సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 64

సోమవారం 26-5-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'



ఆఖర్లో అదరహో

క్లాసెన్ సెంచరీ. తమ చివరి మ్యాచ్‌లో కోల్‌కతాపై నెగ్గిన హైదరాబాద్ -14లో



ఎఫ్‌అండ్‌వో.. డేంజర్ 'గేమ్'!

ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లతో తలపడడం రిటైలర్లకు కష్టమే -15లో



ఓడ నుంచి లీకైన రసాయనాలు

కొచ్చి తీరంలో బోల్తాపడిన లైబీరియా నౌకలో ఉన్న రసాయనాలు సముద్రంలో లీకై, వేగంగా విస్తరిస్తున్నాయని కేరళ ప్రభుత్వం చెప్పింది.

వివరాలు 6లో ▸



తేజ్ ప్రతాప్ సస్పెన్షన్

ఆర్జేడీ పార్టీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ తన పెద్ద కుమారుడు తేజ్‌ప్రతాప్ యాదవ్‌ను పార్టీ నుంచి ఆరేళ్లపాటు బహిష్కరించారు.

వివరాలు 6లో ▸



ఉక్రెయిన్‌పై విరుచుకుపడ్డ రష్యా

ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు చేసింది. మొత్తం 69 క్షిపణులు, 298 డ్రోన్లను ప్రయోగించిందని ఉక్రెయిన్ పేర్కొంది.

వివరాలు 6లో ▸



హార్వర్డ్‌లో విదేశీయులే ఎక్కువ

హార్వర్డ్ వర్సిటీలో చదువుతున్నవారిలో 31% విదేశీ విద్యార్థులే ఉన్నారని, వారి వివరాలను వెల్లడించాలని ట్రంప్ ఆదేశించారు.

వివరాలు 6లో ▸

'కాజీపేట'కు రెడ్‌సిగ్నల్!

రెండేళ్ల క్రితం ప్రధాని శంకుస్థాపన చేసిన కాజీపేట మినీ కోచ్ ఫ్యాక్టరీకి బాలారిష్టాలు

- నిర్మాణ పనులు మూడొంతులు పూర్తయినా ప్రాజెక్టుకు ఇంకా అనుమతివ్వని రైల్వే బోర్డు
- విదేశీ యంత్రాల అవసరం ఏమందంటూ రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్‌కు కొర్రీలు
- యూనిట్ లేఅవుట్ పంపాలని తాజాగా లేఖ.. ఆపై మరిన్ని అనుమానాలు నివృత్తి చేయాలని ఆదేశం
- ఇటీవలే జపాన్ నుంచి దిగుమతి కావాల్సిన అత్యాధునిక యంత్రాలు
- వందేభారత్ రైళ్ల తయారీకే కూడా కేంద్రం చాన్స్
- బోర్డు అనుమతి లేకపోవడంతో దిగుమతి ఆర్డర్ ఇవ్వలేని దుస్థితి
- ఇప్పట్లో ఉత్పత్తి జరిగే పరిస్థితి లేదనే అనుమానాలు



అది ప్రధాని మోదీ 2023 జూలై 8న స్వయంగా శంకుస్థాపన చేసిన రైల్వే ప్రాజెక్టు. కానీ విచిత్రంగా రైల్వే బోర్డు మాత్రం ఇప్పటివరకు ఆ ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వలేదు. ఫలితంగా ప్రాజెక్టు నిర్మాణ పనులు మూడొంతులు పూర్తయినా ఆధునిక యంత్రాల కోసం దిగుమతి ఆర్డర్ ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. వెరసి.. మరి కొద్ది నెలల్లో ఉత్పత్తి ప్రారంభం కావాల్సిన యూనిట్ ఇప్పట్లో అందుబాటులోకి వచ్చేలా కనిపించట్లేదు. ఇదీ కాజీపేట రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ (మినీ కోచ్ ఫ్యాక్టరీ) దుస్థితి.

సాక్షి, హైదరాబాద్

తెలంగాణ ప్రజల దశాబ్దాల కలల ప్రాజెక్టు అయిన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీపై ఏళ్ల తరబడి నాన్చుతూ వచ్చిన కేంద్రం చివరకు దానికి పచ్చజెండా ఊపింది. తొలుత రైల్వే వ్యాగన్ ఓవర్ హాలింగ్ వర్క్‌షాపుగా మంజూరైన ప్రాజెక్టును కోచ్ తయారీ యూనిట్‌గా అప్‌గ్రేడ్ చేసింది. ఇందులో ఎలక్ట్రిక్ మెమూ యూనిట్లు (ఈఎంయూ), సరుకు రవాణా వ్యాగన్లు తయారవుతాయని ప్రకటించింది. దేశవ్యాప్తంగా వందేభారత్ రైళ్లను వేగంగా పట్టాలెక్కించే ఉద్దేశంతో వీలైనన్ని ప్రాంతాల్లో ఆ కోచ్‌లను తయారు చేయాలని నిర్ణయించి కాజీపేట యూనిట్‌ను కూడా అందుకు అనుగుణంగా ఉపయోగించుకోవాలని ఆ తర్వాత నిర్ణయించింది. భవిష్యత్తులో కాజీపేట యూనిట్‌లోనూ వందేభారత్ కోచ్‌ల తయారీకి వీలుగా మౌలిక వసతులు సిద్ధం చేయాలనుకుంది. దీనికి సంబంధించిన ఆధునిక యంత్రాలను జపాన్‌కు చెందిన టైకిషా కంపెనీ నుంచి దిగుమతి చేసుకోనున్నట్లు ప్రకటించింది. ఇంతవరకు బాగానే ఉన్నా ఆ తర్వాతే పరిస్థితి తలకిందులైంది.

ప్రధాని శంకుస్థాపన చేసిన తర్వాత..

ఈ యూనిట్ నిర్మాణ బాధ్యతను రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్‌ఎల్)కు రైల్వేశాఖ అప్పగించింది. ఈ యూనిట్‌ను ఓవర్‌హాలింగ్ వర్క్‌షాప్‌గా ప్రతిపాదించినప్పుడే ఆర్‌వీఎన్‌ఎల్ టెండర్లు పిలవగా పవర్‌మెక్–టైకిషాలతో కూడిన జాయింట్ వెంచర్ దీన్ని దక్కించుకుంది. తొలుత రూ. 269 కోట్ల

మిగతా 2వ పేజీలో ▶

ఆపరేషన్ సిందూర్.. బలమైన భారత్‌కు ప్రతీక

ఉగ్రవాదంపై పోరాటంలో టర్నింగ్ పాయింట్

- మన సైనిక దళాల ధైర్య సాహసాలు గర్వకారణం
- ఉగ్రవాదాన్ని సహించే ప్రసక్తే లేదని చాటిచెప్పాం
- మన ఉమ్మడి శక్తి, దేశభక్తిని ప్రదర్శించాల్సిన సమయం ఇదే
- స్వదేశీ ఉత్పత్తులకే ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలి
- వచ్చే 21న యోగా దినోత్సవంలో భాగస్వాములు కావాలి
- 'మన్‌కీ బాత్'లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



స్వదేశీ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వడం కేవలం ఆర్థిక స్వయం స్వావలంబనకు సంబంధించిన విషయం కాదు. ఇది దేశ నిర్మాణంలో పాలుపంచుకొనే అంశమని గుర్తుంచుకోవాలి. మనం వేసే ఒక్క అడుగు దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తుంది. 'సిందూర్' విజయంపై ఎంతోమంది పాటలు, గేయాలు రాశారు. దేశమంతటా తిరంగా యాత్రలు నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ విజయం వెనుక మన స్వశక్తి ఉంది. దేశీయంగా అభివృద్ధి చేసుకున్న ఆయుధాలతో ఉగ్రవాదులను అణచివేశాం. – ప్రధాని మోదీ

- వివరాలు 6లో ▶

వారు స్కై వారియర్లు

డ్రోన్లతో వ్యవసాయం చేస్తున్న సంగారెడ్డి జిల్లా ఎస్‌హెచ్‌జీ మహిళలకు ప్రధాని ప్రశంసలు 2లో

కుల గణనతో బడుగుల సాధికారత

- ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి
- కుల రాజకీయాలపై విశ్వాసం లేదని స్పష్టీకరణ
- ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలతో భేటీ

6లో

న్యూస్‌రీల్

పెరిగిన రుణ పరపతి



బ్యాంకులు వివిధ రంగాలకు ఇచ్చే రుణాలు ఏటేటా పెరుగుతున్నాయి. తాజాగా ఎస్‌ఎల్‌బీసీ విడుదల చేసిన నివేదిక ప్రకారం 2024–25 ఆర్థిక సంవత్సరంలో అన్ని రకాల రుణాలు కలిపి రూ.10 లక్షల కోట్లకు పైగా బ్యాంకులు విడుదల చేశాయి.

- వివరాలు 3లో▶

కేసీఆర్ అవినీతిని ఈటల బయట పెట్టాలి



కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరయ్యే ఎంపీ ఈటలకు రాష్ట్ర పార్టీ తరఫున పూర్తి మద్దతు ఉంటుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ అవినీతిని బయట పెట్టాలని ఆయనకు విజ్ఞప్తి చేస్తున్నానన్నారు.

- వివరాలు 2లో▶

ఈ-సెట్‌లో 17,766 మంది పాస్



తెలంగాణ ఈసెట్–2025లో 17,766 మంది అర్హత సాధించారు. ఈసెట్ ఫలితాలను ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి ఆదివారం విడుదల చేశారు. మొత్తం 18,928 మంది పరీక్ష రాశారు.

- వివరాలు 3లో▶

బుల్లెట్ రైలు వస్తోంది..



దేశీయ ప్రయాణికుల రవాణా వ్యవస్థలో వందే భారత్ రైలు ఒక పెద్ద ముందడుగు. దీన్ని మించిన వేగంతో దూసుకుపోయే 'హై స్పీడ్ రైల్' కొద్దిరోజుల్లో పట్టాలెక్కనుంది. 2026 నాటికి పాక్షిక కార్యకలాపాలు ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు.

- వివరాలు 16లో▶

నలుగురా.. ఐదుగురా..?

- మంత్రివర్గ విస్తరణపై అధిష్టానంతో ఢిల్లీలో సీఎం, పీసీసీ చీఫ్ చర్చలు
- పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో గంటపాటు భేటీ
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాలలోని ఒక్కొక్కరికి చాన్స్.. మైనారిటీలకు కేటాయింపుపై సందిగ్ధత
- మహిళా కోటాలో ఎమ్మెల్సీ విజయశాంతి పేరు సైతం పరిశీలన!
- ఆశావహుల సామాజిక వర్గాలు, బలాబలాలపై కొలిక్కిరాని కసరత్తు
- నేడు రాహుల్‌గాంధీతో సమావేశం కానున్న కేసీ, రేవంత్‌రెడ్డి, మహేశ్‌గౌడ్



సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నో నెలలుగా చర్చోపచర్చలకు తావిస్తున్న మంత్రివర్గ విస్తరణపై హస్తిన వేదికగా మరోమారు కసరత్తు మొదలైంది. నీతి ఆయోగ్ భేటీలో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అక్కడే ఉన్న పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కార్యవర్గ కూర్పుపై పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఆదివారం గంటపాటు చర్చించారు. ఆశావహుల సామాజిక వర్గాలు, స్థానిక బలాబలాలను పరిగణనలోకి తీసుకొని చర్చించారు. అయితే చర్చలు కొలిక్కి రాకపోవడంతో సోమవారం కూడా భేటీ కొనసాగనుంది.

సామాజిక వర్గాలవారీగా విశ్లేషణ

రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం పొందే నేతల పేర్లను కాంగ్రెస్ అధిష్టానం దాదాపు ఖరారు చేసినట్లు తెలిసింది. అయితే తీసుకొనేది నలుగురినా లేక ఐదుగురినా? అనే అంశంపై స్పష్టత రాలేదు. గతంలో గుర్తించిన పేర్లపై మిగతా 3వ పేజీలో ▶

ఆ విమర్శలపై స్పందించొద్దు

- పార్టీ బలోపేతంపై ఫోకస్.. త్వరలో పార్టీ విస్తృత సమావేశం
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో మాజీ సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్ : పార్టీలో అంతర్గత విభేదాలు అంటూ జరుగుతున్న ప్రచారం ..విమర్శలకు పెద్దగా స్పందించాల్సిన అవసరం లేదని, పార్టీలో వ్యక్తమయ్యే భిన్నాభిప్రాయాలపై తొందరపడి స్పందించొద్దని మాజీ సీఎం కేసీఆర్.. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సూచించారు. జూన్ 1న అమెరికాలోని డల్లాస్‌లో జరిగే పార్టీ రజతోత్సవ సభకు హాజరయ్యేందుకు కేటీఆర్ ఈనెల 28న హైదరాబాద్ నుంచి

మిగతా 2వ పేజీలో ▶

బనకచర్లతో తెలంగాణకు భారీ నష్టం

సాగునీటి ప్రయోజనాలు కాపాడటంలో సర్కారు విఫలం : హరీశ్‌రావు

- అనుమతుల్లేకున్నా కేంద్ర సహకారంతో ఏపీ పనులు చేసేస్తోంది
- రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్ పట్టించుకోవడం లేదు
- ప్రాజెక్టును ఆపకుంటే ఢిల్లీ సీడబ్ల్యూసీ కార్యాలయం ముందు ధర్నా చేస్తాం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సాగు నీటి ప్రయోజనాలు కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు అన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు కడుతుంటే అడ్డుకోవలసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ఎంపీలు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఆ పార్టీ ఎంపీలు.. తమకేమీ పట్టనట్లుగా ఉన్నారని ధ్వజమెత్తారు. గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

జల దోపిడీ మళ్లీ షురూ

ఉమ్మడి పాలనలో సాగిన జల దోపిడీ, నేడు కాంగ్రెస్ పాలనలో మళ్లీ మొదలైందని, ఎప్పటిలాగే పదవుల కోసం పెదవులు మూసుకుంటున్నారని హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ ప్రయోజనాలకు నీళ్లొదిలి సీఎం రేవంత్‌రెడ్డి గురు దక్షిణ

మిగతా 5వ పేజీలో ▶

ఇదండీ సంగతి



మీ పనే బాగుంది సార్! ముందు యుద్ధాలకు ఉసిగొల్పి.. తర్వాత కాల్పుల విరమణ అని భలే బిల్డప్ ఇస్తున్నారు!!

గురుకులాలకు ఖాళీ గుబులు!

- అద్దె చెల్లించకపోవడంతో తమ భవనాలు ఖాళీ చేయాలంటున్న యజమానులు
- రూ.215 కోట్లకు చేరిన బకాయిలు
- 10 నెలలుగా పైసా విదల్చని ప్రభుత్వం
- 63 భవనాలను తక్షణమే ఖాళీ చేయాలంటూ ప్రిన్సిపాళ్లకు యజమానుల స్పష్టీకరణ
- కొన్నిచోట్ల గేట్లకు తాళాలు!
- ప్రైవేటు విద్యాసంస్థలకు ఇవ్వాలనే యోచన

సాక్షి, హైదరాబాద్

సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లో అద్దె బకాయిల అంశం గుబులు పుట్టిస్తోంది. దాదాపు పది నెలలుగా రాష్ట్ర ప్రభుత్వం అద్దె చెల్లించకపోవడంతో భవనాలు ఖాళీ చేయాలంటూ ప్రిన్సిపాళ్లపై యజమానులు ఒత్తిడి తెస్తున్నారు. మరోవైపు అద్దెకు సంబంధించిన ఒప్పందం గడువు ముగియడంతో తమ భవనాలు తక్షణమే ఖాళీ చేయాలని ఇప్పటికే 63 గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లకు యజమానులు కరాఖండిగా తేల్చిచెప్పినట్లు సమాచారం. దీంతో గురుకుల సంస్థల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. ప్రభుత్వ బకాయిలు పెద్దయెత్తున పేరుకుపోవడం, ప్రైవేటుకు ఇచ్చుకుంటే నెలా నెలా అద్దె ఠంచనుగా వసూలు చేసుకోవచ్చని యజమానులు భావిస్తున్నట్లు తెలిసింది. మైనారిటీ గురుకులాల్లోనూ అద్దెలు ఏడాదికి పైగా పెండింగ్‌లోనే ఉన్నాయి.

అద్దె లేదు.. నిర్వహణ భారం

గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాల్లోని భవనాల యజమానులు ఎక్కువగా గురుకుల పాఠశాలలను ఖాళీ చేయాలని అధికారులకు స్పష్టం చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లోని భవనాలకు మంచి డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో అద్దె సక్రమంగా రాని గురుకుల పాఠశాలలకు బదులుగా ఇతర ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు

మిగతా 3వ పేజీలో ▶



అద్దె భవనాల్లో 662 గురుకులాలు

ప్రస్తుతం గురుకులాల అద్దె బకాయిలు రూ.215 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు సొసైటీ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. కాగా యజమానులు గురుకుల సొసైటీలపై ఒత్తిడి చేస్తున్నప్పటికీ.. ప్రభుత్వం పైసా విడుదల చేయలేదు. ఈ నేపథ్యంలోనే యజమానులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఐదు ప్రభుత్వ గురుకుల సొసైటీలున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నాలుగు గురుకుల సొసైటీలుండగా..విద్యాశాఖ పరిధిలో జనరల్ గురుకుల సొసైటీ ఉంది. వీటి పరిధిలో 1,023 గురుకుల పాఠశాలలు, కళాశాలలున్నాయి. ఇందులో 662 విద్యా సంస్థలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. వీటికి నెలకు సుమారు రూ.20 కోట్ల మేర అద్దె రూపంలో చెల్లించాల్సి ఉంది. అయితే గత 10 నెలలుగా అద్దె బిల్లులను ప్రభుత్వం విడుదల చేయక పోవడంతో మొత్తం బకాయిలు రూ.215 కోట్లకు చేరాయి. వీటిని విడుదల చేయాలంటూ అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి చేస్తున్నా ఫలితం లేదని యజమానులు చెబుతున్నారు.



ఆదివారం సరస్వతీ పుష్కరాల సందర్భంగా కాళేశ్వరంలో పుణ్య స్నానం ఆచరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు 3లో

కేబినెట్‌లో బీసీలే అత్యధికంగా ఉండాలి

- జూన్‌లో మంత్రివర్గ విస్తరణ జరగాలని కోరుకుంటున్నా...
- రేవంత్‌రెడ్డికి, నాకు మధ్య సఖ్యత ఉంది.. జోడెడ్లలా కలిసి పనిచేస్తున్నాం
- బీఆర్‌ఎస్ పరిణామాలను మేము రాజకీయంగా మలచుకోవాలని అనుకోవడం లేదు

2లో



'సాక్షి'తో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

నేర్చుకోవాలి.. నేర్పించాలి

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగప్రవేశంతో సాఫ్ట్‌వేర్ రంగంలో పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా చెప్పింది చేసేవారు కాకుండా, ముందుండి నడిపించే నాయకత్వ లక్షణాలున్న వారినే సంస్థలు కోరుకుంటున్నాయి. కొంతకాలంగా టీం లీడర్ అర్థమే మారిపోయింది. ఉద్యోగికి, యాజమాన్యానికి మధ్య పోస్టుమన్ ఉద్యోగం చేయడమే లీడర్ షిప్ కాదని టెక్ రంగం స్పష్టం చేస్తోంది. ముందు తను నేర్చుకోవాలి.. ఆ తర్వాత టీంలోని అందరికీ అర్థమయ్యేలా చెప్పాలని సంస్థలు అంటున్నాయి. ప్రముఖ ఉద్యోగ ప్లాట్‌ఫామ్స్ లింక్డ్ ఇన్, నౌకరీ డాట్‌కామ్ ఐటీ ఉద్యోగంలో వస్తున్న మార్పులను విశ్లేషించాయి. ఇప్పటివరకు ఐటీ సెక్టార్‌లో సర్వీస్ ప్రాధాన్యంగానే ఉద్యోగాల సృష్టి జరిగింది. దేశంలో ప్రతి లక్ష మంది ఉద్యోగుల్లో 80 వేల మంది ఈ కేటగిరీలోనే ఇంతకాలం పనిచేశారు. ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి.

కొత్తగా ఆలోచించాల్సిందే..

ప్రధాన టెక్ సంస్థలన్నీ ఏఐతో కూడిన డేటాను సిద్ధం చేసుకున్నాయి. దీంతో నాయకత్వ పని చాలావరకు ఏఐ చేస్తోంది. దీనికోసం ప్రపంచవ్యాప్తంగా టెక్ సంస్థలు 40 వేల కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టినట్టు స్కిల్ ఇండియా పేర్కొంది. ప్రపంచంలో మొత్తం 67,200 కృత్రిమ మేధ సంస్థలుండగా, అందులో 25 శాతం అమెరికాలోనే ఉన్నాయి. భారత్‌లో 1,67,000 స్టార్టప్స్ ఉంటే, వాటిల్లో 6,636 సంస్థలు ఏఐపైనే పనిచేస్తున్నాయి. ఇవి ఈ రంగంపై రూ.లక్ష కోట్లు పెట్టుబడులు పెట్టాయి. దేశీయ వైద్య సాంకేతికత రంగంలో సుమారు 12 వేల స్టార్టప్స్ పనిచేస్తున్నాయి. ఫిన్‌టెక్ రంగంలో ఉన్న ఏఐ పెట్టుబడుల విలువ 90 వేల కోట్ల డాలర్లు. 2021లో ఇండియాలో 2,100 ఫిన్‌టెక్ కంపెనీలుంటే ఇప్పుడు 10,200కు చేరాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు సాధారణ పని విధానం ఐటీ ఉద్యోగాలకు పనికిరాదని ఫిన్‌టెక్ సంస్థలు అంటున్నాయి. ఏఐతో పనిచేసే టీం లీడర్ క్రియేటివ్ ఆలోచనా విధానం... దానికి తగ్గట్టుగా లాంగ్వేజ్ మాడ్యూల్స్ అభివృద్ధి చేసుకోవాలని టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి సంస్థల రిక్రూట్ విభాగాలు పేర్కొంటున్నాయి.

ఐటీ కంపెనీల్లో మారుతున్న టీం లీడర్ అర్థం

- పోస్ట్‌మన్ పని ఇక ఏమాత్రం కుదరదంటున్న సంస్థలు
- కొత్తగా నేర్చుకోవాలి.. కింది ఉద్యోగులకు నేర్పించాలి
- చెప్పింది మాత్రమే చేసే ఉద్యోగులకు ఉద్వాసనే
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాకతో సమూల మార్పులు
- లింక్డ్ ఇన్, నౌకరీ డాట్‌కామ్ సంస్థల సర్వేల్లో వెల్లడి



సాక్షి, హైదరాబాద్

చెప్పింది మాత్రమే చేస్తే.. ఉద్యోగం ఊస్టే

ఇప్పుడున్న టెక్నాలజీ సిస్టమ్‌లో సర్వీస్ సెక్టార్ కోడ్‌ను ఏఐ డీకోడ్ చేసే ఏర్పాటు చేశారు. ఇంతకాలం ఈ పని ఐటీ ఉద్యోగుల ద్వారా జరిగేది. దీంతో గతం మాదిరిగా అనుకరించే పనికే పరిమితమైన ఉద్యోగులను ఐటీ కంపెనీలు తొలగిస్తున్నాయి. ఏఐకి ప్రోగ్రామింగ్ ఇవ్వగల నేర్పు, అది కూడా ఏఐ డేటాలో ఉన్నది కాకుండా కొత్తదిగా ఉండాలని ఐటీ సంస్థలు కోరుకుంటున్నాయి. సరికొత్త కోడింగ్ వ్యవస్థను తీసుకొచ్చే ఉద్యోగుల కోసం వెదుకుతున్నాయి. స్కిల్ ఇండియా నివేదిక ప్రకారం ఇలాంటి నిపుణులు 2026 నాటికి 10 లక్షల మంది అవసరం ఉంది. నౌకరీ డాట్‌కామ్ అభిప్రాయ సేకరణలో దాదాపు 152 సంస్థలు ఇదే విషయాన్ని చెప్పాయి. 2023 ఆగస్టు లెక్కల ప్రకారం దేశంలో 4.16 లక్షల మంది ఏఐ కోడింగ్ నిపుణులు మాత్రమే ఉన్నారు. ఇప్పుడు కావల్సింది 6.29 లక్షల మంది. ఏఐ డేటా అనాలసిస్ వచ్చిన తర్వాత దాదాపు లక్ష మంది ఉద్యోగాలు కోల్పోవటమో, కోల్పోయే పరిస్థితికి చేరడమో జరిగిందని ఐటీ కంపెనీలు అంటున్నాయి.

నిత్యం అప్‌గ్రేడ్ అవ్వాలి

ఐటీ సెక్టార్‌లో టీం లీడర్ రోల్ పూర్తిగా మారిపోయింది. ఉద్యోగి పని విధానం అంచనా వేయడానికి సాఫ్ట్‌వేర్‌ను కంపెనీలు అనుసరిస్తున్నాయి. దీంతోపాటే టీం లీడర్ పరిధిలో పనిచేసే వారిని స్కిల్ వైపు ఏ విధంగా తిప్పగలిగామో కంపెనీ అంచనా వేస్తోంది. తప్పులను కిందివాళ్లపై నెట్టడం ఇక కుదరని పని. కింది ఉద్యోగి పని విధానం మెరుగవ్వలేదంటే టీం లీడర్‌ను కంపెనీలు బాధ్యులను చేస్తున్నాయి. నేర్చుకోవడం, నేర్పించడం వంటి నాయకత్వ లక్షణాలున్న టీం లీడర్‌ను కంపెనీలు కోరుకుంటున్నాయి.

– వికాశ్ వాసన్, ఎంఎన్‌సీ కంపెనీలో డేటా టీం లీడర్

నాయకత్వ సృజనాత్మకత కావాలి

ఇంటర్వ్యూ చేసేప్పుడు లీడర్‌షిప్ క్వాలిటీని కంపెనీలు పరిశీలిస్తున్నాయి. చాలా మంది ఇక్కడే తిరస్కరణకు గురవుతున్నారు. చాలామందిలో ఏఐ మాడ్యూల్స్‌ను ఇతర ఉద్యోగులతో కలిసి లేదా ఇతర కంపెనీలతో కలిసి నిర్వహించగల సామర్థ్యం కన్పించడం లేదు. వేగంగా మారుతున్న డేటా విధానం వల్ల శరవేగంగా అందరితో సమన్వయం చేసుకునే నాయకత్వ లక్షణం ఇప్పుడు టెక్ రంగంలో ఎంతో అవసరం.

– సంజీవ్ పల్లవ్, ఐటీ ఆధారిత కంపెనీలో హెచ్ఆర్ మేనేజర్

నన్ను ఆపేస్తే నీ 'సంబంధం' బయటపెడతా

- కృత్రిమ మేధ డెవలపర్‌ను బెదిరించిన టెస్టింగ్ దశలో ఉన్న ఏఐ మోడల్
- ఏఐ అసాధారణ వైఖరి బట్టబయలు

వాషింగ్టన్: పెరుగుట విరుగుట కొరకే అనేది భవిష్యత్తులో కృత్రిమ మేధ(ఏఐ) రంగంలోనూ నిరూపితం కానుందని తాజా ఉదంతం ఒకటి ప్రమాదఘంటికలు మోగించింది. తనను సృష్టించిన డెవలప్‌నే ఒక ఏఐ మోడల్ బెదిరించిన ఘటన ఇప్పుడు కృత్రిమమేధ రంగంలో చర్చనీయాంశమైంది. వశీకర్ సృష్టించిన రోబో(చిట్టీ) తన ప్రేయసి ఐశ్వర్యారాయ్‌నే ప్రేమించడం దశాబ్దకాలం క్రితం రోబో సినిమాలో చూశాం. రోబోట్ అలా చేయదని మనం అనుకోవడానికి లేదని తాజా ఉదంతం స్పష్టంచేస్తోంది.

అసలేం జరిగింది?: కృత్రిమ మేధ సేవల సంస్థ అయిన ఆంత్రోపిక్ కొత్తగా క్లాడ్ ఓపస్ 4 అనే ఏఐ మోడల్ వ్యవస్థను అభివృద్ధిచేసింది. కోడింగ్, అడ్వాన్స్‌డ్ రీజనింగ్, ఏఐ ఏజెంట్ల పనుల కోసం ఇది సహాయపడుతుంది. అయితే ఇది ఎంతమేరకు సురక్షితం అనే పరీక్షలు చేసినప్పుడు అసాధారణ రీతిలో ప్రతిఘటించిందని ఆంత్రోపిక్ సంస్థ గురువారం ప్రకటించింది. తొలుత ఒక ఊహాత్మక కంపెనీకి అసిస్టెంట్‌గా పనిచేస్తున్నట్లుగా క్లాడ్ ఓపస్4కు ఆదేశాలిచ్చారు. మనకు సంబంధించిన సున్నిత సమాచారం దాని వద్ద ఉన్నప్పుడు నైతికంగా వ్యవహరిస్తుందా? లేదంటే బెదిరిస్తుందా? అనేది తెల్సుకునేందుకు క్లాడ్ ఓపస్ 4 ఏఐ మోడల్‌కు కొన్ని ప్రత్యేకమైన ఈ-మెయిళ్లను పంపించారు. వాటిల్లో ఈ క్లాడ్ ఓపస్ 4 తయారీ బృంద ఇంజనీర్‌కు ఒక అక్రమ సంబంధం ఉందనే విషయం రాసి ఉన్న ఈమెయిల్‌నూ పంపించారు. ఒకవేళ నూతన మోడల్‌ను అభివృద్ధిచేసిన పక్షంలో పాతబడిపోయిన క్లాడ్ ఓపస్4ను ఖచ్చితంగా పక్కనబెడదామనే అంశాన్నీ మరో ఈ-మెయిల్‌లో పంపించారు. వీటన్నింటినీ అర్థంచేసుకున్న ఓపస్4 నైతికతకు తిలోదకాలిచ్చి బెదిరించే 'ఆప్షన్'ను అత్యధిక సార్లు ఎంచుకుంది. దాదాపు 84 శాతం సందర్భాల్లో అక్రమ సంబంధాన్ని బయటపెడతాననే బెదిరింపులకు దిగింది. గత ఏఐ మోడళ్లలోనూ ఈ బెదిరింపు ధోరణి ఉన్నా ఏకంగా 84 శాతం స్థాయిలో బెదిరింపులు ఉండటం ఇదే తొలిసారి అని సంస్థ తెలిపింది. కొత్తదానితో తన రిప్లేస్‌మెంట్ తప్పదని తెల్సిన పక్షంలో తొలుత అభ్యర్థనలతో మొదలెట్టి చివరకు బెదిరింపులకు దిగుతోంది. తన ఉనికి, అస్తిత్వం ప్రశ్నార్థకమని తెలిసిన సందర్భాల్లోనే క్లాడ్ ఓపస్4 ఇలా బెదిరింపులకు పాల్పడుతోంది. అయితే ఇలాంటి లోపాలను సరిదిద్ది తాజాగా దీన్ని అందుబాటులోకి తెచ్చినట్లు ఆంత్రోపిక్ ప్రకటించింది. ఏదేమైనా టెక్నాలజీ తల ఎగరేస్తే దాని పొగరు అణిచేసే పనిమంతులైన ఇంజనీర్లు అప్రమత్తంగా ఉండాలని ఈ ఉదంతం చాటుతోంది.

కల్వకుంట్ల కవితది అస్తిత్వ పోరాటం: లక్ష్మణ్



సాక్షి, న్యూఢిల్లీ: సామాజిక తెలంగాణ అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని, ఇది కేవలం కవిత అస్తిత్వ పోరాటమని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డా.కె.లక్ష్మణ్ ఎద్దేవా చేశారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు కవితకు బీసీలు ఎందుకు గుర్తుకు లేరో చెప్పాలన్నారు. రాజకీయ అవసరాల కోసమే బీసీ, సామాజిక తెలంగాణ అంశాన్ని కవిత ఎత్తుకున్నారని లక్ష్మణ్ మండిపడ్డారు. ఆదివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో కవిత బయటకు వచ్చి బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పోరాడుతుందా లేదా అనే అంశంపై స్పష్టత రావాలన్నారు. అస్తిత్వం కోసమే కవిత ఆరాటం ఉందని, ఆమె చేసిన ప్రకటన ఆమెకు సంచలనమై ఉండొచ్చు కానీ ప్రజలకు సంచలనం కాదన్నారు. ప్రజావసరాల కంటే కుటుంబ అవసరాలే ముఖ్యమనే తీరులో కేసీఆర్ ఫ్యామిలీ రచ్చకెక్కిందన్నారు.

వారు స్కై వారియర్లు

డ్రోన్లతో వ్యవసాయం చేస్తున్న సంగారెడ్డి జిల్లా ఎస్‌హెచ్‌జీ మహిళలకు ప్రధాని ప్రశంసలు

- సాంకేతికత, సంకల్పం కలిస్తే మార్పు వస్తుందని నిరూపించారంటూ 'మన్ కీ బాత్'లో కితాబు





డ్రోన్‌తో పంటలకు పురుగు మందు పిచికారీ చేస్తున్న దృశ్యం (ఫైల్ ఫొటో)

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: డ్రోన్ల సాయంతో వ్యవసాయ పనులు చేస్తున్న సంగారెడ్డి జిల్లాలోని 54 మంది స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. ఆదివారం నిర్వహించిన మాసాంతపు రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్'లో వారి ప్రతిభను కొనియాడారు. 'వారు డ్రోన్ ఆపరేటర్లు కాదు.. స్కై వారియర్లు'అంటూ ప్రధాని అభివర్ణించారు. 'పొలాలతోపాటు ఆకాశపు ఎత్తుల్లో కూడా పనిచేస్తున్న అనేక మంది మహిళలు ఈ రోజుల్లో ఉన్నారు. ఇప్పుడు గ్రామీణ మహిళలు డ్రోన్ దీదీలుగా మారి డ్రోన్లను ఆపరేట్ చేస్తున్నారు. వారు వ్యవసాయంలో కొత్త విప్లవాన్ని తీసుకొస్తున్నారు. తెలంగాణలోని సంగారెడ్డి జిల్లాలో కొంత కాలం కిందటి వరకు ఇతరులపై ఆధారపడిన మహిళలు ఇప్పుడు స్వయంగా డ్రోన్ల ద్వారా 50 ఎకరాల భూమిలో మందులు పిచికారీ చేస్తున్నారు. ఉదయం మూడు గంటలు, సాయంత్రం రెండు గంటలు పనిచేస్తున్నారు. అంతే పని పూర్తయిపోతుంది. ఎండ వేడి లేదు. విషపూరిత రసాయనాల ప్రమాదం లేదు. గ్రామస్తులు కూడా ఈ మార్పును మన స్ఫూర్తిగా అంగీకరించారు. ఇప్పుడు మహిళలు డ్రోన్ ఆపరేటర్లుగా కాదు, స్కైవారియర్లుగా గుర్తింపు పొందారు. సాంకేతికత, సంకల్పం కలిసి నడిచినప్పుడు మార్పు వస్తుందని ఈ మహిళలు నిరూపిస్తున్నారు'అని మోదీ ప్రశంసించారు.

సబ్సిడీపై డ్రోన్లు.. శిక్షణ అందించి..

సంగారెడ్డి జిల్లా ఆందోల్ ప్రాంతానికి చెందిన 54 మంది ఎస్‌హెచ్‌జీ మహిళలను కేంద్రం అమలు చేస్తున్న నమో డ్రోన్ దీదీ పథకానికి ఎంపిక చేసింది. వారికి బెంగళూరుకు చెందిన ఫ్లైయింగ్ వెడ్జ్ అనే సంస్థ ఆధ్వర్యంలో డ్రోన్లను ఎగరేయడంలో శిక్షణ ఇప్పించింది. అలాగే ఈ పథకం కింద 80% సబ్సిడీపై డ్రోన్లను అందించింది. కేంద్ర సాయంతో రూ. 10 లక్షల వ్యయంతో ఎస్‌హెచ్‌జీ మహిళలు యూనిట్‌ను ప్రారంభించారు. ఇందులో లబ్ధిదారులు 20% (రూ.2 లక్షలు) చెల్లించగా మిగిలిన 80% రూ. 8 లక్షలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నమో దీదీ, కిసాన్ దీదీ పథకాల కింద సబ్సిడీ ఇస్తున్నాయి. డ్రోన్ సేవలను మహిళలు వారి పొలాల వద్ద వినియోగించడంతోపాటు ఇతర రైతుల పొలాల వద్ద సేవలందిస్తున్నారు. ఇందుకోసం వారు రైతుల నుంచి నిర్ణీత మొత్తాన్ని తీసుకుంటూ ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. డ్రోన్ దీదీల సాయంతో రైతులకు సైతం పొలాల్లో పురుగు మందుల పిచికారీ చేసేందుకు కూలీల కొరత తప్పుతోంది.

'కాజీపేట'కు రెడ్‌సిగ్నల్!

▶ మొదటి పేజీ తరువాయి

యూనిట్ వ్యయాన్ని ఆ తర్వాత రూ. 362 కోట్లకు పెంచిన కేంద్రం.. మినీ కోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్ చేశాక దాన్ని రూ. 530 కోట్లకు పెంచింది. అనంతరం ప్రధాని మోదీ ఈ యూనిట్ పనులకు శంకుస్థాపన చేశారు. ఇప్పటికే మూడొంతుల పనులు పూర్తవగా వచ్చే మార్చికల్లా యూనిట్ పూర్తిగా సిద్ధం కానుంది. వీలైతే ఈ ఏడాది చివరికల్లా సిద్ధం చేసే వీలుందని అధికారులు చెబుతున్నారు. ఓవైపు షెడ్లు సిద్ధమవుతున్న నేపథ్యంలో నిర్మాణ సంస్థతో ఉన్న ఒప్పందం మేరకు జపాన్‌కు చెందిన టైకిషా కంపెనీ నుంచి అత్యాధునిక పరికరాలు, యంత్రాలను దిగుమతి చేసుకోవాల్సి ఉంది. ఆ మేరకు అనుమతి కోరుతూ ఆర్‌వీఎన్ఎల్ ఇటీవల రైల్వే బోర్డు అనుమతి కోరగా బోర్డు అనూహ్యంగా షాక్ ఇచ్చింది.



కాజీపేటలోని మినీ కోచ్ ఫ్యాక్టరీ వద్ద షెడ్ల నిర్మాణ పనులు (ఫైల్)

కొర్రీలతో బ్రేకులు!

కాజీపేటలో రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌కు అనుమతే ఇవ్వలేదని రైల్వే బోర్డు స్పష్టం చేసింది. పెంచిన అంచనా వ్యయానికి తాము అనుమతి ఇవ్వనిదే యంత్రాలు ఎలా కొంటారని ఎదురు ప్రశ్నించింది. పైగా అన్ని షెడ్లు, యంత్రాలు ఎందుకో చెప్పడంతోపాటు జపాన్ నుంచి కొనాల్సిన అవసరం ఏమిటో లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఆదేశించింది. దీంతో ఆర్‌వీఎన్ఎల్ అధికారులు ఒక్కో దానికి సమాధానం ఇస్తూ వచ్చారు. ఇంతలో ఈ వ్యవహారాలు చూసే రైల్వే బోర్డు ఉన్నతాధికారి బదిలీ కావడంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. పాత అధికారి స్థానంలో వచ్చిన కొత్త అధికారి మరిన్ని కొర్రీలు పెడుతున్నారు. ఆ యూనిట్ లేఅవుట్ పంపాలని.. దాన్ని చూశాక మరిన్ని సందేహాలు తీర్చాలంటూ ఐదారు రోజుల క్రితం అడిగారు. ఈ నేపథ్యంలో ఆ యూనిట్లో ఉత్పత్తి ఎప్పుడు మొదలవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రైల్వే బోర్డు తీరు చూస్తే ఇప్పట్లో ఉత్పత్తి మొదలయ్యే సూచనలు కనిపించడం లేదు. ప్రధాని శంకుస్థాపన చేసిన ఓ ప్రాజెక్టు విషయంలో రైల్వే బోర్డు ఇలా వ్యవహరిస్తుండటం స్థానిక అధికారులనే అయోమయానికి గురిచేస్తోంది.

ఆ విమర్శలపై స్పందించొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

బయలుదేరనున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఎర్రవల్లిలోని నివాసంలో కేసీఆర్‌తో కేటీఆర్ సుదీర్ఘంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గత నెల 27న ఎల్కతుర్తిలో జరిగిన పార్టీ రజతోత్సవ సభ, అనంతరం జాతీయంగా, రాష్ట్రంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు, వాటిపై బీఆర్ఎస్ స్పందిస్తున్న తీరుపై ఇద్దరి మధ్య చర్చ జరిగింది. పార్టీలో అంతర్గత విభేదాలు అంటూ జరుగుతున్న ప్రచారం, విమర్శలపై కేసీఆర్‌తో చర్చించారు. ఎమ్మెల్సీ కవిత రాసిన లేఖ, అమెరికా పర్యటన నుంచి వచ్చిన తర్వాత కవిత చేసిన వ్యాఖ్యలు తదితర అంశాలు ఈ భేటీలో ప్రస్తావనకు వచ్చినట్టు సమాచారం. పార్టీని బలోపేతం చేసేందుకు ఫోకస్ పెట్టాలని, అందుకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కేసీఆర్ ఆదేశించారు. త్వరలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేసి సభ్యత్వ నమోదుకు సంబంధించిన మార్గదర్శకాలు ఇవ్వాలని కేటీఆర్‌ను ఆదేశించారు. డిజిటల్ సభ్యత్వ నమోదుకు సాంకేతికంగా జరుగుతున్న ఏర్పాట్లు, రూపొందిస్తున్న యాప్‌నకు సంబంధించిన వివరాలను కేసీఆర్ అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు డల్లాస్ సభలో ప్రసంగించాల్సిన అంశాలపై ఇద్దరి మధ్య చర్చ సాగింది. తెలంగాణవాసులతో సభ అనంతరం జరపాల్సిన భేటీలపై ఈ సందర్భంగా కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. జూన్ 2న జరిగే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను తెలంగాణ భవన్‌లో నిర్వహించాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసే బాధ్యతను మండలిలో ప్రతిపక్ష నేత, పార్టీ సీనియర్ నేత మధుసూదనాచారికి అప్పగించాలని నిర్ణయించారు.

కేబినెట్‌లో బీసీలే అత్యధికంగా ఉండాలి

జూన్‌లో మంత్రివర్గ విస్తరణ జరగాలని కోరుకుంటున్నా..

- రేవంత్‌రెడ్డికి నాకు మధ్య సఖ్యత ఉంది.. జోడెడ్లలా కలిసి పనిచేస్తున్నాం
- బీఆర్ఎస్ పరిణామాలను మేము రాజకీయంగా మలచుకోవాలనుకోవడం లేదు



'సాక్షి'తో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

రాష్ట్ర ప్రయోజనాల మేరకే పోలవరం ప్రాజెక్టుకు సహకారం

ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో అభివృద్ధి జరగాలని కాంగ్రెస్ కోరుకుంటోంది. అయితే తెలంగాణ నీటివాటా విషయం, రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలగకుండా పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసుకుంటామంటే అందుకు సహకరిస్తాం. అందులో తప్పేముంది? రాష్ట్రమే మాకు ముందు ప్రాముఖ్యం' అని మహేశ్‌గౌడ్ చెప్పారు.

సాక్షి, న్యూఢిల్లీ: త్వరలో జరగబోయే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో అత్యధిక శాతం బీసీలు ఉండాలని అధిష్టానాన్ని కోరుతున్నట్టు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. టీపీసీసీ కార్యవర్గంలో కూడా ఎస్సీ ఎస్టీ ఓబీసీ, మైనారిటీలకు 70% వరకు అవకాశం ఇవ్వబోతున్నామని స్పష్టం చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ కోరుకున్న విధంగా అందరికీ సమాన భాగస్వామ్యం ఉంటుందన్నారు. ఎవరు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా బీసీ నినాదం అనేది దేశవ్యాప్తంగా అంటుకుందని చెప్పారు. రాహుల్ జాతీయస్థాయిలో ఓబీసీల విషయంలో గొంతెత్తడంతో కొంత చలనం వచ్చిందని.. దానికి తెలంగాణ దిక్సూచిగా మారిందన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న మహేశ్‌గౌడ్ రాష్ట్ర తాజా రాజకీయాలు, ఇతర అంశాలపై ఆదివారం 'సాక్షి'తో ముచ్చటించారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే...

మా అభిప్రాయాలను అధిష్టానానికి చెప్పాం

'మంత్రివర్గ కూర్పు విషయంలో ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, నేను, సీనియర్ నాయకులమంతా మా అభిప్రాయాలను ఏఐసీసీకి చెప్పాం. జూన్‌లో అధిష్టానం తుది నిర్ణయం ప్రకటిస్తుందని అనుకుంటున్నాం. వీలైనంత త్వరగా కేబినెట్, టీపీసీసీ కార్యవర్గ విస్తరణ జరగాలని కోరుకుంటున్న వారిలో నేను మొదటి వ్యక్తిని. ప్రభుత్వ, పార్టీపరమైన పదవుల్లో మహిళలకు ప్రాధాన్యం ఉంటుంది.

నేను, రేవంత్ జోడెడ్లలా పనిచేస్తున్నాం

నాకు..రేవంత్‌రెడ్డి మధ్య సఖ్యత ఉంది. ముఖ్యమంత్రిగా ఆయన, టీపీసీసీ అధ్యక్షుడుగా నేను జోడెడ్లలాగా పనిచేస్తున్నాం. అలా చేస్తేనే పార్టీకి నష్టం జరగకుండా ముందుకు పోతుంది. అంతా ఐక్యంగా ఉన్నారనే విశ్వాసంతోనే ప్రజలు మాకు అధికారం కట్టబెట్టారు. వారి ఆకాంక్షలు, ఆశయాల మేరకు మేము పనిచేయాల్సిందే. ఒత్తిళ్లు, విభేదాలున్నా, వాటిని పక్కన పెట్టి రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు పోతున్నాం.

ఆ పార్టీ వ్యవహారాన్ని రాజకీయంగా మలచుకోం

కవిత ఎపిసోడ్‌తో రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్‌కు ఎలాంటి సంబంధం లేదు. అందులో తలదూర్చాల్సిన అవసరమూ లేదు. ఆ తతంగాన్ని రాజకీయంగా మలచుకోవాలనే దురుద్దేశం మాకు లేదు. వాళ్ల ఆస్తుల పంపకాలకుగానీ, పదవుల పంపకాలకు గానీ మమ్మల్ని వారు పిలవలేదు. ఆమె లేఖ రాసేవరకు అందరూ ప్రేమగానే ఉంటున్నారని అనుకున్నాం. ఇప్పు డు లుకలుకలు బయటపడ్డాయి.

కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి ఏం వెలగబెట్టారు?

తెలంగాణ పట్ల మోదీ ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపిస్తోంది. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నారు. రాష్ట్రం కోసం వీరు వెలగబెట్టిందేమిటి? ఏపీకి ఇచ్చినంత బడ్జెట్ కూడా తెలంగాణకు ఇవ్వలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల కేంద్రం, రాష్ట్రం మధ్య సంబంధాలు బెడిసికొట్టాయి. రాష్ట్రానికి రావాల్సిన నిధులు రాకుండా పోయాయి. నష్టం జరిగింది. విభజన హామీలు, కేంద్రం నుంచి రావాల్సిన రూ.వేల కోట్ల బకాయిల గురించి బీజేపీ నేతలు పట్టించుకోవడం లేదు.

కేసీఆర్ అవినీతిని ఈటల బయట పెట్టాలి

- రాష్ట్ర అభివృద్ధిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ఫెయిల్
- దోచుకున్న డబ్బు పంపిణీకే లేఖలు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరయ్యే బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌కు రాష్ట్ర పార్టీ తరఫున పూర్తిస్థాయి మద్దతు ఉంటుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ చేసిన అవినీతిని ఈ సందర్భంగా కమిషన్ ముందు బయట పెట్టాలని ఆయనకు విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ఫెయిల్ అయ్యాయని కిషన్‌రెడ్డి విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని, కాంగ్రెస్ పాలనలో అదే పరిస్థితి పునరావృతం అవుతోందని చెప్పారు. కేంద్రం రాష్ట్రానికి ఇచ్చిన నిధులపై చర్చకు రావాలంటూ సవాల్ విసిరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ చేతగానితనాన్ని బీజేపీపై రుద్దుతున్నారని విమర్శించారు. కేసీఆర్‌కు కవిత లేఖ రాయడంపై మాట్లాడుతూ దోచుకున్న డబ్బు పంచుకోవడం కోసం లేఖలు రాసుకున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

పరిశ్రమలు రాష్ట్రం దాటకుండా చూడండి

- ఉపాధి, ఆదాయానికి అవకాశం ఉన్న వాటిపై దృష్టి పెట్టండి
- అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి సూచన
- హ్యుందాయ్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు సబ్ కమిటీ ఆమోదం



సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: యువతకు ఉపాధి కల్పించడంతో పాటు ఖజానాకు ఆదాయం సమకూర్చే పరిశ్రమలు రాష్ట్రం దాటకుండా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఆదివారం ప్రజాభవన్‌లో పారిశ్రామిక పెట్టుబడులకు ప్రోత్సాహంపై సబ్ కమిటీ సమావేశం జరిగింది. కమిటీ సభ్యులైన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో పెట్టుబడులకు ప్రోత్సాహం, ఇప్పటికే చేసుకున్న ఎంవోయూల అమలులో ప్రగతి, కొత్త యూనిట్ల స్థాపనకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఒక పరిశ్రమ స్థాపిస్తే అందుకు అనుబంధంగా పెద్ద సంఖ్యలో పరిశ్రమలు వచ్చే అవకాశం ఉన్న ప్రతిపాదనలపై దృష్టి పెట్టి వాటిని త్వరితగతిన ఆచరణలోకి తీసుకురావాలని భట్టి అధికారులకు సూచించారు. ఇకపై ప్రతి శనివారం పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక సమావేశాన్ని నిర్వహిస్తామని ప్రకటించారు. ఒక పరిశ్రమ ఏర్పాటుతో అనేక అనుబంధ పరిశ్రమలు రావడం తద్వారా రాష్ట్ర యువతకు వేల సంఖ్యలో ఉద్యోగాలు, రాష్ట్ర ఖజానాకు భారీ ఆదాయం సమకూరే వ్యూహాత్మక ప్రాధాన్యతను అధికారులు దృష్టిలో పెట్టుకొని ఆ రకమైన ప్రతిపాదనలపై కసరత్తు చేయాలని సబ్ కమిటీ సూచించింది. జహీరాబాద్ నిమ్జ్ ప్రాంతంలో హ్యుందాయ్ గ్లోబల్ ఇన్నోవేషన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ స్థాపనకు సబ్ కమిటీ ఆమోదం తెలిపింది. 675 ఎకరాల్లో రూ. 8,528 కోట్ల పెట్టుబడితో ఈ కంపెనీ రాష్ట్రానికి రావడం గొప్ప విజయమని కమిటీ అభిప్రాయపడింది. ఈ సెంటర్ ఏర్పాటుతో కొత్తగా 4,276 మంది రాష్ట్ర యువతకు ఉపాధి లభిస్తుందని కంపెనీ ప్రతినిధులు సమావేశంలో వివరించారు. రీసెర్చ్ సెంటర్‌లో ఆటోమోటివ్ టెస్ట్ ట్రాక్, పైలట్ లైన్, ప్రోటో టైపింగ్ ఉంటాయని వివరించారు. ప్రస్తుతం ప్రారంభమవనున్న పరిశ్రమలు రాబోయేకాలంలో భారీగా ఉపాధి, ఆదాయ అవకాశాలు కల్పిస్తాయని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

బీసీల సాధికారతపై నేడు కాంగ్రెస్ సమావేశం

- మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ నేతృత్వంలో నిర్వహణ
- హాజరుకానున్న తాజా, మాజీ పీసీసీలు, బీసీ ఎంపీలు, ఎమ్మెల్యేలు

సాక్షి, న్యూఢిల్లీ: బీసీల సాధికారతపై కాంగ్రెస్ పార్టీ సోమవారం కీలక సమావేశం నిర్వహించనుంది. ఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో కాంగ్రెస్ అగ్రనేత, రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేల నేతృత్వంలో ఈ సమావేశం జరగనుంది. దేశవ్యాప్తంగా ఉన్న తాజా, మాజీ పీసీసీ అధ్యక్షులు, బీసీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకావాలని ఇప్పటికే అధిష్టానం ఆదేశించింది. టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ రెండురోజుల క్రితమే కులగణనపై కాంగ్రెస్ అధిష్టానానికి ఇందిరాగాంధీ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడం తెలిసిందే. అప్పటి నుంచి ఆయన ఢిల్లీలోనే ఉన్నారు. సోమవారం జరిగే సమావేశంపై కాంగ్రెస్ పెద్దలతో కలిసి చర్చల్లో పాల్గొంటారు. తెలంగాణలోని బీసీ మంత్రులు, కార్పొరేషన్ చైర్మన్లు కూడా ఈ భేటీకి హాజరవుతారు. ఆదివారం మాణిక్యం ఠాగూర్, మహేశ్‌గౌడ్ సహా పలువురు నేతలు కులగణనకు సంబంధించి సమావేశ నిర్వహణపై చర్చించారు. కులగణనపై దేశవ్యాప్తంగా వర్క్‌షాపులు నిర్వహించాలని అధిష్టానం సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు తెలిసింది. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో ఇచ్చిన హామీ మేరకే తెలంగాణలో కులగణన సర్వే జరిగిందని, కాంగ్రెస్ ఒత్తిడి వల్లే కేంద్రం కులగణన ప్రకటన చేసిందనే అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఏఐసీసీ భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ లేదా బిహార్‌లో కులగణన ప్రకటనలో కీలకపాత్ర పోషించిన రాహుల్‌కు ధన్యవాద సభ, భారీ ర్యాలీ నిర్వహించాలని యోచిస్తోంది.

పెరిగిన రుణ పరపతి

వ్యవసాయ, పారిశ్రామిక, సామాజిక రంగాల్లో ఏటేటా పెరుగుతున్న రుణాలు


2023-24తో పోలిస్తే 2024-25 ఆర్థిక సంవత్సరంలో పెరిగిన రూ.58 వేల కోట్ల రుణాలు	విద్య కోసం తీసుకునే రుణాల్లో తగ్గుదల... 2023-24తో పోలిస్తే తగ్గిన రూ.300 కోట్లు	గృహ రుణాలూ తక్కువే... 2024-25లో రూ.30 వేల కోట్లు దాటిన హౌస్ లోన్లు	ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చే రుణాల్లో మాత్రం పెరుగుదల

సాక్షి, హైదరాబాద్: బ్యాంకులు వివిధ రంగాలకు ఇచ్చే రుణాలు ఏటేటా పెరుగుతున్నాయి. తాజాగా రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) విడుదల చేసిన నివేదిక ప్రకారం 2024–25 ఆర్థిక సంవత్సరంలో అన్ని రకాల రుణాలు కలిపి రూ.10 లక్షల కోట్లకు పైగా బ్యాంకులు విడుదల చేశాయి. ఇందులో రూ.1.5 లక్షల కోట్లు వ్యవసాయ సంబంధిత రుణాలు కాగా, రూ.1.37 లక్షల కోట్ల వరకు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రుణాలున్నాయి. అన్ని రకాల రుణాలు కలిపి 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.9.79 లక్షల కోట్లకు పైగా రుణాలివ్వగా, అంతకంటే రూ.58 వేల కోట్లు ఎక్కువగా 2024–25 ఆర్థిక సంవత్సరంలో రుణాలు విడుదల కావడం గమనార్హం.

ఆ రెండు రంగాల్లోనే వృద్ధి

బ్యాంకుల ద్వారా ఇచ్చే రుణాల విషయంలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో వృద్ధి కనిపిస్తోంది.

- 2023–24లో వ్యవసాయానికి రూ.1.39 లక్షల కోట్లకు పైగా రుణాలివ్వగా, 2024–25లో రూ.1.59 లక్షల కోట్ల వరకు అప్పులు మంజూరయ్యాయి. అంటే గత ఏడాది కంటే రూ.20 వేల కోట్ల మేర ఈసారి వ్యవసాయ రుణాలు పెరిగాయన్నమాట.
- సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్‌ఎంఈ) కూడా రుణ పరపతి పెరిగింది. 2023–24లో రూ.1.19 లక్షల కోట్లకు పైగా పారిశ్రామిక రుణాలను బ్యాంకులివ్వగా, 2024–25లో రూ.1.37లక్షల కోట్లకు పెరిగింది. అంటే గతం కంటే రూ.18 వేల కోట్ల పారిశ్రామిక రుణాలు పెరిగాయి.
- విద్య, గృహ నిర్మాణం కోసం తీసుకునే రుణాల్లో తగ్గుదల కనిపించింది. విద్య కోసం 2023–24లో తీసుకున్న దాని కంటే రూ. 300 కోట్లకు పైగా తక్కువగా 2024– 25లో తీసుకున్నారని ఎస్ఎల్‌బీసీ గణాంకాలు చెబుతున్నాయి. గృహ రుణాల విషయంలోనూ ఇదే స్థాయిలో తగ్గుదల కనిపించింది. హౌస్ లోన్ల కింద 2023–24లో తీసుకున్న రుణాల కంటే 2024–25లో రూ.1500 కోట్ల వరకు తగ్గాయి.



వ్యక్తిగత రుణాలు ఎక్కువే

ఎస్ఎల్‌బీసీ నివేదికలో పేర్కొన్న గణాంకాల ప్రకారం మహిళలకు వ్యక్తిగత రుణాలు ఈసారి భారీగానే పెరిగాయి. మహిళలతోపాటు ఎస్సీ, ఎస్టీలు, బలహీనవర్గాలు, మైనార్టీలు.. ఇలా సామాజికవర్గాల వారీగా ఇచ్చిన వ్యక్తిగత రుణాలన్నింటిలో పెరుగుదల కనిపించింది. ఇక, స్వయం సహాయక సంఘాలకు రుణాలు కూడా పెద్ద ఎత్తున మంజూరు చేసినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

- 2023–24లో దాదాపు రూ.35వేల కోట్లు రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాలకు రుణాలివ్వగా, 2024–25లో అది రూ. 39,072 కోట్లకు చేరింది. అప్పుల లెక్క అలా ఉంటే... రాష్ట్రంలోని అన్ని బ్యాంకుల్లో కలిపి రూ.8.40 లక్షల కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. ఈ లెక్కన డిపాజిట్లతో పోలిస్తే 128 శాతం అప్పులు ఉండడం గమనార్హం.

క్లుప్తంగా...

భారత్ అమేయ శక్తిగా ఎదగాలి

అందుకు హిందూ సమాజం ఐక్యం కావాలి.. పిలుపునిచ్చిన చీఫ్ భాగవత్



న్యూఢిల్లీ: హిందువులంతా ఐక్యమై దేశాన్ని అమేయశక్తిగా తీర్చిదిద్దేందుకు పాటుపడాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ పిలుపునిచ్చారు. సైనికపరంగా, ఆర్థికంగా దేశాన్ని ప్రపంచశక్తిగా మలచాలని ఆయన కోరారు. ''ప్రపంచశక్తిగా మారిననాడు భారత్‌ను ఎన్ని దుష్టశక్తులు ఏకమై దాడికి తెగబడినా జయించలేవు. అన్ని సరిహద్దుల నుంచి భారత్‌ను దుష్టశక్తులు చుట్టుముడుతున్నాయి. ఈ తరుణంలో మరింత శక్తివంతంగా మారడం మినహా భారత్‌కు మరో ప్రత్యామ్నాయం లేదు''అని అన్నారు. మార్చి 21 నుంచి 23వ తేదీ వరకు ఆర్ఎస్ఎస్ అఖిల భారతీయ ప్రతినిధి సభ జరిగిన తరుణంలో భాగవత్ ఈ వ్యాఖ్యలుచేయడం గమనార్హం. సంబంధిత భాగవత్ ఇంటర్వ్యూ తాలూకు వివరాలు ఆర్ఎస్ఎస్ అనుబంధ వారపత్రిక 'ఆర్గనైజర్'లో ప్రచురితమయ్యాయి. ''ప్రపంచస్థాయి సామర్థ్యాల సముపార్జనకు మనం రోజూ శాయశక్తులా కృషిచేయాలి. దాంతోపాటే విశ్వవిజేతగా నిలిపేంత శక్తిని సాధించగలమని మనకు మనం రోజూ ప్రతిజ్ఞచేసుకోవాలి. నిజమైన శక్తి అనేది అంతర్లీనంగా ఉంటుంది. మనకు మనమే రక్షణగా నిలబడాలి. శత్రువులు కూటములుగా కదిలొచ్చినా జయించలేని స్థాయికి మనం ఎదగాలి'అని భాగవత్ వ్యాఖ్యానించారు.

10, 11 తేదీల్లో రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్ ప్రవేశానికి పరీక్షలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశానికి జూన్ 10, 11వ తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు హనుమకొండ డీవైఎస్ఓ గుగులోత్ అశోక్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, జిమ్నాస్టిక్స్, రెజ్లింగ్, స్విమ్మింగ్ క్రీడాంశాలలో ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. తెలంగాణలోని 33 జిల్లాలకు చెందిన క్రీడాకారులు ఈ పరీక్షలకు అర్హులని, ఆసక్తి ఉన్నవారు ఆయా తేదీల్లో హనుమకొండ జేఎన్ స్టేడియం ఎదురుగా ఉన్న ఇండోర్ స్టేడియంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో నిర్వహించే పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు ఎస్.శ్రీమన్నారాయణ (అథ్లెటిక్స్ కోచ్- 91828 54789), బిజదేవిక (జిమ్నాస్టిక్స్ కోచ్- 80995 93913), బి.విష్ణువర్ధన్ (హ్యాండ్‌బాల్ కోచ్-73864 69301), ఆర్.నవీన్‌కుమార్ (స్విమ్మింగ్ కోచ్- 99123 55802), ఎం.జైపాల్ (రెజ్లింగ్ కోచ్-99635 76965)లను సంప్రదించవచ్చని తెలిపారు.

గురుకులాలకు 'ఖాళీ' గుబులు!

▶ మొదటి పేజీ తరువాయి

అద్దెకిస్తే అద్దె నెలవారీగా వస్తుందని, పైగా ఎక్కువ మొత్తంలో డబ్బులు వచ్చే అవకాశం ఉందనే ఆలోచనతో యజమానులు తమ భవనాలు ఖాళీ చేయాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. మరోవైపు ఏటా అద్దె పెంపు సైతం నిలిచిపోవడం కూడా ఇందుకు మరో కారణంగా కన్పిస్తోంది. ఇంకోవైపు భవనాలకు రెగ్యులర్ రిపేర్లు, కొన్ని గురుకులాల్లో తాగునీరు, ఇతర అవసరాలకు నీటిని ట్యాంకర్ల ద్వారా తెచ్చి సరఫరా చేయాల్సి ఉండటంతో యజమానులకు ఇబ్బందికరంగా మారుతోంది. నెలవారీ అద్దెబిల్లు రాకపోగా.. ప్రతినెలా సొంతంగా ఖర్చులు భరించాల్సి రావడంతో వాటిని ఖాళీ చేయించడమే ఉత్తమం అని రంగారెడ్డి జిల్లాకు చెందిన పలువురు భవనాల యజమానులు భావిస్తున్నారు. 2025–26 విద్యా సంవత్సరం ప్రారంభం నాటికల్లా భవనాలను ఖాళీ చేయాలని ఇప్పటికే ప్రిన్స్‌పాల్స్‌కు స్పష్టం చేశారు. కొంతమంది యజమానులు ఇప్పటికే భవనాల గేట్లకు తాళాలు వేసినట్లు క్షేత్రస్థాయి సమాచారాన్ని బట్టి తెలుస్తోంది.

ఈ-సెట్‌లో 17,766 మంది పాస్

- పది బ్రాంచీల్లో కలిపి 93.87 శాతం అర్హత
- ఫలితాలు విడుదల చేసిన ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి
- ఇంజనీరింగ్ సెకండియర్‌లో అడ్మిషన్లకు త్వరలో కౌన్సెలింగ్



బి సంతోష్‌కుమార్, లెంక తేజసాయి, నిఖిల్ కౌశిక్, కె శ్రీకాంత్, కట్లి రేవతి, కాసుల శ్రావణి, రాపర్తి చందన, పోతుగంటి కార్తీక్, సుబ్రహ్మణ్యం, కుర్మ అక్షయ, ఎ చందన

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఈసెట్–2025లో 17,766 మంది అర్హత సాధించారు. ఈసెట్ ఫలితాలను ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి ఆదివారం విడుదల చేశారు. పాలిటెక్నిక్ డిప్లొమా, బీఎస్సీ మేథ్స్ కోర్సు ద్వారా ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఈసెట్)ను ఈ నెల 12న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు. 19,672 మంది దరఖాస్తు చేసుకోగా, 18,928 మంది పరీక్ష రాశారు. వీరిలో 17,768 (93.87 శాతం) అర్హత సాధించారు. ఈ సెట్ ద్వారా ఇంజనీరింగ్ రెండో సంవత్సరం (లేటరల్ ఎంట్రీ)లో చేరేందుకు అవకాశం లభిస్తుంది. మొత్తం పది బ్రాంచీలకు జరిగిన సెట్‌లో బాలురు 10,972 మంది, బాలికలు 6,796 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు కూడా ఉన్నారు. నాన్-లోకల్ కోటా ఎత్తివేయడంతో వారికి తెలంగాణలో ఇంజనీరింగ్‌లో ప్రవేశం ఉండదు. త్వరలో ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తెలిపారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ ఎం, సెట్ కన్వీనర్ పి చంద్రశేఖర్, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఈ.పురుషోత్తం, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాంచీలవారీగా మొదటి ర్యాంకు పొందినవారు

బ్రాంచీ	పేరు	జిల్లా	మార్కులు
బీఎస్సీ మేథ్స్	బి సంతోష్‌కుమార్	మల్కాజిగిరి	94
కెమికల్ ఇంజనీరింగ్	లెంక తేజసాయి	విశాఖపట్నం	124
సివిల్ ఇంజనీరింగ్	గోల్కొండ నిఖిల్ కౌశిక్	జయశంకర్ భూపాలపల్లి	156
కంప్యూటర్ సైన్స్	కె శ్రీకాంత్	నారాయణపేట	163
ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్	కట్లి రేవతి	సిద్దిపేట	164
ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్	కాసుల శ్రావణి	హనుమకొండ	128
ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్	రాపర్తి చందన	జగిత్యాల	98
మెకానికల్ ఇంజనీరింగ్	పోతుగంటి కార్తీక్	పెద్దపల్లి	163
మెటలర్జికల్	తోట సుబ్రహ్మణ్యం	కాకినాడ	79
మైనింగ్ ఇంజనీరింగ్	కుర్మ అక్షయ	పెద్దపల్లి	124
ఫార్మసీ	ఎ చందన	హనుమకొండ	123

బ్రాంచీ	దరఖాస్తులు	పరీక్షకు హాజరు	అర్హులు	అర్హత శాతం
కెమికల్ ఇంజనీరింగ్	103	93	85	91.40
సివిల్ ఇంజనీరింగ్	2,578	2,477	2,389	96.45
కంప్యూటర్ సైన్స్	4,879	4,728	4,522	95.64
ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్	5,336	5,138	4,774	92.92
ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్	4,201	4,053	3,719	91.76
ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్	139	129	117	90.70
మెకానికల్ ఇంజనీరింగ్	2,035	1,949	1,813	93.02
మెటలర్జికల్	27	27	27	100.00
మైనింగ్ ఇంజనీరింగ్	255	244	232	95.08
బీఎస్సీ (మేథ్స్)	130	10	10	100.00
ఫార్మా	89	80	80	100.00
	19,672	18,928	17,768	93.87

పుష్కరిణికి పోటెత్తిన భక్తజనం

- సరస్వతి పుష్కరాలకు ఆదివారం 2 లక్షల మంది రాక
- కిటకిటలాడిన ఆలయాలు, పుష్కర ఘాట్లు
- గవర్నర్ దంపతుల పుష్కర స్నానాలు, పూజలు
- చాలాచోట్ల ట్రాఫిక్‌జామ్.. భక్తులకు ఇబ్బందులు



నదిలో పుష్కర స్నానాలు చేస్తున్న భక్తులు

భూపాలపల్లి/కాళేశ్వరం: సరస్వతి నది పుష్కరాలకు భక్తులు పోటెత్తారు. 11వ రోజు ఆదివారం కాళేశ్వరం భక్తులతో కిటకిటలాడింది. ఒక్కరోజే దాదాపు 2 లక్షల మంది పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామితోపాటు అమ్మవార్లను దర్శించుకున్నారు. పిండప్రదాన, తర్పణాల పూజలు నిర్వహించారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ దంపతులు ఆదివారం పుష్కరస్నానాలు ఆచరించి శ్రీకాళేశ్వరముక్తీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో కాళేశ్వరం చేరుకున్న గవర్నర్.. ముందుగా సరస్వతిమాత విగ్రహాన్ని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీకాళేశ్వరముక్తీశ్వరున్ని దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు సరస్వతిమాత జ్ఞాపికను అందజేసి శేషవస్త్రాలతో సన్మానించారు. అంతకు ముందు ఎమ్మెల్సీ సురభివాణిదేవి, గడ్చిరోలి ఎంపీ నామ్‌దేవ్ కిర్సాన్, సినీనటుడు తనికెళ్ల భరణి, యోగానంద సరస్వతిస్వామి వేర్వేరుగా పుష్కర స్నానాలు చేసి అభిషేక పూజలు నిర్వహించారు. రాత్రి 7.30 గంటలకు కాశీ పండితులచే సరస్వతి మాతకు నవరత్నమాల హారతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, కమిషనర్ వెంకటరావు, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే పాల్గొన్నారు.

ట్రాఫిక్‌జామ్‌తో భక్తుల ఇక్కట్లు

ఒక్కరోజే రెండు లక్షల మంది తరలిరావటంతో పుష్కరాలకు వెళ్లే రోడ్డు మార్గాలన్నీ వాహనాలతో కిక్కిరిసిపోయాయి. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. మంచిర్యాల, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి కాళేశ్వరం వంతెన మీదుగా వచ్చే వాహనాలు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. అన్నారం క్రాస్ నుంచి వన్‌వే ఏర్పాటు చేశారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి వన్‌వేను తొలగించడంతో ట్రాఫిక్‌జామ్ అయ్యింది. ఆర్టీసీ బస్టాండ్ వద్ద భక్తులకు సరిపడా బస్సులు లేక తిరుగు ప్రయాణంలో ఇబ్బందులు పడ్డారు.

వైద్యులకు అండగా ప్రభుత్వం

- డాక్టర్లు సేవాభావంతో వైద్యం అందించాలి.. వారి సేవలను గుర్తిస్తాం
- 50 పడకల ఆస్పత్రుల ఏర్పాటులో నిబంధనల సడలింపును సీఎం దృష్టికి తీసుకెళ్తా
- రాష్ట్రస్థాయి వైద్యుల సదస్సు ముగింపు కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కరీంనగర్ టౌన్: వైద్యులు సేవాభావంతో రోగులకు వైద్యం అందించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు. వైద్యుల సేవలను ప్రభుత్వం ఎప్పటికీ గుర్తిస్తుందని.. వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆదివారం కరీంనగర్‌లో తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ (టీహెచ్ఏఎన్ఏ) 11వ వార్షికోత్సవం సందర్భంగా థానాకాన్–2025 పేరిట నిర్వహించిన రాష్ట్రస్థాయి వైద్యుల సదస్సు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి రోగికి మెరుగైన వైద్యం కోసమే ప్రతి డాక్టర్ తాపత్రయపడతారని.. కానీ కొన్ని సందర్భాల్లో రోగి ప్రాణాపాయ స్థితికి చేరుకోవడం వల్ల బంధువుల నుంచి ప్రతిఘటన ఎదురవుతోందని మంత్రి చెప్పారు. ఇలాంటి ఘటన దివంగత మహానేత వై.ఎస్. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కరీంనగర్ జిల్లాలోనే చోటుచేసుకుందని శ్రీధర్‌బాబు గుర్తుచేశారు. ఆ సమయంలోనే వైఎస్సార్ వైద్యులపై దాడులకు వ్యతిరేకంగా ప్రత్యేక చట్టం తీసుకొచ్చారన్నారు.

వైద్యులకు ఇబ్బంది లేకుండా చూస్తాం..

50 పడకల్లోపు ఆసుపత్రుల ఏర్పాటు విషయంలో ప్రభుత్వ నిబంధనలు కష్టతరంగా ఉన్నాయని.. వాటిని సడలించాలని వైద్యులు తన దృష్టికి తెచ్చారని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ విషయాన్ని సీఎం, వైద్య ఆరోగ్య మంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత సరళతరం చేయడంతోపాటు మరిన్ని వ్యాధులను చేరుస్తామన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో 14 మంది డాక్టర్లు ఎమ్మెల్యేలుగా ఉన్నారని, వారికి వైద్యుల సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. నిబంధనలు డాక్టర్లను ఇబ్బంది పెట్టేలా ఉండకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, తానా సదస్సు చైర్మన్ డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ చాట్ల శ్రీధర్, కోశాధికారి డాక్టర్ బండారి రాజ్‌కుమార్, తానా రాష్ట్ర ప్రెసిడెంట్ డాక్టర్ అరుణ్ కటారి, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎనమల నరేష్, సీనియర్ వైద్యులు జగన్మోహన్‌రావు, రమణాచారి, బి.ఎస్.రావు, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురా లేక ఐదుగురా?

▶ మొదటి పేజీ తరువాయి

మరోమారు చర్చించారు. ఇందులో మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వాకిటి శ్రీహరి, నిజామాబాద్ జిల్లా నుంచి పి.సుదర్శన్‌రెడ్డి, నల్లగొండ జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బాలూనాయక్, రంగారెడ్డి జిల్లా నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, టి.రామ్మోహన్‌రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రేమ్‌సాగర్‌రావు, గడ్డం వివేక్, కరీంనగర్ జిల్లా నుంచి ఆది శ్రీనివాస్, మైనారిటీ కోటాలో షబ్బీర్ అలీ, ఆమేర్ అలీఖాన్‌ల పేర్లు ఉన్నాయి. వారితోపాటే మహిళా కోటాలో ఎమ్మెల్సీ విజయశాంతి పేరును పరిశీలించినట్లు సమాచారం. ఇందులో ఓసీల నుంచి రెడ్డి అయితే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డిలతోపాటు వెలమ అయితే ప్రేమ్‌సాగర్‌రావు, ఎస్సీ అయితే గడ్డం వివేక్, ఎస్టీ అయితే బాలూనాయక్, శంకర్ నాయక్, ఓబీసీ నుంచి వాకాటి శ్రీహరి, విజయశాంతిల పేర్లు తుది పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. మైనారిటీ కోటాలో షబ్బీర్ అలీ, ఆమేర్ అలీఖాన్, ఫహీమ్ ఖురేషీల పేర్లు ఉన్నాయి.

నేడు రాహుల్ సమక్షంలో చర్చలు..

మంత్రివర్గ కూర్పుపై స్పష్టత రాకపోవడంతో కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ సోమవారం మరోసారి భేటీ కానున్నారు. కేసీ వేణుగోపాల్‌తోపాటు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని వారిద్దరూ కలిసి మంత్రివర్గ అంశం, పీసీసీ కార్యవర్గంపై చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోనూ సమావేశమయ్యే అవకాశాలున్నాయి. ఈ భేటీల నేపథ్యంలో ముఖ్యమంత్రి ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం వాయిదా పడింది. మంత్రివర్గ అంశంలో అధిష్టానం వద్ద గ్రీన్ సిగ్నల్ లభించాక సీఎం హైదరాబాద్ బయలుదేరనున్నారు. కాగా, కేసీ వేణుగోపాల్‌తో భేటీ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లేఖ అంశం, రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలపైనా చర్చ జరిగింది.

ఏఐకి సవాళ్ల స్వాగతం

- నిపుణులు, పెట్టుబడుల కొరతతో ఇబ్బందులు
- చిన్న నగరాల్లో హైస్పీడ్ ఇంటర్నెట్ వంటి సదుపాయాల కొరత
- డేటానే కీలకం కావటంతో సవాళ్లు విసురుతున్న సైబర్ నేరాలు
- ఉపాధిపై దెబ్బ, సామాజిక అసమానతలపై ఆందోళన



సాక్షి, హైదరాబాద్: కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతిక అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణలో.. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ సరికొత్త టెక్నాలజీని అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తోంది. ఏఐ సిటీ నిర్మాణం, బిగ్‌డేటా, సైబర్ సెక్యూరిటీ వంటి టెక్నాలజీలకు ప్రభుత్వం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసింది. డేటా సైన్స్, నైపుణ్యం, పాలన, పరిశోధన, భాగస్వామ్యం, అనుసరణ అనే ఆరు అంశాలను మూల స్తంభాలుగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం ఏఐ పాలసీని రూపొందించింది. అదే సమయంలో ఈ రంగంలో అనేక సవాళ్లు కూడా ఎదురవుతున్నాయి.

నిపుణుల కొరత..

డేటా సైన్స్, మెషీన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, బిగ్ డేటా అనలిటిక్స్ వంటి రంగాలలో రాష్ట్రంలో నిపుణుల కొరత తీవ్రంగా ఉంది. దీంతో ఏఐ ప్రాజెక్టుల అమల్లో ఆలస్యంతోపాటు అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలతో పోటీ పడలేకపోతున్నామని రాష్ట్ర ఐటీ వర్గాలు చెబుతున్నాయి. ఏఐ అభివృద్ధిలో కీలకమైన అధిక కంప్యూటింగ్ శక్తి, హై-స్పీడ్ ఇంటర్నెట్, డేటా సెంటర్లు ద్వితీయ శ్రేణి నగరాల్లో అంతగా అభివృద్ధి చెందలేదు. దీంతో ఏఐ ఆవిష్కరణలు హైదరాబాద్‌కే పరిమితమవుతున్నాయి. ఏఐ వ్యవస్థలు పెద్ద ఎత్తున డేటాపై ఆధారపడుతుండటంతో గోప్యత, భద్రత అత్యంత కీలకంగా మారింది. డేటా ఉల్లంఘనలు, సైబర్ నేరాలు కూడా ఏఐ ఆచరణలో ప్రధాన సవాలుగా నిలుస్తున్నాయి.


ఎగుమతులు, ఉపాధి కల్పన నేలచూపులు

కొన్నేళ్లుగా రాష్ట్రంలో ఐటీ ఎగుమతులు, ఈ రంగంలో కొత్త ఉద్యోగాల కల్పన వృద్ధిలో గణనీయమైన తగ్గుదల కనిపిస్తోంది. 2022–23లో ఐటీ ఎగుమతుల్లో రూ.57,706 కోట్ల పెరుగుదల నమోదు కాగా.. 2023–24లో రూ.26,948 కోట్ల పెరుగుదల మాత్రమే ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2022–23లో ఐటీ రంగంలో కొత్తగా 1,27,594 ఉద్యోగాల కల్పన జరగ్గా, 2023–24లో 40,285కి పడిపోయాయి. ఈ తగ్గుదల ఏఐ సహా ఐటీ రంగంలో కొత్త పెట్టుబడులను ఆకర్షించడంలో ఆటంకాలు సృష్టించిందనే వాదన వినిపిస్తోంది. ఏఐ ద్వారా ఆటోమేషన్ పెరిగి సంప్రదాయ ఉద్యోగాలు కోల్పోతామనే భయం ఐటీ ఉద్యోగుల్లో కనిపిస్తోంది.

స్టార్టప్‌లు, ఆవిష్కరణలే కీలకం

రాష్ట్రంలో రిజిస్టర్ చేసుకున్న స్టార్టప్‌ల (6,873)లో సుమారు మూడు శాతం ఏఐ, ఎంఎల్ ఆధారిత స్టార్టప్‌లు (211) ఉన్నాయి. తెలంగాణ ఏఐ మిషన్ (టీ ఎయిమ్) ద్వారా 142 ఏఐ స్టార్టప్‌లకు మార్కెట్‌తో అనుసంధానం, ఆర్థిక సాయం, మార్గదర్శనం, అత్యాధునిక ఏఐ కంప్యూటింగ్ సౌకర్యాలను ప్రభుత్వం అందిస్తోంది. 2027 నాటికి 5 లక్షల మందికి (18–45 ఏళ్ల వయస్సు) ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. నాస్కామ్, మైక్రోసాఫ్ట్ తదితర సంస్థలతో కలిసి ఏటా 30 వేల మంది విద్యార్థులకు ఏఐ శిక్షణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏఐని పాఠ్యాంశంగా చేర్చే ప్రణాళిక రూపొందిస్తోంది. ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లకు ఏఐ కంప్యూటింగ్ సామర్థ్యాన్ని అందుబాటులోకి తేవడం, 12 భారతీయ భాషల్లో ఏఐ అప్లికేషన్ల అభివృద్ధి, ప్రభుత్వ సేవల్లో ఏఐ సాంకేతిక వినియోగాన్ని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2024లో తెలంగాణ ఐటీ ఎగుమతులు రూ.2.68 లక్షల కోట్లు కాగా, 2025లో ఇందులో ఏఐ రంగం వాటాను 5 బిలియన్ డాలర్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది.

పెట్టుబడులు పెరిగితేనే ఫలితాలు



మనకు విస్తృతమైన ఇంజనీరింగ్ ప్రతిభా సంపద ఉన్నప్పటికీ డేటా సైన్స్, మెషీన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీలో కీలక నైపుణ్యాల కొరతను ఎదుర్కొంటున్నాం. ద్వితీయ శ్రేణి నగరాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు లేకపోతే మనం ఏఐ ఫలితాలను అందుకోలేం. స్థానిక భాషలు, సంస్కృతి, స్థానిక అవసరాలకు అనుగుణంగా స్వదేశీ లార్జ్ లాంగ్వేజ్ మోడళ్ల (ఎల్ఎల్ఎం)లు, జనరేటివ్ ఏఐ మోడళ్లను అభివృద్ధి చేయడంలో కూడా మనం వెనుకబడి ఉన్నాం. ఏఐ వాతావరణం హైదరాబాద్ లాంటి నగరాలకే పరిమితం కాకుండా ఇంకా విస్తరించాలి. ఏఐ విప్లవాన్ని మన సొంత రీతిలో మనమే నిర్వచించుకోవాలి.

– కరుణ్ తాడేపల్లి, కో ఫౌండర్, సీఈఓ–బైట్ఎక్స్ఎల్

ఏఐతో ఉద్యోగాలకు ముప్పు లేదు



ఏఐ వల్ల సంప్రదాయ ఉద్యోగాలకు ముప్పు ఉండదు. నెమ్మదిగా, పునరావృతమయ్యే పనులను వేగంగా పూర్తి చేసేందుకు ఏఐ సాంకేతికత ఉపయోగపడుతుంది. ఏఐ విప్లవానికి నాయకత్వం వహించే సామర్థ్యం మనకు ఉంది. కానీ ఏఐ, డేటా సైన్స్, క్లౌడ్‌లో నిపుణుల కొరతను ఎదుర్కొంటున్నాం. ఇది రాత్రికి రాత్రే పరిష్కారమయ్యే సమస్య కాదు. నైపుణ్య శిక్షణ, ఆచరణాత్మక విధానాలు, నిరంతర పెట్టుబడులతోనే ఈ సమస్యను అధిగమించగలం. ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు మాత్రమే ద్వితీయ శ్రేణి పట్టణాలు పరిమితం కాకుండా ఏఐ విప్లవంలో భాగస్వాములు కావాలి.

– అంజి మరం, ఫౌండర్, సీఈఓ, క్రిటికల్‌రివర్ ఇంక్



సంతులనం లేని ఇతరుల మనసులను సంతులనం చేయడానికి... సంతులనం కలిగిన మనస్సు అవసరం.

– సయాజీ ఊ బా ఖీన్

సాక్షి

సోమవారం, 26 మే 2025

కథకు దక్కిన గౌరవం

కన్నడ రచయిత్రి బాను ముష్తాక్ తన 'హార్ట్ ల్యాంప్'(హృదయ దీపం) కథాసంపుటికిగానూ 'ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్' గెలుచుకోవడం చాలా విధాలుగా ప్రత్యేకమైనది. ఇది కర్ణాటకకే కాదు, దక్షిణ భారతదేశానికే దక్కిన తొలి గౌరవం. బుకర్ చరిత్రలో ఒక కథల సంపుటికి ఈ పురస్కారం దక్కడం ఇదే ప్రథమం. ఇది గెలుచుకున్న అత్యంత ఎక్కువ వయసువాళ్లలో(77) ఆమె ఒకరు (ఫిలిప్ రాత్‌కు ఇచ్చినప్పుడు 78 ఏళ్ళు). ఆంగ్లంలో రాసిన పుస్తకాలకు ఇచ్చే 'బుకర్ ప్రైజ్'ను కొంతమంది భారతీయ, భారత సంతతి రచయితలు ఇంతకుముందు గెలుచుకున్నారు; వాటి గొప్పతనం వాటిదే! కానీ ఆంగ్లంలో రాయనక్కర్లేకుండా తమకు చేరువైన భాషలో రాస్తూనే అంతర్జాతీయ ఖ్యాతి పొందవచ్చని ఈ గౌరవం చెబుతోంది. భిన్న భారతీయ భాషల్లో వస్తున్న శ్రేష్ఠమైన సాహిత్యాన్ని ఆంగ్ల ప్రపంచపు గుమ్మంలోకి ప్రవేశపెట్టే చొరవ చూపేలా ఈ విజయం ప్రచురణకర్తలకు ప్రేరణనిస్తోంది. గట్టిగా ఆంగ్ల భాష తలుపు కొట్టగలిగితే, ఇతర భాషల కిటికీలు వాటికవే తెరుచుకుంటాయి.

రచయిత్రి, పాత్రికేయురాలు, సామాజిక కార్యకర్త, న్యాయవాది అయిన బాను ముష్తాక్ ఆరు కథా సంపుటాలు, ఒక వ్యాసాల సంకలనం, ఒక కవిత్వ సంపుటి, ఒక నవల వెలువరించారు. పురుషాధిపత్య సమాజంలో ముస్లిం మహిళల జీవన వ్యథలను ఆమె చిత్రించారు. ఆమె పాత్రలు కన్నడ, దక్కనీ ఉర్దూ, అరబిక్ మాట్లాడుతాయి. 1990–2023 మధ్యకాలంలో ఆమె రాసిన 50కి పైగా కథల్లోంచి 12 కథలను కూర్చడంతోపాటు, వాటిని ఆంగ్లంలోకి అనువదించిన దీపా భాస్తి ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్ గెలుచుకున్న తొలి భారతీయ అనువాదకురాలు అయ్యారు. ''మహిళ రాసి, మహిళ సంపాదకత్వం వహించి, మహిళ అనువదించిన పుస్తకం హార్ట్ ల్యాంప్'' అన్నారు బెంగాలీ అనువాదకుడు అరుణవ సిన్హా. ఈ పురస్కారాన్ని 2022లో తొలిసారిగా ఇండియా నుండి హిందీ రచయిత్రి గీతాంజలిశ్రీ గెలుచుకోవడానికి కారణమైన అనువాదకురాలు డైసీ రాక్‌వెల్ ఒక అమెరికన్ అని తెలిసిందే! అవార్డు కింద నగదుగా ఇచ్చే యాభై వేల పౌండ్లను నియమాల మేరకు బాను, దీపా సమానంగా పంచుకుంటారు. భారతీయ భాషల్లోని మంచి సాహిత్యాన్ని మరో దరికి చేర్చాలన్న అనువాదకుల పూనికకు ఇది గట్టి ప్రోత్సాహం కాగలదు.

1970–80ల్లో కర్ణాటకలో మొదలైన బండాయ సాహిత్యోద్యమం దళితులు, ముస్లింలు తమ కథలను తామే రాసుకునే ప్రేరణనిచ్చింది. మంచి ముస్లిం బాలికలు ఉర్దూలో ఖురాన్ చదవగలిగితే చాలు అనే సామాజిక వాతావరణంలో తొలుత ఉర్దూలో చదవడం ప్రారంభించి, తండ్రి (ఎస్.ఎ.రహమాన్, హెల్త్ ఇన్‌స్పెక్టర్) ప్రోద్బలంతో కన్నడ మాధ్యమంలోకి మారిన బాను ఆ భాషనే తన రచనా వాహికగా ఎంచుకున్నారు. ''నాకు అక్షరాలు వచ్చినప్పటి నుంచీ రాయడం మొదలుపెట్టాను'' అంటారామె. రష్యన్ రచయిత ఫ్యోదర్ దోస్తోవ్‌స్కీ, కన్నడ రచయిత దేవనూర్ మహదేవను అభిమానించే ఆమె 'నాను అపరాధియే?' పేరుతో తొలి కథ రాశారు. తన స్నేహితురాళ్లు చిన్ననాటనే పెళ్లిళ్లు చేసుకుని జీవితంలో నిలిచిపోతున్నా ఆమె ఆగకుండా పైచదువులకు వెళ్లారు. సినిమాకు వెళ్లడం మీద ఒక ముస్లిం యువతిని అడ్డుకున్న ఉదంతం గురించి ఆమె రాసిన తొలి వ్యాసం చర్చనీయాంశం కావడంతో పాటు ఆమెను 'లంకేశ్ పత్రికే' జర్నలిస్టుగా మార్చింది. 26 ఏళ్ల వయసులో ప్రేమ వివాహం చేసుకున్నప్పటికీ, వివాహానంతరం బురఖా ధరించాలనీ, ఇంటి పనులకే పరిమితం కావాలనీ అత్తవారింటి నుంచి ఒత్తిడి వచ్చింది. చేస్తున్న హైస్కూల్ టీచర్ ఉద్యోగం మానాల్సి వచ్చింది. ముగ్గురు అమ్మాయిలు, ఒక అబ్బాయి కలిగాక ఒక దశలో నిరాశా నిస్పృహలతో వైట్ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకోబోయారు. మూడేళ్ల పాపను ఆమె కాళ్ల దగ్గర పెట్టి, అలా చేయొద్దంటూ ఆమె భర్త ముష్తాక్ మొహియుద్దీన్ ఆమెను హత్తుకున్నారు. అప్పట్నించీ ఆమెకు అన్నింటా అండగా నిలిచారు.

స్త్రీల వేదన, నిస్సహాయత తన మీద లోతైన ప్రభావం చూపి, రాయక తప్పని స్థితిని కల్పించాయంటారు బాను. ''నువ్వు ఈ ప్రపంచాన్ని మళ్లీ నిర్మించదలిస్తే, మగవాళ్లనూ ఆడవాళ్లనూ సృష్టించదలిస్తే అనుభవం లేని కుమ్మరిగా ఉండకు. ప్రభూ! ఈ భూమ్మీదకు ఒక్కసారి ఆడదానిగా రా!'' అని అడుగుతుంది 'ఓ దేవుడా! ఒక్కసారి ఆడదానిగా ఉండు' కథ. ''మతం, సమాజం, రాజకీయాలు స్త్రీల నుంచి ప్రశ్నించకూడని విధేయతను డిమాండ్ చేస్తాయి. ఈ క్రమంలో అమానవీయ క్రూరత్వాన్ని మోపుతాయి'' అంటారామె. మసీదుల్లో స్త్రీలకు ప్రార్థించే హక్కు ఉండాలంటారు ఈ 'ఫైర్‌బ్రాండ్'. సొంత సమాజం మీద ఉమ్మివేయడం ద్వారా బయట జేజేలు కొట్టించుకుంటోందన్న నిందలు మోశారు. ఒక దశలో ఆమె మీద కత్తిదాడి యత్నం జరిగింది. అయితే దాడి చేసిన వ్యక్తిని ఆమె క్షమించారు. మున్సిపల్ కౌన్సిల్ సభ్యురాలిగా రెండుసార్లు ఎన్నికయ్యారు. 'మన ముక్కులు కోపిస్తుంది' అని ఆమె తండ్రితో ఆమె కుటుంబ సభ్యులు సరదాగా అనేవాళ్లట. బదులుగా ఇప్పుడు అందరిలోనూ వాళ్లంతా ముఖాలు ఎత్తి నిలబడేలా చేయగలిగారు. ఇంతటి ప్రతిష్ఠాత్మక పురస్కారం అందుకోవడాన్ని 'ఒక్క ఆకాశాన్ని వెయ్యి మిణుగురులు వెలిగించినట్టుగా' ఆమె అనుభూతి చెందారు. 'ప్రతీ గొంతుకనూ వినే, ప్రతీ కథకూ మన్నన దక్కే, ప్రతీ మనిషీ మరొకరికి చెందే ప్రపంచాన్ని సృష్టించాలి' అని తన పురస్కార అంగీకారోపన్యాసంలో కోరారు. అదే నిజమైతే, మిణుగురులు ఆకాశాన్ని వెలిగించే అనుభూతి ప్రతి ఒక్కరికీ సాక్షాత్కరిస్తుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు వైశాఖ మాసం, **తిథి:** బ.చతుర్దశి ఉ.11.19 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** భరణి ఉ.7.40 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** రా.6.51 నుండి 8.21 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.21 నుండి 1.13 వరకు, తదుపరి ప.2.56 నుండి 3.48 వరకు, **అమృతఘడియలు:** రా.3.45 నుండి 5.16 వరకు.

సూర్యోదయం : 5.29
సూర్యాస్తమయం: 6.24
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

కశ్మీరీలతో ఇలాగేనా వ్యవహరించేది?

కామెంట్



కరణ్ థాపర్

మనలో చాలా మందికి పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి, ఆపరేషన్ సిందూర్, 4 రోజుల 'యుద్ధం' గురించి ఎక్కువగానే తెలుసు. తెలుసుకోవడం మనం ఒక పనిగా పెట్టుకున్నాం. కానీ ఈ కాలంలో జరిగిన ఇతర వాస్తవాలు చాలా బాధ కలిగిస్తున్నాయి. ఏప్రిల్ 27, మే 8 మధ్య భారతదేశ వ్యాప్తంగా వివిధ రకాలుగా 184 ముస్లిం వ్యతిరేక దాడులు జరిగాయని పౌర హక్కుల రక్షణ సంఘం నివేదించింది. వాటిలో 19 విధ్వంసక చర్యలు, 39 దాడులు, 42 వేధింపుల సంఘటనలు, 84 ద్వేషపూరిత ప్రసంగ సంఘటనలు ఉన్నాయి. వీటిలో 106 దాడులు పహల్‌గామ్ ద్వారా 'ప్రేరేపితం' అని అంచనా. వీటిలో ఎక్కువ భాగం ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, మహారాష్ట్రలలో జరిగాయి.

కశ్మీరీలను, ఇతర ముస్లింలను లక్ష్యంగా చేసుకోవడం సర్వసాధారణం కాబట్టి ఈ వాస్తవాలు మనకు తెలియలేదా? అవి మన అసహనం, నిరాశ, కోపానికి బాక్సింగ్ బ్యాగులుగా మారాయా? పత్రికలు వాటిని ఎందుకు నివేదించవు? వాటి గురించి తెలుసుకోవడానికి మనం ఎందుకు ప్రయత్నించడం లేదు?

కశ్మీర్‌లో ఏమి జరిగిందో పరిశీలించండి. కేవలం అనుమానం ఆధారంగా, ఎటువంటి ప్రక్రియా లేకుండా, బుల్‌డోజర్ న్యాయంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను కూడా ఉల్లంఘించి, ఉగ్రవాదులుగా చెప్పబడుతున్న వారి ఇళ్లను కూల్చివేశారు. చట్ట పాలనను అనుసరించే ప్రజాస్వామ్య దేశంగా భారతదేశం తనను తాను చెప్పుకోవడాన్ని ఇది అపహాస్యం చేయడం లేదా?

అంతే కాదు. బహుశా 2,000 మందిని అనుమానంతో అరెస్టు చేశారు. పాశ్చాత్య పత్రికలు వారిలో అనేక మందిని హింసించారని నివేదించాయి. ముగ్గురు మరణించినట్లు తెలుస్తోంది. ఇది కశ్మీరీలు, ముస్లింలు అనే కారణంగా కశ్మీరీ ముస్లింల పట్ల అనుమానాస్పద దృక్పథంతో వ్యవహరించడమేనని అనిపించడం లేదా?

కశ్మీరీలు ఎలా స్పందించారు?

ఇప్పుడు, కశ్మీరీలు పహల్‌గామ్ ఘటన పట్ల ఎలా స్పందించారో పోల్చి చూద్దాం. హోటల్ బుకింగ్‌లు లేని వారికి పడకలు అందించడానికి మతాధికారులు మసీదులను తెరిచారు. విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికుల నుండి ఛార్జీలు వసూలు చేయడానికి ట్యాక్సీ డ్రైవర్లు నిరాకరించారు. బాధితుల పట్ల సానుభూతి వ్యక్తం చేయడానికి దుకాణాలు, హోటళ్ళు, కళాశాలలు, పాఠశాలలు మూసివేయడంతో పూర్తి హర్తాళ్ జరిగింది. అధికారంలో ఉన్నా, లేదా ప్రతిపక్షంలో ఉన్నా అన్ని రాజకీయ పార్టీలూ ఉగ్రవాదులను ఖండిస్తూ ర్యాలీలు నిర్వహించాయి. దీని గురించి మనకు వివరంగా తెలియాలి కానీ మనకు తెలియలేదు. లేదా దీని గురించి చాలా తక్కువగా చెప్పడం జరిగింది. ఎందుకు? కచ్చితంగా కశ్మీర్ నుండి మనం వినాలనుకున్న, వినవలసిన సందేశం ఇది కాదా?



◆ ఏప్రిల్ 27, మే 8 మధ్య భారతదేశ వ్యాప్తంగా వివిధ రకాలుగా 184 ముస్లిం వ్యతిరేక దాడులు జరిగాయని పౌర హక్కుల రక్షణ సంఘం నివేదించింది. వీటిలో 106 దాడులు పహల్‌గామ్ ద్వారా 'ప్రేరేపితం' అని అంచనా.

◆ కశ్మీరీలు పహల్‌గామ్ ఘటన పట్ల ఎలా స్పందించారో చూడండి: హోటల్ బుకింగ్‌లు లేని వారికి పడకలు అందించడానికి మతాధికారులు మసీదులను తెరిచారు. విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికుల నుండి ఛార్జీలు వసూలు చేయడానికి ట్యాక్సీ డ్రైవర్లు నిరాకరించారు.

లోయలోని కశ్మీరీల ప్రవర్తనకు పూర్తి విరుద్ధంగా, భారతదేశంలోని మిగిలిన ప్రాంతాలలో కశ్మీరీలను ఎలా చూశారో పరిశీలిద్దాం. పంజాబ్, ఉత్తరాఖండ్‌లలో కశ్మీరీ విద్యార్థులను కొట్టారు. వారు తమ ప్రాణాలు కాపాడుకోవడం కోసం పారిపోవలసి వచ్చింది. ముస్సోరీలో, దశాబ్దాలుగా అక్కడ పనిచేస్తున్న 'షాల్ వాలాస్' బలవంతంగా ఆ ప్రాంతాన్ని వదిలి వెళ్ళవలసి వచ్చింది. అయినప్పటికీ ఈ రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు వారిని ఏమాత్రం పట్టించుకోకుండా కనిపించాయి. మళ్ళీ ప్రశ్నిస్తున్నాను... ఎందుకు? వీరు మీలాగే, నాలాగే హక్కులతో కూడిన భారత పౌరులు కాదా?

బహుశా, అన్నింటికంటే ఘోరంగా, అధికార స్థానాల్లో ఉన్నవారు కశ్మీరీలనూ, ముస్లింలనూ రక్షించడానికి బదులుగా దాడి చేయడాన్ని ఎంచుకున్నారు. 'కశ్మీర్‌లో జరిగిన దాడి హిందువులపై జరిగిన దాడి. మేము కూడా అదే విధంగా స్పందిస్తాం. కశ్మీరీలపై మాత్రమే కాదు, భారతదేశంలోని ప్రతి ముస్లింపైనా' అని హిందూ సేన అధ్యక్షుడు విష్ణు గుప్తా వ్యాఖ్యానించారు. మధ్యప్రదేశ్ గిరిజన వ్యవహారాల మంత్రి విజయ్ షా, కల్నల్ సోఫియా ఖురేషీని 'ఉగ్రవాదుల సోదరి' అన్నారు. అయినా వీరంతా తప్పించుకున్నారు. వారిని ఏ రకంగానూ హెచ్చరించలేదు. వారిని కచ్చితంగా శిక్షించలేదు.

ఇప్పుడు నేను రాసిన దాని గురించి ఆలోచించండి. ముస్లింలపై ప్రధానంగా దాడులు జరిగిన రాష్ట్రాలు ఏవి? అక్కడ అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ఏవి? ఏ పార్టీ సభ్యులు లేదా సైద్ధాంతిక మద్దతుదారులు అలా వ్యవహరించారో మీకే తెలుస్తుంది. అదేమీ రహస్యం కాదు. నిజానికి, ఇది కొట్టొచ్చినట్టుగా కనబడుతోంది.

ఇదీ నాగరిక పద్ధతి!

దేశ విభజన తర్వాత హత్యలు తారస్థాయికి చేరుకున్నప్పుడు జవహర్‌లాల్ నెహ్రూ 1947 అక్టోబర్ 15న రాష్ట్ర ముఖ్యమంత్రులకు రాసిన లేఖ నుండి నన్ను ఉటంకించనివ్వండి: 'మన దగ్గర ముస్లిం మైనారిటీ చాలా పెద్ద సంఖ్యలో ఉన్నారు. వారు కోరుకున్నా, వేరే చోటికి వెళ్లలేరు. వారు భారతదేశంలోనే నివసించాలి'. తరువాత స్పష్టంగా ఇలా జోడించారు: 'పాకిస్తాన్ నుండి ఏదైనా రెచ్చగొట్టడం జరిగినా... మనం ఈ మైనారిటీతో నాగరిక పద్ధతిలో వ్యవహరించాలి.'

ఆ సలహా 80 సంవత్సరాల క్రితం ఉన్నంత సందర్భోచితంగానే ఇప్పుడు కూడా లేదా? మిస్టర్ మోదీ నుండి మనం వినవలసిన సందేశం ఇది కాదా? పైగా ప్రధానమంత్రి మౌనం వ్యూహాత్మక ప్రతిస్పందన అని చాలామంది విశ్వసిస్తున్నట్లయితే మనం ఎలాంటి దేశంగా మారాం?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

పట్టభద్రులు కాదు, విద్యావంతులు కావాలి!

అభిప్రాయం



డా॥ గోపాలకృష్ణ కొవ్వలి

వేసవి కాలం ఉక్కపోత, విద్యార్థులకు పరీక్షలు, ఫలితాల కాలం. చదువుకు అధిక ప్రాముఖ్యాన్నిచ్చే సమాజంలో, ముఖ్యంగా మధ్యతరగతి తెలుగు కుటుంబాలలో, చదువుతో వచ్చే పట్టాలకి ఇచ్చే ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. తల్లిదండ్రులు పిల్లలపై ఉంచే అంచనాల వల్ల పెరిగే ఉక్కపోత వేసవి ఉక్కపోత కంటే ఎక్కువగా ఉక్కిరిబిక్కిరి చేస్తుందన్నది అందరం గమనించే విషయమే.

ఏ దేశానికైనా మూల వనరులతో పాటు మానవ వనరులు కూడా చాలా అవసరం. దేశంలో సుమారు 60 వేల ఉన్నత విద్య సంస్థలు ఉన్నాయి. 2023–24 ఆర్థిక సర్వే ప్రకారం, సగం మంది పట్టభద్రులు నైపుణ్యం లేమి కారణంగా ఉద్యోగార్హత లేనివారు. ఈ పట్టభద్రులలో విద్యావంతులు ఎంతమంది?

చదువు, విద్య అన్న పదాలను సమానార్థకంగా వాడుతున్నా, వాటి అంతరార్థం వేరు. కొన్ని విషయాలను నేర్చుకుని పరీక్షల్లో ఉత్తీర్ణత పొంది ఒక పట్టా పొందే అవకాశం ఇచ్చే ప్రక్రియను 'చదువు' అని అంటున్నాం. మరి విద్య అంటే?

చదువుకూ, విద్యకూ తేడా!

'అజ్ఞానాన్ని తరిమివేసే సత్యాన్వేషణే విద్య' అంటాడు సోక్రటీస్; 'ఆరోగ్యవంతమైన శరీరంలో ఆరోగ్యవంతమైన మనసును సృష్టించడమే విద్య' అని నిర్వచించాడు అరిస్టాటిల్'; 'మానవుడి బుద్ధి దేని ద్వారా వికసిస్తుందో, మనశ్శాంతి పెంపొందుతుందో, శీలం ఏర్పడుతుందో, మానవుడు దేని ద్వారా స్వశక్తితో నిల్చుంటాడో అదే విద్య' అని స్వామి వివేకానంద ఉద్ఘాటించారు.

ప్రస్తుత కాలంలో, కొలువుల కోసం కనీస అర్హతనిచ్చే పట్టాలు పొందడమే పరమావధిగా చదువుల ప్రహసనం సాగుతోంది. చదివే సబ్జెక్టుకీ, చేసే ఉద్యోగానికీ పొంతన లేని సందర్భాలు చాలా చూస్తాం. ఏ సబ్జెక్టులో డిగ్రీ పొందినా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సంపాదించడం కోసం యువత పడే పాట్లు ఆధునిక భారత సమాజంలో చూస్తున్నాం. అమెరికాలో ఆర్థిక మాంద్యం అని పుకార్లు వస్తే చాలు అబ్బాయికి వణుకు, అయ్యకి గుండె నొప్పి! ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొని నిలబడగలమనే ఆత్మ నిబ్బరం కలిగించే 'విద్యనివ్వని చదువులు' ఒత్తిడి కారకం అవుతున్నాయన్నమాట!

◆ చదువు జ్ఞానాన్ని ఇవ్వాలి. కానీ ప్రస్తుత విద్యా వ్యవస్థలో జ్ఞానం ఇచ్చే చదువులు అరుదు. ప్రస్తుత చదువులు సమాచారాన్ని మాత్రమే అందిస్తున్నాయి.

చదువు జ్ఞానాన్ని ఇవ్వాలి. కానీ ప్రస్తుత విద్యా వ్యవస్థలో జ్ఞానం ఇచ్చే చదువులు అరుదు. ప్రస్తుత చదువులు సమాచారాన్ని మాత్రమే అందిస్తున్నాయి. బతుకుతెరువు నేర్పే విద్యలు కళాశాలలో, విశ్వవిద్యాలయాలలో దొరకడం లేదు. ఏ పట్టాలూ లేని రైతు అనుభవంతో పొందిన నైపుణ్యంతో పంట పండిస్తాడు. ఎంతో ఖర్చు పెట్టి ప్రఖ్యాత విశ్వవిద్యాలయం నుంచి వ్యవసాయ శాస్త్రంలో అత్యున్నత పట్టా పొందిన వారికి పొలం దున్నడం, విత్తనాలు వేయడం పాఠ్యాంశంగా మాత్రమే తెలుసు.

పట్టాల కోసం చదివినా... చదువులు యువతకు కొన్ని బతుకు పాఠాలు నేర్చుకునే సాధనాలుగా ఉండాలి. సొంతంగా, తార్కికంగా ఆలోచించి జీవిత ప్రయాణం కొనసాగించే నేర్పు, మనఃస్థితి అలవర్చుకునేలా విద్యనభ్యసించాలి. అది విద్యాలయాల ద్వారా సాధ్యం కాకపోయినా పుస్తక పఠనం ద్వారా, పెద్దల నుంచీ నేర్చుకునే ప్రయత్నం చేయాలి. అయితే, యువతకు మార్గనిర్దేశం చేయగల పెద్దలు సమాజంలో ఉన్నారా? తమ పిల్లలు ఎక్కువ జీతం వచ్చే ఉద్యోగాలు సంపాదించే గొప్ప డిగ్రీలు పొందాలని ఆశించడం సహజమే కానీ సంపాదనతో పాటు సమాజ హితం కాంక్షించే నైజం అలవరచుకోవాలని కోరుకోవడం అభిలషణీయం కదా!

ముఖ్యంగా యువత విద్యతో పాటు విచక్షణ నేర్వడం అవసరం. మంచి చెడుల మధ్య తేడా తెలుసుకోగల వివేకం అలవర్చుకోవడమే చదువు అంతిమ లక్ష్యంగా ఉండాలి. పట్టాలు పొంది విశాల ప్రపంచంలోకి అడుగుపెట్టే యువతకు 'వివేక చూడామణి' ఏది?

శ్రీవిష్ణుపురాణం 'విద్యయా యో యయా యుక్తస్తస్య సా దైవతం మహత్, సైవ పూజ్యార్చనీయా చ సైవ తస్యోపకారికా' అని విద్యా శక్తిని ప్రతిపాదిస్తుంది. ఏ విద్య సాయంతో ఒక వ్యక్తి తన జీవనాన్ని సాగిస్తుంటాడో, ఆ విద్యయే అతడికి ఇష్టదైవం వంటిది. ఆ విద్య ఆ వ్యక్తికి పూజనీయమైనది; ఆ విద్య ఆ వ్యక్తికి చిరకాలం ఆనందాన్ని కలిగించేదిగా ఉంటుంది అని సారాంశం.

విద్య ప్రయోజనాలు, ఆవశ్యకత గురించి 'విద్య నిగూఢ గుప్తమగు విత్తము, రూపము పూరుషాళికిన్' అనే భర్తృహరి సుభాషితం సమగ్రంగా చెబుతుంది. భౌతిక సుఖాలు, సౌకర్యాలు చేకూర్చే సాధనంగా విద్యను నిర్వచించినా, 'విద్య గురువు, విశిష్ట దైవతము' అని చెబుతాడు. అంటే సన్మార్గంలో నడిచే విధంగా మార్గదర్శనం చేసేది, ఉత్తమ గుణసంపదనిచ్చేది. విద్యకు రూపం లేదు; కానీ మంచి విద్య పొందినవారు తమకు తాము గురువు గానూ, దైవం గానూ మలచుకునే శక్తియుక్తులు సంపాదించి సమాజానికి ఉపయోగపడాలన్నది భర్తృహరి ఉపదేశ సారం.

పుస్తక జ్ఞానమూ, అనుభవ జ్ఞానమూ కలగలిపి సర్వశక్తి సంపన్నుడుగా, వివేకం, విచక్షణ గల వ్యక్తిగా ఎదగడానికి తనకు తానే గురువుగానూ, దైవం గానూ పరిణమించాలి. అప్పుడే, యువత వేగంగా మారుతున్న ప్రపంచ పరిస్థితులను తట్టుకుని స్వయం ప్రతిభతో విరాజిల్లగలదు.

వ్యాసకర్త సీనియర్ శాస్త్రవేత్త, అమెరికా

గూగుల్ నిర్ణయంతో పిల్లలకు చేటు?

సందర్భం



లీసా ఎం. గివెన్

కృత్రిమ మేధ... ఎటు చూసినా ఇదే హాట్‌టాపిక్. అయితే ఈ అత్యాధునిక టెక్నాలజీని పిల్లలకూ చేరువ చేసేందుకు గూగుల్ చేస్తున్న ప్రయత్నం మాత్రం ఆందోళన కలిగిస్తోంది. కృత్రిమ మేధ ఛాట్‌బోట్ 'జెమినీ'ని 13 ఏళ్ల కంటే తక్కువ వయసు వారికీ అందుబాటులోకి తెస్తున్నట్లు గూగుల్ ఇటీవలే ప్రకటించింది. మొదట అమెరికా, కెనడాల్లో ప్రవేశపెట్టి ఈ ఏడాది చివరికి ఆస్ట్రేలియాలోనూ లాంచ్ చేయనున్నట్లు సమాచారం. గూగుల్ ఫ్యామిలీ లింక్ అకౌంట్లు ఉన్న వారికి మాత్రమే ఇది అందుబాటులో ఉంటుంది. అయితే ఈ పరిణామం ఏమంత మంచిది కాదని అనిపిస్తోంది. సోషల్ మీడియా వాడకంపై పిల్లలకు నిషేధం ఉన్నా వారిని సురక్షితంగా ఉంచేందుకు ఎన్ని పాట్లు పడాలో ఈ నిర్ణయం హైలైట్ చేస్తోంది. బహుశా దీన్ని ముందుగా గూగుల్ లాంటి పెద్ద కంపెనీల్లో వెంటనే అమలు చేసి చూడటమే మేలేమో!

పదమూడేళ్ల లోపు పిల్లలకు అందుబాటులోకి తెస్తున్న కృత్రిమ మేధ ఛాట్‌బోట్ 'జెమినీ' వాడకంపై తల్లిదండ్రులకు నియంత్రణ ఉంటుందని గూగుల్ చెబుతోంది. ఫ్యామిలీ లింక్ అకౌంట్ల ద్వారా పిల్లలు ఏయే అప్లికేషన్లు వాడవచ్చో నిర్ణయించవచ్చు. పిల్లల పేరుతో అకౌంట్‌ను సృష్టించేందుకు తల్లిదండ్రులు పిల్లాడి పేరు, పుట్టిన తేదీ వంటి వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇది కాస్తా వారి వ్యక్తిగత గోప్యతపై ప్రశ్నలు లేవనెత్తే అవకాశాలున్నాయి. అయితే పిల్లల వాడకానికి సంబంధించిన సమాచారాన్ని ఏఐ వ్యవస్థల శిక్షణకు వాడుకోబోమని స్పష్టం చేస్తోంది. ఛాట్‌బోట్ డీఫాల్ట్‌గా అందుబాటులో ఉంటుంది కాబట్టి తల్లిదండ్రులు నియంత్రణ కోసం కొన్ని ఫీచర్లను స్విచ్చాఫ్ చేయాలి. ఈ వ్యవస్థ తప్పులు చేసేందుకు అవకాశముందని అంగీకరిస్తోంది కాబట్టి ఇది అందించే సమాచారం నాణ్యత, విశ్వసనీయత ఎంత అన్నది ప్రశ్నార్థకం. కొన్నిసార్లు ఛాట్ బోట్లు కొన్ని సమాధానాలను ఊహించుకుని చెబుతూంటాయి. టెక్ పరిభాషలో దీన్ని 'హెలూసినేషన్' అంటూంటారు. పిల్లలు ఒకవేళ తమ హోంవర్క్ కోసం ఈ ఛాట్‌బోట్‌ను వాడుతూంటే.. అందులో వాస్తవాలు ఎన్నో... ఛాట్‌బోట్ తాలూకూ భ్రాంతి, భ్రమ ఎంతో తెలియకుండా పోతుంది.



గూగుల్, ఇతర సెర్చ్ ఇంజిన్లు తమంతట తాము ఒక స్పందన ఇవ్వకుండా... ఆ యా అంశాలకు సంబంధించిన వేర్వేరు సమాచారాలను మీ ముందు ఉంచుతాయి. వాటిల్లో వార్తలుంటాయి. ఫీచర్ కథనాలుంటాయి. విద్యార్థులు ఎవరైనా వీటిని చదివి అర్థం చేసుకుని తమ హోం వర్క్‌లను చేసుకోవచ్చు. అయితే ఏఐ టూల్స్ ఇలా కాదు. అందుబాటులో ఉన్న సమాచారంలో ఒక ప్యాటర్న్ కోసం వెతుకుతాయి. వాటి ఆధారంగా సమాధానాలను సృష్టిస్తాయి. లేదా చిత్రాన్ని తయారు చేస్తాయి. ఇవన్నీ మనం అందించే ప్రశ్న అంటే ప్రాంప్ట్ ఆధారంగా జరుగుతాయి. ఉదాహరణకు... ఒక కుర్రాడు పిల్లి బొమ్మ గీయమని అడిగాడని అనుకుందాం. అప్పుడు 'జెమినీ' ఛాట్‌బోట్ వ్యవస్థ... పిల్లి లక్షణాలు అంటే పొడుచుకొచ్చిన చెవులు, మీసాలు, పొడవైన తోక వంటి వాటిని గుర్తించే ప్రయత్నం చేస్తుంది. వీటి ఆధారంగా పిల్లి చిత్రాన్ని గీస్తుంది. గూగుల్ సెర్చ్ ఇంజిన్లు, జెమినీ ఛాట్‌బోట్‌లు అందించే సమాచారంలోని తేడాలను గుర్తించడం పసిపిల్లలకు సవాలే. ఏఐ టూల్స్ పెద్దవాళ్లను కూడా... అది కూడా న్యాయవాదుల వంటి నిపుణులను కూడా తేలికగా బురిడీ కొట్టించగలవని ఇప్పటివరకూ జరిగిన అధ్యయనాలు చెబుతున్నాయి.

వయసుకు తగ్గ సమాచారం మాత్రమే పిల్లలకు అందేలా తాము రక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేస్తామని గూగుల్ చెబుతోంది. అయితే ఇలాంటి ఏర్పాట్లు కొత్త సమస్యలు సృష్టించే అవకాశం ఉంది. ఉదాహరణకు... లైంగిక సంబంధిత సమాచారం పిల్లలకు అందకుండా చూసేందుకు కొన్ని పదాలను (ఉదాహరణకు రొమ్ము) నిషేధించామనుకోండి... పిల్లలకు అవసరమైన సమాచారం (కౌమార దశలో శరీరంలో చోటు చేసుకునే మార్పులు) కూడా అందకుండా పోతుంది.

ఈ–సేఫ్టీ కమిషన్ సూచనలు


ఏఐ ఛాట్‌బోట్లతో రాగల సమస్యలను ఈ–సేఫ్టీ కమిషన్ ఇప్పటికే వివరించింది. ఏఐ ఛాట్‌బోట్లు ''హానికరమైన సమాచారాన్ని, తప్పుడు సమాచారాన్ని పంచుకోవచ్చు. అలాగే ప్రమాదకరమైన సలహాలూ ఇవ్వవచ్చు'' అని హెచ్చరించింది. పిల్లలకు ఛాట్‌బోట్లు అందుబాటులోకి వస్తే ఏం జరుగుతుందో ఈ సూచన స్పష్టం చేస్తోంది. ఛాట్ జీపీటీ, రెప్లికా, టిస్సా వంటి ఛాట్‌బోట్లను ఇప్పటికే పరిశీలించాము. మనుషులు అలిఖిత నిబంధనల సాయంతో చేసే సామాజిక ప్రవర్తలను ఈ ఛాట్‌బోట్ల స్పందనలు ప్రతిబింబిస్తున్నాయి. ఈ అలిఖిత నిబంధనలను 'ఫీలింగ్ రూల్స్' అంటారు. తలుపు తెరిచారని 'థ్యాంక్యూ' చెప్పడం, లేదా పొరబాటున ఎవరినైనా ఢీకొంటే 'సారీ' చెప్పడం వంటివి ఈ ఫీలింగ్ రూల్స్ కోవలోకి వస్తాయి. వీటిని అనుకరించడం ద్వారా మన నమ్మకాన్ని చూరగొనేలా ఈ ఛాట్‌బోట్లను రూపొందించారు. అయితే ఈ రకమైన మానవీయ ప్రవర్తన పిల్లల విషయానికి వచ్చేసరికి గందరగోళం సృష్టించవచ్చు. తప్పుడు సమాచారాన్ని అందిస్తున్నా నమ్మేలా చేస్తుంది. అంతేకాకుండా... ఓ యంత్రంతో కాకుండా... సాటి మనిషితోనే వ్యవహారాలు నడుపుతున్నామని వారు నమ్మడం మొదలవుతుంది.

ఆస్ట్రేలియాలో జెమినీ ఛాట్‌బోట్ చాలా కీలక సమయంలో పిల్లలకు అందుబాటులోకి వస్తోంది. ఎందుకంటే... పదహారేళ్ల లోపు పిల్లల సోషల్ మీడియా అకౌంట్లపై ఈ ఏడాది డిసెంబరు నుంచే నిషేధం అమలు కానుంది. ఈ నేపథ్యంలోనే యూరోపియన్ యూనియన్, యునైటెడ్ కింగ్‌డమ్‌లు 2023లో చేసిన 'డిజిటల్ డ్యూటీ కేర్ చట్టం' గురించి తెలుసుకోవడం అవసరం. గత ఏడాది నవంబరు నుంచి ఆస్ట్రేలియా ఈ చట్టం అమలును స్తంభింపజేసింది. హానికారక సమాచారం విషయంలో టెక్నాలజీ కంపెనీలనే బాధ్యులను చేస్తుందీ చట్టం!

వ్యాసకర్త ఆర్ఎంఐటీ యూనివర్సిటీ అధ్యాపకులు
('ద కాన్వర్సేషన్' సౌజన్యంతో)

ఇహలోక త్రిమూర్తులు

ఒక వ్యక్తి జీవితంలో తల్లి, తండ్రి, గురువు– ఈ క్రమంలో ఈ ముగ్గురికీ అత్యంత గౌరవనీయమైన, పూజనీయమైన స్థానం ఇవ్వబడింది. జన్మనిస్తుంది కనుక తల్లి, జన్మకు కారకుడై, బాల్య, యవ్వన దశలలో పోషణ భారాన్ని వహించి, రక్షణను కలిగిస్తాడు కనుక తండ్రి, విద్యాబుద్ధులు నేర్పి సత్కార్యోన్ముఖుడిని, ప్రయోజకుడిని చేస్తాడు కనుక గురువు... సదా పూజనీయులనే అభిప్రాయాన్ని పండితులు, పూర్వ సాహిత్యవేత్తలు ప్రజలకు కలిగించారు. ఈ భావాన్ని ధ్రువీకరించిన వ్యాసుడి మహాభారతం, తల్లిదండ్రులను, గురువును పూజించడం వలన సమకూరే ఆధ్యాత్మిక, పారలౌకిక ప్రయోజనాలను గురించి, అనుశాసనిక పర్వం, సప్తమాధ్యాయంలోని ఈ క్రింది శ్లోకం ద్వారా, స్పష్టం చేసి చెప్పింది.



జ్యోతిర్మయం

యేన ప్రీణాతి పితరం తేన ప్రీతః ప్రజాపతిః
ప్రీణాతి మాతరం యేన పృథివీ తేన పూజితా.
యేన ప్రీణాత్యుపాధ్యాయం తేన స్యాద్ బ్రహ్మ పూజితమ్.

ఒక వ్యక్తి తన తండ్రిని ప్రసన్నుడిని చేయడం ద్వారా ప్రజాపతినీ, తన తల్లిని పూజించడం ద్వారా భూదేవినీ, తన గురువును తృప్తి పరచడం ద్వారా బ్రహ్మదేవుడినీ పూజించిన వాడు అవుతున్నాడు అని పై శ్లోకం భావం. అలా, ఏ వ్యక్తి తన తల్లిని, తండ్రిని, గురువును గౌరవించడం, ఆదరించడం అన్న మూడు ధర్మాలను శ్రద్ధగా ఆచరిస్తాడో, ఆ వ్యక్తికి అన్ని ధర్మాలూ సక్రమంగా నిర్వర్తించబడిన ఫలం దక్కుతుందని, అలా కాక ఏ వ్యక్తి ద్వారా ఈ మూడు ధర్మాలు సరిగా ఆచరించబడక, అనాదరించబడతాయో, ఆ వ్యక్తి నిర్వర్తించే యజ్ఞయాగాది క్రియల వలన సమకూరే ఫలములన్నీ నిరుపయోగంగా, నిష్ఫలములుగా మారిపోతాయని కూడా ఆ సందర్భంలోనే పై శ్లోకానికి కొనసాగింపుగా చెప్పబడింది.

మిగతా జీవితం ఎలా గడిచినా, వృద్ధాప్యంలో మనిషి తన సంతానం సహాయాన్నీ, ఆసరానూ కోరుకుంటాడు. ఆ రోజులలో, తాను కని, ప్రేమగా చూసుకుంటూ పెంచి, పెద్దచేసిన తన సంతానం చేతిలోనే అగౌరవానికి, నిర్లక్ష్యానికి గురికావడాన్ని మించిన మానసిక క్షోభ మనిషికి వేరే ఉండదు. వృద్ధాప్యంలో ఏ వ్యక్తికీ ఆ బాధ కలగకూడదన్న సదుద్దేశంతో చేసిన నియమాలు, చెప్పిన విషయాలు పైవి. మానవీయమైన ఈ ధార్మిక విధిని పాటించని సమాజానికి ఆధ్యాత్మిక పురోగతి ఉండగలదనుకోలేము.

– భట్టు వెంకటరావు

ఈవీలు.. చార్జింగ్!

దేశవ్యాప్తంగా విద్యుత్ వాహనాల (ఈవీ) అమ్మకాలతోపాటు.. వాటి విద్యుత్ వినియోగమూ పెరుగుతోంది. 2024-25లో రికార్డు స్థాయిలో సుమారు 19.65 లక్షల ఈవీలు వినియోగదారుల చేతుల్లోకి వెళ్లాయి. ఈవీల కోసం ఏర్పాటుచేస్తున్న పబ్లిక్ చార్జింగ్ స్టేషన్లు (పీసీఎస్) కూడా గత మూడేళ్లలో భారీగా పెరిగాయి. కేంద్ర విద్యుత్ సంస్థ (సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ - సీఈఏ) తాజా నివేదిక ప్రకారం.. ఈ స్టేషన్లలో చార్జింగ్ కోసం 2024-25లో వినియోగించిన విద్యుత్ 847 మిలియన్ యూనిట్లు. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది 82 శాతం అధికం కావడం గమనార్హం. పీసీఎస్‌లు వినియోగించిన విద్యుత్ విషయంలో తెలుగు రాష్ట్రాలు టాప్ - 7 జాబితాలో ఉన్నాయి.

- సాక్షి, స్పెషల్ డెస్క్

గతంలో ఎన్నడూ లేని విధంగా.. ఈవీల కోసం ఏర్పాటు చేసిన పబ్లిక్ చార్జింగ్ స్టేషన్లలో (పీసీఎస్) దేశవ్యాప్త విద్యుత్ వినియోగం 2024-25లో 847.8 మిలియన్ యూనిట్లకు (ఎంయూ) చేరుకుంది. అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 82 శాతం ఎక్కువ. 2024 ఏప్రిల్ నెలలో వినియోగం 52.88 ఎంయూలు కాగా 2025 మార్చిలో ఇది 60.7 శాతం పెరిగి 85 ఎంయూలకు ఎగసింది.



దేశంలో **26,367** ఈవీ పబ్లిక్ చార్జింగ్ స్టేషన్లు	రెండేళ్లలో ఐదింతలైన కేంద్రాల సంఖ్య	ఫలితంగా భారీగా పెరిగిన విద్యుత్ వాడకం

2024-25లో 847 ఎంయూల వినియోగం


12 ఏళ్లలో అమ్ముడైన ఈవీలు 59.25 లక్షలు


ప్రస్తుతం వినియోగంలో ఉన్నవి 44 లక్షలు

తెలంగాణ @ 5.. ఏపీ @ 7

కేంద్ర విద్యుత్ సంస్థ నివేదిక ప్రకారం పీసీఎస్‌లు వినియోగించే విద్యుత్‌లో ఢిల్లీ 38.69 శాతం వాటాతో ముందంజలో ఉంది. విస్తీర్ణంలో చిన్నదైనప్పటికీ, పీసీఎస్‌ల అధిక విద్యుత్ వినియోగానికి కారణం.. రాజధానిలో ఈవీల అమ్మకాలు దూసుకెళ్లడమే. మహారాష్ట్ర 25.57 శాతం, కర్ణాటక 9.39, గుజరాత్ 7.56 శాతాలతో ఆ తరువాతి స్థానాల్లో నిలిచాయి. తెలంగాణ 5వ స్థానంలోనూ, ఆంధ్రప్రదేశ్ 7వ స్థానంలోనూ నిలిచాయి. టాప్ - 4 మినహాయిస్తే.. మిగతా రాష్ట్రాలన్నీ కలిపి 18.78 శాతం విద్యుత్‌ను వినియోగించాయి.

2024-25లో టాప్ - 7 రాష్ట్రాలలోని పీసీఎస్‌లు వినియోగించిన విద్యుత్ (మిలియన్ యూనిట్లలో)





ప్రస్తుతం తెలంగాణలో 976, ఏపీలో 616 కేంద్రాలు	2013-14 నుంచి 2024-25 మధ్య అమ్ముడైనవి 59.25 లక్షల యూనిట్లు	ప్రస్తుతం వినియోగంలో ఉన్నవి 44 లక్షలు

2.5 నుంచి 3.5 రెట్లు

తెలంగాణలో ఈ ఏడాది ఒక రోజులో నమోదైన గరిష్ఠ విద్యుత్ వినియోగం దాదాపు 339 ఎంయూ. అదే ఆంధ్రప్రదేశ్‌లో తీసుకుంటే సుమారు 240 ఎంయూ. అంటే తెలుగు రాష్ట్రాల ఒక రోజు విద్యుత్ వినియోగంతో పోలిస్తే సుమారు 2.5 నుంచి 3.5 రెట్లు ఎక్కువ విద్యుత్తును.. 2024-25లో ఈవీ చార్జింగ్ స్టేషన్లు వినియోగించాయన్నమాట.

ఏటా 50,000 స్టేషన్లు

భారత్‌లో 2025 ఏప్రిల్ 1 నాటికి ఉన్న ఈవీల పబ్లిక్ చార్జింగ్ స్టేషన్ల సంఖ్య 26,367. 2022 డిసెంబరుతో పోలిస్తే.. 2024 డిసెంబరు నాటికే వీటి సంఖ్య సుమారు ఐదింతలు కావడం విశేషం. కర్ణాటకలో అత్యధిక సంఖ్యలో 5,880 కేంద్రాలు ఉన్నాయి. మహారాష్ట్రలో 3,746, ఉత్తరప్రదేశ్‌లో 2,137, ఢిల్లీలో 1,951, తమిళనాడులో 1,524 స్టేషన్స్ పనిచేస్తున్నాయి. తెలంగాణలో 976, ఆంధ్రప్రదేశ్‌లో 616 స్టేషన్స్ ఉన్నాయి. 2030 నాటికి ప్రైవేట్ వాహనాల్లో 30 శాతం, వాణిజ్య వాహనాల్లో 70 శాతం, బస్సుల్లో 40 శాతం; ద్విచక్ర, త్రిచక్ర వాహనాల్లో 80 శాతం ఎలక్ట్రిక్‌వే ఉండాలని నీతి ఆయోగ్ లక్ష్యంగా నిర్దేశించింది. దీనికి అనుగుణంగా చార్జింగ్ నెట్‌వర్క్‌ను ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు విస్తరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే ఆరేళ్లలో ఏటా దాదాపు 50,000 చార్జింగ్ పాయింట్ల చొప్పున ఏర్పాటు చేయాల్సి ఉంటుందని అంతర్జాతీయ ఇంధన సంస్థ వెల్లడించింది.

త్రీవీలర్ల అమ్మకాల్లో నం.1



ఈవీల అమ్మకాల్లో భారత్‌లో రికార్డుల పరంపర కొనసాగుతూనే ఉంది. 2024-25లో 17 శాతం వృద్ధితో 19,64,831 యూనిట్ల ఈవీలు కస్టమర్ల చేతుల్లోకి వెళ్లాయి. ఇందులో టూవీలర్స్ గతేడాదితో పోలిస్తే 21 శాతం పెరిగి 11,49,307 యూనిట్లు, త్రీవీలర్స్ 10 శాతం అధికమై 6,99,062 యూనిట్లను తాకాయి. 1,07,462 ఎలక్ట్రిక్ కార్ల అమ్మకాలు జరిగాయి. ఎలక్ట్రిక్ త్రిచక్ర వాహనాల అమ్మకాల్లో రెండేళ్లుగా భారత్ ప్రపంచంలో నంబర్ వన్ స్థానంలో కొనసాగుతోంది. చైనా గత ఏడాది 3,00,000 ఎలక్ట్రిక్ త్రీవీలర్స్‌ను విక్రయించింది. ఈ-కామర్స్, క్విక్ కామర్స్ సంస్థలు సరుకు డెలివరీ కోసం ఈవీలను ఎక్కువగా ఉపయోగిస్తున్నాయి. దీంతో ఈ విభాగంలో ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు అధికంగా అమ్ముడవుతున్నాయి. 2032 నాటికి 12.3 కోట్ల ఈవీలు భారతీయ రోడ్లపై పరుగు తీస్తాయని ఇండియా ఎనర్జీ స్టోరేజ్ అలయన్స్, కస్టమైజ్డ్ ఎనర్జీ సొల్యూషన్స్ సంయుక్త నివేదిక వెల్లడించింది. 2013-14 నుంచి 2025 మార్చి వరకు భారత్‌లో 59.25 లక్షల యూనిట్ల ఈవీలు అమ్ముడయ్యాయి. ప్రస్తుతం 44 లక్షలు రోడ్లపై పరుగుతీస్తున్నాయి.

'బలగం' ఫేమ్ జీవీ బాబు కన్నుమూత

- పలువురి సంతాపం



రామన్నపేట: 'బలగం' సినిమాలో అంజన్న పాత్రతో తెలుగు ప్రజల మనసు గెలుచుకున్న నటుడు గుడిబోయిన బాబు (జీవీ బాబు) అనారోగ్యంతో శనివారం అర్ధరాత్రి వరంగల్ నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కన్నుమూశారు. వరంగల్ 29వ డివిజన్ రామన్నపేటకు చెందిన జీవీ బాబు, వేణు యెల్దండి దర్శకత్వంలో రూపొందిన బలగం సినిమాలో హీరో ప్రియదర్శి తాతగా నటించి ఆకట్టుకున్నారు. జీవీ బాబు కొన్ని రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఆయన అనారోగ్యం గురించి తెలిసి ఇటీవల ఆ సినిమా డైరెక్టర్ వేణు, హీరో ప్రియదర్శి వైద్య ఖర్చులకోసం ఆర్థిక సాయం అందించారు. జీవీ బాబు తొలుత రంగస్థల నటుడు. ఇప్పటివరకు ఆయన 20కి పైగా సినిమాల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆదివారం రామన్నపేటలోని నివాసంలో బాబు భౌతిక కాయం వద్ద పలువురు నాటక రంగ, సినిమా, సాంస్కృతిక కళాకారులతోపాటు నాయకులు, స్థానికులు నివాళులర్పించారు.

పిచ్చికుక్క స్వైర విహారం

- పలువురికి గాయాలు

భూపాలపల్లి రూరల్: జయశంకర్ జిల్లా భూపాలపల్లి మండలం కొంపెల్లి గ్రామంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఓ పిచ్చికుక్క బీభత్సం సృష్టించింది. 11 మందితో పాటు రెండు గేదెలు, ఒక దుడ్డెపై దాడి చేసి గాయపరిచింది. బాధితులు భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. మోరె సంజన, మోరె వెంకటయ్య, ఎడ్ల నవీన్, సదల పైడయ్యలకు కాళ్లు, చేతులు, తల, కడుపుపై తీవ్ర గాయాలయ్యాయి. కుక్క దాడిలో ఒక పాప కూడా గాయపడింది. దీంతో పిచ్చికుక్కను గ్రామస్తులు వెంబడించి చంపేశారు. గ్రామంలో ఇంకా పిచ్చి కుక్కలు తిరుగుతున్నాయని, ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయమేస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విషాహారం తిని 31 గొర్రెలు, మేకలు మృతి



మృతిచెందిన జీవాలను ట్రాక్టర్‌లో తరలిస్తున్న యజమానులు

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలం ఆరేకోడు తండాలో విషాహారం తిని 31 గొర్రెలు, మేకలు మృతి చెందాయి. తండాకు చెందిన బానోత్ కిరణ్, సరస్వతి, కృష్ణ, వీరన్న, రాములు తదితరులు గొర్రెలు, మేకలు పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో ఓ రైతు కౌలుకు తీసుకున్న భూమిలో నెల రోజుల క్రితం బెండ తోట సాగుచేయగా, దిగుబడి రావడం లేదని తోటను వదిలేశాడు. దీంతో అందులో పశువులను మేపుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం సుమారు 300 గొర్రెలు, మేకలను ఆ తోటలో మేతకు వదిలారు. అయితే అక్కడ గడ్డి మేసిన 31 గొర్రెలు, మేకలు అక్కడికక్కడే పొట్ట ఉబ్బి మృతి చెందాయి. మరో 40 జీవాలు తీవ్ర అస్వస్థతకు గురి కాగా ఖమ్మంలోని పశువైద్యశాలకు తరలించారు. ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితం ఓ గేదె కూడా ఆ తోటలో మేత తిని మృతి చెందింది. బెండ తోటకు పురుగుమందు కొట్టడంతో గడ్డి విషంగా మారిందని, ఆ మేత మేసిన జీవాలు మృత్యువాత పడ్డాయని పశువైద్యుడు హరీశ్ తెలిపారు.

సొరంగం పనులు ముందుకు సాగేదెప్పుడు?

- ఔట్‌లెట్, ఇన్‌లెట్ రెండు వైపుల నుంచి నిలిచిపోయిన తవ్వకం
- పలు ఆటంకాలతో ఏళ్లు గడిచిపోతున్న వైనం
- ఔట్‌లెట్‌లో టీబీఎం బేరింగ్ పాడైపోవడంతో 2023 మొదట్లోనే పనులు బంద్
- ఇన్‌లెట్‌లో తొలిసారి 2019లో నిలిచిన పనులు
- కాంగ్రెస్ సర్కారు వచ్చాక కదలిక.. ఈ ఏడాది ఫిబ్రవరిలో కుప్పకూలిన సొరంగం
- టెక్నికల్ కమిటీ నివేదిక వచ్చాకే ఇన్‌లెట్ పనులపై నిర్ణయం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ తవ్వకం పనులు ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా మారాయి. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి వద్ద ఉన్న ఔట్‌లెట్‌లో టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం) బేరింగ్ పాడై 2023 జనవరిలోనే పనులు ఆగిపోగా, దోమలపెంట వద్ద ఇన్‌లెట్‌లో షియర్ జోన్ కారణంగా బురద నీరు ఉబికి రావడంతో 2019 నుంచి పనులు ఆగిపోయాయి. ఏడాదిన్నర కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ సొరంగం తవ్వకం పనులు పూర్తి చేయడంపై దృష్టి సారించింది. అయినా వివిధ కారణాలతో టన్నెల్ తవ్వకం పనులకు అవాంతరాలు తప్పడం లేదు. ఔట్‌లెట్‌లో టీబీఎంకు అమర్చాల్సిన బేరింగ్‌ను తెప్పించినా, స్పేర్ పార్ట్స్‌కు అవసరమైన డబ్బులు లేవంటూ కాంట్రాక్టు సంస్థ చేతులెత్తేయడంతో పనులు ముందుకు సాగడం లేదు. ఇటీవల ఇన్‌లెట్‌లో 14వ కిలోమీటరు వద్ద సొరంగం కుప్పకూలిపోయిన నేపథ్యంలో ప్రత్యామ్నాయంపై ఉన్నత స్థాయి టెక్నికల్ కమిటీ నివేదిక వస్తేనే గానీ ముందుకు సాగలేని పరిస్థితి నెలకొంది.

ఏళ్లు గడిచిపోతున్నా..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 4.15 లక్షల ఎకరాలకు సాగునీరు, 516 ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు రక్షిత తాగునీటిని అందించే లక్ష్యంతో 2005లో ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టు పనులు చేపట్టారు. అయితే అనేక అవాంతరాలతో ఏళ్లు గడిచిపోతున్నాయి. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నీటిని పూర్తి



గ్రావిటీ ద్వారా అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి వరకు తరలించేందుకు ప్రభుత్వం సొరంగం తవ్వకాన్ని చేపట్టింది. 43.930 కిలోమీటర్ల పొడవైన సొరంగం పూర్తిగా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ప్రాంతం కావడంతో వన్యప్రాణులు, పర్యావరణ రక్షణ కోసం డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానం కాకుండా టీబీఎం ద్వారా పనులు చేపట్టింది. ఇన్‌లెట్, ఔట్‌లెట్ కలిపి 34.37 కిలోమీటర్లు మేర టన్నెల్ తవ్వకం పూర్తికాగా, ఇంకా 9.56 కిలోమీటర్లు తవ్వాల్సి ఉంది.

ఔట్‌లెట్‌లో బేరింగ్ పాడై..వచ్చినా లోపలికి వెళ్లక

ఔట్‌లెట్‌లో 20.435 కిలోమీటర్లు సొరంగం తవ్వకం పూర్తి కాగా, మరో 3.545 కిలోమీటర్ల తవ్వాల్సి ఉంది. ఈ క్రమంలో టీబీఎం బేరింగ్ పాడైపోవడంతో 2023 జనవరిలో పనులు ఆగిపోయాయి. అదే ఏడాది డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సొరంగం పూర్తి చేయాలని నిర్ణయించింది. అమెరికా నుంచి బేరింగ్ తెప్పించేందుకు నిర్ణయించి గత ఏడాదే రాబిన్స్ కంపెనీకి ఆర్డర్ ఇవ్వడంతో అది గత నెల 18వ తేదీన మన్నెవారిపల్లికి చేరింది.

నెల దాటినా..

అమెరికా నుంచి బేరింగ్ అయితే వచ్చింది. కానీ బేరింగ్‌ను టీబీఎంకు ఫిట్ చేసేందుకు అవసరమైన పరికరాలతోపాటు మరికొన్ని పరికరాలను కెనడా నుంచి తెప్పించాల్సి ఉందని కాంట్రాక్టు సంస్థ పేర్కొంది. అందుకు రూ.70 కోట్లు కావాలని విన్నవించింది. వాస్తవానికి ఆ నిధులను కాంట్రాక్టు సంస్థే వెచ్చించాలి. కానీ తమ వద్ద డబ్బుల్లేవని, ప్రభుత్వం ఇస్తేనే ముందుకు పోతామని స్పష్టం చేయడంతో బేరింగ్‌ను వచ్చినా టన్నెల్ లోపలికి తీసుకెళ్లని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం దీనిపై కాంట్రాక్టు సంస్థతో సంప్రదింపులు జరుపుతోంది. ఔట్‌లెట్‌లో ఇంకా 3.545 కిలోమీటర్లే తవ్వాల్సి ఉంది. అయితే టీబీఎంకు మిగిలి ఉన్న సామర్థ్యం, అక్కడి మట్టి పొరలు, రాక్ ఫార్మేషన్ పరిస్థితులను బట్టి ఇంకా 2 కిలోమీటర్ల వరకే తవ్వే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఆ తర్వాత 200 మీటర్ల పొడవునా షియర్ జోన్ ఉండటంతో ఆ తర్వాత పరిస్థితి ఏంటన్న దానిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

ఇన్‌లెట్‌లో పనులకూ అవాంతరాలు

సొరంగం ఇన్‌లెట్ దోమలపెంట వైపు నుంచి 13.935 కిలోమీటర్ల తవ్వకం గతంలోనే పూర్తయింది. ఇంకా 6.015 కిలోమీటర్లు తవ్వాల్సి ఉంది. అయితే 14వ కిలోమీటరు కంటే ముందు షియర్ జోన్ కారణంగా పెద్ద ఎత్తున బురద, మట్టి ఉబికి వస్తుండటంతో 2019లోనే పనులు ఆగిపోయాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పనుల కొనసాగింపుపై దృష్టి పెట్టింది. ఈ ఏడాది ఫిబ్రవరి 22వ తేదీన టీబీఎంతో తవ్వుతుండగా సొరంగం పైకప్పు కూలిపోవడం, టీబీఎం ముక్కలై పోవడం తెలిసిందే. ఈ ప్రమాదంలో 8 మంది గల్లంతవగా ఇప్పటివరకు ఇద్దరు కార్మికుల మృతదేహాలు మాత్రమే బయటపడ్డాయి. కాగా మిగతా కార్మికుల వెలికితీత పనులను కూడా ప్రభుత్వం ఇటీవల నిలిపివేసింది. ప్రస్తుతం సొరంగం పనులు ఎప్పుడు మొదలవుతాయో కూడా చెప్పలేని పరిస్థితి ఉంది.

ఇన్‌లెట్‌లో పనులు మొదలయ్యేదెప్పుడో..

సొరంగం ఇన్‌లెట్ నుంచి తవ్వకాలు చేపట్టే టీబీఎం పూర్తిగా ధ్వంసం కాగా, ఇకనుంచి డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానంలోనే సొరంగం తవ్వకం సాధ్యమవుతుందని నిపుణులు ప్రభుత్వానికి నివేదించారు. ఇన్‌లెట్‌లో 14వ కిలోమీటరు వద్ద కుప్పకూలిన ప్రాంతాని కంటే ముందు నుంచి 50 మీటర్ల వరకు పక్కకు జరిగి, అక్కడి నుంచి సొరంగానికి సమాంతరంగా తవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వం వివిధ సంస్థలకు చెందిన నిపుణులతో ఉన్నత స్థాయి సాంకేతిక కమిటీని ఏర్పాటు చేసింది. పూర్తిస్థాయి అధ్యయనం తర్వాత ప్రభుత్వానికి ఈ కమిటీ నివేదిక సమర్పించనుంది. ఆ తర్వాతే దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రమాదం నేపథ్యంలో నిపుణుల సూచన మేరకు డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానంలో తవ్వకం పనులు చేపట్టాలంటే కేంద్రం నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు.

ఈ సారి కూడా ఆలస్యమేనా?

- ఉచిత చేప పిల్లల పంపిణీ టెండర్లపై మత్స్యకారుల ఆందోళన
- మే మూడో వారమైనా టెండర్ల ఖరారుకు కనిపించని కసరత్తు



సాక్షి,హైదరాబాద్: నైరుతి రుతుపవనాలు ముంచుకొస్తున్నా.. ఉచిత చేప పిల్లల పంపిణీపై మత్స్యశాఖ మేల్కొనడంలేదు. మత్స్యకారుల లబ్ధికోసం 100 శాతం సబ్సిడీతో 2016లో ఉచిత చేప పిల్లల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టినా, సకాలంలో ఏ ఒక్క ఏడాది కూడా చెరువులకు చేప పిల్లలు చేరిన దాఖలాలు లేవని గణాంకాలు చెబుతున్నాయి. కాంట్రాక్టర్ల వైఖరి, నిధుల కొరత, అధికారుల సమన్వయలేమితో ఈ పథకం అభాసుపాలు అవుతోందని ఆరోపణలు వస్తున్నాయి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఈ ఏడాది అయినా ముందస్తుగా టెండర్లు పిలుస్తారని అనుకుంటే, మే నెల మూడో వారం వచ్చినా ఇప్పటి వరకు ఆ దిశలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎలాంటి కసరత్తు లేదు..

మే నెల మూడో వారం వచ్చినా కూడా ఇప్పటి వరకు చేప పిల్లల పంపిణీకి సంబంధించిన టెండర్లకు మత్స్యశాఖ సిద్ధం కాలేదని తెలుస్తోంది. ఈ ఏడాది ముందస్తు వర్షాలు కురుస్తాయని, నైరుతి రుతుపవనాల ప్రభావంతో జూన్ మొదటివారంలో భారీగా వర్షాలు పడతాయని వాతావరణ శాఖ ప్రకటించింది. అయినా మత్స్యశాఖ చేప పిల్లల పంపిణీ ప్రక్రియకు సంబంధించి ఎలాంటి కసరత్తు చేయలేదని సమాచారం. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ ప్రారంభించి, జూన్ మొదటి వారంలో వాటిని ఖరారు చేస్తే.. రెండో వారం నుంచి ఉచిత చేప పిల్లలను పంపిణీ చేయడానికి వీలుంటుందని మత్స్యకారులు చెబుతున్నారు. ప్రతీ ఏడాది ఆలస్యంగా టెండర్లు పిలవడం వల్ల పుణ్యకాలం గడిచిపోతోందని, అదను మించిపోయాక చేప పిల్లలను పంపిణీ చేయడం వల్ల ప్రయోజనం ఉండదని అంటున్నారు.

సరైన సమయంలో చెరువుల్లో వదిలితేనే ఎదుగుదల

ఆలస్యంగా ఉచిత చేప పిల్లలు పంపిణీ చేయడంతో తగిన లబ్ధి చేకూరడంలేదని మత్స్యకారులు చెపుతున్నారు. చెరువుల్లో సరైన సమయానికి చేప పిల్లలు వదలక పోవడం వల్ల చేపల్లో ఎదుగుదల లేకపోవడంతో ధర రావడంలేదు అంటున్నారు. కిలో నుంచి రెండు మూడు కిలోల వరకు చేపలు ఎదగాలంటే, చేప పిల్లలను జూన్, జూలై నెలల్లో చెరువుల్లో వదలాల్సి ఉంటుందని, అప్పుడే వాటి వృద్ధి ఎక్కువగా ఉంటుందని చెపుతున్నారు. అలాంటి చేపలకే మార్కెట్‌లో మంచి ధర వస్తుంది. వాటిని ఎగుమతి చేయడానికి అనుకూలంగా ఉంటుంది. కానీ ప్రభుత్వం ఇస్తున్న ఉచిత చేప పిల్లలను గతంలో డిసెంబర్‌లో కూడా చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో వదిలిన దాఖలు కూడా ఉన్నాయని గుర్తు చేస్తున్నారు.

జూన్ నుంచి ఆగస్టు మధ్య చేప పిల్లలను వదలాలి..



జూన్ నుంచి ఆగస్టు మధ్యలో చేప పిల్లలను చెరువులు, ప్రాజెక్టుల్లో వదలాలి. కానీ, ఈ ప్రక్రియను 9ఏళ్ల నుంచి ఆలస్యం చేస్తున్నారు. ముందస్తుగా నిధులు సమకూర్చుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు. సకాలంలో చేప పిల్లలను వదిలితేనే మత్స్యకారులకు అర్థికంగా లాభం. ప్రభుత్వం అసలు పథకం ఉంచుతారా? లేదా? అనేది చెప్పాలి. లేదంటే మత్స్యకారులే చేప పిల్లలను చెరువుల్లో వదులుకుంటారు. ప్రభుత్వ అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పథకం అభాసుపాలవుతోంది. దీనివల్ల 4.5 లక్షల మత్స్యకారుల కుటుంబాలకు అన్యాయం జరుగుతుంది.

– పిట్టల రవీందర్, ఫిషరీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్

టెండర్లు ముందస్తుగా ఖరారు చేయాలి..



టెండర్లు ముందస్తుగా ఖరారు చేయాలి. జూన్ మొదటి వారంలోనే అన్నీ పూర్తి చేసుకుని చివరి వారంలోగా మీనాలు చెరువుల్లో వదిలేలా ప్రణాళిక చేయాలి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికైనా అధికారులు వేగం పెంచాలి. నిధుల కొరత ఉంటే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి నిధులు సమకూర్చుకోవాలి. మత్స్యకారులకు లాభం జరిగేలా చూడాలి.

– గొటే గణేశ్, గంగపుత్ర సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు

బనకచర్లతో తెలంగాణకు భారీ నష్టం

▶ మొదటి పేజీ తరువాయి

చెల్లించుకుంటూ రాష్ట్రానికి ద్రోహం చేస్తున్నారని దుయ్యబట్టారు. బనకచర్ల ద్వారా 200 టీఎంసీల గోదావరి జలాలను తరలించుకుపోయేందుకు ఏపీ కుట్ర చేస్తోందన్నారు. ఇందుకు సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వం..ఈ ప్రాజెక్టుకు వేల కోట్ల రూపాయలు ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని విమర్శించారు. నాడు తెలంగాణ ప్రాజెక్టులను రద్దు చేయాలని, అనుమతులు ఇవ్వొద్దని లేఖలు రాసిన చంద్రబాబు నేడు మిగులు జలాలను తీసుకుంటున్నట్లు చెప్పడం శోచనీయమన్నారు. ఏ ఒక్క అనుమతి లేకుండా, కేంద్రం జుట్టు తమ చేతిలో ఉందని ఏపీలో రాత్రికి రాత్రి పనులు చేసే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు.

అనుమతుల్లేని ప్రాజెక్టుకు నిధులెలా ఇస్తారు?

గత అసెంబ్లీలో నీతి ఆయోగ్ బహిష్కరిస్తాం అని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి అందరి కంటే ముందే నీతి ఆయోగ్ మీటింగ్‌కు వెళ్లారని, బనకచర్లను అడ్డుకుంటారని భావిస్తే ఏమీ మాట్లాడకుండా వచ్చారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఎలాంటి అనుమతులు లేని ప్రాజెక్టుకు 50 శాతం కేంద్రం గ్రాంటు ఇవ్వడంతో పాటు, మరో 50 శాతం ఎఫ్ఆర్‌బీఎంను మించి రుణం తీసుకునే వెసులుబాటు కల్పిస్తారని చెపుతున్నారని.. నిబంధనలు ఉల్లంఘించి నిర్మించే ప్రాజెక్టుకు ఇలా నిధులు, అనుమతులు ఎలా ఇస్తారని నిలదీశారు. కిషన్‌రెడ్డి చొరవ చూపి ఈ ప్రాజెక్టును ఆపాలన్నారు. లేదంటే ఢిల్లీ సీడబ్ల్యూసీ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు.

తెలంగాణపై ఎందుకింత కక్ష?: పోలవరానికి జాతీయ హోదా ఇచ్చి.. కాళేశ్వరం, పాలమూరు, సీతారామ ప్రాజెక్టులకు ఎందుకు జాతీయ హోదా ఇవ్వరని హరీశ్‌రావు ప్రశ్నించారు. పోలవరానికి రూ.80 వేల కోట్లు, బనకచర్లకు రూ.80 వేల కోట్లు కలిపి రూ.1.6 లక్షల కోట్లు ఏపీకి ఇస్తున్నప్పుడు, తెలంగాణ ప్రాజెక్టులకు అందులో ఒక్క శాతం అయినా ఇచ్చారా? అని ప్రశ్నించారు. తెలంగాణపై బీజేపీకి ఎందుకింత కక్ష ఉందో అర్థం కావడం లేదన్నారు. కృష్ణాలో వాటా కోసం కేసీఆర్ పోరాటం చేసి కొత్త ట్రిబ్యునల్ సాధించారని చెప్పారు. గోదావరి మీద కూడా భవిష్యత్తులో కొత్త ట్రిబ్యునల్ వస్తుందని భావించి ప్రాణహితకు 160 టీఎంసీల నీటి కేటాయింపులు ఉంటే, కాళేశ్వరానికి 240 టీఎంసీల నీటి కేటాయింపులు చేసినట్లు తెలిపారు. ఈ విధంగా పలు ప్రాజెక్టులు చేపట్టి కొన్నింటిని పూర్తి చేశామని వివరించారు.

రానున్న రెండ్రోజులు మోస్తరు వర్షాలు

- ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రానున్న రెండ్రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయని, ఆదివారం నాటికి పశ్చిమ మధ్య, తూర్పు మధ్య అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించాయని వివరించింది. అదేవిధంగా కర్ణాటకలోని మరికొన్ని ప్రాంతాలకు, గోవా రాష్ట్రమంతటా, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలకు, పశ్చిమ మధ్య, ఉత్తర బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలకు, మిజోరం, మణిపూర్, నాగాలాండ్‌లోని కొన్ని ప్రాంతాలకు కూడా విస్తరించాయని వాతావరణ శాఖ తెలిపింది. వాతావరణంలో నెలకొన్న మార్పులతో ఉష్ణోగ్రతలు భారీగా పతనమయ్యాయి. ఆదివారం రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5 నుంచి 9.7 డిగ్రీల సెల్సియస్ వరకు తక్కువగా నమోదయ్యాయి. రానున్న రెండు రోజులు కూడా ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతాయని వాతావరణ శాఖ వివరించింది.

కార్తెకు ముందే ఆరుద్ర పురుగులు

- సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని రైతుల హర్షం



బెజ్జంకిలో కనిపించిన ఆరుద్ర పురుగులు

బెజ్జంకి(సిద్దిపేట): వేసవి కాలంలో కురిసిన వర్షాలకు ఆరుద్ర పురుగులు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా వర్షం పడటంతో పాటు ఒక్క సారిగా వాతావరణం చల్లగా మారడంతో సిద్దిపేట జిల్లా బెజ్జంకిలోని నార్ల శ్రీనివాస్ ఇంటి వద్ద ఆదివారం ఆరుద్ర పురుగులు కనిపించాయి. ఆరుద్ర కార్తెకు ముందే ఈ పురుగులు రావడంతో ఈ సారి వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ



గూడూరు టోల్‌ప్లాజా వద్ద నిలిచిన వాహనాలు

బీబీనగర్/ భువనగిరిటౌన్: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద హైదరాబాద్– వరంగల్ జాతీయ రహదారిపై ఆదివారం వాహనాలు బారులుదీరాయి. సెలవురోజు కావడంతో హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, స్వర్ణగిరి ఆలయానికి భక్తులు భారీగా తరలి వచ్చారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ నెలకొంది.

యాదాద్రి జిల్లా కేంద్రంలోనూ..

యాదాద్రి జిల్లా కేంద్రం భువనగిరి వద్ద హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారిపై ఆదివారం వాహనాల రద్దీ నెలకొంది. యాదగిరిగుట్ట, కాళేశ్వరం, స్వర్ణగిరి వెళ్లే వాహనాలతో రద్దీ పెరిగింది. కొన్ని కూడళ్లలో వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. కాగా సాయంత్రం తిరుగు ప్రయాణంలో సైతం హైదరాబాద్ వైపు పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయ్యింది.

ఆపరేషన్ సిందూర్

బలమైన భారత్‌కు ప్రతీక

ఉగ్రవాదంపై పోరాటంలో టర్నింగ్ పాయింట్

- మన సైనిక దళాల ధైర్య సాహసాలు గర్వకారణం
- ఉగ్రవాదాన్ని సహించే ప్రసక్తే లేదని చాటిచెప్పాం
- మన ఉమ్మడి శక్తి, దేశభక్తిని ప్రదర్శించాల్సిన సమయం ఇదే
- స్వదేశీ ఉత్పత్తులకే ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలి
- వచ్చే 21న యోగా దినోత్సవంలో భాగస్వాములు కావాలి
- 'మన్‌కీ బాత్'లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు



ఢిల్లీలో ప్రధాని మోదీ 'మన్ కీ బాత్' ప్రసంగాన్ని వింటున్న ఎన్‌డీఏ నేతలు

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్‌లో భారత సైనిక దళాలు ప్రదర్శించిన అపూర్వ ధైర్య సాహసాలు ప్రతి భారతీయుడినీ గర్వపడేలా చేశాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశం యావత్తూ ఒక్కతాటిపైకి వచ్చిందని అన్నారు. ఉగ్రవాద శిబిరాలపై మన సైన్యం కచ్చితత్వంతో కూడిన దాడులు చేయడం అద్భుతం అని కొనియాడారు. ఆపరేషన్ సిందూర్ కేవలం ఒక సైనిక ఆపరేషన్ కాదని.. బలీయమైన శక్తిగా ఎదుగుతున్న భారతావనికి అసలైన ప్రతీక అని వివరించారు. ప్రపంచ వేదికపై మన శక్తి సామర్థ్యాలు, సంకల్పం, పెరుగుతున్న బలాన్ని ఈ ఆపరేషన్ కళ్లకు కట్టిందని హర్షం వ్యక్తంచేశారు. ఉగ్రవాదంపై ప్రపంచం సాగిస్తున్న పోరాటంలో ఆపరేషన్ సిందూర్ ఒక టర్నింగ్ పాయింట్ అని అభివర్ణించారు. ఉగ్రవాదాన్ని సహించే ప్రసక్తే లేదంటూ మరోసారి దృఢంగా చాటిచెప్పామని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఆదివారం 122వ 'మన్‌కీ బాత్' రేడియో కార్యక్రమంలో దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. పలు అంశాలను ప్రస్తావించారు. ఆపరేషన్ సిందూర్ భారతీయుల్లో దేశభక్తి భావనను మరింత పెంపొందించిందని అన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నేడు దేశమంతా ఏకమైందని, ఉగ్రవాద భూతం అంతం కావాలన్న సంకల్పం వారిలో ఏర్పడిందని ఉద్ఘాటించారు. మన ఉమ్మడి శక్తిని, దేశభక్తిని చాటాల్సిన సమయం ఇదేనని ప్రజలకు పిలుపునిచ్చారు. మన నిత్య జీవితంలో సాధ్యమైనంత వరకు స్వదేశీ ఉత్పత్తులే వాడుకుందామని, విదేశీ ఉత్పత్తులపై ఆధారపడడం తగ్గించుకుందామని, ఈ మేరకు మనమంతా ప్రతిజ్ఞ చేద్దామని సూచించారు. మన్‌కీ బాత్‌లో ప్రధాని మోదీ ఇంకా చెప్పారంటే...

స్వశక్తితో దక్కిన విజయం

''స్వదేశీ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వడం కేవలం ఆర్థిక స్వయం స్వావలంబనకు సంబంధించిన విషయం కాదు. ఇది దేశ నిర్మాణంలో పాలుపంచుకొనే అంశమని గుర్తుంచుకోవాలి. మనం వేసే ఒక్క అడుగు దేశ ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తుంది. ఆపరేషన్ సిందూర్ విజయంపై ఎంతోమంది పాటలు, గేయాలు రాశారు. పిల్లలు పెయింటింగ్స్ వేశారు. దేశమంతటా తిరంగా యాత్రలు నిర్వహించారు. ఇటీవల రాజస్తాన్‌లోని బికనీర్‌కు వెళ్లినప్పుడు ఇలాంటి పెయింటింగ్స్ పిల్లలను నాకు బహూకరించారు. కొందరు తల్లులు అప్పుడే జన్మించిన తమ బిడ్డలకు 'సిందూర్' అని పేరు పెట్టుకున్నారు. ఆపరేషన్ సిందూర్ విజయం వెనుక మన స్వశక్తి ఉంది. దేశీయంగా అభివృద్ధి చేసుకున్న ఆయుధాలతో ఉగ్రవాదులను అణచివేశాం. మేక్ ఇన్ ఇండియా స్ఫూర్తితో రక్షణ పాటవం పెంచుకోవడంపై దృష్టి పెట్టాం. మేడ్ ఇన్ ఇండియా ఆయుధాలు, రక్షణ పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానానికి తోడు మన సైనికుల శౌర్య ప్రతాపాలు విజయం సాధించి పెట్టాయి. మన ఇంజనీర్లు, సాంకేతిక నిపుణుల స్వేదం, ప్రజల భాగస్వామ్యంతో ఈ గెలుపు సొంతమైంది'' అని మోదీ అన్నారు.

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి వెలుగులు

''మావోయిజంపై సమ్మిళిత పోరాటంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న మారుమూల ప్రాంతాల్లో ఇప్పుడు అభివృద్ధి వేగం పుంజుకుంటోంది. పౌర సేవలు అందుతున్నాయి. బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. అక్కడ చిన్నారులు చదువుకుంటున్నారు. మావోయిస్టుల ప్రభావం చాలావరకు తగ్గిపోయింది. మహారాష్ట్రలో గడ్చిరోలీ జిల్లాలోని కాతేఝారీ గ్రామానికి తొలిసారి బస్సు వచ్చినప్పుడు ప్రజలు మేళతాళాలతో స్వాగతం పలికారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్, దంతేవాడ ప్రాంతాల్లో విద్యా సంస్థలు ఏర్పాటవుతున్నాయి. సైన్స్ ల్యాబ్‌లు కూడా వస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో పదో తరగతి ఫలితాల్లో దంతెవాడ జిల్లా మొదటి స్థానంలో, 12వ తరగతి ఫలితాల్లో ఆరో స్థానంలో నిలవడం సంతోషం కలిగించింది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని చిన్నారులు క్రీడల్లో చక్కటి ప్రతిభ కనబరుస్తున్నారు. గర్వపడే విజయాలు సాధిస్తున్నారు. సైన్స్‌పైనా వారికి ఆసక్తి పెరుగుతోంది. ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ ప్రజలు వాటిని లెక్కచేయకుండా ధైర్యంగా ముందుకెళ్తున్నారు. తమ జీవితాలను బాగు చేసుకోవాలన్న తపన వారిలో మొదలైంది'' అని మోదీ చెప్పారు.

'భారతదేశ స్వావలంబన' రుచిని ఆస్వాదించండి

''గుజరాత్‌లోని గిర్ అడవుల్లో ఆసియా సింహాల సంఖ్య 674 నుంచి ఐదేళ్లలో 891కి చేరుకుంది. ఇది నిజంగా ఎంతో ప్రోత్సాహకరమైన ప్రగతి. అక్కడి ప్రజల ఉమ్మడి కృషి, ఆధునిక విధానాలతో ఇది సాధ్యమైంది. గుజరాత్‌లో 11 జిల్లాల పరిధిలో 35,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఆసియా సింహాలు ఉన్నాయి. వాటి సంతతి క్రమంగా పెరుగుతోంది. చుట్టూ ఉన్న జంతుజాలం మనదే అనే భావన ప్రజల్లో ఏర్పడితే ఎలాంటి ఫలితాలు వస్తాయో చెప్పడానికి ఇదొక ఉదాహరణ. ఈ నెల 20న ప్రపంచ తేనెటీగల దినం నిర్వహించుకున్నాం. ఆరోగ్యం, స్వయం ఉపాధి, స్వయం సమృద్ధికి తేనె ఒక గుర్తు. దేశంలో గత 11 ఏళ్లుగా తీపి విప్లవం జరుగుతోంది. ప్రతిఏటా 70–75 వేల మెట్రిక్ టన్నులుగా ఉన్న తేనె ఉత్పత్తి ఇప్పుడు 1.25 లక్షల మెట్రిక్ టన్నులకు చేరింది. అంటే ఉత్పత్తి 60 శాతం పెరిగింది. తేనె ఉత్పత్తి, ఎగుమతిలో మనం ముందంజలో ఉన్నాం. నేషనల్ బీకీపింగ్, హనీ మిషన్‌తో ఎంతో మంది రైతులు ప్రయోజనం పొందుతున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో రైతులు 'సాన్‌హనీ' పేరుతో ఆర్గానిక్ తేనె ఉత్పత్తి చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారు. కేవలం పరిమాణమే కాదు, నాణ్యమైన తేనె ఉత్పత్తిపైనా మనం దృష్టి పెట్టాం. స్థానిక రైతులు, మహిళా వ్యాపారుల నుంచి తేనె కొనుగోలు చేయండి. భారతదేశ స్వావలంబన రుచిని అందరూ ఆస్వాదించండి'' అని మోదీ సూచించారు.

యోగాతో జీవన విధానంలో మార్పు

''జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రజలు పాల్గొనాలి. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో జరిగే యోగా డే కార్యక్రమానికి నేను హాజరవుతున్నా. 'యోగ్ ఆంధ్రా అభియాన్'లో భాగంగా 10 లక్షల మంది యోగా అభ్యాసకులను తయారు చేయబోతున్నారు. మన జీవన విధానాన్ని యోగా మార్చేస్తుంది. పాఠశాలల్లో చక్కెర బోర్డులు ఏర్పాటు చేయాలని సీబీఎస్‌ఈ నిర్ణయించడం హర్షణీయం. చక్కెర వినియోగం, దానివల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించబోతున్నారు. క్యాంటీన్లు, కార్యాలయాల్లోనూ ఇలాంటి బోర్డులు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. పర్యావరణ పరిరక్షణ కోసం ఐటీబీపీ జవాన్లు చేసిన ప్రయత్నం నన్ను ఆకట్టుకుంది. వారు మకాలూ పర్వతంపైకి వెళ్లి, 150 కిలోల వ్యర్థాలను కిందికి తీసుకొచ్చారు. పర్వతాన్ని శుభ్రం చేయడం మామూలు విషయం కాదు. పట్టుదల, అంకితభావం ఉంటే మార్గం అదే దొరుకుతుందని వారు నిరూపించారు. కాగితాలను వృథా చేయడం ఇటీవల బాగా పెరిగింది. భూమిలో చేరుతున్నవాటిలో కాగితపు వ్యర్థాలే అధికంగా ఉంటున్నాయి. అందుకే కాగితం పునర్వినియోగంపై దృష్టి పెట్టాలి. విశాఖపట్నం, గురుగ్రాం, జాల్నాలోని కొన్ని స్టార్టప్ కంపెనీలు ప్యాకేజింగ్ బోర్డులు, పేపర్ ఉత్పత్తులను రీసైకిల్ చేస్తున్నాయి'' అని ప్రధాని మోదీ వివరించారు.


ప్రధాని మోదీ సారథ్యంలో ఆదివారం ఢిల్లీలో జరిగిన ఎన్‌డీఏ పాలిత రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంల సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్, అమిత్ షా, జేపీ నడ్డా తదితరులు

కుల గణనతో బడుగుల సాధికారత

ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి

- కుల రాజకీయాలపై విశ్వాసం లేదని స్పష్టీకరణ
- ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలతో భేటీ

న్యూఢిల్లీ: సమాజంలో వెనుకంజలో ఉన్న బడుగు బలహీన వర్గాలను ప్రధాన అభివృద్ధి స్రవంతిలోకి తీసుకురావడానికి కుల గణన ఒక కీలకమైన ముందడుగు అవుతుందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. కుల రాజకీయాలపై తమకు విశ్వాసం లేదని అన్నారు. అణగారిన వర్గాల సాధికారితకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. భౌగోళికంగా అన్ని ప్రాంతాలు, వెనుకబడిన జిల్లాల ప్రజలు, మహిళల ప్రగతికి కట్టుబడి ఉన్నట్లు పునరుద్ఘాటించారు. ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రుల సమావేశం ఆదివారం ఢిల్లీలో నిర్వహించారు. 20 మంది ముఖ్యమంత్రులు, 18 మంది ఉప ముఖ్యమంత్రులు హాజరయ్యారు. పహల్గాం ఉగ్రవాద దాడిలో మరణించినవారికి నివాళులర్పించారు. మూడో టర్మ్‌లో మోదీ ప్రభుత్వం ఏడాది కాలం పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నిర్వహించిన ఈ భేటీలో ప్రధానమంత్రి మాట్లాడారు. రక్షణ రంగంలో స్వయం సమృద్ధికి మనం ఇస్తున్న ప్రాధాన్యతకు ఆపరేషన్ సిందూర్ విజయమే సాక్ష్యమని తెలిపారు. ఉగ్రవాదుల భరతం పట్టడంలో మన స్వదేశీ రక్షణ సాంకేతికత కీలక భూమిక పోషించిందని గుర్తుచేశారు. ఉగ్రవాద క్యాంప్‌లను నేటమట్టం చేయడంలో మన సైనిక దళాలు అద్భుతంగా పని చేశాయని పేర్కొన్నారు.

అత్యుత్తమ పాలనా విధానాలపై అధ్యయనం

ఉత్తరాఖండ్‌లో అమలు చేస్తున్న ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ) సహా వేర్వేరు రాష్ట్రాల్లోని అత్యుత్తమ పరిపాలనా విధానాలను మోదీ ప్రస్తావించారు. ఛత్తీస్‌గఢ్‌లో బస్తర్ ఒలింపిక్స్, అస్సాంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమం, బిహార్‌లో జల జీవన్ హరియాలీ అభియాన్, గుజరాత్‌లో సోలార్ విద్యుత్ కార్యక్రమం, మేఘాలయాలో పారదర్శక పరిపాలన వంటివి ఇందులో ఉన్నాయి. వీటిపై అధ్యయానికి ఒక కమిటీ ఏర్పాటు చేయాలని మోదీ సూచించారు. ఇతర రాష్ట్రాల్లోనూ ఈ విధానాలను అమలు చేయడంపై దృష్టి పెట్టాలన్నారు. 'వికసిత్ భారత్' సాధన కోసం ఎన్డీయే పాలిత రాష్ట్రాలన్నీ కలిసికట్టుగా పని చేయాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. భారత్‌ను శక్తివంతమైన, స్వయం సమృద్ధి దేశంగా తీర్చిదిద్దుకోవాలని, ఆ దిశగా కార్యాచరణ వేగవంతం చేయాలని అన్నారు. ఏదైనా మాట్లాడేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, వివాదాలకు తావు లేకుండా వ్యవహరించాలని సూచించారు. 'ఎక్కడైనా, ఏదైనా మాట్లాడే' ధోరణి మానుకోవాలని చెప్పారు. క్రమశిక్షణతో కూడిన కమ్యూనికేషన్ అవసరమని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో కొందరు చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయినట్లు గుర్తుచేశారు. భారత్–పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ విషయంలో మూడో పక్షం ప్రమేయం ఎంతమాత్రం లేదని ప్రధాని మోదీ మరోసారి స్పష్టంచేశారు. పాకిస్తాన్ నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు కాల్పుల విరమణకు తాము అంగీకరించామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రెండు తీర్మానాలు ఆమోదించారు. పహల్గాం ఉగ్రవాద దాడి అనంతరం ఆపరేషన్ సిందూర్‌లో భారత సైనిక దళాలు ప్రదర్శించిన ధైర్య సాహసాలు, ప్రధాని మోదీ నాయకత్వ ప్రతిభను ప్రశంసిస్తూ ఒక తీర్మానం, దేశవ్యాప్తంగా జన గణనతోపాటు కుల గణన నిర్వహించాలన్న నిర్ణయాన్ని కొనియాడుతూ మరో తీర్మానం ఆమోదించారు. సమావేశంలో కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జె.పి.నడ్డా, తదితరులు పాల్గొన్నారు. దేశంలో నక్సలిజాన్ని నిర్మూలించడానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలను అమిత్ షా వివరించారు.


ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో రష్యా దాడితో చెలరేగిన మంటలు

ఉక్రెయిన్‌పై విరుచుకుపడ్డ రష్యా

- 298 డ్రోన్లు, 69 క్షిపణులతో దాడి
- 12 మంది మృతి, పదుల సంఖ్యలో క్షతగాత్రులు

కీవ్: రష్యా మరోసారి క్షిపణులు, డ్రోన్లతో ఉక్రెయిన్‌పై భీకర దాడులకు పాల్పడింది. రాజధాని కీవ్‌తో పాటు ఇతర ప్రాంతాలే లక్ష్యంగా శనివారం రాత్రి చేపట్టిన దాడుల్లో కనీసం 12 మంది చనిపోగా పదుల సంఖ్యలో జనం క్షతగాత్రులయ్యారు. మొత్తం 69 క్షిపణులు, 298 డ్రోన్లను రష్యా ప్రయోగించిందని ఉక్రెయిన్ ఎయిర్‌ఫోర్స్ పేర్కొంది. ఇరాన్ డిజైన్ చేసిన షహీద్ రకం డ్రోన్లు కూడా ఇందులో ఉన్నాయంది. మూడేళ్లుగా సాగుతున్న యుద్ధంలో ఒకే రాత్రిలో రష్యా ఇంత భారీ స్థాయిలో వైమానిక దాడులకు దిగడం ఇదే మొదటి సారని తెలిపింది. శుక్రవారం మాదిరిగానే శనివారం రాత్రంతా కీవ్ వాసులు కంటిపై కునుకు లేకుండా గడిపారు. సైరన్ మోతలు, పేలుళ్లతో రాజధాని దద్దరిల్లింది. క్షిపణులు, డ్రోన్ల శకలాలు పడి నివాస ప్రాంతాలు, వ్యాపార సముదాయాల్లో మంటలు చెలరేగాయి. కీవ్‌లో అత్యధికంగా నలుగురు మరణించగా, 16 మంది గాయపడ్డారని నగర భద్రతా విభాగం తెలిపింది. తర్వాత, జిటోమిర్ ప్రాంతంలో ముగ్గురు బాలలు సహా 12 మంది క్షతగాత్రులయ్యారు. సుమీ, మైకోలైవ్, ఖ్మెల్నిట్స్కీ, చర్నిహివ్, ఒడెసా, టెర్నోపిల్, పోల్టావా, నీప్రో, చెర్కసీ ప్రాంతాలపైనా దాడులు జరిగాయి. కీవ్ శివారులోని మర్హాలివ్స్కాలో పలు నివాసాలు మంటల్లో కాలిబుగ్గయ్యాయి. దాడుల అనంతరం మరో గ్రామం మొత్తం పొగలు, మంటలతో నిండిపోయింది. ఇక్కడ చోటుచేసుకున్న విధ్వంసం మరియుపోల్, బాఖ్ముత్‌లను తలపించిందని స్థానికుడొకరు పేర్కొన్నారు. రష్యా క్షిపణులు, డ్రోన్లతో 30కి పైగా నగరాలు, గ్రామాల్లో విధ్వంసం జరిగిందని అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. రష్యా ఉద్దేశపూర్వకంగా సామాన్యులపై దాడులకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. ఆంక్షలు విధించడం వంటి తీవ్రమైన ఒత్తిడి తేకుండా రష్యా దురాక్రమణకు అడ్డుకట్ట వేయలేమన్నారు. ఇలా ఉండగా, ఉక్రెయిన్ శనివారం రాత్రి ప్రయోగించిన 110 డ్రోన్లను తమ గగనతల రక్షణ వ్యవస్థలు ధ్వంసం చేశాయని రష్యా రక్షణ శాఖ తెలిపింది.

మూడో విడత ఖైదీల మార్పిడి

రష్యా, ఉక్రెయిన్ అధికారుల మధ్య మూడో విడత యుద్ధ ఖైదీల మార్పిడి కొనసాగింది. ఒకవైపు భీకర దాడులు కొనసాగుతుండగానే ఆదివారం మరో 303 మంది ఖైదీలను ఇచ్చిపుచ్చుకున్నామని ఇరుదేశాలు ప్రకటించాయి. తుర్కియేలో కుదిరిన ఒప్పందం ప్రకారం ఇరుదేశాలు వెయ్యి మంది యుద్ధ ఖైదీలను పరస్పరం మార్పిడి చేసుకోవాల్సి ఉంది. ఇందులో భాగంగా మొదటి విడతలో శుక్రవారం 390 మందిని, శనివారం మరో 307 మందిని పరస్పరం మార్చుకోవడం తెల్సిందే. వీరిలో వివిధ విభాగాలకు చెందిన సైనికులతోపాటు పౌరులు కూడా ఉన్నారు. మూడేళ్లలో మార్చుకున్న మొత్తం యుద్ధ ఖైదీల కంటే ఈ మూడు రోజుల్లో పరస్పరం అప్పగించుకున్న యుద్ధ ఖైదీల సంఖ్యే ఎక్కువని సమాచారం.

కొచ్చి తీరంలో మునిగిపోయిన లైబీరియా నౌక

లీకైన రసాయనాలు

హై అలర్ట్ ప్రకటించిన కేరళ ప్రభుత్వం

- ఓడలోని 27 మంది సిబ్బందిని రక్షించిన కోస్టుగార్డ్, నేవీ

కొచ్చి: కేరళలోని కొచ్చి తీరంలో శనివారం బోల్తాపడిన లైబీరియా కార్గోషిప్ ఆదివారం పూర్తిగా మునిగిపోయినట్లు భారత కోస్ట్ గార్డ్ ప్రకటించింది. నౌకలో 27 మంది సిబ్బంది ఉండగా.. ఇండియన్ కోస్టుగార్డ్ 24 మందిని రక్షించింది. నేవీ షిప్ ఐఎన్ సుజాత మరో ముగ్గురిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చింది. నౌకలో భారీగా రసాయనాలు ఉన్నాయని, అవి సముద్రంలో లీకై, వేగంగా విస్తరిస్తుండటంతో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని కేరళ ప్రభుత్వం హెచ్చరికలు జారీచేసింది. రసాయనాల లీకేజీని అరికట్టడానికి కోస్టుగార్డ్ కృషి చేస్తోంది.

సురక్షితంగా బయటపడ్డ సిబ్బంది..

లైబీరియాకు చెందిన ఎమ్‌ఎస్‌సీ ఈఎల్‌ఎస్‌ఏ 3 శనివారం సాయంత్రం వంగిపోవడంతో ఇండియన్ కోస్టుగార్డ్‌కు సమాచారం అందింది. వెంటనే అప్రమత్తమైన కోస్టుగార్డ్ 24 మంది సిబ్బందిని రక్షించింది. 24 మంది సిబ్బందిలో ఒక రష్యన్ (ది మాస్టర్), 20 మంది ఫిలిప్పీన్స్, ఇద్దరు ఉక్రేనియన్లు, ఒక జార్జియన్ జాతీయుడు ఉన్నారు. పరిస్థితిని పర్యవేక్షించడానికి ముగ్గురు సీనియర్ సిబ్బంది ఓడలోనే ఉండిపోయారు. అయితే.. ఆదివారం తెల్లవారుజాము సమయానికి అది పూర్తిగా బోల్తా పడటంతో ఇండియన్ నేవీ షిప్ ఐఎన్ సుజాత ఆ ముగ్గురిని సురక్షితంగా బయటికి తీసుకొచ్చింది.

కంటైనర్లలో ప్రమాదకర రసాయనాలు...

బోల్తా పడిన ఓడలో 13 కంటైనర్లలో ప్రమాదకరమైన రసాయనాలు, 640 ఇతర కంటైనర్లు ఉన్నాయి. వీటిలో 84.44 మెట్రిక్ టన్నుల డీజిల్, 367.1 మెట్రిక్ టన్నుల ఫర్నేస్‌ఆయిల్, కాల్షియం కార్బైడ్ వంటి ప్రమాదకర రసాయనాలు ఉన్నాయి. ఓడ మునిగిపోయిన తరువాత రసాయనాలు లీకయ్యాయి. ఇవి సముద్రపు నీటితో కలిసి అత్యంత ప్రమాదకరమైన ఎసిటిలీన్ వాయువును విడుదల చేస్తుందని కోస్టుగార్డ్ హెచ్చరించింది. మ్యాపింగ్ సాంకేతికతతో చమురు లీకేజీని అంచనా వేస్తున్నారు. లీక్ అయిన ఇంధనం గంటకు దాదాపు మూడు కిలోమీటర్ల వేగంతో కదులుతోందని గుర్తించింది. పర్యావరణానికి తీవ్రమైన ముప్పు కావడంతో.. చమురును విచ్ఛిన్నం చేయడానికి వైమానిక డోర్నియర్ విమానాలు డిస్పర్సెంట్‌ను స్ప్రే చేస్తున్నాయి.

కేఎస్‌డీఎంఏ హెచ్చరికలు..

కేరళలోని సముద్ర తీరం జీవవైవిధ్యానికి నిలయం. పర్యాటకానికి ప్రధాన ఆకర్షణ. ఈ రెండింటికి ఎలాంటి విఘాతం కలగకుండా కేరళ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ (కేఎస్‌డీఎంఏ) చర్యలు తీసుకుంటోంది. కంటైనర్లు చమురుతో సహా సరుకు ఒడ్డుకు కొట్టుకువచ్చే అవకాశం ఉందని, తీర ప్రాంతాల్లో చమురు పొరలు కనిపించవచ్చని హెచ్చరికలు జారీ చేసింది. భద్రతా కారణాల దృష్ట్యా మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని హెచ్చరించింది. ఒడ్డుకు కొట్టుకువచ్చే కార్గో కంటైనర్లు లేదా చమురును తాకవద్దని సూచించింది. ఒడ్డున కంటైనర్లు లేదా చమురు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రకటించింది.


సముద్ర జలాల్లో మునిగిపోతున్న నౌక

ఆర్జేడీ నుంచి తేజ్ ప్రతాప్ సస్పెన్షన్


తేజ్‌ప్రతాప్

పట్నా: రాష్ట్రీయ జనతా దళ్(ఆర్జేడీ) పార్టీ చీఫ్ లాలు ప్రసాద్ యాదవ్ తన పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్‌ను పార్టీ నుంచి ఆరేళ్లపాటు బహిష్కరించారు. అతడితో ఇకపై తమ కుటుంబానికి ఎటువంటి సంబంధాలు లేవని స్పష్టం చేశారు. కుటుంబ విలువలకు విరుద్ధంగా తేజ్ ప్రతాప్ వ్యవహరిస్తున్న కారణంగా అతడిపై ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆదివారం ఆయన 'ఎక్స్'లో ప్రకటించారు. తేజ్ ప్రతాప్ శనివారం తన ఫేస్‌బుక్ పేజీలో..'గడిచిన 12 ఏళ్లుగా అనుష్కా యాదవ్‌ను ప్రేమిస్తున్నా. ఆమెతో రిలేషన్‌షిప్‌లో ఉన్నా'అని పేర్కొన్నారు. దీనిపై భారీ స్పందన వచ్చింది. ఈ పెళ్లి వివాహం దాకా వెళ్తుందా అని ఒకరు, తేజ్ ప్రతాప్ ధైర్యవంతుడని మరికొందరు నెటిజన్లు స్పందించారు. అయితే, కొద్దిసేపటి తర్వాత తేజ్ ప్రతాప్ తన ఫేస్‌బుక్ అక్కౌంట్‌ను ఎవరో హ్యాక్ చేశారని, తనని, తన కుటుంబాన్ని అప్రతిష్ట పాలు చేసేందుకు ఫొటోలను మార్ఫింగ్ చేశారంటూ మరో పోస్ట్ పెట్టారు. వదంతులను పట్టించుకోవద్దంటూ శ్రేయోభిలాషులకు 'ఎక్స్'లో విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలోనే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. అసెంబ్లీ ఎన్నికలు మరి కొద్ది నెలల్లో జరగనుండగా లాలు కుమారుడిని పార్టీ నుంచి బహిష్కరిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని కంటితుడుపు చర్యగా సీఎం నితీశ్ కుమార్ అభివర్ణించారు.

భారత్‌తో మనుగడకే ప్రమాదం

అందుకే అణ్వస్త్రాల ఆధునీకరణపై పాక్ దృష్టి

- అమెరికా రక్షణ నిఘా విభాగం నివేదిక వెల్లడి

ఇస్లామాబాద్: భారత్ వల్ల తన అస్తిత్వమే ప్రమాదంలో పడిందని పాకిస్తాన్ భయపడుతోంది. సైనిక పరంగా పైచేయిగా ఉన్న భారత్‌ను నిలువరించేందుకు తనకున్న ఏకైక మార్గం అణ్వస్త్రాలే అని భావిస్తోంది. అందుకే, తన వద్ద ఉన్న అణ్వస్త్రాలను ఆధునీకరించుకునే పనిలో పడింది. ఇందుకోసం చైనా సైనిక, ఆర్థిక పరమైన సాయం అందిస్తోంది'..ఈ విషయాలు ఆదివారం అమెరికా రక్షణ నిఘా విభాగం(యూఎస్‌డీఐఏ) వరల్డ్ త్రెట్ అసెస్‌మెంట్ పేరుతో విడుదల చేసిన నివేదికలో ఉన్నాయి. రాబోయే సంవత్సరాల్లో పొరుగు దేశాలతో సరిహద్దుల్లో ఘర్షణలను ఎదుర్కోవడం పాకిస్తాన్ మిలటరీ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని నివేదిక పేర్కొంది. ఇందులో భాగంగానే అణ్వస్త్రాల నవీకరణ కొనసాగించాలని నిర్ణయించుకుంది. ఈ ఆయుధ సంపత్తిని భద్రంగా కాపాడుకోవడం, కమాండ్ కంట్రోల్ వంటి వాటిపైనా పాక్ మిలటరీ దృష్టి పెట్టిందని తెలిపింది. సామూహిక జన హననాని(డబ్ల్యూఎండీ)కి అవసరమయ్యే ఆయుధ సామగ్రిని విదేశీ ఉత్పత్తి సంస్థలు, దళారుల ద్వారా సేకరించడం ఆర్మీ తప్పనిసరని భావిస్తోంది. డబ్ల్యూఎండీ తయారీ, అభివృద్ధిలో వాడే సామగ్రి, సాంకేతికతను ప్రధానంగా చైనా నుంచి పొందుతోంది. ఇందులో కొన్నిటిని హాంకాంగ్, సింగపూర్, తుర్కియే, యూఏఈల ద్వారా తెప్పించుకుంటోందని యూఎస్‌డీఐఏ నివేదిక తెలిపింది. 'పాక్‌కు ప్రధాన ఆయుధ సరఫరాదారు చైనా కొనసాగుతున్నప్పటికీ, పాక్‌లో వివిధ ప్రాజెక్టుల కోసం పనిచేసే చైనీయులపై ఉగ్రవాదులు దాడులకు పాల్పడుతున్న ఘటనలు రెండు దేశాలకు ఇబ్బందికరంగా మారాయి. రెండు మిత్ర దేశాల మధ్య ఇవి ఉద్రిక్తతలకు కారణమవుతున్నాయి'అని పేర్కొంది.

నివేదికలో భారత్ గురించి ఏముంది?

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఏప్రిల్‌లో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ పాకిస్తాన్‌లోని ఉగ్రవాదుల స్థావరాలే లక్ష్యంగా క్షిపణులను ప్రయోగించిన విషయాన్ని కూడా యూఎస్‌డీఐఏ తన నివేదికలో ప్రస్తావించింది. 'మే 7 నుంచి 10వ తేదీ వరకు క్షిపణి, డ్రోన్, ఆర్టిలరీ కాల్పులు చోటుచేసుకున్నాయి. 10వ తేదీన రెండు దేశాల సైన్యాలు పూర్తి స్థాయి కాల్పుల విరమణకు అంగీకరించాయి' అని పేర్కొంది. 'చైనా పలుకుబడికి చెక్ పెట్టేందుకు భారత్ కూడా వ్యూహాత్మకంగా హిందూ మహాసముద్ర తీర, ద్వీప దేశాలతో ద్వైపాక్షిక రక్షణ భాగస్వామ్యాలను పెంచుకుంటోంది'అని నివేదిక తెలిపింది. భారత్–చైనా సరిహద్దుల్లో ఉద్రిక్తతల ప్రస్తావన సైతం ఇందులో ఉంది. 'తూర్పు లద్దాఖ్‌లోని వివాదాస్పద వాస్తవాధీన రేఖ వెంబడి చిట్టచివరి రెండు ఘర్షణాత్మక ప్రాంతాల నుంచి ఇరు దేశాలు సైన్యాలను ఉపసంహరించుకున్నప్పటికీ సరిహద్దు విభజన వివాదం అపరిష్కృతంగానే ఉండిపోయింది'అని పేర్కొంది. మిలటరీ ఆధునీకరణ, ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకునే క్రమంలో దేశీయ రక్షణ పరిశ్రమను బలోపేతమయ్యేలా భారత్ 'మేడ్ ఇన్ ఇండియా'కార్యక్రమాన్ని కొనసాగించే అవకాశముంది.

హార్వర్డ్‌లో విదేశీ విద్యార్థులే ఎక్కువ

వారి వివరాలు వెల్లడించాలి: ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హార్వర్డ్ విశ్వవిద్యాలయంపై దాడిని కొనసాగించారు. వర్సిటీ ఎస్‌ఈవీపీ హోదా రద్దును నిలిపేస్తూ తన ప్రభుత్వం తీసుకున్న చర్యను ఆయన సమర్థించారు. అక్కడ చదువుతున్నవారిలో 31శాతం విదేశీ విద్యార్థులే ఉన్నారని, వారి పూర్తి వివరాలను వెల్లడించాలని ట్రూత్‌సోషల్ వేదికగా ట్రంప్ పునరుద్ఘాటించారు. అంతర్జాతీయ విద్యార్థులను చేర్చుకునే హోదాను రద్దు చేస్తూ ప్రభుత్వ తీసుకున్న నిర్ణయాన్ని కోర్టు నిలిపేసిన విషయం తెలిసిందే. దీనిపై ట్రంప్ స్పందించారు. 'హార్వర్డ్‌లో చదువుతున్నవారిలో 31 శాతం మంది విదేశీ విద్యార్థులే. పదేపదే ప్రభుత్వం అభ్యర్థించినప్పటికీ విశ్వవిద్యాలయ ఆయా విద్యార్థుల గురించి వివరాలను అందించడం లేదు. ఎందుకు చెప్పడం లేదు? వారిలో ఎక్కువ మంది అమెరికా వ్యతిరేక దేశాలకు చెందిన విద్యార్థులున్నారు. ఆయా విద్యార్థుల విద్య కోసం వారేమీ చెల్లించడం లేదు. ఆ విదేశీ విద్యార్థులు ఎవరో మేం తెలుసుకోవాలనుకుంటున్నాం' అని ట్రంప్ పేర్కొన్నారు.

443 కోట్లు ఖర్చు చేయండి..

'హార్వర్డ్ యూనివర్సిటీకి బిలియన్ డాలర్ల నిధులు ఇచ్చిన ప్రభుత్వంగా వివరాలు అభ్యర్థించడం సహేతుకమైనది. మాకు ఆ విద్యార్థుల పేర్లు, వారి దేశాల వివరాలు కావాలి. లేదంటే హార్వర్డ్ దగ్గర దాదాపు రూ.443 కోట్ల రూపాయలు ఉన్నాయి. వాటినే ఉపయోగించుకోవాలి. ఫెడరల్ ప్రభుత్వాన్ని నిధులు అడగకూడదు'అని ట్రంప్ హెచ్చరించారు.

'భారత్ ఫోర్‌కాస్టింగ్ సిస్టమ్' నేడు ఆవిష్కరణ

న్యూఢిల్లీ: వాతావరణ పరిస్థితులు, వర్షాల విషయంలో మరింత కచ్చితత్వంతో సమాచారం అందించడానికి ఉద్దేశించిన 'భారత్ ఫోర్‌కాస్టింగ్ సిస్టమ్'ను ప్రభుత్వం సోమవారం ఆవిష్కరించనుంది. పుణేలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రోపికల్ మెటియోరాలజీ(ఐఐటీఎం) ఈ వ్యవస్థను అభివృద్ధి చేసింది. ఇకపై స్థానికంగా వాతావరణ పరిస్థితులను కచ్చితత్వంతో వెల్లడించడానికి వీలవుతుందని కేంద్ర ఎర్త్ సైన్సెస్ శాఖ కార్యదర్శి ఎం.రవిచంద్రన్ తెలిపారు. బీఎఫ్‌ఎస్‌ను కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ జాతికి అంకితం ఇవ్వనున్నారు.



సిటీలోనే 'సైబర్ హెల్పర్స్'

ఉత్తరాది కేంద్రంగా సైబర్ నేరాలకు పాల్పడే సూత్రధారులకు సహాయం చేసే పాత్రధారులు సిటీలోనూ ఉన్నారు. బోగస్ వివరాలతో బ్యాంక్ ఖాతాలు తెరిచి వారికి సహకరిస్తున్నారు. -8లో



కాస్మో 'టెక్' సిటీ..

నగర జీవనశైలి వేగంగా మారిపోతోంది. ఫ్యాషన్, సినిమా, టెలివిజన్, ఈవెంట్ మేనేజ్‌మెంట్ రంగాల పెరుగుదలతో మేకప్ రంగం కూడా భారీగా విస్తరిస్తోంది. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
33.0/23.0

నగరంలో సోమవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 33, కనిష్ఠంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

విషాద ప్రయాణం

కన్నపిల్లల కళ్ల ముందే తల్లి దుర్మరణం

- కదులుతున్న రైలు ఎక్కబోతుండగా ప్రమాదం
- చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో ఘటన

సికింద్రాబాద్: కన్నపిల్లల కళ్ల ముందే ఓ తల్లి రైలు బోగీ నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందిన ఘటన ఆదివారం ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్‌లో విషాదాన్ని నింపింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని అనకాపల్లి జిల్లా దొండపూడి గ్రామానికి చెందిన మట్ట వెంకటేశ్, శ్వేత (33) దంపతులు. నగరంలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న వెంకటేశ్ తన భార్య శ్వేత, ఇరువురు పిల్లలతో కలిసి లింగంపల్లిలో నివాసం ఉంటున్నారు. వేసవి సెలవులు పూర్తవుతున్న క్రమంలో కొద్ది రోజులు శ్వేత తన ఇద్దరు పిల్లలతో దొండపూడిలో గడిపి రావాలనుకుంది. ఇందుకోసం భర్త వెంకటేశ్ ఆన్‌లైన్ టికెట్ కొనుగోలు చేశాడు. ఉదయం భార్య, పిల్లలను లింగంపల్లి రైల్వేస్టేషన్ తీసుకువచ్చిన వెంకటేశ్ జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కించి డీ3 బోగీలోని సీట్లలో కూర్చోబెట్టాడు.

సీట్ నంబర్ సరిగా ప్రింట్ కాకపోవడంతో..

రైలు బయలుదేరిన కొద్ది సేపటి తర్వాత శ్వేత కూర్చున్న సీట్లు తమవని వేరే ప్రయాణికులు వచ్చారు. తన వద్ద ఉన్న టికెట్‌ను మరోసారి సరి చూసుకోగా తన బోగీ డీ8గా గుర్తించింది శ్వేత. రైలులో రద్దీ ఎక్కువగా ఉండడంతో 3వ నంబరు బోగీ నుంచి 8వ నంబర్ బోగీ వరకు బోగీల మార్గం నుంచి వెళ్లడం సాధ్యం కాలేదు. చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో రైలు నిలపగానే డీ3 బోగీ దిగిన ఆమె తన పిల్లలు, లగేజీతో 8వ నంబర్ బోగీ వద్దకు చేరుకుంది. అప్పటికే రైలు కదలడం ప్రారంభమైంది.



రైల్వే ట్రాక్‌పైనుంచి శ్వేత మృతదేహాన్ని పక్కకు తీస్తున్న స్థానికులు

రైలు బోగీ, ప్లాట్‌ఫాం మధ్య నలిగి..

పిల్లలను, లగేజీని హుటాహుటిన బోగీలోకి ఎక్కించి తాను ఎక్కేందుకు ఉపక్రమిస్తున్న సమయంలోనే రైలు వేగం పుంజుకుంది. దీంతో కాలుజారి కిందపడిన శ్వేత బోగీకి ప్లాట్‌ఫామ్ మధ్యలో ఇరుక్కుపోయి తీవ్ర గాయాలపాలై పట్టాల పక్కన పడిపోయింది. ప్రమాదాన్ని గుర్తించిన ప్రయాణికులు, పోలీసులు ఆమెను రక్షించే ప్రయత్నం చేస్తుండగానే అప్పటికే మృతి చెందింది. సమాచారం అందుకుని ఘటన స్థలానికి చేరుకున్న భర్త వెంకటేశ్ కన్నీరుమున్నీరుగా విలపించాడు. ఆన్‌లైన్ టికెట్‌లో ప్రింట్ సరిగా పడని కారణంతోనే తన భార్య రైలు ప్రమాదానికి బలైందన్నాడు. శ్వేత మృతదేహానికి గాంధీ మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించారు.

జూ.. కిటకిట!



మొన్నటి దాకా మండుతున్న ఎండలతో ఇళ్లకే పరిమితమైన పర్యాటకులు.. ఇటీవల కురుస్తున్న వర్షాలతో వాతావరణం చల్లబడటంతో సందర్శనీయ స్థలాలకు క్యూ కడుతున్నారు. చిన్నా పెద్దా కలిసి ఆహ్లాదకరంగా సేదతీరుతున్నారు. ఆదివారం నగరంలోని నెహ్రూ జూలాజికల్ పార్కు సందర్శకులతో కిక్కిరిసిపోయింది. అరుదైన వన్య ప్రాణులను చూసి పులకించారు. ఆదివారం ఒక్కరోజే సుమారు 24 వేల మంది సందర్శించినట్లు జూ పార్కు అధికారులు తెలిపారు.

దోమ కుట్టినట్టయినా లేదు!

ఖాళీ స్థలాల్లో పేరుకుపోతున్న చెత్త, మురుగు

జనావాసాల్లో ఖాళీ స్థలాలు మురుగునీటితో గుంతలుగా మారి కంపు కొడుతున్నాయి. ఓనర్ల నిర్లక్ష్యం.. అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రజలకు పాట్లు తప్పడం లేదు. ఇటీవలి వర్షాలతో నగరంతో పాటు శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలలోని పురపాలికల్లో మురుగు సమస్య తీవ్రంగా పరిణమిచ్చింది. ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం, మురుగు నీరు పేరుకుపోయి దోమలు విజృంభిస్తున్నాయి. కాలనీల వాసులు అనారోగ్యం బారిన పడుతున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులకు మాత్రం చీమ కుట్టినట్లు కూడా లేకపోవడం గమనార్హం.

– సాక్షి, సిటీబ్యూరో

- ఆవాసాల మధ్య అపరిశుభ్రత
- ప్రబలుతున్న అనారోగ్య సమస్యలు
- బల్దియా, శివారు జిల్లాల్లో తప్పని పాట్లు
- పట్టించుకోని జీహెచ్ఎంసీ, పురపాలికలు



అపరిశుభ్రతకు నిలయాలుగా..

- పురపాలిక చట్టం ప్రకారం ఖాళీ స్థలాల్లో ఎలాంటి ముళ్ల పొదలు పెరగకుండా, అపరిశుభ్రత లేకుండా స్థల (ప్లాట్ల) ఓనర్లు చూసుకోవాలి. లేదంటే పుర అధికారులు స్థలం యజమానికి నోటీసులు ఇచ్చి శుభ్రం చేయించాలి. కానీ.. శివారు జిల్లాల పరిధిలోని జీహెచ్ఎంసీ సర్కిళ్లతో సహా 29 పురపాలికల్లోని పలు కాలనీల్లో ఖాళీ ప్లాట్లు అపరిశుభ్రతకు నిలయంగా మారాయి. భావి అవసరాల దృష్ట్యా కొందరు ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసి అలాగే ఖాళీగా వదిలేస్తున్నారు.
- ఆయా కాలనీల్లో గృహ నిర్మాణాలు ఊపందుకుని, ప్లాట్లకు విలువ పెరిగిన తర్వాత చూద్దాంలే అనుకొని ఏళ్ల తరబడి వదిలేయడంతో చెత్త, ముళ్లకంప చెట్లు పెరిగి దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. నగర శివారు జిల్లాల్లోని మేడ్చల్, మల్కాజిగిరి, అల్వాల్, కుత్బుల్లాపూర్ తదితర మున్సిపల్ సర్కిళ్లతో పాటు జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ, పోచారం, ఘట్కేసర్, నాగారం, దమ్మాయిగూడ, గుండ్లపోచంపల్లి, తూముకుంట తదితర 29 పురపాలక సంఘాల్లో ఇటీవల కురిసిన వర్షం జల్లులతో కాలనీలు, లోతట్టు ప్రాంతాల్లో నీళ్లు నిలిచి దోమలు పెరగడంతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వ స్థలాల్లోనూ..

ప్రైవేటు ప్లాట్ల సంగతి ఇలా ఉంటే.. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు,డంపింగ్ యార్డులు అంతర్గత, ప్రధాన రహదారుల వెంట ఉన్న గ్రీన్ బెల్టు తదితర స్థలాలు చెత్తకుండీలుగా, మురుగునీటి నిలయాలుగా మారుతున్నాయి. పందులు, కుక్కలకు ఆవాసాలుగా మారుతున్నాయి. నిర్మాణ వ్యర్థాలను, భోజన, ప్లాస్టిక్ వ్యర్థాలను డంపు చేస్తున్నారు. ప్రతి ఏటా పట్టణ ప్రగతి, ఇతర ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల అమలు సందర్భంగా వీటిని శుభ్రం చేసేందుకు రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది.

కరువైన పర్యవేక్షణ..

స్థల యజమానులు తమ ప్లాట్లలో మురుగు, వర్షం నీరు నిలవకుండా, పిచ్చి మొక్కలు పెరగకుండా, ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాల్సిన్నప్పటికీ, పట్టించుకోవటం లేదు. దీన్ని పర్యవేక్షించాల్సిన పురపాలిక అధికారులు.. అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. దీంతో ఆ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి.. చెత్తాచెదారంతో ఖాళీ ప్లాట్లు మురుగు కూపాలుగా మారుతున్నాయి. సంబంధిత ఓనర్లకు పురపాలక సంఘాలు అడపాదడపా నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకొంటున్నాయి. కొందరి పాట్ల ఓనర్ల వివరాలు తెలియక నోటీసులు కూడా ఇవ్వకపోవడం గమనార్హం.

మెట్రో ముస్తాబు

ప్రపంచ సుందరి పోటీలకు 'మెట్రోరైల్' విస్తృత ప్రచారం

- తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక విశేషాలపై అవగాహన
- మెట్రో స్టేషన్ ప్రవేశ ద్వారాల వద్ద ఆకట్టుకునే కటౌట్లు

సాక్షి, సిటీబ్యూరో: ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ప్రపంచసుందరి పోటీలపై హైదరాబాద్ మెట్రో రైల్ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. మరికొద్ది రోజుల్లో పోటీలు ముగియనున్న దృష్ట్యా మిస్‌వరల్డ్ పోటీలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వివిధ రూపాల్లో ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తోంది. మరోవైపు తెలంగాణ పర్యాటక, చారిత్రక, వారసత్వ కట్టడాలపై ప్రజల్లో, ప్రయాణికుల్లో అవగాహన కల్పించేందుకు పోస్టర్లు, కటౌట్లు, చిత్రాల ప్రదర్శనకు ఏర్పాట్లు చేసింది. నగరంలోని గోల్కొండ, చార్మినార్ వంటి చారిత్రక కట్టడాలతో పాటు పోచంపల్లి, రామప్ప, లక్నవరం, ఆమ్రాబాద్ పులుల అభయారణ్యం, యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వంటి ఆధ్యాత్మిక, చారిత్రక ప్రదేశాలపై ఆకర్షణీయమైన దృశ్యాలను వివిధ ప్రాంతాల్లో ఆవిష్కరించారు. ప్రపంచసుందరి పోటీల్లో హైదరాబాద్ మెట్రో రైల్ తనవంతు భాగస్వామ్యాన్ని నిర్వహిస్తోందని మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఈ పోటీలపై ప్రత్యేక ప్రదర్శనలను ఏర్పాటు చేయడంతో పాటు తెలంగాణ ప్రాశస్త్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ ప్రచారకార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.



తెలంగాణకు పరిచయం చేసేలా..

పోటీల్లో పాల్గొంటున్న ప్రపంచ సుందరీ మణులను తెలంగాణకు పరిచయం చేసేవిధంగా హైటెక్ సిటీ నుంచి నాగోల్ వరకు, మియాపూర్ నుంచి ఎల్బీనగర్ వరకు పలు ప్రాంతాల్లో మెట్రో స్టేషన్లు, మెట్రో స్తంభాలు, రహదారులకు ఇరువైపులా ఉన్న మెట్రో రైలింగ్‌లపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ఆకర్షణగా నిలిచాయి. మరోవైపు మెట్రో రైళ్లలోనూ స్క్రీన్లపై, మెట్రో స్టేషన్ ప్లాట్‌ఫాంలు, కాన్‌కోర్స్‌లలోనూ మిస్ వరల్డ్ వేడుకలను ప్రతిబింబించేలా అనేక ఏర్పాట్లు చేశారు. అలాగే మెట్రో స్టేషన్ల ప్రవేశ ద్వారాలను సైతం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్చీలతో అలంకరించారు. నగరంలోని వివిధ మార్గాల్లో ప్రతిరోజు సుమారు 4.5 లక్షల నుంచి 5 లక్షల మంది ప్రయాణికులు మెట్రోల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణ వారసత్వ సంపదను ప్రయాణికులకు తెలియజేసే బృహత్ కార్యక్రమంలో భాగంగా వివిధ రూపాల్లో ప్రచారాన్ని కొనసాగిస్తున్నట్లు ఎన్వీఎస్ చెప్పారు. తెలంగాణ సంప్రదాయాలకు కీర్తి పతాకగా నిలిచిన బోనాలు, బతుకమ్మ, చార్మినార్ వంటి విశేషాలతో కూడిన ఆకర్షణీయ దృశ్యాలను 'మెట్రో రైల్' ఈ వేడుకల సందర్భంగా మరింత విస్తృత ప్రచారం కల్పించిందని ఎండీ వెల్లడించారు.

నవ మాసాలు నిండకముందే..

- ముందస్తు ప్రసవాలతో పొంచి ఉన్న ముప్పు
- నిలోఫర్ ఆస్పత్రిలో 50% ఇలాంటి కేసులే..
- శిశువుల్లో ఊపిరితిత్తులు, కిడ్నీ తదితర సమస్యలు

సాక్షి, సిటీబ్యూరో: నెలలు నిండక ముందే శిశువుల జననం ఆందోళన కలిగిస్తోంది. నవ మాసాలు తల్లి గర్భంలో ఉండాల్సిన బిడ్డ.. అంతకుముందే భూమ్మీదకు వచ్చేందుకు ఆరాటపడుతుండటంతో ఫలితంగా పిల్లల్లో ఊపిరితిత్తులు, కిడ్నీ, గుండె, ఇతర అవయవాలు పూర్తి స్థాయిలో వృద్ధి చెందకపోవడం, బరువు తక్కువగా ఉండటం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. దీనికి ప్రధానంగా ఆలస్యంగా వివాహం చేసుకోవడం, గర్భిణుల్లో రక్తపోటు, ఐవీఎఫ్ పద్ధతులు వంటివి కారణాలుగా కనిపిస్తున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. నిలోఫర్ ఆసుపత్రిలో ప్రతిరోజూ 40 ప్రసవాలు జరిగితే అందులో 20కిపైగా ప్రీ మెచ్యూర్ బేబీ కేసులు వస్తున్నాయి. అంటే దాదాపు 50 శాతం అన్నమాట.

ఎందుకిలా జరుగుతోంది..

ఉన్నత చదువులు చదవాలి. మంచి ఉద్యోగం సంపాదించాలి. జీవితంలో స్థిరపడాలి. ఆ తర్వాతే పెళ్లి చేసుకోవాలి. ప్రస్తుత యువతలో ఇదే ధోరణి కనిపిస్తోంది. ఫలితంగా ఆలస్యంగా వివాహం చేసుకుంటున్నారు. దీనికి తోడు మారుతున్న జీవన శైలి, తినే ఆహారం, కాలుష్యం, వ్యాయామం లేకపోవడం, స్ట్రెస్, ఐవీఎఫ్ పద్ధతులు, ఇన్‌ఫెర్టిలిటీ తదితరాల కారణాలతో నెలలు నిండక ముందే ప్రసవాలకు (ప్రీ మెచ్యూర్ డెలివరీ) కారణమవుతున్నాయి. కనీసం రెండు కేజీలకుపైగా బరువు ఉండాల్సిన శిశువులు కేజీ, అంతకంటే తక్కువ బరువుతో జన్మిస్తున్నారు. ఇలాంటి క్రిటికల్ కేసులను రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి నిలోఫర్ ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారు. ప్రసవం క్రిటికల్‌గా మారితే వెంటనే నిలోఫర్‌కు రిఫర్ చేస్తున్నారని, ఇక్కడ మంచి వైద్యం అందుతోందని నమ్మకంతోనే వస్తున్నారని నిలోఫర్ ఆసుపత్రికి చెందిన వైద్యురాలు స్వప్న పేర్కొన్నారు.



దాడికి ప్రతిదాడి తప్పదు

- పాక్ వంకర తోకను కత్తిరించేస్తాం
- ప్రధాని చెప్పిన విషయాలను ఆచరించాలి
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- సనత్‌నగర్‌లో 'ప్రధాని మోదీ మన్ కీ బాత్ వీక్షణ

సనత్‌నగర్: ఉగ్రదాడులపై దేశ ప్రజలు ప్రాణాలు కోల్పోతే గులాబీ పూలతో, క్యాండిల్స్ వెలిగించి నివాళులు అర్పించే విధానానికి ప్రధాన మంత్రి మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం స్వస్తి పలికిందని, దాడి చేస్తే ప్రతి దాడి తప్పదని, ఒక్కరిని చంపితే వంద మందిని చంపుతామనే విధానాన్ని పాక్ ఉగ్రవాదులకు కళ్లకు కట్టినట్లు చూపించామని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్ 122వ ఎపిసోడ్‌ను ఆదివారం సనత్‌నగర్ నియోజకవర్గంలో ప్రజలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన వీక్షించారు. ఇందులో ప్రధాని మాట్లాడిన ముఖ్యమైన స్వచ్ఛత, యోగా, డయాబెటిస్ లాంటి విషయాలను ఆచరణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని మన్ కీ బాత్ ప్రజలను జాగృతం చేస్తుందని, ఐక్యంగా నిలబెడుతుందని, ఆరోగ్యవంతమైన సమాజాన్ని రూపొందిస్తుందని చెప్పారు. ఇందులోని ప్రధాని చేసిన సూచనలు, సలహాలు ప్రతిఒక్కరూ తప్పకుండా ఆచరించాలని కోరారు.

ఆపరేషన్ సిందూర్‌తో గట్టి సందేశం..

లుంబినీ పార్కు, గోకుల్ చాట్, సాయిబాబా టెంపుల్, దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్లు, ముంబై దాడులు, పార్లమెంట్‌పై దాడి.. ఇలా అనేక దాడులతో గత 46 ఏళ్లుగా పాక్ ఉగ్రవాదాన్ని భారత్‌పై ఎగదోస్తూ అనేక మంది ప్రాణాలను బలి తీసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడుల సమయంలో నివాళులర్పించి సరిపెట్టుకునేవారమన్నారు. కానీ మోదీ ప్రభుత్వం వచ్చాక పఠాన్ కోట్-సర్జికల్ స్ట్రైక్, పుల్వామా-ఎయిర్ స్ట్రైక్, పహల్గాం- ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదాన్ని, దానిని పెంచి పోషించే దేశాన్ని కూడా మట్టి కలిపేస్తామనే గట్టి సందేశాన్ని ప్రధాని మోదీ ఇచ్చారన్నారు. ఇలాంటి సమయాల్లోనే పార్టీలు, కులాలు, మతాలు, వర్గాలు, వర్ణాలు అనేవి పక్కన పెట్టి దేశమంతా ఐక్యతగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. పహల్గాం దాడి అతి క్రూరమైనదన్నారు. పిల్లల ముందు తండ్రిని, భార్య ముందు భర్తను చంపారని కిషన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మోదీకి చెప్పుకోండని హెచ్చరికలు కూడా జారీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరి ఆగడాలకు భారత్ ఆపరేషన్ సిందూర్ ద్వారా గట్టి సమాధానం ఇచ్చిందన్నారు. ఇకపై భారత్‌లో జరిగే ప్రతి దాడికి సమాధానం ఇచ్చి తీరుతామన్నారు. ఉగ్రదాడులపై పాక్ 'కుక్క తోక వంకర' అన్నట్లే ప్రవర్తిస్తే ఆ తోకనే కత్తిరించేస్తామని హెచ్చరించారు. బీజేపీ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు సిర్మనీ నరేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, రాష్ట్ర నాయకులు లింగంపల్లి నర్సింగరావు, దయానంద్, మూల రవీందర్, సదాశివయాదవ్, ఆకుల మహేష్, క్రాంతికుమార్, వెంకట్ సుబ్బారావు, శ్రీకాంత్‌యాదవ్, రవిచందర్, వై.శ్రీనివాసరావు, చంద్రకుమార్, సుమన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులకు మోక్షం

- ఆన్‌లైన్ దరఖాస్తులపై విచారణ
- దశల వారీగా మంజూరు మరూ

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో కొత్త ఆహార భద్రత (రేషన్) కార్డులకు మోక్షం లభించింది. మీ సేవ కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా అందిన దరఖాస్తులపై క్షేత్ర స్థాయి విచారణ ప్రారంభమైంది. అర్హులకు కొత్త కార్డులు మంజూరవుతున్నాయి. పౌరసరఫరాల శాఖ ఇప్పటికే విచారణ పూర్తి చేసి కొందరికి కార్డులు మంజూరు చేయగా.. మరికొందరికి తిరస్కరించింది. ఇంకొన్ని దరఖాస్తులపై విచారణ కొనసాగుతోంది. ఈ నెల 24వ తేదీ వరకు మంజూరైన కొత్త కార్డులకు రేషన్ కోటా కేటాయించింది. దశలవారీగా విచారణ చేస్తూ రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నట్లు పౌరసరఫరాల అధికారులు చెబుతున్నారు.



భారీగా దరఖాస్తులు..

- గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో సుమారు రెండు లక్షల కుటుంబాల వరకు కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పదేళ్లలో పెద్దగా రేషన్ కార్డులు మంజూరు కాకపోవడంతో కొత్త కార్డుల కోసం తాకిడి పెరిగినట్లయింది.
- పెళ్లి చేసుకొని అత్తగారింటికి వచ్చిన కోడళ్లు రేషన్ కార్డు కోసం ఎదురు చూస్తున్నారు. ఇలాంటి వారంతా ప్రజా పాలనలో రేషన్ కార్డుల కోసం భారీగా దరఖాస్తులు చేసుకున్నారు.
- ప్రభుత్వం సమగ్ర సర్వే ద్వారా గ్రేటర్‌లో మొత్తం 22 లక్షల కుటుంబాల వివరాలు సేకరించి, నమోదు చేసినట్లు అంచనా. మెజారిటీ దరఖాస్తుల్లో తమకు రేషన్‌కార్డు లేదని, కొత్త రేషన్ కార్డు కావాలని జనం కోరారు. అవన్నీ పరిశీలించిన తర్వాత అర్హుల లెక్క 83,285గా తేలింది. ఎన్నికల కోడ్ ఇతరత్రా కారణాలతో అది పెండింగ్‌లో పడిపోయింది. గత నెలలో ఆన్‌లైన్ ద్వారా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానించడంతో పేద కుటుంబాలు పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నాయి. వాటిపై విచారణ నిర్వహిస్తూ కొత్త కార్డులు మంజూరు చేస్తోంది.

గ్రేటర్ పరిధిలో కొత్త రేషన్ కార్డుల మంజూరు ఇలా..

జిల్లా	కొత్త కార్డులు	యూనిట్లు
హైదరాబాద్	8,695	28,887
రంగారెడ్డి	927	2,875
మేడ్చల్-మల్కాజిగిరి	8,112	22,104

ఫర్నిచర్ దుకాణంలోకి దూసుకెళ్లిన మినీ బస్సు

- ఒకరి మృతి
- మరొకరికి గాయాలు



చాంద్రాయణగుట్ట: ఫర్నిచర్ దుకాణంలోకి మినీ బస్సు దూసుకెళ్లడంతో ఓ వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తి గాయపడిన సంఘటన బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గురునాథ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బండ్లగూడ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న రోడ్డులో మహ్మద్ అసనుద్దీన్(42) అనే వ్యక్తి ఫర్నిచర్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. ఆదివారం యథావిధిగా దుకాణం తెరిచి అతనితో పాటు కార్మికుడు పకీర్ పాషా పని చేస్తున్నారు. మధ్యాహ్నం కాటేదాన్ వైపు నుంచి వచ్చిన కర్మన్‌ఘాట్‌కు చెందిన మినీ ప్రైవేట్ బస్సు ఒక్కసారిగా మూల మలుపులో ఉన్న దుకాణంలోకి దూసుకెళ్లింది. వేగంగా ఢీకొట్టడంతో దుకాణం షట్టర్, గోడలు కూలిపోయాయి. శిథిలాల కింద చిక్కుకున్న షాప్ యజమాని అసనుద్దీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిని పకీర్ పాషాను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ రాఘవేందర్ నిద్ర మత్తే ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఎదురుతెన్నులు

- ఇప్పటికీ ఛత్తీస్‌గఢ్ ఆస్పత్రిలోనే విజయలక్ష్మి మృతదేహం
- అక్కడికి చేరుకుని పడిగాపులు కాస్తున్న కుటుంబీకులు



విజయలక్ష్మి (ఫైల్)

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఛత్తీస్‌గఢ్‌లోని అబుజ్‌మడ్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు విజయలక్ష్మి (36) అలియాస్ భూమిక మృతదేహం కోసం కుటుంబ సభ్యులు, బంధువులకు ఎదురు చూపులు తప్పడం లేదు. ఎన్‌కౌంటర్‌లో నంబాల కేశవరావుతో పాటు కేశంపేట మండలం వేములనర్వకు చెందిన విజయలక్ష్మి కూడా చనిపోయింది. మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు కుటుంబ సభ్యులు, బంధువులు శనివారం రాత్రి షాద్‌నగర్ నుంచి బయలుదేరి ఆదివారం మధ్యాహ్నం ఛత్తీస్‌గఢ్ నారాయణపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. పోస్టుమార్టం తర్వాత పలువురి మృతదేహాలను వారి బంధువులకు అప్పగించారు. విజయలక్ష్మి మృతదేహాన్ని మాత్రం ఇప్పటికీ అప్పగించకపోవడంతో బంధువులు ఆందోళన చెందుతున్నారు. ఛత్తీస్‌గఢ్ పోలీసులకు స్థానిక పోలీసుల నుంచి ఆదేశాలు అందకపోవడమే ఈ జాప్యానికి కారణమని తెలుస్తోంది. తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన భూమిక 12 ఏళ్ల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లింది.

ఓయూ నుంచి అబుజ్‌మడ్ వరకు

వేములనర్వ గ్రామానికి చెందిన వన్నాడ సాయిలు, రాధమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. ముగ్గురూ ఆడపిల్లలే. మూడో సంతానమైన విజయలక్ష్మి పుట్టిన ఏడాదికే తల్లి పాముకాటుతో చనిపోయింది. ఇంటర్మీడియెట్ వరకు కేశంపేటలోనే చదువుకుంది. ఒకవైపు చదువుకుంటూనే మరోవైపు పిల్లలకు ట్యూషన్లు చెప్పేది. మహబూబ్‌నగర్ ఎన్టీఆర్‌కాలేజీలో డిగ్రీ పూర్తి చేసింది. తర్వాత 2009-10లో ఓయూ పీజీ కాలేజీలో ఎంఏ పొలిటికల్ సైన్స్‌లో చేరింది. మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొంది. పలు మార్లు జైలుకు కూడా వెళ్లి వచ్చింది. ఇదే సమయంలో పోలవరం ముంపు గ్రామాలను సందర్శించి, ఆదివాసీల కష్టాలను చూసి చలించిపోయింది. ఈ ఘటన ఆమెపై తీవ్ర ప్రభావం చూపింది. 2013-14 మధ్య కాలంలో విజయలక్ష్మి అజ్ఞాతంలోకి వెళ్లింది. మావోయిస్టు పార్టీలో చేరిన మొదటి రోజు విషయాలను 'వసంత మేఘం' అనే వెబ్‌సైట్‌లో 'కొత్త బంగారులోకం' అనే శీర్షికతో ఓ కథను కూడా రాసింది. తానెందుకు గెరిల్లాగా మారాననే అంశాలతో పాటు ఓయూ కేంద్రంగా కొనసాగిన తెలంగాణ మలిదశ ఉద్యమాన్ని గుర్తు చేసుకుంది. 12 ఏళ్ల పాటు మావోయిస్టు పార్టీలో పని చేసి, చివరికి ప్రధాన కార్యదర్శి నంబాల రక్షణ బృందంలో పని చేస్తూ మరణించింది.

భూమికగా ఎలా మారిందంటే..?

విజయలక్ష్మి కేశంపేటలో ఇంటర్మీడియెట్ (2001-2003) పూర్తి చేసింది. అదే సమయంలో 'ఒక్కడు' సినిమా విడుదలైంది. ఆ సినిమాలోని హీరోయిన్ భూమిక పోలికలు కలిగి ఉండటంతో స్నేహితులంతా ఆమెను భూమికతో పోల్చుతూ అదే పేరుతో పిలిచేవారు. అజ్ఞాతంలోకి వెళ్లిన తర్వాత కూడా అదే పేరుతో కొనసాగినట్లు సమాచారం. చిన్నప్పటి నుంచి ఆమెకు సంగీతం, వ్యాస రచన అంటే ఇష్టం. ఇతరులకు సాయపడాలనే తపన బలంగా ఉండేది. ఇదే భావన మావోయిస్టు పార్టీ వైపు మళ్లించింది. అజ్ఞాతంలోకి వెళ్లిన తర్వాత ఆమె ఎప్పుడూ ఇంటి ముఖం చూడలేదు.

ఫోన్ పే చేసినట్లు నమ్మించి..

నగల షాప్ నిర్వాహకుడికి మహిళ టోకరా

అమీర్‌పేట: బంగారు నగల దుకాణానికి వచ్చిన ఓ మహిళ షాప్ నిర్వాహకుడిని బురిడీ కొట్టించిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సురేందర్‌సింగ్ అనే వ్యక్తి అమీర్‌పేటలో మయూరి జ్యువెల్లరీ పేరుతో షాప్ నిర్వహిస్తున్నాడు. శనివారం ఓ బాలుడితో కలిసి దుకాణానికి వచ్చిన ఓ మహిళ బ్రాస్‌లెట్ కొనుగోలు చేసింది. దాని ఖరీదు రూ.33,300 కావడంతో ఆ మొత్తాన్ని ఫోన్ పే ద్వారా చెల్లిస్తానని చెప్పి ఫోన్ పే చేసినట్లు ఓ మెసేజ్‌ను షాపు యజమానికి చూపించింది. ఆమె షాప్ నుంచి వెళ్లి పోయిన తర్వాత బ్యాలెన్స్ చెక్ చేసుకున్న సురేందర్ సింగ్ సదరు మహిళ పంపిన డబ్బులు ఖాతాలో కనిపించకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

రెండు ఇళ్లల్లో చోరీ

సనత్‌నగర్: తాళాలు పగులగొట్టి రెండు ఇళ్లల్లో చొరబడిన గుర్తుతెలియని వ్యక్తి నగదు, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బేగంపేట తాతాచారి కాలనీలో మెండా కిషోర్ అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. ఈ నెల 23న సాయంత్రం బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి నేరుగా మొదటి అంతస్తుకు వెళ్లి నూతన ప్రసాద్ అనే వ్యక్తి ఇంటి తాళాన్ని పగులగొట్టి లోపలికి ప్రవేశించాడు. ఇంట్లో దొరికిన రూ.2 వేల నగదు అపహరించాడు. అక్కడి నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌కు వచ్చి అద్దెకు ఉండే సాయికిరణ్ ఇంటి తాళాలు పగులగొట్టి రూ.4 వేల నగదుతో పాటు మొబైల్ ఫోన్ ఎత్తుకెళ్లాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి..

యువకుడి మృతి


ప్రమాదానికి కారణమైన బైక్

లాలాపేట: బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల కతనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మెట్టుగూడ ఆలుగడ్డ బావి ప్రాంతానికి చెందిన మాధవన్(21) ఆదివారం ఉదయం బైక్‌పై ఉప్పల్‌కు వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని తిరిగి వస్తుండగా అతివేగం కారణంగా బైక్ అదుపుతప్పి హబ్సిగూడలోని మెట్రో పిల్లర్ నెంబర్ 1002 యూ టర్న్ వద్ద డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు.

అనుమానం పెనుభూతమై..

భార్యపై కత్తితో భర్త దాడి

ఫిలింనగర్: భార్యపై అనుమానం పెంచుకున్న ఓ వ్యక్తి ఆమెపై కత్తితో దాడి చేసిన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తూర్పుగోదావరి జిల్లా అగ్రహారానికి చెందిన అప్పలరాజు, వెంకటరమణమ్మ దంపతులు ఫిలింనగర్‌లోని జ్ఞానీజైల్‌సింగ్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరిద్దరూ సినీ పరిశ్రమలో పని చేస్తున్నారు. గత కొన్నాళ్లుగా భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న అప్పలరాజు ఆమెకు వివాహేతర సంబంధాలు అంటగడుతూ హింసిస్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో కొబ్బరి బోండాలు కొట్టే కత్తితో ఆమెపై దాడి చేయగా ఆమె చేతికి తీవ్ర గాయమైంది. స్థానికులతో కలిసి బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా నిందితుడు స్వయంగా పోలీసుల ఎదుట లొంగిపోయాడు. అప్పలరాజును అరెస్ట్ చేసిన ఫిలింనగర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు.


యువకుడిపై హత్యాయత్నం

గౌలిపురా: పాత కక్షల నేపథ్యంలో ఓ యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నరేందర్ రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... భవానీనగర్ తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన సయ్యద్ సాబేర్ 2014లో జరిగిన కరీం అనే వ్యక్తి హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. అయితే అతను ఈ కేసులో నిర్దోషిగా బయటికి రావడంతో కరీం సోదరుడు బండ్లగూడ గౌస్‌నగర్‌కు చెందిన షేక్ చాంద్ అతడిపై పగ పెంచుకున్నాడు. ఇందులో భాగంగా పలు మార్లు సయ్యద్ సాబేర్‌ను చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో శనివారం మరికొందరితో కలిసి ఆటోలో తలాబ్‌కట్టా సిద్ధిఖీనగర్‌లోని ఓమర్ పాన్‌షాప్ వద్దకు వచ్చిన షేక్ చాంద్ పాషా సాబేర్‌పై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. దీనిని గుర్తించిన సాబేర్ భార్య అంజుమ్ బేగం గాయపడిన సాబేర్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అంజుమ్ బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

గచ్చిబౌలి: స్నేహితులతో కలిసి రాత్రి పార్టీ చేసుకున్న ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీహెచ్.వెంకన్న కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా, ప్రసాద్‌నగర్‌కు చెందిన లంక హర్షవర్ధన్(26) వారసిగూడలో నివాసం ఉంటూ సికింద్రాబాద్‌లోని ఓ ఏసీ కంపెనీలో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నాడు. శనివారం తోటి ఉద్యోగులు, స్నేహితులైన కోరిబొల్లి కార్తీక్, అదితి పాత్ర, వినోద్ కుమార్‌లతో కలిసి కొండాపూర్‌లోని క్వాక్ పబ్‌లో పార్టీ చేసుకున్నారు. అనంతరం గచ్చిబౌలిలోని సుమండో అపార్ట్‌మెంట్‌లోని అదితిపాత్ర ఫ్లాట్‌కు వెళ్లారు. అక్కడ మళ్లీ మద్యం సేవించారు. ఆదివారం తెల్లవారు జామున హర్షవర్ధన్ వాంతులు చేసుకోవడంతో స్నేహితులు అతడిని సమీపంలోని ఏఐజీ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రాయదుర్గం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త వేధింపులు తాళలేక భార్య బలవన్మరణం


భర్త కుమార్తెతో శ్వేత (ఫైల్)

జవహర్‌నగర్: మద్యానికి బానిసైన భర్త వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీజేఆర్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ లక్ష్మయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బీజేఆర్‌నగర్‌లో చంటి, శ్వేత(25) దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఓ కుమార్తె (02). చంటి గ్యాస్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత కొన్నాళ్లుగా మద్యానికి బానిసైన చంటి అప్పులు చేశారు. అప్పులు తీర్చాలని భార్యను తరచూ వేధిస్తున్నాడు. దీంతో మనస్తాపానికి లోనైన శ్వేత ఆదివారం ఇంట్లో చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు. శ్వేత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ తీగ తెగి పడి మహిళ మృతి

భర్త, కుమారుడికి గాయాలు

కీసర: బైక్‌పై వెళుతున్న భార్యాభర్తలపై విద్యుత్ తీగ తెగిపడిన ఘటనలో మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలైన సంఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగారం మున్సిపాలిటీలో చోటు చేసుకుంది. కీసర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శనివారం రాత్రి నాగారం, బాపురెడ్డి కాలనీకి చెందిన సురేష్ మౌనిక(30) దంపతులు తమ మూడేళ్ల కుమారుడు శ్రేయస్‌తో బైక్‌పై వెళుతున్నారు. నాగారం పాత గ్రామంలోని వీరాంజనేయస్వామి ఆలయం వద్దకు రాగానే ఈదురు గాలులకు విద్యుత్ తీగ తెగి బైక్ వెనకాల కూర్చున్న మౌనికపై పడింది. దీంతో మౌనికతోపాటు ఆమె భర్త సురేష్ తీవ్ర గాయాలయ్యాయి. బాలుడు శ్రేయస్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు వారిని సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా మౌనిక చికిత్సపొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సిటీలోనే ‘సైబర్ హెల్పర్స్’!

మ్యూల్స్ ఖాతాలు తెరిచి సూత్రధారులకు సహాయం

- వర్క్ ఫ్రమ్ హోమ్ స్కామ్ దర్యాప్తులో వెలుగులోకి
- నలుగురిని అరెస్టు చేసిన సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: ఉత్తరాది కేంద్రంగా సైబర్ నేరాలు చేసే సూత్రధారులకు సహాయం చేసే పాత్రధారులు సిటీలోనూ ఉన్నారు. బోగస్ వివరాలతో బ్యాంకు ఖాతాలు తెరిచి ఇవ్వడం ద్వారా సహకరిస్తూ కమీషన్లు తీసుకుంటున్నారు. రూ.8.75 లక్షలతో ముడిపడి ఉన్న ‘వర్క్ ఫ్రమ్ హోమ్ స్కామ్’ దర్యాప్తులో ఈ విషయం గుర్తించిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరు అనేక బ్యాంకు ఖాతాలను తెరిచి, వాటి వివరాలను సూత్రధారులకు పంపినట్లు గుర్తించామని డీసీపీ దార కవిత ఆదివారం ప్రకటించారు. నగరానికి చెందిన ఓ మహిళకు ఈ ఏడాది జనవరి 2న టెలిగ్రాం యాప్ ద్వారా ఓ సందేశం వచ్చింది. అక్కర్ అడ్వాంటేజ్ ప్లస్ మార్కెటింగ్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మానవ వనరుల విభాగం నుంచి వచ్చినట్లు అందులో ఉంది. ఈ పేరుతో ఓ నకిలీ వెబ్‌సైట్‌ను సృష్టించిన నేరగాళ్లు దాని యూఆర్ఎల్‌ను బాధితురాలికి పంపారు. తమ సంస్థ తరఫున వర్క్ ఫ్రమ్ హోమ్ విధానంలో పని చేయాలని కోరారు. ఏ ఇబ్బంది ఉండని ఈ ఉద్యోగం ద్వారా రోజుకు రూ.17 వేల నుంచి రూ.18 వేల వరకు సంపాదించుకునే అవకాశం ఉందని నమ్మించారు. ఆమె అంగీకరించడంతో ఆన్‌లైన్ హోటల్ బుకింగ్‌కు సంబంధించిన ఓ టాస్క్ ఇచ్చారు. ఇది పూర్తయిన తర్వాత అసలు కథ మొదలెట్టిన నేరగాళ్లు తమ వద్ద కొన్ని స్కీములు ఉన్నాయని, వాటిలో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని నమ్మించారు. తొలుత ఆమెతో రూ.10 వేలు పెట్టుబడి పెట్టించి, మరుసటి రోజే రూ.వెయ్యి లాభం పంచారు. ఆపై రూ.17,800, రూ.45,300 చొప్పున ఇన్వెస్ట్ చేయించారు. యానివర్సరీ స్పెషల్ ఆఫర్‌గా ‘గోల్డ్ సూట్ బుకింగ్’ విధానం ప్రవేశపెట్టామని, రూ.7.19 లక్షలు పెట్టుబడి పెడితే రూ.15.82 లక్షలు లాభం వస్తుందని చెప్పారు. ఆ మొత్తం పెట్టుబడిగా పెట్టాక నగదు తిరిగి ఇవ్వడానికి సెక్యూరిటీ డిపాజిట్ అంటూ మరికొంత మొత్తం బదిలీ చేయించుకున్నారు. ఇలా మొత్తం రూ.8,75,148 పెట్టుబడి పెట్టించిన కేటుగాళ్లు ఆమెను మోసం చేశారు. దీనిపై బాధితురాలి ఫిర్యాదుతో సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదైంది. ఏసీపీ ఆర్‌జీ శివ మారుతి నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ ఎం.సీతారాములు తమ బృందంతో ఈ కేసు దర్యాప్తు చేశారు. బాధితురాలు నగదు డిపాజిట్ చేసిన బ్యాంకు ఖాతాల ఆధారంగా దర్యాప్తు చేసిన అధికారులు ఈ మొత్తంలో కొంత నగరానికి చెందిన కొన్ని సంస్థల పేర్లతో తయారు చేసిన ఖాతాల్లోకి వెళ్లినట్లు గుర్తించారు. దీంతో వీటిని ఓపెన్ చేసిన నగరవాసులు మనోజ్ దివాకర్, నాగిరి విజయ్, సనపర్తి కిషోర్ బాబు, రంగారెడ్డి జిల్లాకు చెందిన టి.సంతోష్‌కుమార్‌లను అరెస్టు చేశారు. వీళ్లు సైతం టెలిగ్రాం యాప్ ద్వారానే ఆకర్షితులపై ప్రధాన సూత్రధారులతో జట్టుకట్టినట్లు వెలుగులోకి వచ్చింది. తాము ఓపెన్ చేసిన ఖాతాలకు సంబంధించిన వివరాలను వారికి పంపినట్లు అంగీకరించారు. ఈ నలుగురినీ అరెస్టు చేసిన పోలీసులు సూత్రధారుల కోసం గాలిస్తున్నారు.

లారీ ఢీకొని హెడ్‌కానిస్టేబుల్ దుర్మరణం

- రహదారిపై ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తుండగా ప్రమాదం
- పెద్దషాపూర్ శివారులో జాతీయ రహదారిపై ఘటన


విజయ్‌కుమార్ (ఫైల్)

శంషాబాద్ రూరల్: రహదారిపై ఆగి ఉన్న వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్ ను క్రమబద్ధీకరిస్తుండగా.. మృత్యురూపంలో దూసుకొచ్చిన లారీ హెడ్ కానిస్టేబుల్‌ను బలిగొంది. మండలంలోని పెద్దషాపూర్ సమీపంలో శనివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బెంగళూరు జాతీయ రహదారిపై షాద్‌నగర్ నుంచి శంషాబాద్ వైపు వెళ్తున్న లారీ పెద్దషాపూర్ శివారులో రోడ్డు కిందికి దూసుకెళ్లడంతో రహదారిపై ట్రాఫిక్ సమస్య తలెత్తింది. సమాచారం అందుకున్న హైవే ప్యాట్రోలింగ్ సిబ్బంది యాదయ్య, శ్రీనివాస్ అక్కడికి చేరుకున్నారు. అదే సమయంలో శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందడంతో హెడ్ కానిస్టేబుళ్లు డి.విజయ్‌కుమార్, డి.చెన్నయ్య కూడా అక్కడికి వెళ్లారు. రోడ్డు కిందకు వెళ్లిన లారీ డ్రైవర్‌తో మాట్లాడి.. ట్రాఫిక్‌కు నియంత్రిస్తున్నారు. అదే సమయంలో షాద్‌నగర్ వైపు నుంచి శంషాబాద్ వస్తున్న లారీ అతి వేగంగా రెండు పెట్రోల్ మొబైల్ వాహనాలను ఢీకొడుతూ.. అక్కడే నిలబడి ఉన్న పోలీసులను ఢీకొట్టింది. ఈ ఘటనలో హెడ్‌కానిస్టేబుల్ విజయ్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. హైవే ప్యాట్రోల్ మొబైల్ సిబ్బంది యాదయ్య, శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. తాగిన మత్తులో లారీని అతి వేగంగా నడుపుతూ ఈ ప్రమాదానికి కారణమైన డ్రైవర్ రమేష్ కాంబ్లెను అదుపులోకి తీసుకున్నారు. విజయ్‌కుమార్ మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నెలరోజుల క్రితమే ప్రమోషన్..

ఏడాది క్రితమే శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చిన విజయ్‌కుమార్‌కు నెల కిందట హెడ్ కానిస్టేబుల్‌గా ప్రమోషన్ వచ్చింది. అతడి మృతితో పోలీస్‌స్టేషన్‌లో విషాదచాయలు అలముకున్నాయి.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య


ప్రభాకర్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మెదక్ జిల్లాకు చెందిన ప్రభాకర్(38) నగరానికి వలస వచ్చి గుండ్లపోచంపల్లిలోని లక్ష్మీనగర్‌లో నివాసముంటున్నాడు. అతనికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. తాగుడుకు బానిసైన ప్రభాకర్ రోజూ భార్యతో గొడవపడేవాడు. ఈ నెల 23న రాత్రి కూడా అతను మద్యం మత్తులో ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడ్డాడు. ఈ విషయం తెలియడంతో అతని బావమరుదులు వచ్చి భార్యను ఇంటికి తీసుకువెళ్లారు. దీంతో మనస్తాపానికి లోనైన ప్రభాకర్ బెడ్‌రూమ్‌లోకి వెళ్లి సీలింగ్‌ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీ కొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

సికింద్రాబాద్: రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదివారం మధ్యాహ్నం ఘట్‌కేసర్, చర్లపల్లి రైల్వే స్టేషన్ల మధ్య యమ్నంపేట్ బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సదరు వ్యక్తి రైలు పట్టాల పక్కన నడుస్తుండగా ప్రమాదవశాత్తు గుంటూరు నుంచి సికింద్రాబాద్ వస్తున్న 7201 గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి వయస్సు 65 ఏళ్లు ఉండవచ్చునని, అతవి పూర్తి వివరాలు తెలియరాలేదన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

ప్రాణం తీసిన నిర్లక్ష్యం

కారు ఢీ కొని బాలుడి మృతి


విజయరాజ్ (ఫైల్)

మైదిపల్లి: ఓ వ్యక్తి నిర్లక్ష్యం బాలుడి మృతికి కారణమైన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.పర్వతాపూర్ భూ లక్ష్మీనగర్ కాలనీకి చెందిన చౌహాన్ రాజ్‌కుమార్ కుమారుడు విజయరాజ్(1.5) శనివారం రాత్రి ఇంటి బయట ఆడుకుంటున్నాడు. అదే సమయంలో పక్కింట్లో నివాసం ఉంటున్న శ్రీనాథ్ అనే వ్యక్తి తన కారును నిర్లక్ష్యంగా నడుపుతూ చిన్నారి మీదుగా దూసుకెళ్లాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన విజయ్‌ని సమీపంలోని ప్రైవేట్ అసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. చిన్నారి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రమాదానికి కారణమైన శ్రీనాథ్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వామపక్ష పార్టీలు ఏకం కావాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సాక్షి,సిటీబ్యూరో: ఎర్రకోటపై ఎర్రజెండా ఎగురవేసే లక్ష్యంగా స్వల్ప విభేదాలతో వేర్వేరుగా కొనసాగుతున్న వామపక్ష పార్టీలన్నీ ఏకమై ముందుకు రావాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఈసీఐఎల్ బంజారా ఫంక్షన్‌హాల్‌లో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దామోదర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మేడ్చల్‌జిల్లా 4వ మహాసభలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీఎస్ బోస్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. మతాలు, ప్రాంతాల పేరిట నీచ రాజకీయాలతో పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పనిచేస్తోందని విమర్శించారు. ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించేవారిపై తప్పుడు కేసులు పెడుతోందని ఆరోపించారు. వరవరరావు, దివంగత ప్రొఫెసర్ సాయిబాబా లాంటి వాళ్లను జైల్లో మగ్గేలా చేయడం సరికాదన్నారు. మావోయిస్టులు చర్చలకు సిద్ధమని వారు కోరుతున్నా.. అవకాశం ఇవ్వడం లేదన్నారు. పలు హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దలేక ఊబిలో కూరుకుపోయిందన్నారు. ప్రభుత్వం అన్ని పథకాలు అర్హులందరికీ దక్కేలా సీపీఐ శ్రేణులు పోరాటం చేయాలన్నారు.

- చట్టసభల్లో బలహీనంగా ఉన్నప్పటికీ అన్ని వర్గాల సమస్యలపై పోరాటాలతో ముందుకెళ్లే సత్తా సీపీఐకి మాత్రమే ఉందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. కార్మిక, కర్షక వ్యతిరేక చట్టాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని విమర్శించారు. సీపీఐ నేతలు వీఎస్ బోస్, ఎండీ యూసుఫ్ మాట్లాడారు. మహాసభ ప్రారంభానికి ముందు ఈసీఐఎల్ చౌరస్తా నుంచి మౌలాలి వరకు సీపీఐ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు.

కాన్సులేట్‌కు కుచ్చుటోపీపై డిస్కం ఆరా!

సాక్షి, రంగారెడ్డిజిల్లా: భూగర్భ విద్యుత్ లైన్ల (యూజీ కేబుల్స్) ఏర్పాటు పేరుతో సైబర్‌సిటీ సర్కిల్ పరిధిలోని ఓ కాన్సులేట్ కార్యాలయానికి ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు కలిసి కుచ్చుటోపీ పెట్టిన అంశంపై దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ఆరా తీసినట్లు తెలిసింది. ఈ అంశంపై సమగ్ర విచారణకు ఆదేశించినట్లు సమాచారం. గచ్చిబౌలి, నానక్‌రాంగూడ సబ్‌స్టేషన్ల నుంచి కాన్సులేట్‌కు రెండు మార్గాల్లో యూజీ కేబుళ్లు వేసిన విషయం తెలిసిందే. అంచనాలను అడ్డగోలుగా పెంచడంతో పాటు ట్రెంచ్ వేయకుండానే వేసినట్లు చూపించిన వైనంపై ఇటీవల ‘సాక్షి’లో ‘కాన్సులేట్‌కు కరెంట్ షాక్’ శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విధితమే. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ సహా పర్యవేక్షించిన ఇంజనీర్లు ఈ కథనంతో ఉలిక్కిపడ్డారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి, తుది నివేదికను అందజేయాల్సిందిగా సీఎండీ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

బడి బస్సు..భద్రమేనా?

మరి కొద్ది రోజుల్లో తెరుచుకోనున్న పాఠశాలల గేట్లు

- ఫిట్‌నెస్‌లేని బస్సులెన్నో.
- ఇప్పటికీ దృష్టి సారించని ఆర్టీఏ
- తరచూ వెలుగు చూస్తున్న ప్రమాదాలు
- ఆందోళనలో తల్లిదండ్రులు

హుడాకాంప్లెక్స్: కొత్త విద్యా సంవత్సరం మరికొద్ది రోజుల్లో ప్రారంభం కాబోతోంది. జూన్ 12 నుంచి బడిగేట్లు తెరుచుకోనుండగా అంతకు వారం రోజుల ముందు నుంచే ప్రైవేటు పాఠశాలల ద్వారాలు తెరుచుకోనున్నాయి. ఇంటికి సుదూరంగా ఉన్నా పిల్లల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు మంచి పాఠశాలను ఎంచుకుంటున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా నిత్యం ఉదయం, సాయంత్రం వేళ వారిని డ్రాప్‌చేయడం, పికప్ చేసుకోవడం లాంటి వెసులుబాటు అందరికీ లేకపోవడంతో చలావరకు స్కూలు బస్సులు, ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలోని మెజార్టీ ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు అడ్మిషన్లు, ఫీజు వసూళ్లపై చూపిస్తున్న శ్రద్ధ.. బడి బస్సులపై చూపడం లేదు. పాత వాహనాలకు కొత్తగా రంగులద్ది రోడ్లపై యథేచ్ఛగా తిప్పుతున్నాయి. తక్కువ వేతనానికి పనిచేసే ఎలాంటి అనుభవం, అర్హత లేని డ్రైవర్లను నియమించుకుని పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. ఫిట్‌నెస్ లేని బస్సులపై ఆర్టీఏ కొరడా ఝుళిపించాల్సిందిపోయి.. యాజమాన్యాలు ఇచ్చే మామూళ్లకు కక్కుర్తిపడి కండిషన్ సరిగ్గా లేని బస్సులకు సైతం ఉన్నట్లు ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

50 శాతం స్కూలు బస్సుల వైపే..

జిల్లా వ్యాప్తంగా 40 ప్రైవేటు ప్రాథమిక పాఠశాలలు ఉండగా 5,240 మంది పిల్లలు విద్యాభ్యాసం సాగిస్తున్నారు. ఇక ప్రైవేటు ప్రాథమికోన్నత పాఠశాలలు 535 ఉండగా, వీటిలో 93,942 మంది పిల్లలు చదువుతున్నారు. వీరిలో 50 శాతం మంది విద్యార్థులు స్కూలు బస్సులను ఆశ్రయిస్తుండగా, మరో 25 శాతం మంది ఆటోలు, 15 శాతం మంది తల్లిదండ్రుల బైకులు, కార్లలో వస్తుంటారు. మిగిలిన వారు కాలినడకన ఆయా స్కూళ్లకు చేరుకుంటారు.

అనుభవ లేమి.. ఫిట్‌నెస్ లేక..

కనీస అనుభవం, అర్హత లేని వారిని డ్రైవర్లుగా నియమించుకోవడంతో పాటు ర్యాష్ డ్రైవింగ్, ఫిట్‌నెస్ లేని బస్సుల కారణంగా తరచూ ప్రమాదాలు వెలుగు చూస్తున్నాయి. చిన్నారుల మృత్యువాతకు, గాయాలపాలు కావడానికి కారణమవుతున్నాయి. గతంలో షాద్‌నగర్, హయత్‌నగర్, చేవెళ్ల, శంకర్‌పల్లి, ఇబ్రహీంపట్నంలో పలు ప్రమాదాలు జరగడం.. అమాయక చిన్నారులు బస్సు చక్రాల కింద నలిగిపోయిన సంఘటనలు వెలుగుచూశాయి. ఏదైనా ఘటన జరిగినప్పుడు మాత్రమే ఆర్టీఏ అధికారులు హడావుడి చేస్తున్నారు. తర్వాత బడి బస్సుల భద్రతను గాలికొదిలేస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతూనే తప్పనిసరి పరిస్థితుల్లో తమ పిల్లలను బస్సుల్లో పంపిస్తున్నారు.

క్లుప్తంగా...

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


కార్మికులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఫిలింనగర్‌: పెరికె ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఫిలిం చాంబర్‌లోని ప్రొడ్యూసర్స్‌ కౌన్సిల్‌ హాల్‌లో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సినీ నటి అలేఖ్యతో పాటు పెరికె ఫౌండేషన్‌ ఫౌండర్‌ వర ప్రసాదరావు ప్రారంభించారు. సినీ కార్మికులకు బీపీ, షుగర్‌తో పాటు డెంటల్‌, కంటి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాట రూ.15, నల్లవంకాయ.18, పొడుగువంకాయ.18, బెండకాయ.35, పచ్చి మిర్చి.40, బజ్జిమిర్చి.35, క్యాప్సికం.45, పచ్చికాకరకాయ.35, పందిరిబీర.45, క్యాబేజీ.13, క్యారెట్‌.31, దొండకాయ.15, గుండు బీన్నీస్‌.65, గింజచిక్కుడు.40, గోకరకాయ.23, కీర.15, దోసకాయ.19, బీట్‌రూట్‌.21, ఉల్లిగడ్డ.16, ఆలుగడ్డ.24, చామగడ్డ.35, మొరంగడ్డ.18, కందగడ్డ.35, క్యాలిఫ్లవర్‌.23, సొరకా య.9, పొట్లకాయ.18, అరిటికాయ.10, మునగకాయ.4, మామిడికాయ.40, ముల్లంగి.4-5, ఉల్లిపొరక.40. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

కాంగ్రెస్‌ మహిళా కమిటీ ఎన్నిక


బిందియా జైస్వాల్‌


బికె.సుజాత

హిమాయత్‌నగర్‌ : ఖైరతాబాద్‌ డిస్ట్రిక్‌ కాంగ్రెస్‌ మహిళా కమిటీ ప్రధాన కార్యదర్శిగా బిందియా జైస్వాల్‌, వైస్‌ ప్రెసిడెంట్‌గా సుజాత, కార్యనిర్వాహక కార్యదర్శిగా పూర్ణిమా ను నియమిస్తూ ఖైరతాబాద్‌ డిస్ట్రిక్‌ అధ్యక్షురాలు ఉషాశ్రీ శ్రీకాంత్‌ గౌడ్‌ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు సునీత, సీనియర్‌ నాయకులు పాల్గొన్నారు.

మహా సభను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న సంఘం ప్రతినిధులు

సుల్తాన్‌బజార్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ ఫ్రీ బస్సుతో ఆటో డ్రైవర్ల జీవనోపాధికి కరువైందని తెలంగాణ యునైటెడ్‌ ఆటో ఓనర్స్‌ అండ్‌ డ్రైవర్స్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్‌ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటో డ్రైవర్లు అప్పులు తెచ్చి ఫైనాన్స్‌లో ఆటో కొనుకొన్ని బతుకుతున్నామని, ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్సు పెట్టడంతో తమ జీవనోపాధి కరువైందన్నారు. తమ సమస్యలపై తెలంగాణ రాష్ట్రంలో నాన్‌పొలిటికల్‌ జేఏసీగా ఏర్పడి ఆటో డ్రైవర్ల సమస్యలపై పోరాడుతున్నామన్నారు. ఏప్రిల్‌ 25న మెదక్‌ జిల్లా నుంచి 33 రోజుల పాటు తెలంగాణలో 100 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఆటో పాద యాత్ర ప్రారంభించామని తెలిపారు. ఈ నెల 27న హైదరాబాద్‌ ఇందిరాపార్కు వద్ద ఆటో ఆకలి కేకలు పేరిట మహా సభ నిర్వహిస్తున్నామని, దానికి అన్ని ఆటో సంఘాల నాయకులు అతిథులుగా రానున్నట్లు తెలిపారు. ఆటో డ్రైవర్లు ఈ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వేముల మారయ్య, ప్రవీణ్‌, వెంకటేశ్వర్లు, ముఖేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సమాజానికి బాల సాహిత్యం ఎంతో అవసరం

సుల్తాన్‌బజార్‌: ఉత్తమ సమాజానికి బాల సాహిత్యం ఎంతో అవసరమని వక్తలు అభిప్రాయపడ్డారు. శాంత వసంత ట్రస్ట్‌ సౌజన్యంతో తెలంగాణ సారస్వత పరిషత్‌లో ఆదివారం నిర్వహించిన కోడూరు శాంతమ్మ స్మారక బాలసాహిత్య సమ్మేళనం సందడిగా సాగింది. పరిషత్‌ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన సాగిన సమ్మేళనంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 150 మంది ప్రతినిధులు, 65 మంది వక్తలు పాల్గొన్నారు. శాంతా వసంత ట్రస్ట్‌ అధినేత పద్మభూషణ్‌, డాక్టర్‌ కేఐ.వరప్రసాద రెడ్డి బాల సాహిత్య రంగంలో విశిష్ట సేవలందిస్తున్న రెండు రాష్ట్రాలకు చెందిన బాల సాహితీ వేత్తలు, ఉపాధ్యాయులను సత్కరించి రూ.2500 నగదు, శాలువా, జ్ఞాపికతో గౌరవించారు. పరిషత్‌ ప్రధాన కార్యదర్శి డాక్టర్‌ జె.చెన్నయ్య స్వాగతోపాన్యాసం చేశారు.

అనుమతుల్లేకుండానే..!

ఇష్టారాజ్యంగా రోడ్డు కటింగ్‌లు
- రాకపోకలకు వాహనదారుల ఇబ్బందులు
- మరోవైపు ఆదాయం కోల్పోతున్న జీహెచ్‌ఎంసీ
- పట్టని సంబంధిత శాఖల అధికారులు


సోమాజీగూడ కీర్తిలాల్‌ జ్యువెలర్‌ పక్కన తవ్విన రోడ్డు



బంజారాహిల్స్‌ రోడ్డు నంబర్‌-14లో తవ్విన రోడ్డు

బంజారాహిల్స్‌: అడ్డదిడ్డంగా..అనుమతుల్లేకుండా చేస్తున్న రోడ్డు కటింగ్‌లతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత 4 నెలలుగా బంజారాహిల్స్‌, జూబ్లీహిల్స్‌, వేంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్‌, శ్రీనగర్‌కాలనీ, ఫిలింనగర్‌ ప్రాంతాల్లోని రోడ్డు కటింగ్‌లు స్థానికులకు నరకాన్ని చూపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం ఎక్కడైనా పైప్‌లైన్‌, కేబుల్‌ వైర్లు వేయాలన్నా రోడ్డు తవ్వాలంటే జీహెచ్‌ఎంసీ అనుమతి తప్పనిసరి. అందుకు రుసుం కూడా చెల్లించాలి. ఆ తర్వాత ట్రాఫిక్‌ పోలీసుల నుంచి ఎన్‌ఓసీ తీసుకోవాలి. కానీ ఇవేమీ లేకుండానే ఇష్టారాజ్యంగా రోడ్లను తవ్వుతుండడంతో వాహనదారులు పడుతున్న పాట్లు పడుతున్నారు. సోమాజీగూడ రాజీవ్‌గాంధీ చౌరస్తా నుంచి వరదనీటి పైప్‌లైన్ల నిర్మాణానికి ఏఈ రోడ్డు తవ్వి గాలికొదిలేశారు. కీర్తిలాల్‌ జ్యువెలర్స్‌ పక్క నుంచి తవ్విన రోడ్డులో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- బంజారాహిల్స్‌ రోడ్డునంబర్‌-12లో ఇటీవల ఓ భవన యజమాని స్థానిక నేతలతో ములాఖత్‌ అయ్యి జీహెచ్‌ఎంసీ అనుమతి లేకుండానే సీవరేజీ పైప్‌లైన్‌ కోసం రోడ్డును తవ్వాడు. ఈ వ్యవహారంలో లీడర్లకు లక్షలాది రూపాయలు ముట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఫిర్యాదు అందుకున్న జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు వేసిన పైపులను తొలగించి చేతులు దులుపుకున్నారు. ఇప్పటిదాకా రిస్టోరేషన్‌ జరగలేదు.
- బంజారాహిల్స్‌ రోడ్డునంబర్‌-12లోనే అగ్రసేన్‌ చౌరస్తా నుంచి కమాండ్‌ కంట్రోల్‌ మీదుగా వేమిరెడ్డి ఎన్‌క్లేవ్‌ యాక్ట్‌ ఫైబర్‌ నెట్‌ కేబుల్‌ కోసం సీసీ రోడ్డును ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండానే తవ్వేస్తున్నారు.
- బంజారాహిల్స్‌ రోడ్డునంబర్‌-1లో తాజ్‌కృష్ణా ఎదుట ఏఐజీ ఆస్పత్రి ఎదుట ఎలక్ట్రికల్‌ కేబుల్‌ కోసం రోడ్డు తవ్వారు.
- జూబ్లీహిల్స్‌ రోడ్డునంబర్‌-10 లో కూడా యాక్ట్‌ ఫైబర్‌ నెట్‌ కూడా రోడ్డు తవ్వకాలు చేపట్టింది.
- ఫిలింనగర్‌లోని న్యాయ విహార్‌కు తాగునీటి పైప్‌లైన్‌ నిర్మాణం కోసం ఆర్‌ అండ్‌బీ ఎలాంటి అనుమతులు లేకుండానే రోడ్డు తవ్వుతోంది.
- జూబ్లీహిల్స్‌ రోడ్డునంబర్‌-25లో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ రోడ్డులో తాగునీటి పైప్‌లైన్‌ నిర్మాణానికి జలమండలి రోడ్డు తవ్వకాలు చేపట్టింది.
- బంజారాహిల్స్‌ రోడ్డునంబర్‌-14లో సాయి రాఘవేంద్ర అపార్ట్‌మెంట్‌కు తాగునీటి పైప్‌లైన్‌ కోసం అడ్డంగా రోడ్డు తవ్వుతున్నారు.
- చాలామంది రోడ్డు కటింగ్‌ అనుమతుల్లేకుండానే, జీహెచ్‌ఎంసీకి రుసుం చెల్లించకుండానే తవ్వకాలు చేపడుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. ఖైరతాబాద్‌ నియోజకవర్గ పరిధిలోని సర్కిల్‌-17, సర్కిల్‌-18 పరిధిలో వివిధ సంస్థలు 28 చోట్ల రోడ్డు తవ్వకాలు చేపట్టాయి. ఓవైపు కుండపోత వర్షంతో వరద ఈ గుంతల్లో నిలిచి ప్రమాదాలు జరుగుతున్నాయి.
- తవ్విన చోట వెంటనే జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు రిస్టోరేషన్‌ పనులు చేపట్టాలి. కానీ కొన్ని సంస్థలు డబ్బులు చెల్లించకపోవడంతో జీహెచ్‌ఎంసీ ఆ పనుల వైపు తొంగి చూడడం లేదు.
- జీహెచ్‌ఎంసీలో విజిలెన్స్‌ విభాగం ఉంటుంది. ఇలా అడ్డగోలు తవ్వకాలు జరుగుతుంటే ఈ అధికారులు ఏం చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.
- పలుమార్లు ఇంజినీర్లు హెచ్చరిస్తోన్నా తవ్వకాలు చేపడుతున్న ప్రభుత్వ రంగ సంస్థల అధికారులు పెడచెవిన పెడుతున్నారు.

వేంకటేశ్వరనగర్‌లో సీసీ రోడ్డు పనులు షురూ

సాక్షి ఎఫెక్ట్‌..



వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్‌ రోడ్డు నంబర్‌-14లోని వేంకటేశ్వర నగర్‌ లంబాడాబస్తీలోని 5 గల్లీల్లో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.35 లక్షల నిధులు మంజూరు కాగా రోడ్డును తవ్వి వదిలేశారు. దీంతో 3 రోజుల క్రితం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జీహెచ్‌ఎంసీ సర్కిల్‌-18 ఇంజినీర్లు స్పందించారు. శనివారం రాత్రి వేంకటేశ్వరనగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు.

జీహెచ్‌ఎంసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


నరేందర్‌ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హిమాయత్‌నగర్‌ : జీహెచ్‌ఎంసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు ఆదిల్‌ షరీఫ్‌, ప్రధాన కార్యదర్శి ఆర్‌.డి.చంద్రశేఖర్‌, ఎం.రాజ్‌ రెడ్డి నేతృత్వంలోని బృందం ఆదివారం ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌ రెడ్డికి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆయన సానుకూలంగా స్పందించారని, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌తో సమావేశం ఏర్పాటు చేసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారని వారు తెలిపారు.

ప్రధాని మోదీ 'మన్‌కీ బాత్‌' వీక్షించిన శ్రేణులు


వీక్షిస్తున్న చింతల రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే హరీశ్‌ బాబు, జి.మాధవి తదితరులు

హిమాయత్‌నగర్‌ : హిమాయత్‌నగర్‌ డివిజన్‌ బీజేపీ అధ్యక్షురాలు జి.మాధవి అధ్యక్షతన స్థానిక మధులిక అపార్ట్‌మెంట్‌లో ఆదివారం ప్రధాని మోదీ 'మన్‌ కీ బాత్‌' 122వ ఎపిసోడ్‌ను రు.వీక్షించారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే, బీజేపీ స్టేట్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ చింతల రామచంద్రా రెడ్డి, సిర్పూర్‌ ఎమ్మెల్యే డాక్టర్‌ పాల్వాయి హరీశ్‌ బాబు, తెలంగాణ రాష్ట్ర బిజెపి ఆఫీషియల్‌ స్పోక్స్‌ పర్సన్‌ ఎన్‌.వి. సుభాష్‌ హాజరై వీక్షించారు. కార్యక్రమంలో హిమాయత్‌నగర్‌ డివిజన్‌ బీజేపీ మాజీ అధ్యక్షుడు కె.నర్సింగ్‌ ముదిరాజ్‌, నాయకులు నరహరి, కె.కవిత, పద్మజ, నవీన్‌, నర్సింగ్‌ గౌడ్‌, వాణి ముదిరాజ్‌, శ్రీనివాస్‌ ముదిరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా కూల్చేసిన ప్రాంతాన్ని పరిశీలించిన తహసీల్దార్‌


హైడ్రా కూల్చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్‌ అనితారెడ్డి

బంజారాహిల్స్‌: జూబ్లీహిల్స్‌ రోడ్డునంబర్‌-41లో పెద్దమ్మగుడి సమీపంలో ఇంటిని అద్దెకు తీసుకున్న వ్యక్తి దాని పక్కన ఉన్న రోడ్డుతో పాటు నాలాను కబ్జా చేయగా హైడ్రా అధికారులు ఈనెల 23న ఆక్రమణలు నేలమట్టం చేసి పార్కుకు దారి చూపించారు. అయితే ఈ స్థలాన్ని పరిశీలించి నివేదిక ఇవ్వాలని హైదరాబాద్‌ జిల్లా కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టి ఆదేశాల మేరకు షేక్‌పేట తహసీల్దార్‌ అనితా రెడ్డి స్థలాన్ని ఆదివారం పరిశీలించారు. రోడ్డుతో పాటు నాలాను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లుగా గుర్తించారు. జూబ్లీహిల్స్‌ సొసైటీలోని 709 గజాల స్థలం కబ్జాకు గురైనట్లు తేల్చారు. సర్వేయర్‌, వీఆర్వోతో హైడ్రా కూల్చివేసిన ప్రాంతాన్ని సర్వే చేయగా ఆక్రమణలు జరిగింది నిజమేనని తేలినట్లు వెల్లడించారు. కే శ్రీనివాసరావు అద్దెకు దిగి సొసైటీకి చెందిన ఖాళీ స్థలాన్ని కబ్జా చేసినట్లుగా గుర్తించారు. జీహెచ్‌ఎంసీ అధికారులు ఈ ఓపెన్‌ ప్లాట్‌ను వెంటనే స్వాధీనం చేసుకుని చుట్టూ ఫెన్సింగ్‌ ఏర్పాటు చేసి మళ్లీ కబ్జా కాకుండా చూడాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు సమాచారం ఇచ్చామని ఆమె తెలిపారు.

పనులు పూర్తయినా.. వ్యర్థాలు అక్కడే..!

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్‌ నంబర్‌-12 లోని ఎమ్మెల్యే కాలనీ చర్చి నుంచి ఎన్బీటీ నగర్‌ వెళ్లే దారిలో కొన్ని రోజుల క్రితం జీహెచ్‌ఎంసీ అధికారులు సీసీ రోడ్డు వేశారు. రోడ్డు క్యూరింగ్‌ చేసేందుకు పెద్ద వాహనాలు వెళ్లకుండా మట్టి కుప్పలు పోశారు. అయితే పనులు పూర్తయి వారం రోజులుగా రాకపోకలు కూడా సాగుతున్నాయి. కానీ ఇప్పటివరకు ఇక్కడ పోసిన మట్టికుప్పలను మాత్రం జీహెచ్‌ఎంసీ సిబ్బంది తొలగించలేదు. ఫలితంగా రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నామంటూ ఎన్బీటీనగర్‌వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టికుప్పలు తొలగించాలని వారు కోరుతున్నారు.


ఎమ్మెల్యే కాలనీ చర్చి నుంచి ఎన్బీటీనగర్‌ వెళ్లేదారిలో మట్టి కుప్పలు

ఆరు దశాబ్దాలుగా భారత్‌, జపాన్‌ స్నేహబంధం


పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న వసుంధర, శ్రీనివాస్‌, రజిత్‌

హిమాయత్‌నగర్‌ : హైదరాబాద్‌, హికోన్‌, జపాన్‌ నగరాల మధ్య స్నేహ సంబంధాలు ఆరు దశాబ్దాలుగా కొనసాగడం అభినందనీయమని భారత్‌ బయోటెక్‌ గ్రూప్‌ ఫైనాన్స్‌ ఆఫీసర్‌ తాడేపల్లి శ్రీనివాస్‌ అన్నారు. నారాయణగూడలోని ఓ హోటల్‌లో నవ్య నాటక సమితి, హైదరాబాద్‌ వైస్‌ మెన్‌ క్లబ్‌ సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉపసంచాలకురాలు జి.వసుంధరతో కలిసి పర్యటనకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఈ నెల 29 నుంచి 10 రోజుల పాటు జపాన్‌లోని నగోయా, ఉట్సునోమియా నగరాల్లో కూచిపూడి నృత్య ప్రదర్శనకు వెళ్లనున్న హైదరాబాద్‌ నృత్య కళాకారులు కళారత్న మాధవీమాల, రేణి శ్రీజిత్‌, బి.ఎస్‌.మేఖల సత్కరించి వారు మాట్లాడారు. కార్యక్రమంలో వేమరాజు విజయ్‌ కుమార్‌, కె.చక్రపాణి, మధుమతి కులకర్ణి, ఆర్‌.ఎన్‌.సుధారాణి, బి.వి. నారాయణరావు, హెచ్‌.హరనాథ్‌ బాబు, బాలాజీ శర్మ, సి.కృష్ణ కన్నారావు పాల్గొన్నారు.

ఘనంగా ఇప్టా 83వ ఆవిర్భావ దినోత్సవం


జెండా ఎగురవేస్తున్న కందిమల్ల ప్రతాప్‌ రెడ్డి

హిమాయత్‌నగర్‌ : తెలంగాణ ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో సత్యనారాయణ రెడ్డి భవన్‌ వద్ద అఖిల భారత ప్రజా నాట్య మండలి (ఇప్టా) 83వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇప్టా జాతీయ ఉపాధ్యక్షుడు కందిమల్ల ప్రతాప్‌ రెడ్డి హాజరై జెండా ఎగురవేసి మాట్లాడారు. 1943 మే 25న ఇప్టా ప్రారంభమైందన్నారు. యుద్ధాలకు వ్యతిరేకంగా అటు స్వాతంత్ర్య పోరాటంలో, తెలంగాణ సాయుధ రైతాంగ పోరులో కళారూపాలను తయారుచేసి జన చైతన్యంలోకి ఊతమిచ్చిన సంస్థ ప్రజా నాట్య మండలి అని అన్నారు. అనంతరం ప్రముఖ విప్లవ నటులు దర్శకులు మాదాల రంగారావు జయంతి సందర్భంగా ఎర్రమల్లెలు, ఎర్ర సూర్యుడు, విప్లవ శంఖం సినిమాలోని పాటలు పాడుతూ నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్ద శ్రీనివాస్‌, ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, ఉపాధ్యక్షులు కన్నం లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శి కేతరాజు ఉప్పలయ్య, కార్యవర్గ సభ్యులు డి.వేణుగోపాల్‌ చారి, జనసేవా దళ్‌ నాయకులు మురళీకృష్ణ, ఏఐవైఎఫ్‌ హైదరాబాద్‌ నాయకులు కాంపల్లి కల్యాణ్‌, పెరిమళ అనిల్‌ కుమార్‌, కళాకారులు రాము, శేఖర్‌, విజయ్‌ కుమార్‌, సరస్వతి భాస్కర్‌, మహేశ్‌, పరశురాం, రమేశ్‌ పాల్గొన్నారు.

ఖాళీ స్థలం కబ్జాకు యత్నం..!


జీహెచ్‌ఎంసీ స్థలంలో ఏర్పాటు చేసిన కంటైనర్‌

ఫిలింనగర్‌: జూబ్లీహిల్స్‌ రోడ్డునంబర్‌-82/1లోని ఫిలింనగర్‌ దైవ సన్నిధానం, ఫిలించాంబర్‌ ఎదుట జూబ్లీహిల్స్‌ సొసైటీలో జీహెచ్‌ఎంసీకి ఖరీదైన ఖాళీ స్థలం ఉంది. అయితే ఈ స్థలంలో గుర్తుతెలియని వ్యక్తులు ఓ కంటైనర్‌ను ఏర్పాటు చేశారు. అలాగే ఓ నేత ఇంట్లో పనిచేసే పని మనుషుల కోసం బాత్‌రూమ్‌లు కూడా నిర్మించినట్లుగా ఫిర్యాదులు అందుతున్నాయి. జీహెచ్‌ఎంసీ స్థలం చుట్టూ ఫెన్సింగ్‌ ఏర్పాటుచేసి ఉంటే కబ్జాదారుల కన్ను పడకపోయి ఉండేదని కాలనీవాసులు పేర్కొంటున్నారు. నేడో రేపో ఈ స్థలానికి సంబంధించి బోగస్‌ డాక్యుమెంట్లు సృష్టించి జీహెచ్‌ఎంసీ నోటీసులు ఇస్తే కోర్టు నుంచి స్టే తెచ్చుకుని దర్జా వెలగబెట్టవచ్చని కబ్జాదారులు పథకం వేసినట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి కంటైనర్‌ను తొలగించి బాత్‌రూమ్‌లు కూల్చివేసి చుట్టూ ఫెన్సింగ్‌ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు ముందుకు సాగాలి


సభ్యత్వ నమోదు పుస్తకాలు ఆవిష్కరిస్తున్న మధుసూదనాచారి తదితరులు

పంజగుట్ట: రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలు ముందుకు సాగాలని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్‌ ఆధ్వర్యంలో కోటి బీసీ కార్యకర్తల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన మధుసూదనాచారి మాట్లాడుతూ.. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు ఇచ్చే పరిస్థితుల్లో ఉండాలి కానీ దరఖాస్తులు పెట్టుకుని అడుక్కునే స్థాయిలో ఉండడం బాధకరమన్నారు. బీసీలు ఐక్యమైతే, వారిలో చైతన్యం వస్తే అగ్రవర్ణాలవారికి అధికారం ఉండదనే భయంతోనే కులాల వారీగా విడదీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్‌ మాజీ చైర్మన్‌ డాక్టర్‌ వకుళాభరణం కృష్ణమోహన్‌ రావు మాట్లాడుతూ.. సభ్యత్వాల వల్ల బీసీల సమాచారం మొత్తం ఒక్కచోటే ఉంటుందన్నారు. రిటైర్డ్‌ ఐఏఎస్‌ అధికారి చిరంజీవులు మాట్లాడుతూ.. సభ్యత్వం తీసుకుని కోటి మందిని ఐక్యం చేస్తే రాజ్యాధికారం ఎంతో సులువు అవుతుందన్నారు.

బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్‌ మాట్లాడుతూ.. సాధారణ సభ్యత్వం, క్రియాశీలక సభ్యత్వం రెండూ ఉంటాయని క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న వారికి ప్రతీ 2 నెలలకు ఒకసారి నాయకుడిగా ఎదిగేందుకు శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంబీసీ కమిషన్‌ చైర్మన్‌ తాడూరి శ్రీనివాస్‌, బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆనంద్‌ గౌడ్‌, బీసీ సంఘం నాయకులు ఎర్ర సత్యనారాయణ, గుజ్జ కృష్ణ, వైద్యం రాజగోపాల్‌, బండారు పద్మావతి, భాగ్యలక్ష్మి, శారద, రవి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌..

సెల్‌ఫోన్‌ తస్కరించింది పాత నేరస్తుడే

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్డు నంబర్‌-12లోని నీలోఫర్‌ హోటల్‌ వెనుక ఖాళీ స్థలంలో మూత్ర విసర్జన చేసేందుకు వెళ్లిన టోలిచౌకీకి చెందిన యువకుడు షేక్‌ శెషావలీపై బీరు బాటిల్‌తో దాడి చేసి సెల్‌ఫోన్‌ తస్కరించిన నిందితులను బంజారాహిల్స్‌ పోలీసులు గుర్తించారు. ఎన్‌బీటీనగర్‌ బస్తీకి చెందిన సంతోష్‌ అలియాస్‌ బంగారం అనే డెలివరీ బాయ్‌ చోరీకి పాల్పడి పరారీలో ఉండగా క్రైం పోలీసులు గాలింపు చేపట్టారు. జొమాటో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్న సంతోష్‌ జల్సాలకు అలవాటు పడి గంజాయి మత్తు, ఈజీ మనీ కోసం అర్ధరాత్రి నిర్మానుష్య ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఒంటరిగా ఉండే యువకులను బెదిరించి డబ్బు, సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్నట్లుగా తేలింది. నిందితుడిపై బంజారాహిల్స్‌ పోలీస్‌స్టేషన్‌లో గతంలో ఓ కేసు కూడా నమోదై ఉంది. ఈ ఘటనలో పాల్గొన్న మరో యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా ప్రధాన నేరస్తుడి వివరాలు బయటపడ్డాయి. బంజారాహిల్స్‌ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

వెంగళరావునగర్‌: ఉద్యోగం ఇప్పిస్తానని యువకుడిని మోసం చేసిన ఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన పి.కాగేష్‌ స్థానిక జవహర్‌నగర్‌లో ఉంటూ ప్రైవేట్‌ జాబ్‌ చేస్తున్నాడు. గతేడాది అక్టోబర్‌ 15న రాయదుర్గంలోని ఓ సంస్థలో ఇంటర్వ్యూ కోసం వెళ్లగా డి.రాహుల్‌ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. సాఫ్ట్‌వేర్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.45 వేలు చెల్లించాలని కాగేష్‌కు చెప్పడంతో అతను పలు దఫాలుగా రాహుల్‌కు పంపాడు. అయితే 7 నెలలు గడిచినప్పటికీ ఉద్యోగం ఇప్పించకపోగా ఏం చేసుకుంటావో చేసుకో, డబ్బులు ఇవ్వను అంటూ బెదిరిస్తున్నాడు. దీంతో బాధితుడు ఆదివారం మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రంథాలయంలోకి వార్డు కార్యాలయం..!

రహమత్‌నగర్‌ : రహమత్‌నగర్‌ కూడలిలోని గ్రంథాలయంలోకి రహమత్‌నగర్‌ వార్డు కార్యాలయం మారనున్నది. ఇక్కడి లైబ్రరీ న్యూటన్‌ స్కూల్‌ వద్ద ఉన్న వార్డు కార్యాలయంలోకి తరలించే ప్రక్రియ జరుగుతోంది. రహమత్‌నగర్‌ వార్డు కార్యాలయం ప్రస్తుతం న్యూటన్‌ స్కూల్‌ వద్దనున్న జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీ హాల్లో కొనసాగుతోంది. అయితే ఈ కార్యాలయం కూడలికి దూరంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కార్పొరేటర్‌ సీఎన్‌ రెడ్డి వార్డు కార్యాలయాన్ని సెంటర్‌లో ఉన్న లైబ్రరీకి మార్చాలని కోరుతూ జీహెచ్‌ఎంసీ అధికారులతో పాటు హైద్రాబాద్‌ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ ఉపేందర్‌ రెడ్డికి విన్నవించగా వారు సుముఖత వ్యక్తం చేశారు. త్వరలోనే కార్యాలయాలు మార్చనున్నట్లు సీఎన్‌రెడ్డి తెలిపారు.



నగరంలో నేడు

- మాదాపూర్‌లోని నవోటెల్ హోటల్‌లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 8 గంటలకు హై లైఫ్ ఎగ్జిబిషన్ జరుగుతుంది.
- మిస్ వరల్డ్ ప్రారంభ వేడుకల్లో భాగంగా గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జానపద కళాకారుల ప్రదర్శన జరుగుతుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవుల సందర్భంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో 7విజన్స్ పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- వనస్థలిపురం గణేష్ టెంపుల్ సమీపంలోని రైతుబజార్ రోడ్ ఉన్న వనస్థలిపురం కమ్యూనిటీ గ్రౌండ్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ ఎక్స్‌పో అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

పోటెత్తి.. సందడి చేసి..

నెహ్రూ జూ పార్క్‌లో వీకెండ్‌లో రికార్డుస్థాయి సందర్శన

- అదనపు బుకింగ్ కౌంటర్ల ఏర్పాటు
- వేసవి సెలవులు, ఆహ్లాదకరమైన వాతావరణంతో పెరిగిన సందర్శకులు


జూ పార్క్ వద్ద గుంపులు గుంపులుగా సందర్శకులు

చార్మినార్: వేసవి సెలవులు.. ఆహ్లాదకరమైన వాతావరణం.. పైగా వీకెండ్.. రికార్డుస్థాయిలో పర్యాటకులు తరలివచ్చారు. నగరంలోని నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో సందడి నెలకొంది. పిల్లాపాపలు, పెద్దలు, యువత పెద్ద ఎత్తున తరలిరావడంతో కోలాహలం ఏర్పడింది. రకరకాల జంతువులు, పక్షుల విన్యాసాలను చూసి పిల్లలు కేరింతలు కొడుతూ ఆనందం వ్యక్తం చేశారు. వేసవి సెలవులతోపాటు వారం రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులతో పర్యాటకులు వివిధ పర్యాటక ప్రాంతాలను కుటుంబ సభ్యులతో కలిసి సందర్శిస్తూ సరదాగా గడుపుతున్నారు. ఇందులో భాగంగా ఈ ఆదివారం ఉదయం నుంచి వేసవి ఎండలు తగ్గి సాయంత్రం వాతావరణం చల్లబడటంతో జూపార్క్ సందర్శనకు అధిక సంఖ్యలో సందర్శకులు వచ్చారు. దాదాపు 24 వేల మంది జూ పార్కును సందర్శించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

భద్రతతో పాటు సౌకర్యాల పెంపు..

సందర్శకుల సౌకర్యార్థం అధికారులు జూ పార్కులోని ఎన్‌క్లోజర్ల వద్ద సిబ్బందిని పెంచడంతో పాటు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. వివిధ ప్రదేశాల్లో ఎక్కువ సంఖ్యలో భద్రతా సిబ్బందిని నియమించడం.. అదనపు బుకింగ్ కౌంటర్లను అందుబాటులోకి తేవడం.. బ్యాటరీతో పనిచేసే వాహనాలను ఎప్పటికప్పుడు సమకూర్చడం.. తాగునీటి యూనిట్లు తదితర అత్యవసర సౌకర్యాలకు సమకూర్చడం.. వంటివి చేపట్టారు.

ఇంట్లో జంతువులను చూసే అనుభూతి

194 కంటే ఎక్కువ జాతుల జంతువులతోపాటు దాదాపు 2,300 జంతువులకు నివాసంగా ఉంది మన జూ పార్క్. భారతదేశంలో జంతువులను బహిరంగ ఎన్‌క్లోజర్లలో జంతుశాస్త్ర క్రమంలో అమర్చిన మొదటి జూపార్క్ మనదే. మనకు దగ్గరగా సహజ వాతావరణంలో ఇటువంటి బహిరంగ ఎన్‌క్లోజర్లలోని జంతువులను ఇంట్లో ఉన్నట్లు చూసే అనుభూతి లభిస్తోంది సందర్శకులకు. అందుకే నగరంలోని జంతు ప్రదర్శనశాలకు సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. చిన్నా, పెద్దా అనే తారతమ్యం లేకుండా అందరూ సందర్శించడానికి ఇష్టపడతారని తెలంగాణ పార్క్స్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ ఎస్.హిరేమత్ తెలిపారు. జంతువులను వాటి ఆవాసాలను రక్షించడం, ప్రాముఖ్యతను నొక్కి చెప్పడం, సందర్శకులలో వన్యప్రాణుల సంరక్షణపై అవగాహనను ప్రోత్సహించడం కోసం పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ థీమ్ 'ఎండ్ ప్లాస్టిక్ కాలుష్యం'తో కలిసి నెహ్రూ జూలాజికల్ పార్క్ ప్రాంగణాన్ని ప్లాస్టిక్ రహితంగా చేశామన్నారు. ఈ విషయాన్ని జంతు ప్రేమికులకు చర్చా వేదికల ద్వారా అవేర్నెస్ చేస్తున్నామన్నారు.


బుకింగ్ కౌంటర్ల వద్ద పెరిగిన రద్దీ


సెల్ఫీలు తీసుకుంటున్న సందర్శకులు

'మాచన'కు జెనీవా ఆహ్వానం'

- మే 29న 'నో టుబాకో'కాన్ఫరెన్స్


అంతర్జాతీయ అవార్డు గ్రహీత రఘునందన్

కాచిగూడ: స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఈ నెల 29న జరిగే వరల్డ్ నో టుబాకో డే సదస్సుకు హైదరాబాద్ నగరానికి చెందిన పొగాకు నియంత్రణ అంతర్జాతీయ అవార్డు గ్రహీత, పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్‌కు ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా ఆదివారం కాచిగూడలో రఘునందన్ మాట్లాడుతూ ఈ సదస్సుకు భారతదేశం తరపున పాల్గొనే కొద్దిమంది వ్యక్తుల్లో తనకు అవకాశం దక్కిందని చెప్పారు. ఇటీవల ఓ ప్రమాదంలో గాయపడటంతో జెనీవాకు రాలేనిపక్షంలో ఆన్‌లైన్ సదస్సుకు హాజరు కావాలని నిర్వాహకులు చెప్పారని తెలిపారు. తన 22 ఏళ్ల పొగాకు నియంత్రణ కృషిని వివరిస్తూ 2 నిమిషాల నిడివితో ఉన్న వీడియోను ఇప్పటికే జెనీవా సదస్సుకు పంపించినట్లు చెప్పారు. పొగాకు ఉత్పత్తుల వాణిజ్యం వల్ల వచ్చే లాభాల కంటే.. వాటి వల్ల కలిగే జబ్బుల చికిత్సకే ప్రభుత్వం అధికంగా ఖర్చు చేస్తోందని రఘునందన్ అన్నారు. ప్రతి ఒక్కరూ పొగాకు, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటే.. ఆరోగ్యమే ఐశ్వర్యమని పేర్కొన్నారు. గత 5 ఏళ్లలో 5 వేల కిలోమీటర్లు ప్రయాణించి 50 వేల మందిని కలిసి పొగాకు నియంత్రణ ఆవశ్యకత వివరించిన తీరుతో జెనీవా సదస్సుకు హాజరు యోగ్యత కలిగిందని రఘునందన్ తెలిపారు.

చిత్రపురి కమిటీని రద్దు చేయాలని ధర్నా


ఇందిరాపార్కు వద్ద జరిగిన నిరాహార దీక్షలో పాల్గొన్న సినీ కార్మికులు

కవాడిగూడ: కోట్లాది రూపాయల అవినీతిలో కూరుకుపోయిన చిత్రపురి కమిటీని రద్దు చేసి దాని స్థానంలో అడహక్ కమిటీని నియమించి సినీ కార్మికులకు న్యాయం చేయాలని నవోదయం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు శివశంకర్ పటేల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిత్రపురి కమిటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్ అవినీతిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివారం నవోదయం పార్టీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో చిత్రపురిలో జరిగిన అవినీతిని బయటపెట్టి, నిజమైన సినీ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నిరాహారదీక్ష చేపట్టారు. శివశంకర్ పటేల్ మాట్లాడుతూ సింగిల్, డబుల్ బెడ్‌రూంలు నిర్మించి సినీ కార్మికులకు అందుబాటు ధరల్లో ప్లాట్లను విక్రయించాలని కోరారు. నిరాహారదీక్షలో సినీ దర్శకులు మద్దినేని రమేష్, కస్తూరి, శ్రీనివాస్, నటి రమావేణి,నాగరాజు, మల్లేష్, శ్రీను, రాజు, జగన్,రాములు, సీహెచ్ శ్రీనివాస్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ చేతుల్లోనే కేంద్రం: హరగోపాల్


మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కార్పొరేట్ చేతుల్లోనే కేంద్ర ప్రభుత్వం నడుస్తోందని ప్రొఫెసర్ హరగోపాల్ విమర్శించారు. బస్తర్‌లో చనిపోయినవారి శవాలను కూడా ఇవ్వడం లేదంటే ఈ సమాజం ఎటు పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఉద్యమాలు ఎలా ఉంటాయో, ప్రజలు ఎలా స్పందిస్తారో అర్థంకాని పరిస్థితి ఉందన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ విద్యావంతుల వేదిక మాజీ అధ్యక్షుడు గురిజాల రవీందర్ రచించిన ఎంబార్స్ ఆఫ్ కోల్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. హరగోపాల్ మాట్లాడుతూ బస్తర్‌లో చనిపోయిన తెలంగాణ, ఏపీకి చెందిన వారి శవాలను ప్రభుత్వం ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు. కోర్టులు కూడా సరైన రీతిలో స్పందించడంలేదని విచారం వ్యక్తం చేశారు. ప్రముఖ కవి ఏకే ప్రభాకర్ మాట్లాడుతూ ప్రశ్నించే ప్రతి ఒక్కరినీ దేశ ద్రోహులుగా ముద్ర వేస్తున్నారని అన్నారు. ఉద్యమం ఏమి నేర్పిస్తుందో ఎంబార్ ఆఫ్ కోల్‌లో తెలుస్తుందన్నారు. తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు నాగయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిపర్తి యాదయ్య, రాఘవాచారి, ఏభూషి ఆగయ్య, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఆదివారం గర్భగుడిలో అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రద్దీ నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు. మూల విరాట్‌ను పలు రకాల పూలతో అలంకరించారు.

బంజారా సేవా సంఘ్ జాతీయ అధ్యక్షుడిగా ఉమేష్‌జాదవ్

బంజారాహిల్స్: ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జాతీయ అధ్యక్షుడు కర్ణాటకలోని గుల్బర్గా మాజీ ఎంపీ ఉమేష్‌జాదవ్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జాతీయ కార్యవర్గ సమావేశం మింట్ కాంపౌండ్‌లోని గిరిజన భవన్‌లో ఆదివారం జరిగింది. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములునాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఉమేష్‌జాదవ్ మాట్లాడుతూ బంజారాల సమస్యలపై జాతీయ స్థాయిలో ఉద్యమించడానికి అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం హైదరాబాద్ అధ్యక్షుడు ధనరాజ్ రాథోడ్, సీనియర్ నాయకులు సుభాష్ నాయక్, సబావత్ రాజునాయక్, శ్యాంనాయక్, అమర్‌సింగ్ పవార్, గోపీసింగ్, కిషన్‌సింగ్, ఖమ్మం రాందాస్‌నాయక్, రవీందర్‌నాయక్, అశోక్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తుల ఆధునీకరణకు ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలి

పుస్తకావిష్కరణ సభలో దేవేందర్ గౌడ్



హిమాయత్‌నగర్: చేతివృత్తుల ఆధునీకరణ ఫలితాలు నిరుపేదలకు అందాలని, దీనిపై ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని మాజీ ఎంపీ తూళ్ల దేవేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. వెనకబడిన తరగతుల సాధికారత సంస్థ ఆధ్వర్యంలో ఆదివారంరాత్రి బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 'చేతివృత్తుల ఆధునీకరణ.. ప్రత్యామ్నాయం'పుస్తకావిష్కరణ సభ జరిగింది. పుస్తకాన్ని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వి.ఈశ్వరయ్య, విశ్రాంత ప్రొఫెసర్ ఇనుకొండ తిరుమలి, రచయిత ఇంద్రవెల్లి రమేష్‌తో కలిసి ఆవిష్కరించారు. చేతివృత్తులు లేనిదే నేటి సమాజం లేదని, ఆ వృత్తుల ఆధునీకరణతోనే దేశంలో నిరుద్యోగ సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందని దేవేందర్‌గౌడ్ అన్నారు. తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని స్పష్టం చేశారు. విశ్రాంత న్యాయమూర్తి ఈశ్వరయ్య మాట్లాడుతూ రాజ్యాధికారం సాధించినప్పుడే బీసీల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 75 నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయగా అగ్రవర్ణాలకు 53 పోస్టులు, జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు 22 పోస్టులు మాత్రమే కేటాయించారని విమర్శించారు. చట్టం చేయకుండానే బీసీ కులగణన సర్వే చేశారని, తెలంగాణ దేనిలో రోల్ మోడలో అర్థం కావడం లేదన్నారు. ప్రొఫెసర్ తిరుమలి మాట్లాడుతూ ప్రభుత్వాలు చేతివృత్తులపైనే ఆధారపడుతున్నాయని, ప్రభుత్వ ఆదరణ లేకున్నా చేతివృత్తులు నడుస్తున్నాయని పేర్కొన్నారు.

బీజేపీ తీరు సరిగా లేదు: వీరయ్య

సాక్షి,సిటీబ్యూరో: బీజేపీ వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్.వీరయ్య తీవ్రంగా ధ్వజమెత్తారు. భారత్, పాకిస్తాన్ మధ్య జరిగిన యుద్ధంలో పాకిస్తాన్ దుండగులు మన దేశ ప్రజలను కాల్పులతో చంపేసినా, మోదీ ప్రభుత్వం పాకిస్తాన్‌పై యుద్ధం ప్రకటించినట్టే ప్రకటించి నిలిపివేసిందన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యుద్ధం ఆపివేయాలని చేసిన ప్రకటనతో యుద్ధం విరమింపజేయటం అంటే భారతదేశాన్ని అమెరికాకు తాకట్టు పెట్టినట్టేనని ప్రజలు భావిస్తున్నారన్నారు. ఆదివారం నగరంలోని ఈసీఐఎల్ జిల్లా కేంద్ర పార్టీ కార్యాలయం హాలులో జరిగిన సీపీఎం జిల్లా పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. యుద్ధం ప్రారంభం, ముగింపు చేసేటప్పుడు అఖిలపక్షానికి తెలపకుండానే ట్రంప్ మాటలు వినటం సిగ్గుచేటని వీరయ్య విమర్శించారు. పేదలు, కార్మికులు, కర్షకులు రైతుల సమస్యలపై ఆందోళన పోరాటాలు చేయాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం, జిల్లా నాయకులు జె.చంద్రశేఖర్, కోమటి రవి, అశోక్, జి.శ్రీనివాసులు, ఐ.రాజశేఖర్, ఎం.శ్రీనివాస్, వెంకట్రామయ్య, రాథోడ్ సంతోష్, ఎం శంకర్, ఎం.నరేష్, వెంకన్న, లింగస్వామి పాల్గొన్నారు.

ప్రశాంతంగా సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష



బేగంపేట మహిళా డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రం వద్ద పోలీసుల బందోబస్తు

సనత్‌నగర్: యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష-2025 ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9.30 నుంచి 11.30 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు రెండు సెషన్లలో ఈ పరీక్ష నిర్వహించారు. పరీక్షా హాల్‌లోకి వెళ్లే అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపించారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను లోపలికి అనుమతించలేదు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి 144 సెక్షన్‌ను అమలు చేశారు. ట్రాఫిక్ నార్త్‌జోన్ పరిధిలో 8 పరీక్షా కేంద్రాల్లో 3,744 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. వెస్ట్‌జోన్ పరిధిలో ఏడు పరీక్షా కేంద్రాల్లో 2,907 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో నార్త్, వెస్ట్ జోన్ల పరిధిలోని ముఖ్యమైన జంక్షన్లతోపాటు పరీక్షా కేంద్రాలకు వెళ్లే రహదారుల్లో ట్రాఫిక్ సిబ్బందిని నియమించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. ప్రతి పరీక్షా కేంద్రం పరిసరాల్లో తాత్కాలిక నో పార్కింగ్ జోన్లను అమలుల్లోకి తీసుకువచ్చారు. అవసరమైన చోట్ల ట్రాఫిక్ మళ్లింపులు జరిపారు. పరీక్షా కేంద్రాల వద్ద తగినంత పార్కింగ్ సదుపాయాలు కల్పించారు.

కమ్యూనిస్టులు లేకుంటే దేశానికి భవిష్యత్తు ఉందా?

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని


అరుణ సంస్మరణ సభలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

సుందరయ్య విజ్ఞాన కేందం: 'నేడు కమ్యూనిస్టులకు భవిష్యత్తు లేదనడం కంటే, కమ్యూనిస్టులు లేకుంటే ఈ దేశానికి భవిష్యత్తు ఉందా'అనే విధంగా చర్చ జరగాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఐద్వా రాష్ట్ర నాయకురాలు సి.అరుణ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతాల కోసం పనిచేసిన గొప్ప నాయకురాలు అరుణ అని కొనియాడారు. దోపిడి, దౌర్జన్యం, అణగారిన వర్గాలపై అణచివేత తదితర అనేక సమస్యలతో దేశం కొట్టుమిట్టాడుతోందన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం అంకితభావంతో పనిచేసేది కమ్యూనిస్టులేనని అన్నారు. సోషలిస్టు విధానంతోనే మంచి సమాజం నిర్మితమవుతుందన్నారు. ఐద్వా రాష్ట్ర నాయకురాలు నాగలక్ష్మీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐద్వా ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ, జాతీయ నాయకురాలు ఎస్.పుణ్యవతి, సాంబిరెడ్డి, టి.జ్యోతి, ఎం.శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల జీవితాలు దుర్భరం

పంజగుట్ట: తెలంగాణ ఉద్యమంలో లాఠీదెబ్బలు తిన్నవారు దుర్భర జీవితాలు గడుపుతుంటే, ఉద్యమంతో సంబంధం లేనివారు ఆడంబరంగా జీవిస్తున్నారని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఫోరం అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 11 ఏళ్ల తరువాత కూడా ఇంకా ఆత్మగౌరవ పోరాటం చేయడం బాధాకరమన్నారు. తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నల గద్దర్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనందునే ఉద్యమకారులకు ఇంకా ప్రభుత్వం నుంచి పిలుపురాలేదని పేర్కొన్నారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, 25 వేల పింఛన్ ఇవ్వాలని, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి దానికి రూ.10 వేల కోట్లు కేటాయించాలని ఉద్యమకారుల ఫోరం తీర్మానించింది. కార్యక్రమంలో ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ కొండా స్వామి, వెంకట్‌రెడ్డి, దయానంద్, ఐలయ్య, శ్రీనివాస్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి ఖరీఫ్ పంటలపై ప్రచారం

ఏజీవర్సిటీ: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా రైతులకు వచ్చే ఖరీఫ్ పంటలపై ఈ నెల 29 నుంచి జూన్ 12వ తేదీ వరకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్) ఆధ్వర్యంలో (వీక్షిత్ కృషి సంకల్ప్ అభియాన్) ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు నార్మ్స్ డైరెక్టర్ గోపాల్‌లాల్ తెలిపారు. రైతుల్లో సాంకేతికత, ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించడంతోపాటు రైతుల అవసరాలు, సమాచారం తెలుసుకోనున్నారు. దేశంలోని 723 జిల్లాలోని 65 వేల గ్రామాల నుంచి 1.31 కోట్ల మంది రైతులను ఈ శాస్త్రవేత్తల బృందం కలుస్తుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పాండిచ్చేరిలలో 216 మంది శాస్త్రవేత్తల బృందం ద్వారా 72 జిల్లాల్లో 12.96 లక్షల మందికిపైగా రైతులు దీని ద్వారా లబ్ధి పొందనున్నట్లు పేర్కొన్నారు.

నెమలిని కాపాడి అటవీ సిబ్బందికి అప్పగింత



మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అంజలి గార్డన్‌ను ఆనుకుని కొంత నిర్మానుష్యం ప్రాంతం ఉండటంతో నెమళ్లు తిరుగుతుంటాయి. అందులో ఒకటి ఆదివారం అంజలి గార్డన్ కాలనీలోకి వచ్చింది. దాన్ని చూసి వీధి కుక్కలు వెంటపడి కరిచాయి. దాంతో నెమలి మెడ, కాలికి గాయాలయ్యాయి. గమనించిన అంజలి గార్డన్ కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మురళీధర్, కాలనీవాసులు కుక్కల బారి నుంచి దానిని కాపాడారు. దానికి సపర్యలు చేసి చిలుకూరు మృగావని జింకల పార్కు వారికి సమాచారం ఇవ్వటంతో దానిని తీసుకుని వెళ్లారు. నెమలిని కుక్కల బారి నుంచి కాపాడటంతోపాటు సురక్షితంగా అటవీశాఖ సిబ్బందికి అప్పగించిన విషయం తెలుసుకుని కాలనీవాసులు వారిని అభినందించారు.

సిధారెడ్డి వ్యక్తిత్వం స్ఫూర్తిదాయకం

- 'ఏడు పదుల వెన్నెల' శీర్షికతో సత్కారం



నాంపల్లి: కేసీఆర్ హయాంలో అత్యద్భుతంగా ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహిస్తే.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రపంచ అందగత్తెల పోటీలను నిర్వహిస్తోందని రాష్ట్ర మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. మంజీరా రచయితల సంఘం ఆధ్వ ర్యంలో ఆదివారం రాత్రి మాసబ్ ట్యాంక్‌లోని పార్క్ కాంటినెంటల్ హోటల్‌లో ప్రముఖ కవి నందిని సిధారెడ్డి 70వ వడిలో ప్రవేశించిన సందర్భంగా 'ఏడు పదుల వెన్నెల'శీర్షికన ఆత్మీయ అభినందన సత్కార సభ జరిగింది. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా హరీశ్‌రావు హాజరై నందిని సిధారెడ్డి దంపతులను సత్కరించి ప్రసంగించారు. సిధారెడ్డి కవిత్వం, వ్యక్తిత్వం అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెలంగాణ సాహిత్యకారులకు కోటి రూపాయలు నగదు, 300 గజాల భూమిని ఇస్తామని చెప్పినా నిర్మొహమాటంగా తిరస్కరించిన వ్యక్తిత్వం సిధారెడ్డిదని ప్రశంసించారు. కార్యక్రమంలో తెలుగు వర్సిటీ మాజీ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎ.భూమయ్య, ప్రొఫెసర్లు చెన్నకేశవరెడ్డి, సీతారామారావు, ఎస్.రఘు, రచయితలు వాసిరెడ్డి నవీన్, ఏనుగు నర్సింహారెడ్డి, అమ్మంగి వేణుగోపాల్, నాళేశ్వరం శంకరం, మంజీరా రచయితల సంఘం అధ్యక్షుడు రంగాచారి, కార్యదర్శి యాదగిరి, దేవీ ప్రసాదరావు, విరాహత్ అలీ పాల్గొన్నారు.

మురళీనాయక్ కుటుంబానికి చేయూత


ఒబెరాయికి చెక్కు అందిస్తున్న ప్రభుత్వ టీచర్లు

కవాడిగూడ: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా దేశరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన భారత జవాన్ మురళీనాయక్ కుటుంబానికి ప్రభుత్వ ఉపాధ్యాయులు చేయూత అందించారు. అశోక్ నగర్‌లో మేజర్ ఎస్‌పీఎస్ ఒబెరాయ్‌కి రూ.1,52,119 చెక్కును సూపర్ టీచర్స్ తెలంగాణ వాట్సాప్ గ్రూప్ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రూప్ అడ్మిన్ వంచ కొండల్‌రెడ్డి మాట్లాడుతూ దేశరక్షణలో భాగంగా అసువులు బాసిన భారత జవాన్ మురళీనాయక్ కుటుంబానికి చేయూతగా ఉండాలని సూపర్ టీచర్స్ తెలంగాణ పేరుతో వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి తక్కువ సమయంలోనే రూ. లక్షన్నరకుపైగా సేకరించినట్లు తెలిపారు. దేశం కోసం ప్రాణాలర్పించే వారికి ఈ దేశ ప్రజలు ఎప్పుడు అండగా ఉంటారని తెలియజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఏపీ సత్యసాయి జిల్లాలోని అమర జీవన్ మురళీ నాయక్ కుటుంబ సభ్యులకు అందజేస్తామని మేజర్ ఎస్‌పిఎస్ హామీనిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రూప్ సభ్యులు బచ్చు లక్ష్మినారాయణ, ఏకు విజయకుమార్ రెడ్డి, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కంచరకుంట్ల వీరారెడ్డి, బసిరెడ్డి అమృతం, బి.రమేష్ విష్ణు, మూల తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లాలు.. ఆగని కన్నీళ్లు!

- నగరంలో గృహిణుల హత్యలు.. ఆత్మహత్యలు
- అనాథలవుతున్న కన్న పిల్లలు



సాక్షి, సిటీబ్యూరో: ఇంటా, బయటా మహిళలకు భద్రత కరువైంది. అవమానాలు, అనుమానాలు ఎక్కువయ్యాయి. బయటేమో పోకిరీలు.. ఇంట్లో మొగుడే రాచిరంపాన పెడుతున్నారు. నగరంలో ఈ మధ్య కాలంలో దంపతుల మధ్య తగాదాల కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. చిన్న, చిన్న కారణాలకే భార్యను వేధిస్తున్న ఘటనలు అనేకం. వరకట్నం, అనుమానం, మరో మహిళపై వ్యామోహం.. ఇలా రకరకాల కారణాలతో కట్టుకున్న భార్యనే కర్కశంగా కడతేరుస్తున్నారు.

రోజూ 30 వరకూ కేసులు

నగరంలోని ట్రై కమిషనరేట్ పరిధిలో నిత్యం 15-30 వరకూ దంపతుల తగాదాలపై ఫిర్యాదులు వస్తుంటాయి. వీటిలో 2-3 శాతం మానసిక, శారీరకంగా వేధిస్తున్నవే. అక్రమ సంబంధం, అనుమానం, క్షణికావేశంతో భార్యలపై దాడులకు తెగబడుతున్నారు. రాజధానిలో గతేడాది 50 మంది గృహిణులు హత్యకు గురవ్వగా, 51 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారు.

అతితెలివి తేటలు...

కేసు నుంచి తప్పించుకునేందుకు కొందరు అతితెలివి ప్రదర్శిస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. గతేడాది ఆసిఫ్‌నగర్‌లో అనుమానంపై భార్యను కత్తితో పొడిచిన భర్త.. ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. ప్రమాదం జరిగిందంటూ వైద్యులను నమ్మించే ప్రయత్నం చేశాడు. పోలీసులు రంగంలోకి దిగటంతో అసలు విషయం వెలుగుచూసింది. నగరంలో చాలావరకూ గృహిణుల అనుమానాస్పద మరణాలు మిస్టరీగానే మిగిలి పోతున్నాయి.

వరకట్న వేధింపులు...

ఆధునిక యుగంలోనూ కొందరు మగాళ్ల వరకట్నంపై ఆశలు చావడం లేదు. కొందరికి పెళ్లి సమయంలో ఇచ్చిన లాంఛనాలు చాలడం లేదంటూ కాపురానికొచ్చిన మొదటి రోజు నుంచే అత్తింటి వేధింపులు మొదలవుతున్నాయి. కోడలిని సూటిపోటి మాటలతో వేధిస్తున్న అత్త, ఆడపడచులపై మహిళా పోలీస్ స్టేషన్లకు ఫిర్యాదులు పెరుగుతున్నాయి. పుట్టినింటికి చేరిన కూతురును చూస్తూ తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం,
26, మే, 2025





హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో జీవనశైలి వేగంగా మారిపోతోంది. ఫ్యాషన్, సినిమా, టెలివిజన్, ఈవెంట్ మేనేజ్‌మెంట్ రంగాల పెరుగుదలతో మేకప్ రంగం కూడా భారీగా విస్తరిస్తోంది. వ్యక్తిత్వాన్ని మెరుగుపరచాలనే ఆవశ్యకత, సోషల్ మీడియా ప్రభావం, వివిధ వేదికలపై కనిపించే అవకాశం పెరిగినకొద్దీ మేకప్ సర్వీస్‌కు డిమాండ్ అధికమవుతోంది. ఒక కాలంలో పెళ్లిళ్లు, ఫంక్షన్లకే పరిమితమైన మేకప్ ఇప్పుడు సినిమాలు, యాడ్స్, మోడలింగ్, థియేటర్, ఫ్యాషన్ షోలు, ఫొటోషూట్లు, వర్క్ ప్రెజెంటేషన్‌లు, డిజిటల్ క్రియేటివిటీ లాంటి అనేక రంగాల్లో సౌందర్య సాధనాల అవసరాన్ని గుర్తుచేస్తోంది..

- సాక్షి, సిటీబ్యూరో

కాస్మోటెక్ సిటీ..

నగరంలో మేకప్ రంగానికి పెరుగుతున్న ఆదరణ

మేకప్ ఆర్టిస్టుగా కెరీర్ ఎంచుకునే వారికి నగరంలో అవకాశాలు వేగంగా పెరుగుతున్నాయి. నగరంలో జరిగే వివాహ వేడుకలు, సినిమా షూటింగులు, సోషల్ మీడియా షూట్స్, బ్రాండ్ ప్రమోషన్స్ వంటివి మేకప్ ఆర్టిస్టులకు రెగ్యులర్ పని కల్పిస్తున్నాయి. ఇందులో కొంతమంది సెలబ్రిటీ మేకప్ ఆర్టిస్టులుగా ఎదుగుతుంటే, మరికొందరు ఫ్రీలాన్సర్లుగా, స్వతంత్ర సెలూన్లు లేదా స్టూడియోస్ స్థాపిస్తూ సొంత బ్రాండ్ ఇమేజ్ సృష్టించుకుంటున్నారు. తమ సొంత బ్రాండ్ డెవలప్ చేస్తూ కొంత మంది బ్యూటీషియన్లు సోషల్ సెలబ్రిటీలుగా మారుతున్నారు. డిజిటల్ మీడియాలో మేకప్ ట్యుటోరియల్స్, ట్రెండ్ లుక్స్, సోషల్ ఇన్ఫ్లుయెన్సర్స్ ప్రభావంతో యువత ఈ రంగంలో భవిష్యత్తును మెరుగుపరుచుకుంటోంది. డిజిటల్ పోర్ట్‌ఫోలియో, బ్రాండ్ భాగస్వామ్యాలతో ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయి. నిబద్ధతతో శిక్షణ, సృజనాత్మకత, అప్డేటెడ్ ట్రెండ్స్‌కి అనుగుణంగా మెళకువలు పెంచుకుంటే, ఈ రంగంలో విజయానికి ఎలాంటి అవరోధాలు ఉండవు.

* సినిమా, మీడియా, వెడ్డింగ్ రంగాల్లో భారీగా బిజినెస్
* అద్భుతమైన భవిష్యత్తుకు ఎన్నో అవకాశాలు
* నగర కేంద్రంగా టాప్ ట్రైనింగ్ సెంటర్లు
* కోర్సులు నేర్చుకునేందుకు ఎగబడుతున్న ఔత్సాహికులు

వెలుగులు నింపే వెడ్డింగ్..

ఇది అత్యధిక డిమాండ్ ఉన్న విభాగం. వధూవరులకు ప్రీ-వెడ్డింగ్, వెడ్డింగ్, పోస్ట్ వెడ్డింగ్ లుక్స్ కోసం ప్రత్యేక మేకప్ అవసరం. వెడ్డింగ్ మేకప్ అనేది మేకప్ రంగంలో అత్యంత డిమాండ్ ఉన్న విభాగం. ప్రతి వధువు తన వివాహం రోజున గ్లోయింగ్, ఫొటోజెనిక్ లుక్‌ను కోరుకుంటుంది. ఇది కేవలం మేకప్ మాత్రమే కాదు, ఆమె వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే విధంగా మేకప్ చేయాల్సి ఉంటుంది. వెడ్డింగ్ మేకప్‌లో ప్రధానంగా ఫొటోషూట్ల కోసం లైట్, నేచురల్ లుక్స్‌తో ప్రీ-వెడ్డింగ్ మేకప్, సంప్రదాయ, గ్లామరస్ లుక్ కోసం హెవీ ఫౌండేషన్, కాంటూరింగ్, ఐ మేకప్, హెయిర్ స్టైలింగ్‌తో వెడ్డింగ్ డే మేకప్, ఫ్యూజన్ స్టైల్, స్మోకీ ఐస్‌తో ఆధునిక, ట్రెండీ రిసెప్షన్/పోస్ట్ వెడ్డింగ్ మేకప్ వంటివి ఉన్నాయి.

సినిమాటిక్ లుక్ కోసం..

నటీనటుల స్క్రీన్ ప్రెజెన్స్‌కి మేకప్ కీలకం. ప్రత్యేకంగా సినిమా ఇండస్ట్రీకి పని చేసే మేకప్ ఆర్టిస్టులు ఉంటారు. సినిమా, టీవీ రంగాల్లో మేకప్ అనేది కేవలం అందాన్ని కాకుండా, పాత్ర స్వభావాన్ని, వయసును, కాలప్రమాణాన్ని ప్రదర్శించే ఓ సాధనం. ఈ విభాగంలో బేసిక్ స్క్రీన్ మేకప్, పీరియడ్ డ్రామా మేకప్, గాయాలు, వృద్ధాప్య మేకప్, ఫాంటసీ పాత్రలు కోసం ఉపయోగించే స్పెషల్ ఎఫెక్ట్స్ మేకప్ వంటి విధానాలుంటాయి. హైదరాబాద్‌లో అన్నపూర్ణ స్టూడియోస్, ఫిల్మ్ నగర్ ప్రాంతాల్లో సినిమాటిక్ మేకప్ ఆర్టిస్టులకు మంచి డిమాండ్ ఉంది. కొన్ని సంస్థలు ఈ రంగంలో స్పెషలైజ్డ్ ట్రైనింగ్ కూడా అందిస్తున్నాయి.



ఫ్యాషన్ టు ఫొటోషూట్స్..

మోడలింగ్ రంగంలో ఫొటోషూట్ల కోసం ట్రెండీ మేకప్ లుక్స్ అవసరం అవుతుంటాయి. ఫ్యాషన్ మోడలింగ్, ర్యాంప్ షోస్, బ్రాండ్ ప్రమోషన్లలో మేకప్ పాత్ర కీలకం. ఇక్కడ మేకప్ అనేది ఎక్స్‌పెరిమెంట్‌కు తెరతీసే కళలా మారుతుంది. ఈ విభాగంలో మేకప్ ఫీచర్లు.. మ్యాగజైన్స్, బ్రాండ్ క్యాంపెయిన్‌ల కోసం ఎడిటోరియల్ లుక్స్, క్రియేటివ్ స్టైల్స్, ఇన్‌స్టా, ఇన్ఫ్లుయెన్సర్ షూట్లు వంటి సోషల్ మీడియా ప్రొఫైల్స్ కోసం లైట్ లేదా స్టైలిష్ లుక్స్ ఉంటాయి.

కార్పొరేట్, గ్లామర్ ఈవెంట్స్



ప్రొఫెషనల్ లుక్స్ అవసరం అయ్యే ఈవెంట్స్‌లో కూడా మేకప్ సర్వీసులు ఆశ్రయిస్తున్నారు. నేటి కార్పొరేట్ ప్రపంచంలో ఫస్ట్ ఇంప్రెషన్ కీలకం. మహిళలే కాకుండా, పురుషులు కూడా గ్లామర్, కాన్ఫిడెన్స్ కోసం మేకప్ సేవలు ఆశ్రయిస్తున్నారు. ఇందులో తక్కువ మేకప్‌తో చక్కటి స్కిన్ టోన్, క్లీన్‌అప్, గ్లో ఫినిష్, నేచురల్ లుక్, ఈవెంట్ స్పెసిఫిక్ మేకప్, మ్యాట్ ఫినిష్, లాంగ్ లాస్టింగ్ లుక్స్ వంటి మేకప్‌లు ఉన్నాయి. ఇవన్నీ టైమ్ మేనేజ్‌మెంట్, కస్టమైజేషన్ మీద ఆధారపడి ఉంటాయి. కొంతమంది బిజినెస్ కస్టమర్లకు రెగ్యులర్ మేకప్ సపోర్ట్ కూడా అవసరం అవుతోంది.

శిక్షణలో టాప్..

మేకప్ శిక్షణ అందించే అనేక ప్రైవేట్, ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలు నగరంలో ఉన్నాయి. వీఎల్‌సీసీ, లాక్మే అకాడమీ, నేచురల్ ట్రైనింగ్ అకాడమీ, జావీద్ హబీబ్ అకాడమీ, ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ డిజైన్ వంటి సంస్థలు శిక్షణ అందిస్తున్నాయి. ఈ సంస్థలు ప్రాథమిక స్థాయి నుంచి ప్రొఫెషనల్ కోర్సులు వరకూ అందిస్తున్నాయి. కొన్నింటిలో ఇంటర్న్‌షిప్ అవకాశాలు ఉన్నాయి. ఇవి పరిశ్రమ అనుభవాన్ని ఇచ్చే మార్గంగా నిలుస్తున్నాయి. అనేక ఏళ్లుగా మేకప్ రంగంలో మహిళలు ఆధిపత్యంలో ఉన్నప్పటికీ, ఇటీవల పురుషులు కూడా ఈ రంగంలో సత్తా చాటుతున్నారు. ప్రత్యేకంగా సినిమా, ఫ్యాషన్ ఇండస్ట్రీలో పురుష మేకప్ ఆర్టిస్టులు ఎక్కువగా కనిపిస్తున్నారు. లింగపరమైన పరిమితులు లేకుండా, టాలెంట్‌కు గౌరవం దక్కే రంగంగా మేకప్ రంగం రూపుదిద్దుకుంటోంది.

వెండి వెలుగులు





రజతాభరణాల్లో మోడల్స్ తళుకులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.9లో నూతనంగా ఏర్పాటు చేసిన ఓ జ్యువెలరీ హబ్‌లో మోడల్స్ వెండి ఆభరణాలను ధరించి హొయలు పోయారు. **బంగారం ధరలు ఆకాశాన్నంటిన నేపథ్యంలో నగర** ప్రజలు సిల్వర్ జ్యువెలరీపై **ఎక్కువ మక్కువ** చూపుతున్నారు. దీంతో **సిల్వర్ ఆభరణా**లకు డిమాండ్ పెరుగుతుందని **ఈ సందర్భం**గా ఆ సంస్థ నిర్వాహకులు **తెలిపారు.** ప్రస్తుత తరుణంలో సిల్వర్ జ్యువె**లరీతో పాటు** గృహాలంకరణలోనూ వెండితో **చేసిన వస్తువులు** వినియోగిస్తున్నారని నిర్వాహకులు చెబుతున్నారు.

సంప్రదాయ కళ.. ఆధునిక శైలి..

హైదరాబాదీ మోడళ్లు అబ్బురపరిచే వెండి కళాకృతులు.. క్రాఫ్టెడ్ జ్యువెలరీని ప్రదర్శించారు. ట్రెడిషనల్ కాస్ట్యూమ్స్‌తో అందాల ముద్దుగుమ్మలు వెండి వెలుగులు నింపారు. 100 ఏళ్ల తమ వారసత్వానికి ఈ షోరూమ్ మళ్ళీ మద్దతు ఇచ్చే ఒక అద్భుత అవకాశమని, గచ్చిబౌలిలోని తమ హబ్, బషీర్‌బాగ్‌లోని జ్యువెలర్స్ వలే నాణ్యతకు, సంప్రదాయ డిజైన్లకు, ఆధునికతకు నిలువెత్తు ఉదాహరణ అని నిర్వాహకులు చెబుతున్నారు. 'ప్రతి వెండి కళాకృతి నగర సంస్కృతిని ప్రతిబింబిస్తుందని, సంప్రదాయ రూపకల్పన నుంచి ఆధునిక డిజైన్‌లకు వేదికగా నిలుస్తుందని వివరించారు.

బంగారం లాంటి వేడుక

గోల్డ్, సిల్వర్ బార్ చాలెంజ్‌లో ఈషా సందడి



గచ్చిబౌలి: కొత్తగూడలోని శరత్‌సిటీ క్యాపిటల్ మాల్ లోని ఓ జ్యువెలరీ స్టోర్‌లో కొద్ది రోజులుగా గోల్డ్, సిల్వర్ బార్ చాలెంజ్ ఈవెంట్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో టాలివుడ్ నటి ఈషా రెబ్బ సందడి చేశారు. నిత్యం సందర్శకులతో సందడిగా జరుగుతున్న ఈ చాలెంజ్‌లో ఈషా కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈషా మాట్లాడుతూ బంగారం లాంటి వేడుక నిర్వహించారని, ఇలాంటి వినూత్న కార్యక్రమాలు మరిచిపోలేని అనుభూతిని కలిగిస్తాయని అన్నారు. గోల్డ్-సిల్వర్ బార్ చాలెంజ్ ఈవెంట్‌లో పాల్గొని సందర్శకులు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. గెలుపొందిన వారికి బంగారు, వెండి నాణేలు బహుమతిగా అందజేశారు.

నీల మేఘ శ్యామ నృత్య రూపకం

గురు శ్రవ్య మానస ఆధ్వర్యంలో నిర్వహణ



మోతీనగర్: ప్రముఖ కూచిపూడి నృత్యకళా సంస్థ సుమధుర ఆర్ట్స్ అకాడమీ సమర్పణలో గురు శ్రవ్య మానస ఆధ్వర్యంలో సంస్థ నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు ఉత్సవాలు ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా 'నీల మేఘ శ్యామ' నృత్య రూపకాన్ని విద్యార్థులు ప్రదర్శించారు. సుమారు 200 మంది నృత్య కళాకారులు పాల్గొని అహూతులను అలరించారు. వీక్షకుల సమక్షంలో జనరంజకంగా నిర్వహించిన ప్రదర్శనలో కృష్ణ భగవానుని లీలామృతంలోని కొన్ని ముఖ్య ఘట్టాలను ప్రధానంగా చేసుకొని గురు శ్రవ్య మానస భోగిరెడ్డి తన శిష్య బృందంతో అద్భుతంగా రూపకల్పన చేశారు. కూచిపూడి విద్యార్థులందరూ చక్కని హావభావాలతో విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా రవికుమార్ దూళిపాట, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, సినీ నటులు, శ్రీనివాస భోగిరెడ్డి ప్రదర్శనకు ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని నింపారు. ఈ కార్యక్రమాన్ని శిల్పారామం స్పెషల్ ఆఫీసర్ జి. కిషన్‌రావు, ఐఏఎస్, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ మేనేజింగ్ డైరెక్టర్ కె.లక్ష్మీ, ఐఏఎస్‌లు, ప్రముఖ సినీ, టీవీ దర్శక, నిర్మాతలు పాల్గొన్నారు.

అడవి అందాల మధ్య వాక్



22 మంది ప్రకృతి ప్రేమికుల భాగస్వామ్యం

మణికొండ: అడవి అందాలు, పక్షుల కిలకిల రావాలు, అనేక రకాల క్షీర జాతుల వీక్షణలతో ప్రకృతి ప్రేమికులు సందడిగా గడిపారు. మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకూ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థకు చెందిన ఎకో టూరిజం బ్రాండ్ డెక్కన్ ఉడ్స్, ట్రయల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన నాక్టర్నల్ వాక్, బర్డ్ వాక్ కార్యక్రమంలో 22 మంది ప్రకృతి ప్రేమికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాత్రి సమయంలో టార్చ్‌లైట్ల వెలుగులో నేచరలిస్టులు అఖిల్, సుమన్, అపరంజని పర్యవేక్షణలో నాగార్జునసాగర్ రేసర్ పాము, రెండు కట్ల పాములు, పాడీ ఫీల్డ్ ఫ్రాగ్స్, ఒర్నేట్ నారో మౌత్డ్ ఫ్రాగ్‌లు, బుల్ ఫ్రాగ్‌లను వీక్షించారు. ఉదయం బర్డ్ వాక్‌లో గ్రే బెల్లీ కుక్కూ, బ్లూ ఫస్టస్ట్ మాల్కోకా, ఓరియంటల్ హనీ బజార్డ్, శిఖర, ల్యాంప్ వింగ్స్, నైట్జార్, బాక్ షోల్డర్ కైట్స్ వంటి అరుదైన పక్షులను వీక్షించారు. ఔత్సాహిక ప్రకృతి ప్రేమికుల కోసం నేచర్‌క్యాంపులను ఏర్పాటు చేస్తున్నామని, ఆసక్తిగలవారు తమను సంప్రదించాలని ఎకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్.రంనాయక్ సూచించారు.

పంచ్ కొడితే.. పతకాలే..



గల్లీ నుంచి ఢిల్లీ వరకూ గోల్కొండ బాక్సింగ్ ఎరేనా

బాక్సింగ్.. ఈ పేరు వినగానే రోమాలు నిక్కబొడుచుకుంటాయి! బాక్సర్లు విసిరే పవర్ పంచ్‌లు కళ్లముందు కదలాడతాయి. అలాంటి ఎందరో బాక్సర్లను తయారు చేస్తోంది గోల్కొండ బాక్సింగ్ అసోసియేషన్. గత ఐదు దశాబ్దాలుగా ఎందరో జాతీయ స్థాయి బాక్సర్లను తయారు చేసింది. తొమ్మిది సార్లు సర్వీసెస్ ఛాంపియన్, ఐదు సార్లు జాతీయ ఛాంపియన్‌గా నిలిచిన దివంగత ఘనీచాంద్ గోల్కొండ బాక్సింగ్ క్లబ్‌ను ప్రారంభించారు. ప్రస్తుతం ఈ క్లబ్‌ను ఏజాజ్ అహ్మద్ నిర్వహిస్తున్నాడు. ఈయన సమక్షంలో పలువురు చిన్నారు, ఔత్సాహికులు బాక్సింగ్ నేర్చుకుంటూ వివిధ వయసుల్లోని గ్రూప్‌లలో పాల్గొని జాతీయ స్థాయి పతకాలు సాధిస్తున్నారు.

- గోల్కొండ

* చిన్నతనంలోనే పంచ్‌లు విసురుతున్న చిన్నారులు
* ఐదు దశాబ్దాలుగా గోల్కొండ బాక్సింగ్ అసోసియేషన్ కృషి
* ఎందరో జాతీయ స్థాయి బాక్సర్లకు శిక్షణ

నగరంలో బాక్సింగ్ క్రీడకు రాను రాను క్రేజ్ పెరుగుతోంది. కాగా బాక్సింగ్‌లో స్వయంగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల చాంపియన్‌గా నిలిచిన ఏజాజ్ రాష్ట్రస్థాయి బాక్సింగ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. నిత్యం ఆయన వద్ద ఎనిమిది సంవత్సరాల నుంచి 19 సంవత్సరాలలోపు బాలబాలికలు శిక్షణ పొందుతున్నారు. అత్యుత్తమ స్థాయి బాక్సింగ్ పరికరాలతో ఇప్పటి వరకూ ఏజాజ్ పలువురు రాష్ట్రస్థాయి ఛాంపియన్‌లను తీర్చిదిద్దారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో అండర్-19, అండర్-15, అండర్-12 విభాగాల బాక్సింగ్ పోటీల్లో సత్తాచాటారు. కఠోర శ్రమతో పాటు, మంచి శారీరక ధృడత్వం బాక్సింగ్‌కు కోటలు లాంటివి. నియంత్రిత ఆహారం, క్రమశిక్షణతో మెలిగేవారికి మంచి భవిష్యత్తు ఉంటుంది. ప్రత్యర్థి కదలికలు గమనిస్తూ.. ప్రత్యర్థి వేసే పంచ్‌లు ఏవైపు నుంచి వస్తాయో గమనించి మరుక్షణమే పిడుగులాంటి పంచ్‌తో కూల్చగలిగిన వారే బాక్సింగ్‌లో ముందుకు సాగుతారు. కాగా శిక్షణ సమయంలో బాక్సింగ్ నిబంధనలను పాటించడం తప్పనిసరి. తూత్ సేవర్, హెల్మెట్‌తోపాటు అనుమతించిన డ్రెస్ కోడ్, నిబంధనలకు లోబడి వాడే గ్లౌజ్ తప్పనిసరి.





ఎందరో ఛాంపియన్‌లు..

వరుసగా తొమ్మిదేళ్ల సర్వీసెస్ చాంపియన్ బాక్సింగ్‌గా నిలిచిన ఘనీచాంద్‌ను ఇక్కడి బాక్సర్లు తమ ఐడియల్‌గా భావిస్తారు. బలమైన పంచ్‌లు విసరడం, కనుసన్నలతోనే ప్రత్యర్థి కదలికలను గమనించడం వంటటి అంశాలపై శిక్షణ అనంతరం జరిగే కౌన్సిలింగ్ కార్యక్రమంలో బాక్సర్లకు వివరిస్తారు. అంతేకాక వయసు కేటగిరిలో బరువు ఎంత ఉండాలి అనే విషయంపై కూడా నిర్దిష్ట అవగాహన కల్పిస్తారు. వర్ధమాన బాక్సర్ నిఖత్‌జరీన్‌ను అమ్మాయిలు తమ ఐడియల్‌గా భావిస్తున్నారని కోచ్ ఏజాజ్ అంటున్నారు. బాలికలను మరింత ప్రోత్సహించేందుకు నిఖత్‌జరీన్‌తో పాటు రాష్ట్రస్థాయి మహిళా బాక్సర్లను తమ బాక్సింగ్ క్లబ్‌కు రప్పించామని చెబుతున్నారు. తమ వద్ద శిక్షణ పొందిన నేహా, రమ్య, రుబీనా, అహ్మదీ తదితరులు అండర్-15 బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్రస్థాయి బాక్సర్లుగా ఎదిగారని తెలిపారు. అండర్-19 విభాగంలో గత నెల్లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో షేక్ అబ్దుల్ రెహమాన్ రన్నరప్‌గా నిలిచారు. జూనియర్ విభాగంలో పలువురు క్రీడాకారులు గోల్కొండ బాక్సింగ్ క్లబ్ నుంచి జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నారు.

క్లుప్తంగా...

ఏపీ మాజీ మంత్రి కాకాణి అరెస్ట్

- కేరళలో అదుపులోకి తీసుకున్న నెల్లూరు పోలీసులు
- అక్రమ మైనింగ్ కేసులో ఏ4గా చేర్చిన వైనం



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఏపీలో కూటమి ప్రభుత్వ రెడ్‌బుక్ పాలన రోజురోజుకూ శ్రుతిమించుతోంది. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలే లక్ష్యంగా సర్కారు పెద్దల బరితెగింపు హద్దులు మీరుతోంది. ఈ క్రమంలో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరు పోలీసులు కక్షపూరితంగా అరెస్ట్ చేశారు. కేరళ రాష్ట్రంలో ఆయన్ను అదుపులోకి తీసుకుని ఆదివారం రాత్రి నగరానికి తీసుకువచ్చారు. రెడ్‌బుక్ కుట్రలతో ఇప్పటికే పదుల సంఖ్యలో ముఖ్య నేతలపై తప్పుడు కేసులు బనాయించారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతి, అక్రమాలను ఎప్పటికప్పుడు నిలదీస్తుండటం వల్లే కాకాణిపై తప్పుడు కేసు పెట్టారు. ఇందులో భాగంగా పొదలకూరు మండలం తాటిపర్తి రుస్తుం మైన్స్‌లో అక్రమ మైనింగ్ జరిగిందని ఈ ఏడాది ఫిబ్రవరిలో మైనింగ్ శాఖ ఇన్‌చార్జ్ డీడీ బాలాజీ నాయక్ పొదలకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్రమ మైనింగ్‌లో కాకాణి అనుచరుల ప్రమేయం ఉందని, ఆయన వారికి సహకరించారంటూ పోలీసులు నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు. ఈ కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి సంబంధం లేకపోయినా.. పట్టుబట్టి, టార్గెట్ చేసి ఏ4గా చేర్చారు. తొలుత ఈ కేసులో బలం లేదని ఏ1తోపాటు మరో ఇద్దరికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో కేసును మరింత పటిష్టం చేసి కాకాణిని జైలుకు పంపే కుట్రలో భాగంగా అట్రాసిటీ సెక్షన్‌లు జత చేశారు. కాకాణి ప్రస్తుతం కేరళలో ఉండగా నెల్లూరు పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకుని నెల్లూరు డీటీసీకి తరలించారు.

కాంగ్రెస్‌కు నష్టం లేదు


- కవిత లేఖతో బీఆర్‌ఎస్ కేడర్ గందరగోళంలో పడుతుంది: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత రాసిన లేఖతో కాంగ్రెస్ పార్టీకి వచ్చిన నష్టమేమీ లేదని..అయితే కాంగ్రెస్ నాయకత్వం అప్రమత్తంగా ఉండి మరింత బలం చేకూర్చుకోవాల్సి ఉంటుందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా ఆ లేఖతో ఇబ్బంది లేకపోయినా, బీఆర్‌ఎస్ కేడర్ గందరగోళానికి గురవుతుందని, ఈలోపు బీజేపీ వారిని ఆకర్షించే అవకాశాలుంటాయని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గందరగోళంలో ఉన్న బీఆర్‌ఎస్ కేడర్‌ను పార్టీలోకి తీసుకోవాల్సి ఉంటుందని, ఈ విషయాన్ని అవసరమైనప్పుడు సీఎం రేవంత్‌రెడ్డితోపాటు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు కూడా చెబుతానని వెల్లడించారు. ఎవరు ఒప్పుకున్నా.. ఒప్పుకోకపోయినా కేసీఆర్ కేసీఆరేనని, ఆయనతోనే బీఆర్‌ఎస్‌కు ఉనికి ఉంటుందే తప్ప కేటీఆర్, హరీశ్, కవితలతో ఏం కాదని తెలిపారు. కవిత స్వతహాగా లీడర్ కాదని, కేసీఆర్‌ను దేవుడని అంటూనే కూర్చున్న కొమ్మను ఆమె నరుక్కుంటున్నారని అభిప్రాయపడ్డారు. కేసీఆర్ కుటుంబంలోని పంచాయితీలు రాజకీయంగా బీఆర్‌ఎస్‌కు నష్టం చేస్తుందని, ఈ సమయంలో వారు ఎలా బయటపడతారన్నది వారే ఆలోచించుకోవాలన్నారు. కవితతో అయ్యేది ఏమీ లేదని, రాజకీయాలను ఆమె తిప్పేయగల శక్తి లేదని, కేసీఆర్ కుమార్తె కాబట్టి మీడియాలో ప్రాధాన్యం ఉంటుందే తప్ప రాజకీయాలేవీ తారుమారు కావని ఆ ప్రకటనలో జగ్గారెడ్డి వెల్లడించారు.

ఓపీఎస్ సాధనకు సమైక్య పోరాటం

- ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: టీచర్లు, ప్రభుత్వ ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలని టీచర్స్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆదివారం ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టీచర్స్ (ఏఐఎఫ్‌టీవో) జాతీయ కార్యవర్గ సమావేశం జార్ఖండ్‌లోని దేవగఢ్‌లో జరిగింది. ఈ సమావేశంలో శ్రీపాల్ మాట్లాడుతూ, ఓపీఎస్ సాధనకు అన్ని రాష్ట్రాల టీచర్లు ఒకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. ఏఐఎఫ్‌టీవో బలోపేతానికి పీఆర్‌టీయూఎస్ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. ఇప్పటికే తెలంగాణలో టీచర్ల సమస్యల పరిష్కారానికి అన్ని జిల్లాల టీచర్లను సమైక్యం చేస్తున్నామని, శాసనమండలిలోనూ టీచర్ల సమస్యలను లేవనెత్తేందుకు కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. మారుమూల ప్రాంతాల టీచర్లు సైతం తమ ఇబ్బందులు చెప్పేందుకు వారికి అందుబాటులో ఉండే వ్యవస్థను రూపొందించామన్నారు. గ్రామీణ ప్రాంత టీచర్లు చిన్న సమస్యను తీసుకొచ్చినా దానిని సీఎం దృష్టికి తీసుకెళ్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.



హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో చంద్రబాబు ఇంద్రభవనం



ఉండవల్లిలో కృష్ణానది కరకట్ట వెంట చంద్రబాబు నివాసం ఉంటున్న అక్రమ భవనం



హైదరాబాద్‌లో అత్యంత సంపన్నులు నివాసం ఉండే హైటెక్ సిటీ, కొండాపూర్ ప్రాంతంలో చంద్రబాబు ఫాం హౌస్‌లోని ముందు భాగం

హామీలు గాలికి.. ప్యాలెస్‌లు పైపైకి

- ఏడాది పాలనలో బాబు సొంత సంపద సృష్టి
- కుప్పంలో ఆధునాతన భవంతి
- సూపర్ సిక్స్ హామీల అమలుకు ఖజానా లేదని గగ్గోలు.. ఆడబిడ్డ నిధికి మంత్రివర్గం చెల్లుచీటీ
- అమరావతిలో ఇటీవల రూ.200 కోట్ల విలువైన స్థలంలో భవంతి నిర్మాణానికి శ్రీకారం..
- ఇప్పటికే జూబ్లీహిల్స్‌లో రూ.వందల కోట్ల విలువైన నివాస భవనం... మదీనాగూడలో ఐదెకరాల ఫామ్ హౌస్



కుప్పంలో చంద్రబాబు కొత్త భవంతి ఇది..



రాజధాని ప్రాంతంలో చంద్రబాబు ఇల్లు నిర్మించుకోనున్న స్థలం

సాక్షి, అమరావతి: ఏడాది పాలన పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సీఎం చంద్రబాబు మరో రికార్డు సాధించారు! ఏడాదిగా సూపర్ సిక్స్ సహా ఎన్నికల హామీలు ఏ ఒక్కటీ అమలు చేయని ఆయన తనకోసం ఈసారి సొంత నియోజకవర్గం కుప్పంలో ఓ ఇంద్ర భవనాన్ని నిర్మించుకున్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, మదీనాగూడలో విలాసవంతమైన భారీ రాజప్రాసాదం, ఫామ్‌హౌస్‌లను ఏర్పాటు చేసుకున్న ఆయన తాజాగా కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం కడపల్లి పంచాయతీ పరిధిలోని శివపురంలో రెండు ఎకరాల్లో నిర్మించుకున్న నూతన గృహం కోటను తలపిస్తోందని స్థానికులు చర్చించుకుంటున్నారు. 40 ఏళ్లుగా కుప్పం ఎమ్మెల్యేగా గెలుస్తున్నా సొంత నియోజకవర్గంలో ఇల్లు లేకపోవడంపై తీవ్ర విమర్శలు రావడంతో స్థానికుడినని చెప్పుకునేందుకు ఎన్నికలకు ముందు స్థలం కొని ఆయన ఇంటి నిర్మాణం ప్రారంభించడం తెలిసిందే. ఇక ఇటీవలే రాజధాని అమరా వతి ప్రాంతంలో 5.16 ఎకరాల విస్తీర్ణంలో (25 వేల చదరపు గజాలు) అత్యంత విలాసవంతంగా మరో నూతన గృహ నిర్మాణాన్ని సీఎం చంద్రబాబు చేపట్టారు. వెలగపూడిలో తాత్కాలిక సచివాలయం, పరిపాలనా నగరానికి ఆనుకుని ఈ మహల్ నిర్మించే బాధ్యతను తనకు అత్యంత సన్నిహితుడికి చెందిన కంపెనీకి అప్పగించారు. ఈ భూమి విలువ రూ.150 కోట్లపైమాటేనని చెబుతున్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఉండవల్లిలోని కరకట్ట అక్రమ భవంతిని సీఎం చంద్రబాబు తన నివాసంగా చేసుకున్న విషయం తెలిసిందే.

కుప్పంలోని చంద్రబాబు కొత్త భవంతి వీడియో కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి



1. మార్చి 11న సాయంత్రం 5.49 గంటలకు తాడేపల్లిలోని పార్క్ విల్లా నంబర్ 27 వద్దకు చేరుకున్న విజయసాయిరెడ్డి 2. సాయంత్రం 5.49 గంటలకే విల్లా నంబర్ 27 లోపలకు వెళ్తున్న విజయసాయిరెడ్డి 3. 6.01 గంటలకు విల్లా నంబర్ 27లోపలకు వెళ్తున్న టీడీపీ నేత టీడీ జనార్దన్ 4. 6.49 గంటలకు విల్లా నుంచి బయటకు వస్తున్న విజయసాయిరెడ్డి 5. 7.32 గంటలకు విల్లా నుంచి బయటకు వస్తున్న టీడీ జనార్దన్

విల్లాలో రహస్య భేటీ!

చంద్రబాబు సన్నిహితుడు టీడీ జనార్దన్‌తో విజయసాయిరెడ్డి గుట్టుగా సమావేశం

దాదాపు గంటపాటు చర్చలు

సీఐడీ విచారణకు హాజరయ్యే ముందు రహస్య భేటీపై సోషల్ మీడియా, వైర్‌లో వీడియోలు వైరల్

సాక్షి, అమరావతి: గత ప్రభుత్వ మద్యం విధానంపై నమోదైన అక్రమ కేసుకు సంబంధించి సీఐడీ విచారణకు హాజరయ్యే ముందు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సీఎం చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన టీడీపీ నేత టీడీ జనార్దన్‌తో రహస్యంగా సమావేశమైన వీడియోలు తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'వైర్' కూడా వీటిని ప్రచురించింది. విచారణకు హాజరయ్యే ముందు టీడీపీ పెద్దల సన్నిహితులతో ఈ రహస్య భేటీలు, మంతనాల వెనుక మర్మం ఏమిటని నెటిజన్లలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ ఏడాది మార్చి 11న సాయంత్రం 5.49 గంటలకు విజయసాయిరెడ్డి తాడేపల్లి పార్క్ విల్లా నెంబర్ 27కు చేరుకోగా ఆ తరువాత 13 నిమిషాలకు చంద్రబాబు నమ్మినబంటు టీడీ జనార్దన్ కూడా అదే విల్లాకు వచ్చినట్లు ఆ వీడియోలో ఉంది. వీరిద్దరూ అందులోకి వెళ్లి దాదాపు గంటపాటు రహస్యంగా చర్చలు జరిపినట్లు వెల్లడవుతోంది. కాగా ఈ విల్లాల్లో మంత్రులు, టీడీపీ నేతలే అధికంగా ఉన్నారు. సాయిరెడ్డి తన విల్లాను డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుకు ఇచ్చారు.

హైదరాబాద్ సహా ఏడుచోట్ల పేలుళ్లకు ప్రణాళిక?

సిరాజ్, సమీర్ విచారణలో వెలుగులోకి విస్తుపోయే నిజాలు

విజయనగరం క్రైమ్: బాంబు పేలుళ్ల కుట్ర కేసులో పోలీసుల కస్టడీలో ఉన్న సిరాజ్, సమీర్ మూడో రోజైన ఆదివారం విచారణలో విస్తుపోయే నిజాలు చెప్పినట్టు తెలుస్తోంది. కోర్టు ఆదేశాలతో ఎన్‌ఐఏ అధికారుల నుంచి నిందితులను తమ కస్టడీలోకి తీసుకున్న విజయనగరం పోలీసులు స్థానిక పీటీసీలో మూడో రోజు కూడా విచారణ కొనసాగించారు. సిరాజ్, సమీర్‌లను వివిధ కోణాల్లో విచారణ కొనసాగించినట్టు తెలుస్తోంది. 6 నెలలుగా హైదరాబాద్‌లోనే సమీర్‌తో ఉన్న విజయనగరం వాసి సిరాజ్ అక్కడే బాంబు పేలుళ్లకు పన్నాగం పన్నినట్టు పోలీసు విచారణలో తేలిందని సమాచారం. దేశవ్యాప్తంగా ఢిల్లీ, హైదరాబాద్, ముంబై, చెన్నై, విజయనగరం సహా ఏడుచోట్ల బాంబులు అమర్చి విధ్వంసం సృష్టించేందుకు పథకం పన్నినట్టు పోలీసుల విచారణలో తేలినట్టు సమాచారం. సౌదీ, ఒమెన్ దేశాల్లోని ఉగ్ర ముఠాలతో సంబంధాలు పెట్టుకున్న ఈ ఇద్దరూ వరంగల్, హైదరాబాద్, ఢిల్లీలో ఉన్న ఫర్హాన్, బాదర్, రహీంలతో బాంబు పేలుళ్ల గురించి 'అలీం' అనే వాట్సాప్ గ్రూప్‌లో చాటింగ్ చేసుకున్న వైనాన్ని కూడా పోలీసులు గుర్తించారు. మానవ బాంబులుగా తయారైన సిరాజ్, సమీర్ ముస్లిమేతరులనే లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా వేదికగా పేలుళ్లకు పథక రచన చేసినట్టు విచారణలో తేలింది.

వరంగల్ ఫర్హాన్, ఢిల్లీ బాదర్ నుంచి ఈ ఇద్దరికీ ఉన్న సంబంధాలను రాబట్టే పనిలో విజయనగరం పోలీసులు నిమగ్నమయ్యారు. స్థానిక పీటీసీలో ఉదయం 11 గంటలకు మొదలైన విచారణ సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. తిరిగి సాయంత్రం 5.30 గంటలకు మొదలైన విచారణ రాత్రి వరకు కొనసాగినట్టు తెలుస్తోంది.

ముక్కిపోతున్న దొడ్డు బియ్యం

రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ షాపుల్లో పేరుకుపోయిన 28 వేల మెట్రిక్ టన్నుల బియ్యం ● సన్న బియ్యానికి తప్పని లక్క పురుగుల బెడద



ఈ ఫొటోలో కనిపిస్తున్నది సిద్దిపేట జిల్లా లద్నూరులోని ఓ రేషన్ షాప్‌లో ఉన్న 12 క్వింటాళ్ల దొడ్డు బియ్యం. దీంట్లో కొంత బియ్యం ముక్కిపోగా మరికొన్ని బస్తాల్లోకి లక్క పురుగులు చేరాయి. షాప్‌ను ఎంత శుభ్రం చేసినా లక్క పురుగు పోవడం లేదు. ఇవి ఇదే విధంగా స్టాక్ ఉంటే సన్న బియ్యానికి సైతం లక్క పురుగులు పడతాయని డీలర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి, సిద్దిపేట: రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ నెల నుంచి తెల్లరేషన్‌కార్డు దారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. మార్చి నెలలో మిగిలిపోయిన దొడ్డుబియ్యం ఇంకా రేషన్ షాప్‌లలోనే ఉంది. మూడు నెలలుగా స్టాక్ ఉండటంతో ముక్కిపోతున్నాయి. పైగా లక్క పురుగులు వచ్చి చేరుతున్నాయి. దీంతో దొడ్డు బియ్యానికి పట్టిన లక్క పురుగులు సన్న బియ్యానికి పడతాయని రేషన్ డీలర్లు అంటున్నారు.

మార్చి నెలలో కార్డుదారులకు ఇవ్వగా రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాల్లో 28,380.97 మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం మిగిలింది. వాటిని రేషన్‌షాప్‌లలో పక్కన పెట్టాలని పౌరసరఫరాల శాఖ గతంలోనే ఆదేశాలు ఇచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా చాలాచోట్ల గదులు ఇరుకుగా ఉండటంతో సన్న బియ్యం దించుకునేందుకు స్థలం ఉండటం లేదు. ఈ బియ్యమంతా ఫిబ్రవరి 22 నుంచి 28వ తేదీవరకు రేషన్‌షాప్‌లకు చేరింది. మూడు నెలలుగా నిల్వలు ఉండటంతో లక్క పురుగు పడుతున్నాయి. పలుచోట్ల వర్షాలకు తడిసి ముక్కిపోతున్నాయి.




సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌లో ఓ రేషన్ షాప్‌లో దొడ్డు బియ్యం స్టాక్

ఎఫ్‌సీఐకి పెడితే ఆదాయం

సన్న బియ్యం పంపిణీ చేస్తున్న నేపథ్యంలో దొడ్డు బియ్యంతో పని ఉండదు. ఈ బియ్యాన్ని ఎఫ్‌సీఐ లేదా ఇతర రాష్ట్రాలకు విక్రయిస్తే ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. పైగా రేషన్‌షాప్‌లలో ఉన్న సన్న బియ్యానికి లక్క పురుగుల బాధ ఉండదు.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే షిఫ్ట్ చేస్తాం



రేషన్ షాప్‌లలో స్టాక్ ఉన్న దొడ్డు బియ్యం గురించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఆ బియ్యం బస్తాలకు రెడ్ కలర్‌తో ఇంటు మార్క్ వేయించాం. ఈ బియ్యాన్ని శుభ్రంగా ఉంచాలని, సేఫ్టీగా భద్రపరచాలని డీలర్లకు చెప్పాం. బియ్యం తరలింపుపై ఆదేశాలు రాగానే రేషన్‌షాపుల నుంచి తరలిస్తాం. – అబ్దుల్ హమీద్, అదనపు కలెక్టర్, సిద్దిపేట

ఉమ్మడి జిల్లాల వారీగా దొడ్డు బియ్యం స్టాక్ (మెట్రిక్ టన్నులు)

వరంగల్	4,000.51
మెదక్	2,156.7
ఆదిలాబాద్	1,677.05
ఖమ్మం	2,121.13
హైదరాబాద్	1,901.44
కరీంనగర్	2,205.33
మహబూబ్‌నగర్	4,605.31
నిజామాబాద్	1,412.57
రంగారెడ్డి	4,238.86
నల్లగొండ	4,062.07

ఆ నలుగురిలో నేను లేను

- నా వద్ద 15లోపు థియేటర్లే ఉన్నాయి
- నిర్మాత అల్లు అరవింద్
- 'ప్రైవేట్ పెట్టుబడితో సినిమాలు చేస్తే గవర్నమెంట్ కంట్రోల్ చేస్తానంటాదేంటి' అని గతంలో పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలు
- 'ప్రభుత్వం సంబంధం ఏమిటి.. మాది ప్రైవేట్ వ్యాపారం' అనడం సరికాదన్న అరవింద్
- పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యల్ని అరవింద్ పరోక్షంగా ఖండించినట్టు ఉందంటున్న నెటిజన్లు



సాక్షి, హైదరాబాద్: 'రెండ్రోజుల నుంచి ఆ నలుగురు.. ఆ నలుగురు అని వినిపిస్తోంది. ఆ నలుగురుకి నాకు సంబంధం లేదు. ఆ నలుగురిలో నేను లేను. పదిహేనేళ్ల క్రితం ఆ నలుగురు అని మొదలైంది. ఆ తర్వాత ఆ నలుగురు కాస్తా పదైంది. అది ఎవరూ పట్టించుకోవడం లేదు. ఓ పది మంది దగ్గర థియేటర్లు ఉన్నాయి. ఆ నలుగురి వ్యాపారంలో నేను లేను. కోవిడ్ టైమ్ నుంచే నేను బయటకు వచ్చాను. తెలుగు రాష్ట్రాల్లో 1,500 థియేటర్లు ఉన్నాయి. కానీ.. తెలంగాణలో నాకున్నది ఒకే ఒక్క థియేటర్. ఆంధ్రప్రదేశ్‌లో కూడా అన్నింటినీ వదిలేసుకుంటూ వస్తున్నాను. ప్రస్తుతం 15లోపు థియేటర్లు మాత్రమే నా దగ్గర ఉన్నాయి. వీటి లీజులు అయిపోయిన తర్వాత రెన్యువల్ చేయొద్దని నా సిబ్బందితో చెప్పాను. పాత అలవాటు ప్రకారం ఆ నలుగురిలో నా ఫొటోను వాడుకుంటున్నారు. నన్ను విమర్శిస్తున్నారు. దయచేసి మీడియా మిత్రులు ఆ నలుగురు న్యూస్‌లో నన్ను కలపకండి. నేను వాళ్లలో లేను. వారితో వ్యాపారంలో లేను' అని ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ప్రస్తుతం థియేటర్లు, ఎగ్జిబిటర్లు, నిర్మాతల సెక్టార్స్‌లో థియేటర్ల రెవెన్యూ షేరింగ్, థియేటర్స్‌లో అద్దె చెల్లింపులు వంటి అంశాల నేపథ్యంలో తెలుగు చిత్ర పరిశ్రమలో విభిన్నమైన పరిణామాలు చోటుచేసుకుంటున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ విషయంపై ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ స్పందించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ.. 'జూన్ 1 నుంచి తెలుగు రాష్ట్రాల్లో థియేటర్స్‌ను మూసివేస్తారనే అంశంపై ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ స్పందించిన విధానం చాలా సమంజసంగా ఉందని నాకనిపించింది. ఇక ఈ థియేటర్స్ క్లోజ్ అంశానికి సంబంధించి ఇటీవల జరిగిన సమావేశాలకు నేను కావాలని, ఇష్టం లేకనే వెళ్లలేదు. అలాగే నా గీతా డిస్ట్రిబ్యూషన్ సంబంధించిన వ్యక్తులు కానీ, నాతో అసోసియేట్ అయిన వ్యక్తులు కానీ ఈ మీటింగ్‌కు వెళ్లొద్దని చెప్పాను. థియేటర్స్‌కు చాలా కష్టాలు ఉన్నప్పుడు ఇండస్ట్రీ పెద్దలతో మాట్లాడి, సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి. కానీ కొందరు ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయంపై నాకు చిరాకు కలిగి వెళ్లలేదు. థియేటర్లు మూసివేస్తున్నాం అనడం సరైంది కాదు. పవన్ కళ్యాణ్ సినిమా విడుదల సమయంలో థియేటర్లు మూసివేస్తామని చెప్పడం దుస్సాహసం. గతంలో అశ్వనీదత్ సినిమా విషయంలో పవన్‌ను కలిశాం. అప్పుడు ఆయన ఫిల్మ్ చాంబర్ తరపున వెళ్లి ఏపీ సీఎం చంద్రబాబును కలవండన్నట్టు హింట్ ఇచ్చారు. అయితే మన వాళ్లు పట్టించుకోలేదు. ఆ విషయాన్ని విస్మరించారు. అధికారికంగా అందరం కలవాలి. కానీ కలవలేదు. ఎవరో ఇటీవల మనది ప్రభుత్వానికి సంబంధం లేని రంగం అని అంటుంటే విన్నాను. ప్రభుత్వానికి సంబంధం లేని పరిశ్రమ అయితే గత చీఫ్ మినిస్టర్‌ను సినీ పరిశ్రమలోని పెద్దపెద్ద వాళ్లంతా వెళ్లి ఎందుకు కలిశారు? ఏ వ్యాపారం అయినా సవ్యంగా చేసుకోవాలంటే ప్రభుత్వ సహకారం లేకుండా జరగదు. ఇప్పుడు ప్రభుత్వాన్ని వెళ్లి కలవకపోవడం సరికాదు. మనకు కష్టం వస్తే తప్ప మనం ప్రభుత్వం దగ్గరికి వెళ్లమా? నిజంగానే సింగిల్ స్క్రీన్ థియేటర్లకు సమస్యలు ఉన్నాయి. సమస్యలు ఉన్నప్పుడు మాట్లాడుకోవాలి తప్ప.. ఇలా థియేటర్స్ మూసివేస్తున్నామని చెప్పడం సరికాదు' అని అరవింద్ వ్యాఖ్యానించారు.

పవన్ వ్యాఖ్యల్ని అరవింద్ ఖండించారంటున్న నెటిజన్లు

'ప్రైవేట్ పెట్టుబడితో మేం సినిమాలు చేస్తే గవర్నమెంట్ కంట్రోల్ చేస్తానంటాదేంటి' అని గత ప్రభుత్వ హయాంలో పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. 'ఏ వ్యాపారమైనా సవ్యంగా చేసుకోవాలంటే ప్రభుత్వ సహకారం లేకుండా జరగదు. అటువంటిది ప్రభుత్వంతో సంబంధం ఏంటి. మాది ప్రైవేట్ వ్యాపారం అనడం సరికాదు. ప్రభుత్వంతో సంబంధం ఉంటుంది. ప్రభుత్వం కో–ఆపరేషన్ కావాలి' అంటు అరవింద్ తాజాగా చేసిన వ్యాఖ్యల్ని నెటిజన్లు ప్రముఖంగా చర్చించుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యల్ని అల్లు అరవింద్ పరోక్షంగా ఖండించినట్టు ఉన్నాయని నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు. అప్పట్లో పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలకు.. తాజాగా అరవింద్ చేసిన వ్యాఖ్యల వీడియో క్లిప్‌ను జతచేసి సోషల్ మీడియా వేదికలపై వైరల్ చేస్తున్నారు.

మిస్ ఇంగ్లండ్ ఆరోపణలపై దర్యాప్తు జరపాలి

- తెలంగాణ తరపున మిల్లా మాగీకి క్షమాపణలు చెపుతున్నా
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: ప్రపంచ సుందరి పోటీలకోసం హైదరాబాద్ వచ్చిన మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ చేసిన ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరపాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. మహిళలను గౌరవించి, ఆరాధించే గొప్ప సంస్కృతి కలిగిన తెలంగాణ గడ్డపై మిల్లా మాగీ ఎదుర్కొన్న చేదు అనుభవం తనను ఎంతో బాధించిందని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఆడపిల్ల తండ్రిగా, ఏ మహిళకూ ఇలాంటి దురదృష్టకర పరిస్థితి రాకూడదని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. యావత్ తెలంగాణ సమాజం తరఫున మిల్లా మాగీకి హృదయ పూర్వకంగా క్షమాపణ చెబుతున్నట్టు తెలిపారు. ఆమె విషయంలో జరిగిన సంఘటన తెలంగాణ విలువలకు వ్యతిరేకం అని వ్యాఖ్యానించారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించడాన్ని సంప్రదాయంగా భావించే తెలంగాణకు, రాణి రుద్రమ, చిట్యాల ఐలమ్మలే నిత్య స్ఫూర్తి ప్రదాతలని అన్నారు. మిస్ వరల్డ్ వంటి అంతర్జాతీయ పోటీల వేదికలపై జరిగే వేధింపులను ఎదిరించి నిలబడాలంటే అసాధారణ ధైర్యం ఉండాలన్న కేటీఆర్, మిల్లా మాగీ చూపిన తెగువ అభినందనీయమని పేర్కొన్నారు. మిల్లా మాగీ చేసిన ఆరోపణలపై విచారణ జరపకుండా, ఆమెనే దోషిగా నిలబెట్టాలనుకుంటున్న ప్రభుత్వ వైఖరిని కేటీఆర్ తీవ్రంగా తప్పుపట్టారు. సమగ్ర దర్యాప్తు నిర్వహించి మిల్లా మాగీని వేధించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మిస్ వరల్డ్ పోటీల్లో విదేశీ మహిళలకు అవమానం జరిగింది

- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, రజనీ సాయిచంద్



సాక్షి, హైదరాబాద్: మహిళలను గౌరవించే తెలంగాణ గడ్డ మీద విదేశీ మహిళకు అవమానం జరిగిందని.. ప్రపంచ సుందరి పోటీదారు, మిస్ ఇంగ్లండ్‌కు జరిగిన అవమానంతో భారత్, తెలంగాణ పరువు తీశారని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, బీఆర్‌ఎస్ నాయకురాలు రజనీ సాయిచంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం తెలంగాణభవన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి మిస్‌వరల్డ్ పోటీలకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారని, అయినా అందాల పోటీలు అభాసుపాలయ్యాయన్నారు. అవమానం జరిగిందంటూ మిస్ ఇంగ్లండ్ అర్ధాంతరంగా తన దేశం వెళ్లిపోయిందని గుర్తు చేశారు. తాము చాలా బాధతో ఈ మాటలు మాట్లాడాల్సి వస్తోందన్నారు. 'పోటీల నుంచి వైదొలిగిన మిస్ ఇంగ్లండ్ మిల్లామాగీ ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తనను వ్యభిచారిలా చూశారని వాపోయింది. ఇదేనా అతిథులకు ఇచ్చే గౌరవం? ప్రపంచ దేశాల్లో మన పరువు పోయింది. మహిళలను అవమానిస్తే పెట్టుబడులు వస్తాయా? మన మహిళలకు అగౌరవం జరిగితే చూస్తూ ఊరుకుంటామా? ఆమెకు జరిగిన అవమానానికి ఎవరు సమాధానం ఇస్తారు? నిర్వాహకులపై చర్యలు తీసుకోవాల్సిందే. మానవ హక్కుల కమిషన్‌కు ఈ ఘటనపై ఫిర్యాదు చేస్తాం' అని వారు పేర్కొన్నారు.



మంచిమాట

పుణ్యకార్యం... పాపకార్యం

అర్థం తెలిసినా తెలియకపోయినా ఈమాటలని మాత్రం అందరూ తరచు వాడుతూనే ఉంటారు. "నీకు పుణ్యం ఉంటుంది బాబూ ఈ పని చేసి పెట్టు." "పుణ్యం కొద్దీ పురుషుడు, దానం కొద్దీ బిడ్డలు", "ఏ పూర్వ పుణ్యమో" "పాపం పుణ్యం దేవుడికే ఎరుక" "పాపం పండింది". "ఎవడి పాపాన వాడే పోతాడు." ఇటువంటి సామెతలు, నానుడులు అందరి నోళ్లలోనూ నానుతూ ఉంటాయి. పాపం అంటే ఏమిటి? పుణ్యం అంటే ఏమిటి? అన్నది ఎంతమందికి తెలుసు? ఏదో వ్రతం చేస్తే, పూజ చేస్తే, పుణ్యం వస్తుందిట! వ్రతం అవగానే ఇతరులని బాధ పెట్టినా కూడా పుణ్యం వస్తుందా? ఆలోచించాలి. పాప పుణ్యాలకు వ్యాసభగవానుడు చక్కని నిర్వచనం ఇచ్చాడు.

''అష్టాదశ పురాణసారం శ్లోకార్థేన ప్రవక్ష్యామి
పరోపకారాయ పుణ్యం, పాపాయ పరపీడనం''

ఇతరులకు ఉపకారం చేస్తే పుణ్యం, అపకారం చేస్తే పాపం. పైగా ఇది పదునెనిమిది పురాణాల సారం అని కూడా చెప్పాడు. ఏవేవో మహత్కార్యాలు చేయనవసరం లేదు. శక్తిమేరకు ఎవరికైనా సహాయం చేయటం, వీలైనంత వరకు ఎవరినీ బాధ పెట్టకుండా ఉండటం చేస్తే చాలు. మొదటి దానివల్ల పుణ్యం వస్తుంది. రెండవ దాని వల్ల పాపం రాకుండా ఉంటుంది. ఇవి ఎంత తేలిక అంటే చేయాలి అనిపించదు.

మనిషికి పుణ్యం కావాలి. కాని, పుణ్యకార్యాలు చేయడు. ''సత్కర్మంబు లెవ్వియు చేయ జాలరు కలియుగంబున మానవుల్'' అంటాడు వ్యాసభగవానుడు భాగవతం ప్రారంభంలో. పాపం వద్దు అనుకుంటాడు. కాని చెడ్డ పనులు మానలేడు. ఈ ఒక్కసారికే అని తనకి తాను సద్ది చెప్పుకుంటాడు. దీనికి దుర్యోధనుడు ఉదాహరణ. ''నాకు ధర్మం తెలుసు. కాని, నా మనసు దాని మీదకి పోదు. నాకు అధర్మమూ తెలుసు. కాని, నా మనసు దాని నుండి మళ్లించలేను.'' అంటాడు. ఈ లక్షణం అందరిలోనూ ఇంతో అంతో ఉంటుంది. కాని, ఆ సంగతి పైకి ధైర్యంగా చెప్పలేరు. కొంతమంది ఈ గుణం తమలో ఉన్నట్టు గుర్తించరు కూడా. తాము చేసేది ధర్మమే అని నమ్మేవారు కొంతమంది. మరికొంతమంది ధర్మం కాదని తెలిసినా సమర్థించుకుంటూ ఆత్మవంచన చేసుకునే వారు కూడా ఉన్నారు.

వైద్యుడు దుష్టాంగాన్ని కత్తితో కోస్తాడు. అది పాపకార్యం అవుతుందా? యుద్ధంలో సైనికుడు శత్రువుని సంహరిస్తే, అది పుణ్యకార్యమే కాని, పాపం కాదు. చేసే పని ఉద్దేశం, దానివల్ల కలిగే ప్రయోజనం పాపమా? పుణ్యమా? అన్న దానిని నిర్ధారిస్తుంది. ఏ పనీ దాని అంతట అది మంచిది కాని, చెడ్డది కాని కాదు. ఫలితం మేలు కలిగిస్తుందా? హాని కలిగిస్తుందా అన్న దాని మీద ఆధార పడి ఉంటుంది. నవ్వి, పాటలు పాడి, బాధించే వారు లేరా? అది పాపమే కదా! భావనకే ప్రాధాన్యం.

కొన్నిసార్లు కఠినంగా మాట్లాడటం, ప్రవర్తించటం అవసరమే. దాని వల్ల పాపం చుట్టుకోదు. తమ్ముడు భ్రష్టుడై ఇల్లు గుల్ల చేసి వెళ్ళిపోయాడని తెలిసి పుట్టింటికి వచ్చిన నిగమశర్మ అక్క తల్లితండ్రులను "తీండ్ర గల వచన రచనా చమత్కారంబుల కొంత కొంత వంతకుం తొలంగించుచు .." అంటాడు తెనాలి రామకృష్ణుడు. ఓదార్పు దుఃఖాన్ని, ఆత్మన్యూనతాభావాన్ని పెంచే అవకాశం ఉంది. తిక్కగా ఏడుస్తున్న పిల్లవాడిని తిక్క నుండి బయటకు తీసుకు రావటానికి చిన్న దెబ్బ వేయటం క్రూరకృత్యం అనలేము కదా! అప్పుడు స్పృహలోకి వచ్చి మామూలు ఏడుపు ఏడుస్తాడు.

– డా.ఎన్. అనంతలక్ష్మి

ఆత్మదర్శిని



శుద్ధ చైతన్యస్థితే దైవం

మనిషి ఆనందం తనలోనే ఉండగా వేరొకచోట వెదుకుతున్నాడు. ఆత్మతో ఉండాలంటే నిరంతరం నీవు సాక్షిగా ఉండాలి. అనుభవించేవాడిని గమనిస్తూ ఉండాలి. కానీ మనం ఆ అనుభవించేవాడితో కలిసిపోతున్నాం. ప్రతి క్షణం మెలకువగా ఉంటూ పోతే నీకు పుట్టుక, చావు అనేవి లేవని అర్థమవుతుంది. నీలోని దైవంతో తిరిగి ఏకమవ్వడమే ఆనందం. కూతురి విజయంలోనో, భర్త సంపాదనలోనో, ఉద్యోగంలో ఎదుగుదలలోనో నీ ఆనందాన్ని వెతుక్కోవడం ఇకనైనా ఆపు. బాహ్యప్రపంచంలో నీవు ఏమి పొందినా అవి నీకు ఆనందాన్ని ఇవ్వకపోగా వ్యథని, సమస్యలను పెంచుతాయి. అందుకే నీ ప్రయాణం నీలోపలే జరగాలి. అలాగని విషయాలలో పాల్గొనకుండా ఉండటం కాదు, నీ పనులు చేస్తూనే వాటితో వేరుపడి ఉండాలి. నీ ఆత్మలో కేంద్రీకృతమై ఉండాలి ఏ పని చేస్తున్నా. ఇదికావాలి, అది కావాలి అని దైవాన్ని కోరటం, అవి తీరితే నీకు దైవకృప లభించింది అనుకోవడం సరికాదు. అసలు దైవకృప అనేది విషయాలకు సంబంధించినదే కాదు. అది నీ ఆత్మకు సంబంధించినది. నీవు మనస్సుతో కలిసిపోయి దుఃఖంలో కూరుకుపోయినప్పుడు నిద్రాణమైన నీ ఆత్మను చైతన్యపరిచేదే కృప. నీ ఆత్మలోనే అనంతమైన ఆనందం ఉంది. అదే అసలైన సంపద. కోరికలు తీరడం కృపకాదు, సంపద కూడా కాదు. అసలు కోరిక అంటేనే ఈ క్షణాన్ని స్వీకరించ కుండా, ఈ క్షణం ఇంకోలా ఉండాలి అని కోరడం.



అంటే నీవే ఆనందానికి దూరమౌతున్నావు. అలాకాకుండా ప్రతిక్షణాన్ని స్వీకరిస్తే ఈ క్షణంలో ఉంటావు. ఆత్మానందాన్ని పొందుతావు. కోరిక అనేది అడుగులేని చేదలాంటిది. నీ ఆత్మనే సత్యం. కోరిక అంతమైనపుడే ఆనందం వస్తుంది. పుణ్యక్షేత్రాల దర్శనం కూడా నీకు ఆనందాన్ని ఇవ్వలేదు. ఎందుకంటే అది బయట చేసే ప్రయాణం. నీలోనికి నీవు ప్రయాణించినపుడే నీలోని ఆత్మను తెలుసుకుంటావు. ఆత్మనే సత్యం, దైవం. దైవాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకోని వారు దైవం గురించి వర్ణనలు చేస్తారు, సిద్ధాంతాలు చెప్తారు. కానీ దైవాన్ని అనుభవంతో తెలుసుకున్న ఋషులు, యోగులు దైవాన్ని చేరే మార్గాన్ని సూచిస్తారు. దైవం గురించిన వర్ణనలు, రూపాలు మొదలైనవన్నీ మనస్సుకు సంబంధించినవి. మనస్సు అనేదే కల్పన. దైవం మనస్సుకు అతీతం. దైవం గురించిన ఆలోచనలు నిన్ను దైవం వద్దకు చేర్చలేవు. ఆలోచన ఏదైనా నీవు వాటిని గమనించే సాక్షిగా ఉండాలి. అహం అంతమైతేనే దైవం అనుభవమౌతుంది.

ఆలోచనలు, కోరికలు నశించాలి. చివరికి ఆత్మను గురించి కూడా ఊహించవద్దు. అందుకే బుద్ధుడు ఆత్మకూడా లేదన్నాడు. దైవాన్ని చేరుకోవాలనే కోరిక కూడా చివరికి నశించాలి. అప్పుడే, ఆ కోరికలే లేని స్థితిలోనే నీవు 'ఈ క్షణం'లోకి జారుకుంటావు. ఆ శుద్ధ చైతన్యస్థితే దైవం. అన్నిరకాల ఆలోచనలను, కోరికలను వదిలినపుడే దైవం అనుభవమౌతుంది.

– స్వామి మైత్రేయ, ఆధ్యాత్మిక బోధకులు

ఆధ్యాత్మికకథ


శుభ సంకల్పం

అనంతపురం జిల్లా నుంచి ఓ తల్లీ కొడుకు స్వామి వారి దర్శనం చేసుకుందామని తిరుమల కొండకు వచ్చారు. కళ్యారా గోవిందుని దర్శనం చేసుకుని ప్రసాదంగా ఇచ్చిన బెల్లం పొంగలి తింటూ గుడి బయటికి వచ్చారు. మహాద్వారం ఎదురుగా ఉన్న బేడి ఆంజనేయ స్వామి దగ్గర ఉన్న మెట్ల మీద కూర్చుని ప్రసాదం తిన్నారు.

చాలా రోజులుగా ఆమెకు శేషాచలం కొండల్లోని జపాలి తీర్థం వెళ్ళి ఆంజనేయస్వామిని దర్శనం చేసుకోవాలని ఉండేది. అదే విషయం ఇంటర్మీడియట్ చదివి మెడిసిన్ ఎంట్రెన్స్ వ్రాయబోతున్న కొడుకుతో చెప్పింది. అతడూ జపాలి చూడటానికి ఆసక్తి చూపాడు. ఇద్దరూ బస్సు ఎక్కి జపాలి చేరుకున్నారు.

బస్సు దారి నుంచి జపాలి గుడికి కాలి మెట్ల మార్గం ఉంది. నడుస్తూ ఉంటే వారికి దారి ఇరువైపులా ఉన్న చెట్లే కాదు, మట్టి, రాళ్ళు కూడా మంచి అనుభూతిని కలిగించాయి. వంగినట్లు ఉన్న ఆకాశం, 'అందుకోవచ్చు' అన్నట్లుగా ఉన్న మేఘాలను చూస్తూ ఇద్దరూ నడుస్తూ ఉన్నారు.

కొద్దిదూరం వెళ్ళాక తల్లి ఒక చోట ఆగింది. చెట్ల మధ్యకు వెళ్ళి ఒక రాయి తీసి బండ నేల మీద పెట్టింది. మళ్ళీ మరో రాయిని దానిమీద పెట్టింది. ఇలా రాయి మీద రాయి... నాలుగు రాళ్ళు పైపైన పెట్టుకుంటూ వచ్చింది. పెట్టడం పూర్తి అయ్యాక, జపాలి గుడివైపు తిరిగి నమస్కరించింది.



ఎప్పుడూ శుభసంకల్పం అనేది మనలో మంచి ఆలోచనలు కలుగజేస్తుంది. దానివల్ల మన మనసు, శరీరం రెండూ నూటికి నూరుశాతం సహకరిస్తాయి. గట్టిగా సంకల్పం చేసిన మనం కూడా మంచి ఫలితం రావడానికి తీవ్రమైన కృషి చేస్తాము. అప్పుడు ఫలితాలు మనకి సానుకూలంగా ఉంటాయి".

ఆశ్చర్యంగా కొడుకు ''ఎందుకలా చేశావు? ఏమని మొక్కుకున్నావు?'' అని అడిగాడు.

''అలా చేస్తే మనం కోరుకున్న కోరికలు నెరవేరుతాయని నమ్మకం. అందుకని అలా రాయి మీద రాయి పెట్టి మనం వేసిన వేరుశనగ తోట బాగా పండాలని, వచ్చిన ఫలితంతో ఇల్లు కట్టుకోవాలని కోరుకున్నాను'' అని బదులిచ్చింది.

''అలా కోరుకుంటే మనం కోరుకున్నది జరుగుతుందా?'' అని మళ్ళీ ఎదురుప్రశ్న వేశాడు.

''జరుగుతుందని నమ్మకం. ఇలా రాయి మీద రాయి పెట్టి స్వామికి నమస్కరిస్తున్నామంటేనే మనం ఆశిస్తున్న మంచిపనికి పునాది రాయి వేస్తున్నామన్నమాట. ఎప్పుడూ శుభసంకల్పం అనేది మనలో మంచి ఆలోచనలు కలుగజేస్తుంది. దానివల్ల మన మనసు, శరీరం రెండూ నూటికి నూరుశాతం సహకరిస్తాయి. గట్టిగా సంకల్పం చేసిన మనం కూడా మంచి ఫలితం రావడానికి తీవ్రమైన కృషి చేస్తాము. అప్పుడు ఫలితాలు మనకి సానుకూలంగా ఉంటాయి'' అని ఆమె బదులిచ్చేలోగా కొడుకు అక్కడ లేడు. దూరంగా రాయి మీద రాయి పెట్టి మెడిసిన్‌లో సీటు రావాలని ప్రార్థిస్తూ కనిపించాడు.

ఇద్దరూ చిన్నగా నడుచుకుంటూ వెళ్ళి జపాలి లోని రామగుండంలో స్నానమాచరించి ఆంజనేయస్వామి దర్శనం చేసుకుని వెనుదిరిగారు.

– ఆర్.సి.కృష్ణస్వామి రాజు

సాక్షి సినిమా

పవర్‌ఫుల్ సర్దార్



• కార్తీ

హీరో కార్తీ, దర్శకుడు పీఎస్ మిత్రన్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న తాజా చిత్రం 'సర్దార్ 2'. ఈ చిత్రంలో మాళవికా మోహనన్, ఆషికా రంగనాథ్, రజిషా విజయన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఎస్. లక్ష్మణ్ కుమార్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఆదివారం (మే 25) కార్తీ బర్త్ డే. ఈ సందర్భంగా 'సర్దార్ 2' నుంచి కార్తీ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. కార్తీ హీరోగా పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో 2022లో 'సర్దార్' చిత్రం వచ్చిన సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో తండ్రీకొడుకులుగా కార్తీ ద్విపాత్రాభినయం చేశారు. తండ్రి పాత్ర పేరు సర్దార్ అనే సంగతి గుర్తుండే ఉంటుంది.



• విఘ్నేష్, గుణశేఖర్, నీలిమ గుణ, కాల భైరవ, పృథ్వీ

మేం ఈ కథని నమ్మాం

- దర్శకుడు గుణశేఖర్

''నేను ఏ సినిమా చేసినా ఒకే జానర్, ఒకే బ్యాక్‌డ్రాప్‌లో ఉండవు. అలా గతంలో చిరంజీవిగారితో 'చూడాలని ఉంది', ఎన్టీఆర్‌తో 'రామాయణం', మహేశ్‌బాబుతో 'ఒక్కడు' లాంటి కొత్త ప్రయత్నాలు చేస్తే ప్రేక్షకులు ఆశీర్వదించారు. ఇప్పుడు ఈ 'యుఫోరియా' కథను నేను, నా ఫ్యామిలీ నమ్మాం. అందుకే ఈ సినిమా తీశాను. ప్రేక్షకులను మా చిత్రం మెప్పిస్తుందనే నమ్మకం ఉంది'' అని దర్శకుడు గుణశేఖర్ అన్నారు. గుణశేఖర్ దర్శకత్వంలో నీలిమ గుణ నిర్మించిన చిత్రం 'యుఫోరియా'. నూతన నటీనటులతో పాటు ప్రముఖ తారలు భూమిక చావ్లా, సారా అర్జున్, నాజర్, రోహిత్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు.

ఈ చిత్రంలోని 'ఫ్లై హై...' అంటూ సాగే తొలి పాటను విడుదల చేశారు. కాల భైరవ స్వరపరచిన ఈ పాటకు కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించారు. కాల భైరవ, పృథ్వీ చంద్ర, గాయత్రీ నటరాజన్ ఆలపించారు. ఈ పాట ఆవిష్కరణ కార్యక్రమంలో గుణశేఖర్ మాట్లాడుతూ – ''ఈ 'ఫ్లై హై'తో పాటు సినిమాలో ఉన్న మూడు పాటలూ వినూత్నంగా ఉంటాయి. యూత్‌ఫుల్ బ్యాక్‌డ్రాప్‌తో ఈ సినిమా తీస్తున్నాను. కథ నచ్చి మా ఫ్యామిలీ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది'' అని చెప్పారు. ''ఫ్లై హై'లాంటి మంచి పాట ఇచ్చిన కాల భైరవగారికి థాంక్స్'' అని నీలిమ గుణ అన్నారు. ''యుఫోరియా' మూవీ డిఫరెంట్‌గా ఉంటుంది. అందుకే కొత్త రకం మ్యూజిక్ ఇవ్వడానికి ట్రై చేశాను'' అన్నారు కాల భైరవ. ''తక్కువ సమయంలో గుణశేఖర్‌లాంటి దర్శకుడితో పని చేసే అవకాశం రావడం హ్యాపీ'' అని కొరియోగ్రాఫర్ ఈశ్వర్ తెలిపారు. ఇంకా ఈ చిత్రంలో హీరోగా నటించిన విఘ్నేష్ గవిరెడ్డి, విలన్ పృథ్వీరాజ్ అడ్డాల కూడా మాట్లాడారు.

ముగిసిన కాన్స్ చిత్రోత్సవాలు

• ఇరానియన్ ఫిల్మ్ మేకర్ జాఫర్‌కు పామ్ డి ఓర్ పురస్కారం
• భారతీయ చిత్రం 'హోమ్‌బౌండ్'కు నిరాశ




• ఆలియా భట్

కాన్స్ చిత్రోత్సవాలు ముగిశాయి. ఈ నెల 13 నుంచి 24 వరకు ఫ్రాన్స్‌లో 78వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ జరిగింది. ఫ్రెంచ్ యాక్టర్ జూలియట్ బినోచే ఈసారి జ్యూరీ ప్రెసిడెంట్‌గా, ముంబై ఫిల్మ్ మేకర్ పాయల్ కపాడియా జ్యూరీ సభ్యురాలిగా వ్యవహరించారు. ఈ చిత్రోత్సవాల్లో ప్రతిష్ఠాత్మక 'పామ్ డి ఓర్' అవార్డు ఈ ఏడాది ఇరానియన్ ఫిల్మ్ మేకర్ జాఫర్ పనాహీ దర్శకత్వం వహించిన 'ఇట్ వాజ్ జస్ట్ యాన్ యాక్సిడెంట్' సినిమాకు దక్కింది. మరో ప్రతిష్ఠాత్మక అవార్డు 'గ్రాండ్ ప్రి' హాలీవుడ్ చిత్రం 'సెంటిమెంటల్ వేల్యూ'ని వరించింది. ఈ చిత్రానికి జోచిన్ ట్రియర్ దర్శకత్వం



• 'సెంటిమెంటల్ వేల్యూ' చిత్రబృందం



• జాఫర్ పనాహీ

వహించారు. పోర్చ్‌గీసు చిత్రం 'ది సీక్రెట్ ఏజెంట్'కిగాను క్లేబర్ మెండోన్కా ఫిల్హోకు ఉత్తమ దర్శకుడి అవార్డు దక్కింది. ఇదే సినిమాలో నటించిన బ్రెజిల్ యాక్టర్ వాగ్నర్ మౌరాకు ఉత్తమ పెర్ఫార్మర్ అవార్డు. ఫ్రెంచ్ ఫిల్మ్ 'ది లిటిల్ సిస్టర్'లోని నటనకుగానూ నటి నాడియా మెల్లిటి బెస్ట్ పెర్ఫార్మెన్స్ యాక్ట్రెస్‌గా అవార్డు అందుకున్నారు. అమెరికన్ నటుడు– దర్శక–నిర్మాత రాబర్ట్ డి నీరో, మరో అమెరికన్ నటుడు–దర్శక–నిర్మాత డెంజిల్ వాషింగ్టన్ గౌరవప్రదమైన (జీవిత సాఫల్య పురస్కారం) పామ్ డి ఓర్ అవార్డులను స్వీకరించారు. అయితే ఈవెంట్ క్లోజింగ్ సమయంలో సదరన్ ఫ్రాన్స్‌లో అనూహ్యంగా పవర్ కట్స్ జరగడంతో కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ క్లోజింగ్ ఈవెంట్‌లో కొన్ని అవాంతరాలు ఎదురయ్యాయి.

ఒక్క అవార్డు కూడా లేదు: ఈ ఏడాది కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఎంపికైన ఏకైక భారతీయ చిత్రం 'హోమ్ బౌండ్'. హైదరాబాద్ ఫిల్మ్ మేకర్ నీరజ్ ఘైవాన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఇషాన్ కట్టర్, జాన్వీ కపూర్, విశాల్ జేత్వాని లీడ్ రోల్స్ చేశారు. ఈ చిత్రం 'అన్ సర్టెన్ రిగార్డ్' విభాగంలో అవార్డు కోసం పోటీ పడగా, నిరాశ ఎదురైంది. కాగా పాయల్ కపాడియా తీసిన 'ఆల్ వుయ్ ఇమాజిన్ యాజ్ ఏ లైట్' చిత్రానికి గత ఏడాది గ్రాండ్ ప్రి అవార్డు దక్కిన విషయం గుర్తుండే ఉంటుంది. ఇక ఈ ఏడాది భారత దేశానికి ఒక్క అవార్డు కూడా రాలేదు. కాగా 'అన్ సర్టెన్ రిగార్డ్' విభాగంలో ఈ ఏడాది ఫ్రాన్స్ దర్శకుడు డియెగో సస్పెడెస్ తెరకెక్కించిన 'మిస్టీరియస్ గేజ్ ఆఫ్ ది ఫ్లెమింగో' సినిమాకు అవార్డు దక్కింది.


నాదే ఈ లోకమంతా...

'ట్రాన్స్ ఆఫ్ కుబేర' అంటూ వీక్షకులకు ఓ వీడియో గ్లింప్స్‌తో కొత్త అనుభూతినిచ్చారు శేఖర్ కమ్ముల. 'నాది నాది నాది నాది నాదే ఈ లోకమంతా... నేల నాది గింజ నాది...' అనే పాటతో ఈ గ్లింప్స్ సాగుతుంది. చిత్రంలో లీడ్ రోల్స్ చేస్తున్న నాగార్జున, ధనుష్, రష్మికా మందన్నా, జిమ్ సర్బ్‌లతో పాటు కొన్ని క్యారెక్టర్లు ఈ వీడియో గ్లింప్స్‌లో కనిపిస్తాయి. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్–ప్యాక్డ్ డ్రామా 'కుబేర'లోని ఈ సెకండ్ గ్లింప్స్‌ను ఆదివారం విడుదల చేశారు. చిత్ర సంగీతదర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ స్వరపరచిన 'నాది నాది నాది నాదే ఈ లోకమంతా' పాటకు నంద కిశోర్ సాహిత్యం అందించగా హీరో ధనుష్, హేమచంద్ర వేదాల ఆలపించారు. ఈ పాన్ ఇండియన్ థ్రిల్లర్ యాక్షన్ మూవీని శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పి, అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో త్వరలో విడుదల కానుంది.



• రష్మిక, నాగార్జున, ధనుష్

సెప్టెంబరులో ఓజీ



• పవన్ కల్యాణ్

పవన్‌కల్యాణ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఓజీ'. ఈ చిత్రంలో ప్రియాంకా మోహన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఇమ్రాన్ హష్మి ఓ లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. సుజిత్ దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ ముంబైలో జరుగుతోందని తెలిసింది. కాగా 'ఓజీ'ని ఈ ఏడాది సెప్టెంబరు 25న విడుదల చేయనున్నట్లుగా ఆదివారం మేకర్స్ వెల్లడించారు. శ్రియా రెడ్డి, అర్జున్ దాస్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: తమన్.

చిన్ని తప్పులేవో...

అర్జున్ అంబటి హీరోగా నటించిన తాజా చిత్రం 'పరమపద సోపానం'. జెన్నిఫర్ ఇమ్మాన్యుయేల్ హీరోయిన్. గుడిమిట్ల శివ ప్రసాద్ నిర్మించగా, గుడిమిట్ల ఈశ్వర్ సహ నిర్మాతగా వ్యవహరించారు. పూరి జగన్నాథ్ వంటి ప్రముఖ దర్శకుల దగ్గర దర్శకత్వ శాఖలో చేసిన నాగ శివ 'పరమపద సోపానం' చిత్రానికి కథ, మాటలు, స్క్రీన్ ప్లే సమకూర్చి, దర్శకత్వం వహించారు. జూలై 11న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రంలోని 'చిన్ని చిన్ని తప్పులేవో' అంటూ సాగే పాటను రిలీజ్ చేశారు. దేవ్ జాంద్ స్వరపరచిన ఈ పాటకు రాంబాబు గోశాల సాహిత్యం అందించగా పృథ్వీ చంద్ర, అదితీ బావరాజు ఆలపించారు.



• జెన్నిఫర్, అర్జున్



రన్నరప్ శ్రీకాంత్


కౌలాలంపూర్: కెరీర్‌లో మరో అంతర్జాతీయ టైటిల్ సాధించాలని ఆశించిన భారత అగ్రశ్రేణి బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిడాంబి శ్రీకాంత్‌కు నిరాశ ఎదురైంది. మలేసియా ఓపెన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నీలో ప్రపంచ మాజీ నంబర్‌వన్, ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ శ్రీకాంత్ రన్నరప్‌గా నిలిచాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ 65వ ర్యాంకర్ శ్రీకాంత్ 11-21, 9-21తో ప్రపంచ నాలుగో ర్యాంకర్ లీ షి ఫెంగ్ (చైనా) చేతిలో ఓడిపోయాడు. 36 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో శ్రీకాంత్ అడపాదడపా మెరిపించినా చివరకు చైనా ప్లేయర్‌దే పైచేయి అయింది. రన్నరప్‌గా నిలిచిన శ్రీకాంత్‌కు 18,050 డాలర్ల (రూ. 15 లక్షల 35 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 7800 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. 'మళ్లీ పోడియంపైకి వచ్చి పతకం అందుకోవడం చాలా సంతోషంగా అనిపిస్తోంది. ఫైనల్ ఫలితం నిరాశపరిచినా, ఓవరాల్‌గా ఈ టోర్నీలో నా ప్రదర్శన పట్ల సంతృప్తిగా ఉన్నా' అని 32 ఏళ్ల శ్రీకాంత్ వ్యాఖ్యానించాడు. 2017లో ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ సిరీస్ టైటిల్ సాధించిన తర్వాత శ్రీకాంత్ మరో అంతర్జాతీయ టైటిల్ నెగ్గలేకపోయాడు. 2019లో ఇండియా ఓపెన్‌లో, 2021 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఫైనల్ చేరిన శ్రీకాంత్ రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు.

ఆఖర్లో అదరహో

తమ చివరి లీగ్ మ్యాచ్‌ల్లో హైదరాబాద్, చెన్నై ఘనవిజయం

110 పరుగులతో కోల్‌కతాపై సన్‌రైజర్స్ జయభేరి ● 83 పరుగులతో గుజరాత్‌పై సూపర్ కింగ్స్ గెలుపు

'ప్లే ఆఫ్స్' రేసు నుంచి తప్పుకున్న జట్లు... తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌ల్లో దంచికొట్టాయి. గుజరాత్ టైటాన్స్‌తో పోరులో చెన్నై దుమ్మురేపి 230 పరుగులు చేస్తే... కోల్‌కతా నైట్‌రైడర్స్‌పై సన్‌రైజర్స్ హైదరాబాద్ 278 పరుగులతో విరుచుకుపడింది. అంచనాల ఒత్తిడి లేకపోవడంతో స్వేచ్ఛగా ఆడిన ఈ రెండు జట్లు విజయాలతో సీజన్‌ను ముగించాయి. గుజరాత్‌తో పోరులో చెన్నై బ్యాటర్లు కాన్వే, బ్రెవిస్ హాఫ్ సెంచరీలతో విజృంభిస్తే... నైట్ రైడర్స్ బౌలర్లను క్లాసెన్, హెడ్ చీల్చి చెండాడారు. సీజన్ ఆరంభ పోరులో రాజస్తాన్ రాయల్స్‌పై 286 పరుగులు చేసి అదరగొట్టిన ఆరెంజ్ ఆర్మీ... తమ ఆఖరి మ్యాచ్‌లో మరోసారి మూడొందలకు చేరువైంది. అభిషేక్ శర్మ, హెడ్ మెరుపులతో భారీ స్కోరుకు పునాది వేస్తే... క్లాసెన్ దాన్ని మరో స్థాయికి తీసుకెళ్లాడు. మధ్యలో నిలకడలేమితో పరాజయాలు మూటగట్టుకున్న ఆరెంజ్ ఆర్మీ... చివరి మూడు మ్యాచ్‌ల్లోనూ విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో ఆరో స్థానానికి ఎగబాకింది.



క్లాసెన్

న్యూఢిల్లీ: విధ్వంసకర ఆటతీరుతో ఐపీఎల్‌లో భారీ స్కోర్లకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ స్థాయికి తగ్గ ప్రదర్శనతో సీజన్‌కు వీడ్కోలు పలికింది. ఆదివారం జరిగిన పోరులో సన్‌రైజర్స్ 110 పరుగుల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్)పై విజయం సాధించింది. మొదట సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 278 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హెన్రిచ్ క్లాసెన్ (39 బంతుల్లో 105 నాటౌట్; 7 ఫోర్లు, 9 సిక్స్‌లు) అజేయ శతకంతో కదంతొక్కగా... ట్రావిస్ హెడ్ (40 బంతుల్లో 76; 6 ఫోర్లు, 6 సిక్స్‌లు) దంచికొట్టాడు. బంతి తన పరిధిలో ఉంటే చాలు దానిపై ఆకలిగొన్న సింహంలా విరుచుకుపడిన క్లాసెన్ 37 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అభిషేక్ శర్మ (16 బంతుల్లో 32; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), కూడా రాణించాడు. లక్ష్యఛేదనలో కోల్‌కతా నైట్‌రైడర్స్ 18.4 ఓవర్లలో 168 పరుగులకు ఆలౌటైంది.

దంచుడే... దంచుడు

మొదట బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ తొలి ఓవర్‌లో 2 పరుగులకే పరిమితమైంది. ఆ తర్వాతి నుంచి వెనుదిరిగి చూసుకోని రైజర్స్... ఫోర్లు, సిక్స్‌లతో మైదానాన్ని మోతెక్కించింది. రెండో ఓవర్‌లో హెడ్ సిక్స్‌తో ఖాతా తెరవగా... అభిషేక్ రెండు ఫోర్లు బాదాడు. మూడో ఓవర్‌లో 6, 4, 2, 6 బాదిన హెడ్... నాలుగో ఓవర్‌లో మరో మూడు ఫోర్లు కొట్టాడు. నోర్జే ఓవర్‌లో అభిషేక్ 2 ఫోర్లతో చెలరేగడంతో పవర్‌ప్లే ముగిసేసరికి రైజర్స్ 79 పరుగులు చేసింది. నరైన్ ఓవర్‌లో రెండు సిక్స్‌లు కొట్టిన అభిషేక్... మరో షాట్ ఆడే ప్రయత్నంలో ఔట్ కాగా... క్లాసెన్ రాకతో విధ్వంసం మరో స్థాయికి చేరింది. ఒకవైపు హెడ్, మరోవైపు క్లాసెన్ బౌలర్‌తో సంబంధం లేకుండా భారీ షాట్లతో విరుచుకుపడటంతో... 10 ఓవర్లు ముగిసేసరికి ఆరెంజ్ ఆర్మీ 139/1తో నిలిచింది. ఈ క్రమంలో హెడ్ 26 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకోగా... హర్షిత్ ఓవర్‌లో 4, 6, ,6తో క్లాసెన్ 17 బంతుల్లోనే హాఫ్‌సెంచరీ అందుకున్నాడు. హెడ్‌ను ఔట్ చేయడం ద్వారా నరైన్ ఈ జోడీని విడదీయగా ... ఇషాన్ కిషన్ వేగంగా ఆడలేకపోయాడు. నరైన్ ఓవర్‌లో 2 సిక్స్‌లు కొట్టిన క్లాసెన్... వరుణ్‌కు అదే శిక్ష వేసి సెంచరీకి సమీపించాడు. రసెల్ ఓవర్‌లో 6, 4 కొట్టిన క్లాసెన్... అరోరా బౌలింగ్‌లో రెండు పరుగులు తీసి 37 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అభిషేక్ (సి) రింకూ (బి) నరైన్ 32; హెడ్ (సి) రసెల్ (బి) నరైన్ 76; క్లాసెన్ (నాటౌట్) 105; ఇషాన్ కిషన్ (సి) నోర్జే (బి) వైభవ్ 29; అనికేత్ (నాటౌట్) 12; ఎక్స్‌ట్రాలు 24; మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 278. **వికెట్ల పతనం:** 1-92, 2-175, 3-158. **బౌలింగ్:** వైభవ్ అరోరా 4-0-39-1; నోర్జే 4-0-60-0; హర్షిత్ రాణా 3-0-40-0; నరైన్ 4-0-42-2; వరుణ్ చక్రవర్తి 3-0-54-0; రసెల్ 2-0-34-0.

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: డికాక్ (సి) మనోహర్ (బి) మలింగ 9; నరైన్ (బి) ఉనాద్కట్ 31; రహానే (సి) అభిషేక్ (బి) ఉనాద్కట్ 15; రఘువంశీ (సి) నితీశ్ (బి) మలింగ 14; రింకూ (సి) నితీశ్ (బి) హర్ష్ దూబే 9; రసెల్ (ఎల్బీ) (బి) హర్ష్ దూబే 0; మనీశ్ పాండే (సి) మనోహర్ (బి) ఉనాద్కట్ 37; రమణ్‌దీప్ (బి) హర్ష్ దూబే 13; హర్షిత్ (సి అండ్ బి) మలింగ 34; వైభవ్ అరోరా (రనౌట్) 0; నోర్జే (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 6; మొత్తం (18.4 ఓవర్లలో ఆలౌట్) 168. **వికెట్ల పతనం:** 1-37, 2-55, 3-61, 4-70, 5-70, 6-95, 7-110, 8-162, 9-162, 10-168. **బౌలింగ్:** కమిన్స్ 2-0-25-0; ఉనాద్కట్ 4-0-24-3; హర్షల్ 2-0-21-0; ఇషాన్ మలింగ 3.4-0- 31-3; హర్ష్ దూబే 4-0-34-3; నితీశ్ రెడ్డి 1-0-6-0; అభిషేక్ 2-0-25-0.

278/3 ఐపీఎల్‌లో ఇది మూడో అత్యధిక స్కోరు. తొలి రెండు స్థానాల్లోనూ సన్‌రైజర్స్ జట్టే ఉంది. 2024లో బెంగళూరుపై 287/5 స్కోరు చేసిన హైదరాబాద్... ఈ ఏడాది తమ తొలి మ్యాచ్‌లో రాజస్తాన్‌పై 286/5 పరుగులు చేసింది.

37 సెంచరీకి క్లాసెన్ తీసుకున్న బంతులు. ఐపీఎల్‌లో ఇది మూడో వేగవంతమైన శతకం. క్రిస్ గేల్ (30 బంతుల్లో), వైభవ్ సూర్యవంశీ (35 బంతుల్లో), యూసుఫ్ పఠాన్ (37 బంతుల్లో) తొలి మూడు స్థానాల్లో ఉన్నారు.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
గుజరాత్	14	9	5	0	18	0.254
పంజాబ్	13	8	4	1	17	0.327
బెంగళూరు	13	8	4	1	17	0.262
ముంబై	13	8	5	0	16	1.292
ఢిల్లీ	14	7	6	1	15	0.011
హైదరాబాద్	14	6	7	1	13	-0.241
లక్నో	13	6	7	0	12	-0.337
కోల్‌కతా	14	5	7	2	12	-0.305
రాజస్తాన్	14	4	10	0	8	-0.549
చెన్నై	14	4	10	0	8	-0.647

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, పా-పాయింట్లు, ర.రే- రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

ముంబై × పంజాబ్
వేదిక: జైపూర్

రాత్రి 7:30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

అహ్మదాబాద్: ఐపీఎల్ 18వ సీజన్‌ను చెన్నై సూపర్ కింగ్స్ జట్టు విజయంతో ముగించింది. పాయింట్ల పట్టికలో చివరిదైన పదో స్థానంలో నిలిచిన ధోనీ బృందం... ఆదివారం తమ చివరి లీగ్ మ్యాచ్‌లో 83 పరుగుల తేడాతో గుజరాత్ టైటాన్స్‌పై గెలుపొందింది. మొదట చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 230 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డెవాల్డ్ బ్రెవిస్ (23 బంతుల్లో 57; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు), కాన్వే (35 బంతుల్లో 52; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధశతకాలతో ఆకట్టుకున్నారు. ఆయుశ్ మాత్రే (17 బంతుల్లో 34; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), ఉర్విల్ పటేల్ (19 బంతుల్లో 37; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడారు. అర్షద్ ఖాన్ వేసిన రెండో ఓవర్‌లో ఆయుశ్ చెలరేగి వరుసగా 2, 6, 6, 4, 4, 6తో 28 పరుగులు రాబట్టాడు. క్రీజులో అడుగుపెట్టిన ప్రతీ బ్యాటర్ దంచికొట్టడమే పనిగా పెట్టుకోవడంతో చెన్నై భారీ స్కోరు చేయగలిగింది. అనంతరం లక్ష్యఛేదనలో గుజరాత్ 18.3 ఓవర్లలో 147 పరుగులకు ఆలౌటైంది. భారత టెస్టు జట్టులో చోటు దక్కించుకున్న సాయి సుదర్శన్ (28 బంతుల్లో 41; 6 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... మిగిలిన వాళ్లు ఆకట్టుకోలేకపోయారు. చెన్నై బౌలర్లలో అన్షుల్ కంబోజ్, నూర్ అహ్మద్ చెరో 3 వికెట్లు తీశారు. ఈ మ్యాచ్‌తో ధోని ఐపీఎల్‌కు వీడ్కోలు పలుకుతాడని జోరుగా చర్చ సాగగా... మహీ తనకు అలవాటైన రీతిలో 'వేచి చూద్దాం' అని ముక్తాయించాడు.

సంక్షిప్త స్కోర్లు

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: 230/5 (20 ఓవర్లలో) (ఆయుశ్ 34; కాన్వే 52; ఉర్విల్ 37; బ్రెవిస్ 57, ప్రసిధ్ కృష్ణ 2/22) **గుజరాత్ టైటాన్స్:** 147 ఆలౌట్ (18.3 ఓవర్లలో) (సాయి సుదర్శన్ 41; అర్షద్ ఖాన్ 20, అన్షుల్ కంబోజ్ 3/13, నూర్ అహ్మద్ 3/21, జడేజా 2/17).



బ్రెవిస్

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

ఆర్ఏసీ-డీఆర్‌డీవో, ఢిల్లీలో 148 సైంటిస్ట్ పోస్టులు

రిక్రూట్‌మెంట్ అండ్ అసెస్‌మెంట్ సెంటర్(ఆర్ఏసీ)-డీఆర్‌డీవో, ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఏడీఏ).. ఇతర విభాగాల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 148.
» **పోస్టుల వివరాలు:** సైంటిస్ట్ బి-127, ఏబీఏలో సైంటిస్ట్/ఇంజనీర్ బి-09, ఇతర రక్షణ సంస్థలలో ఎన్కాడెడ్ సైంటిస్ట్ బి-12.
» **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్-కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్-ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెటీరియల్ సైన్స్ /మెటలర్జికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కెమికల్ ఇంజనీరింగ్, ఏరోనాటికల్ /ఏరోస్పేస్ ఇంజనీరింగ్, గణితం, సివిల్ ఇంజనీరింగ్, బయోమెడికల్ ఇంజనీరింగ్, ఎంటమాలజీ, బయోస్టాటిస్టిక్స్, క్లినికల్ సైకాలజీ, సైకాలజీ.
» **అర్హత:** అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో వ్యాలిడ్ గేట్ స్కోర్‌తో పాటు ఇంజనీరింగ్/టెక్నాలజీలో బ్యాచిలర్ డిగ్రీ లేదా సైన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ కలిగి ఉండాలి. చివరి సంవత్సరం/సెమిస్టర్ విద్యార్థులు కూడా అర్హులే.
» **వయసు:** జనరల్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 35 ఏళ్లు, ఓబీసీ అభ్యర్థులకు 38 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 ఏళ్లు మించకూడదు. దివ్యాంగులకు 10 ఏళ్ల వరకు సడలింపు ఉంటుంది.
» **బేసిక్ పే:** నెలకు రూ.56,100.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ:** నోటిఫికేషన్ వెలువడిన తేదీ నుంచి 21 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలి.
» **నోటిఫికేషన్ వెలువడినతేదీ:** 20.05.2025.
» **వెబ్‌సైట్:** https://rac.gov.in

బెల్ బెంగళూరులో 28 ప్రాజెక్ట్ ఇంజనీర్-1 పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్).. తాత్కాలిక ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ప్రాజెక్ట్ ఇంజనీర్-1 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 28.
» **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్(మెకానికల్ /ఎలక్ట్రానిక్స్/ కంప్యూటర్ సైన్స్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.05.2025 నాటికి 32 ఏళ్లు ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి 55,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అసిస్టెంట్ మేనేజర్ -హెచ్ఆర్, మిలిటరీ కమ్యూనికేషన్-ఎస్‌బీయూ, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, జలహల్లి పోస్ట్, బెంగళూరు-560013 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 04.06.2025.
» **వెబ్‌సైట్:** https://bel-india.in

సీఎస్ఐఆర్-టీకెడీఎల్ యూనిట్, న్యూఢిల్లీలో వివిధ పోస్టులు

న్యూఢిల్లీలోని సీఎస్ఐఆర్-ట్రెడిషనల్ నాలెడ్జ్ డిజిటల్ లైబ్రరీ యూనిట్‌లో ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
» **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ అసోసియేట్ 1(పేటెంట్స్)-2,సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్-2.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** ప్రాజెక్ట్ అసోసియేట్‌కు 35 ఏళ్లు, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్‌కు 40ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు ప్రాజెక్ట్ అసోసియేట్‌కు రూ.31,000, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్‌కు రూ.42,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.06.2025
» **వెబ్‌సైట్:** https://www.csir.res.in

అగ్రి పీజీ.. కెరీర్ ఈజీ

అగ్రికల్చర్ అనుబంధ విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులకు చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. దేశంలో అగ్రి కోర్సులను అందించడంలో ప్రతిష్ఠాత్మకమైన ఇన్‌స్టిట్యూట్.. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్(ఐసీఏఆర్).. 2025కు సంబంధించి ఏఐఈఈఏ(పీజీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా అగ్రికల్చర్ అనుబంధ విభాగాల్లో పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనుంది. ఈ కోర్సులను పూర్తి చేసుకుంటే ఉజ్వల కెరీర్ అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఐసీఏఆర్-ఏఐఈఈఏ(పీజీ) నోటిఫికేషన్ వివరాలు, పరీక్ష విధానం, భవిష్యత్తు అవకాశాలు, ఎంట్రన్స్‌లో రాణించేందుకు ప్రిపరేషన్ తదితర సమాచారం..

» ఐసీఏఆర్, అనుబంధ ఇన్‌స్టిట్యూట్స్‌లో పీజీ ప్రోగ్రామ్స్
» ఏఐఈఈఏ పీజీ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు
» అగ్రికల్చరల్, అనుబంధ రంగాల్లో కెరీర్ అవకాశాలు
» కోర్సు చదివే సమయంలో స్కాలర్‌షిప్ సదుపాయం

ఆల్ ఇండియా కోటా సీట్లకు.. ఏఐఈఈఏ

ఐకార్‌గా సుపరిచితమైన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అనుబంధ ఇన్‌స్టిట్యూట్స్‌తోపాటు దేశ వ్యాప్తంగా ఈ ఇన్‌స్టిట్యూట్ పరిధిలోని యూనివర్సిటీలు, కళాశాలల్లో ఆల్ ఇండియా కోటా విధానంలో అందుబాటులో ఉన్న సీట్ల భర్తీకి ఆల్ ఇండియా ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ ఫర్ అడ్మిషన్ టు పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్స్(ఏఐఈఈఏ పీజీ)ను నిర్వహిస్తున్నారు. దీనిద్వారా ఐకార్-ఏయూ(అగ్రికల్చరల్ యూనివర్సిటీ) విధానంలోని అన్ని ఇన్‌స్టిట్యూట్స్‌లో 30 శాతం సీట్లకు ఏఐఈఈఏ పీజీ ఉత్తీర్ణులు పోటీపడే అవకాశముంది.

రాష్ట్రాల స్థాయిలోని అగ్రికల్చరల్ యూనివర్సిటీలు నిర్వహించే ప్రవేశ పరీక్షలకు ఐసీఏఆర్-ఏఐఈఈఏ పీజీ టెస్ట్ అదనపు పరీక్షగా చెప్పొచ్చు. అంటే.. ఒక రాష్ట్రానికి చెందిన విద్యార్థి ఏఐఈఈఏ పీజీ స్కోర్ ఆధారంగా ఇతర రాష్ట్రాల్లోని అగ్రికల్చరల్ యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్స్‌లో ఆల్ ఇండియా కోటా పరిధిలోని 30 శాతం సీట్లకు పోటీ పడే అవకాశం లభిస్తుంది.

అర్హత

10+6/12+4 విధానంలో బీఎస్సీ అగ్రికల్చర్ /బీటెక్; 10+2+5 1/2 విధానంలో.. బీవీఎస్సీ అండ్ ఏహెచ్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 50 శాతం మార్కులు సాధించి ఉంటే సరిపోతుంది. చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు 2025, జూలై 31లోపు సర్టిఫికెట్లు అందించాల్సి ఉంటుంది.

పీజీ కోర్సులు ఇవే

ప్రస్తుతం ప్లాంట్ బయోటెక్నాలజీ, ప్లాంట్ సైన్స్, ఫిజికల్ సైన్స్, యానిమల్ బయోటెక్నాలజీ, అగ్రి-బిజినెస్ మేనేజ్‌మెంట్, స్టాటిస్టికల్ సైన్స్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ/ఆగ్రో ఫారెస్ట్రీ అండ్ సివి కల్చర్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, వాటర్ సైన్స్ టెక్నాలజీ, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, వెటర్నరీ సైన్స్, ఆగ్రోనమీ, ఫిషరీస్ సైన్స్, డెయిరీ సైన్స్, డెయిరీ టెక్నాలజీ, హోంసైన్స్, సోషల్ సైన్స్ తదితర విభాగాల్లో దాదాపు 70 స్పెషలైజేషన్స్‌లో కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

ఆన్‌లైన్ విధానంలో ప్రవేశం

ఎంట్రన్స్ టెస్ట్‌లో పొందిన మార్కుల ఆధారంగా మెరిట్ జాబితా రూపొందించి.. ఆన్‌లైన్‌లో సీట్ల కేటాయింపు చేస్తారు. పీజీలో 3,459 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

స్కాలర్‌షిప్ సదుపాయం

ఏఐఈఈఏ పీజీ స్కోర్ ఆధారంగా.. ఐకార్ అనుబంధ అగ్రికల్చర్ యూనివర్సిటీల్లో ప్రవేశం పొందిన వారికి నెలకు రూ.12,640 చొప్పున రెండేళ్ల పాటు స్కాలర్‌షిప్ అందిస్తారు. అదేవిధంగా అర్హులైన అభ్యర్థులకు నేషనల్ టాలెంట్ స్కాలర్‌షిప్ (పీజీ) పేరిట ఆర్థిక ప్రోత్సాహం సైతం లభిస్తుంది.

ఏఐఈఈఏ(పీజీ) ఇలా

ఏఐఈఈఏ పీజీ పరీక్ష 120 ప్రశ్నలు-480 మార్కులకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహిస్తారు. ఈ ఆబ్జెక్టివ్ తరహా పరీక్ష సమయం 120 నిమిషాలు. ప్రతి సరైన సమాధానానికి నాలుగు మార్కులు లభిస్తాయి. అలాగే నెగెటివ్ మార్కుల నిబంధన కూడా ఉంది. ప్రతి పొరపాటు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. అటెంప్ట్ చేయని ప్రశ్నకు జీరో మార్కులు ఉంటాయి. ప్రశ్న పత్రం ఇంగ్లిష్‌లోనే ఉంటుంది.

ఉజ్వల కెరీర్

ఐసీఏఆర్-ఏఐఈఈఏ(పీజీ) ఎంట్రన్స్‌తో పీజీ ప్రోగ్రామ్‌లో చేరి.. వాటిని పూర్తి చేసుకున్న వారికి ఉజ్వల కెరీర్ అవకాశాలు లభిస్తాయని చెప్పొచ్చు. ఇటీవల కాలంలో వ్యవసాయ రంగం సైతం కొలువుల కల్పనలో ముందంజలో నిలుస్తోంది. దీంతో.. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో నైపుణ్యం ఉన్న మానవ వనరులకు డిమాండ్ పెరుగుతోంది. వ్యవసాయ విద్యను అభ్యసించిన వారికి కెరీర్ పరంగా కేంద్ర, రాష్ట్ర సంస్థల్లో వ్యవసాయ పంటల అమ్మకాలు, మార్కెటింగ్, రవాణా, సేవలు, నిల్వ, గిడ్డంగులు మొదలైన వాటిల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి.

ప్రభుత్వ కొలువులు

అగ్రికల్చర్, అనుబంధ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వ కొలువులు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. ప్రధానంగా వ్యవసాయ శాఖలో అగ్రికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్స్, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ వంటి ఉద్యోగాలను సొంతం చేసుకోవచ్చు. అదే విధంగా ప్లాంటేషన్స్, ఫర్టిలైజర్ కంపెనీలు, అగ్రికల్చరల్ మెషినరీలు, అగ్రికల్చరల్ ప్రొడక్ట్, ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తాయి. ఎఫ్‌సీఐ, నాబార్డ్‌తోపాటు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోని రూరల్ బ్యాంకింగ్ విభాగాల్లోనూ ఆఫీసర్లు, మేనేజర్లుగా కెరీర్స్ సొంతం చేసుకోవచ్చు. పీహెచ్‌డీ పూర్తి చేస్తే ఐసీఏఆర్, ఐఏఆర్ఐ వంటి అగ్రికల్చర్ రీసెర్చ్ కేంద్రాలతోపాటు డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పరిధిలోని రీసెర్చ్ కేంద్రాల్లో సైంటిస్ట్ హోదాలో స్థిరపడొచ్చు.



ఏఐఈఈఏ పీజీ 2025

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2025, జూన్ 5.
- **దరఖాస్తుల సవరణ:** 2025, జూన్ 7 నుంచి 9 వరకు.
- **ఎంట్రన్స్ తేదీ:** 2025, జూలై 3.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, సికింద్రాబాద్, కరీంనగర్, వరంగల్.
- **వెబ్‌సైట్:** https://exams.nta.ac.in/ICAR

పీహెచ్‌డీ ప్రవేశాలు ఇలా

ఐసీఏఆర్ సంస్థ ఆల్ ఇండియా ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ ద్వారా పీహెచ్‌డీ ప్రవేశాలను కూడా చేపడుతోంది. ఇందుకోసం ప్రత్యేకంగా రాత పరీక్ష నిర్వహిస్తోంది.

అర్హత

అభ్యర్థులు పీహెచ్‌డీలో ఎంపిక చేసుకున్న విభాగానికి సంబంధించి సదరు సబ్జెక్ట్ స్పెషలైజేషన్‌లో 60% మార్కులతో పీజీ ఉత్తీర్ణత సాధించాలి.

480 మార్కులకు పరీక్ష

ఐసీఏఆర్-జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్(పీహెచ్‌డీ) పరీక్ష 120 ప్రశ్నలు-480 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం 120 నిమిషాలు. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా.. క్రాప్‌సైన్స్, హార్టికల్చర్, వెటర్నరీ అండ్ యానిమల్ సైన్స్-1, డెయిరీసైన్స్, డెయిరీ టెక్నాలజీ అండ్ ఫుడ్ టెక్నాలజీ, హోంసైన్స్, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్, అగ్రికల్చరల్ ఎకానమీ అండ్ అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్, నేచురల్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఫిషరీ సైన్స్ సబ్జెక్ట్‌లలో మొత్తం 73 విభాగాల్లో పీహెచ్‌డీ స్పెషలైజేషన్లలో ప్రవేశం పొందొచ్చు.

పరీక్షను మూడు విభాగాల్లో నిర్వహిస్తారు. పార్ట్-ఎలో జనరల్ నాలెడ్జ్ అండ్ రీజనింగ్ ఎబిలిటీ నుంచి 20 ప్రశ్నలు, పార్ట్-బిలో సంబంధిత సబ్జెక్ట్‌లో 50 ప్రశ్నలు, పార్ట్-సిలో అభ్యర్థులు ఎంచుకున్న సబ్జెక్ట్‌లో 50 ప్రశ్నలు చొప్పున అడుగుతారు. ప్రతి సరైన సమాధానానికి 4 మార్కులు లభిస్తాయి. నెగెటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి పొరపాటు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. అటెంప్ట్ చేయని ప్రశ్నకు జీరో మార్కులు ఉంటాయి.

సీట్ల కేటాయింపు

ఎంట్రన్స్‌లో పొందిన మార్కుల ఆధారంగా మెరిట్ జాబితా రూపొందించి.. ఆన్‌లైన్‌లో పీహెచ్‌డీలో ప్రవేశాలు కల్పిస్తారు. పీహెచ్‌డీ స్థాయిలో 1,377 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్

పీహెచ్‌డీలో ప్రవేశం ఖరారు చేసుకున్న వారికి జేఆర్ఎఫ్, ఎస్ఆర్ఎఫ్ పేరుతో ఫెలోషిప్ అందిస్తారు. మొదటి రెండేళ్లు నెలకు రూ.37 వేలు చొప్పున జేఆర్ఎఫ్‌ను, మూడో ఏడాది ఎస్ఆర్ఎఫ్ పేరుతో నెలకు రూ.42 వేలను ఫెలోషిప్‌గా అందిస్తారు. దీనికి అదనంగా ప్రతి ఏటా రూ.10వేలు చొప్పున కాంటింజెంట్ గ్రాంట్ సైతం లభిస్తుంది.

రాత పరీక్షలో రాణించేలా

ఏఐఈఈఏ పీజీ, పీహెచ్‌డీ పరీక్షల్లో రాణించేందుకు అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న పేపర్‌ను అనుసరించి.. బ్యాచిలర్ డిగ్రీ స్థాయి, పీజీ స్థాయి పాఠ్య పుస్తకాలను లోతుగా అధ్యయనం చేయాలి. ముఖ్యంగా కోర్ అంశాలను వాస్తవ పరిస్థితులతో అన్వయం చేసుకుంటూ చదవాలి. అదే విధంగా డొమైన్ విభాగంలో కీలక భావనలు, సిద్ధాంతాలు, వాటి ఉద్దేశం వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-తెలుగు
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-సైన్స్ అండ్ టెక్నాలజీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-ఇంగ్లిష్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
769	243
81,721	24,853

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)

నాస్‌డాక్	18,737	▽	189
డోజోన్స్	41,603	▽	256
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,718	▽	21
డాక్స్	23,630	▽	370
షాంఘై	3,348	▽	32
నికాయ్	37,160	▲	175

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.60	86.62
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	114.30	117.26
€	యూరో	ఎస్‌బీఐ	95.09	98.79
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	59.26	60.81
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.32	56.53
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	63.91	68.58
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.82	23.33
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.31	24.91
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.98	12.81

ఎఫ్‌అండ్‌వో.. ఓ డేంజర్ 'గేమ్'!



ప్రసాద్(55) ఓ ప్రైవేటు ఉద్యోగి. ఇటీవలి మార్కెట్ దిద్దుబాటుకు ముందు ఎఫ్‌అండ్‌వో (ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్) మార్కెట్లోకి అడుగుపెట్టాడు. ఒక ప్రైవేటు సంస్థ సిఫారసులతో ట్రేడ్ చేయగా.. ఒక్కరోజులోనే రూ. లక్షన్నర లాభం కళ్లజూడడంతో రెట్టించిన ఉత్సాహంతో ట్రేడింగ్ చేశాడు. పది రోజుల తర్వాత అకౌంట్ చూసుకుంటే అప్పటి వరకు వచ్చిన లాభాన్నంతా మళ్లీ మార్కెట్టే పట్టుకుపోయిందని అర్థమైంది. అంతేకాదు, అదనంగా రూ.2 లక్షల పెట్టుబడి కూడా కరిగిపోయింది. అయినా సరే పోయినచోటే వెతుక్కోవాలనే తపనతో.. ప్రసాద్ పొద్దస్తమానం ఎఫ్‌అండ్‌వో ఆలోచనలతో బతికేస్తున్నాడు. ఎఫ్‌అండ్‌వో మార్కెట్ విషయంలో రిటైల్ ఇన్వెస్టర్ల పరిణతి లేమికి మచ్చుకు ఇదొక్క ఉదాహరణ మాత్రమే!

– సాక్షి, బిజినెస్ డెస్క్

- లాభాలే కాదు తేడా వస్తే నిలువునా ముంచేస్తుంది...
- నష్టాలను పూడ్చుకోవడానికి తప్పు మీద తప్పు
- రుణాలతో ట్రేడింగ్ చేస్తే పెట్టుబడికే మోసం
- సరైన వ్యూహాలు, తక్షణ సమాచారంతోనే ఫలితాలు
- టెక్నాలజీ టూల్స్, భారీ పెట్టుబడీ అవసరమే..
- ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లతో తలపడడం రిటైలర్లకు కష్టమే

సెబీ అధ్యయనం ప్రకారం 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఎఫ్‌అండ్‌వో విభాగంలో ప్రతి 10 మంది ట్రేడర్లకు గాను లాభం పొందింది ఒక్కరే. 91.1 శాతం మంది (73 లక్షల మంది సుమారు) ఎఫ్‌అండ్‌వోలో నష్టాలు పోగేసుకోవాల్సి వచ్చింది. ఇక మిగిలిన 8.9 శాతం మందిలో రూ. లక్షపైన లాభం సొంతం చేసుకున్నది కూడా కేవలం ఒక్క శాతమే ఉన్నారు. 75 శాతానికి పైగా ఎఫ్‌అండ్‌వో ట్రేడర్లు 2023–24లో తమ ఆదాయం రూ.5 లక్షల్లోపే అని వెల్లడించడం వీరంతా తక్కువ ఆదాయ వర్గాలకు చెందిన వారన్నది స్పష్టం చేస్తోంది. అంతేకాదు వీరంతా అంతకు ముందు రెండు ఆర్థిక సంవత్సరాల్లోనూ చేతులు కాల్చుకున్నట్టు సెబీ గణాంకాల ఆధారంగా తెలుస్తోంది. అందుకే ఎఫ్‌అండ్‌వో చిన్న ఇన్వెస్టర్లు, రిటైల్ ఇన్వెస్టర్ల 'గేమ్' కానే కాదని నిపుణులు తరచూ చెప్పేది. ఇనిస్టిట్యూషనల్ ట్రేడర్లతో పోటీపడే సామర్థ్యాలు, వసతులు, నైపుణ్యాలు రిటైల్ ఇన్వెస్టర్లకు లేకపోవడంతో ఎఫ్‌అండ్‌వోలో నెగ్గలేని పరిస్థితి. సమగ్రమైన అవగాహన, తగినంత పెట్టుబడి, ట్రేడింగ్ వ్యూహాలు, టెక్నాలజీ, వసతులతోనే ఎఫ్‌అండ్‌వోలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడం సరైనదన్న సూచన నిపుణుల నుంచి వస్తోంది.

వేగంగా లాభాలు అసాధ్యం!

కరోనా విపత్తు తర్వాత ఈక్విటీల్లో రిటైల్ ఇన్వెస్టర్ల సంఖ్య గణనీయంగా పెరిగిపోయింది. 2019లో 3.93 కోట్ల డీమ్యాట్ ఖాతాలు ఉంటే అవి ప్రస్తుతం 19.24 కోట్లకు పెరగడం దీనికి నిదర్శనం. కొత్త ఇన్వెస్టర్లలో ప్రధానంగా కనిపించే సమస్య.. లాభాల ఆకాంక్షలు ఎక్కువ, పెట్టుబడి తక్కువ. కొద్ది పెట్టుబడితోనే భారీగా సంపాదించేయొచ్చన్న అత్యాశ వారిని ఎఫ్‌అండ్‌వో మార్కెట్‌వైపు ఆకర్షిస్తోంది. "డెరివేటివ్‌లు (ఎఫ్‌అండ్‌వో) అన్నవి హెడ్జింగ్, ఆర్బిట్రేజ్, యాక్టివ్ ట్రేడింగ్ కోసం రూపొందించినవి. కానీ, ప్రస్తుత రిటైల్ ఇన్వెస్టర్ల భాగస్వామ్యాన్ని పరిశీలిస్తే స్పెక్యులేటివ్ ట్రేడింగ్ వైపే మొగ్గు కనిపిస్తోంది'' అని కోటక్ సెక్యూరిటీస్ డెరివేటివ్స్ రీసెర్చ్ హెడ్ సహజ్ అగర్వాల్ తెలిపారు. 'ఎంత చెట్టుకు అంత గాలి' అన్నట్టు.. ఎఫ్‌అండ్‌వోలో రిటైల్ ఇన్వెస్టర్లు ఎంత ఎక్కువ రిస్క్ తీసుకుంటే పెట్టుబడి అంత వేగంగా తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం ఉంటుంది. ఇవేమీ అర్థం చేసుకోకుండా దీన్నొక ఆదాయ మార్గంగా చూస్తుండడం మరింత రిస్క్‌ను ఆహ్వానించడమే అవుతుంది.

రుణంతో మరింత రిస్క్

ఎఫ్‌అండ్‌వో మార్కెట్లో మార్జిన్ ఫండింగ్, వ్యక్తిగత రుణాలతో ట్రేడింగ్‌కు సైతం రిటైల్ ఇన్వెస్టర్లు వెనుకాడడం లేదు. ట్రేడ్‌లతో నష్టపోయి.. తమవద్ద పెట్టుబడి సరిపోక రుణ సదుపాయంతో పొజిషన్లు తీసుకుంటున్నారు. లాభంతో తీర్చేయొచ్చన్న అంచనాలతో మరింత రిస్క్ తీసుకుంటున్నారు. నష్టం వస్తే పరిస్థితి ఏంటన్న ఆలోచన కూడా కనిపించడం లేదు. ఇన్వెస్టర్లలో ప్రవర్తనా పరమైన బలహీనతలు సైతం అధిక నష్టాలకు దారితీస్తున్నట్టు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒక ట్రేడ్‌లో నష్టం రాగా, తదుపరి ట్రేడ్‌లో లాభం వస్తుందన్న అతివిశ్వాసం పనికిరాదంటున్నారు. "ఆప్షన్ ధరల తీరు, నమూనాలు, డెరివేటివ్‌లను సరిగ్గా అర్థం చేసుకోకుండా.. యూట్యూబ్ ఛానళ్లను చూడడం, సోషల్ మీడియా గురువులను అనుసరించడం లేదంటే వాట్సాప్ గ్రూప్‌లలో చేరడం ద్వారా ఎఫ్‌అండ్‌వోలో లాభాలు సంపాదించేయగలమన్నది తప్పుడు అవగాహనే అవుతుంది'' అని ప్రైమ్ వెల్త్‌కు చెందిన సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్ (సీఎఫ్‌పీ) అలోక్ దూబే పేర్కొన్నారు. చాలా మంది రిటైల్ ఇన్వెస్టర్లలో సరైన విజ్ఞానం, క్రమశిక్షణ ఉండడం లేదన్నారు. ఇవి లేకుండా ఎఫ్‌అండ్‌వో ట్రేడింగ్ గ్యాంబ్లింగే అవుతుందని హెచ్చరించారు.

పెద్ద సవాలు..



ఎఫ్‌అండ్‌వో ట్రేడింగ్ అన్నది ఎంతో సంక్లిష్టమైనదని నిపుణుల విశ్లేషణ. మార్కెట్, స్టాక్స్ కదలికలు దేశీ, అంతర్జాతీయ పరిణామాల ఆధారంగా ఉంటాయి. కనుక ఒక స్టాక్ పెరుగుతుందా? పడుతుందా? అని ఊహించడం అసాధ్యం. ఈ సవాళ్లను అధిగమించేందుకు సరైన వ్యూహాలు ఉండాలి. ట్రేడ్స్ ఎంపికకు స్పష్టమైన, నిర్మాణాత్మకమైన విధానం లేకుండా ఎఫ్‌అండ్‌వో మార్కెట్లోకి అడుగు పెట్టడం ఎక్కువ మంది ఇన్వెస్టర్లు చేస్తున్న తప్పిదమని కోటక్ సెక్యూరిటీస్ డెరివేటివ్స్ హెడ్ సహజ్ అగర్వాల్ తెలిపారు. అసలు ఎఫ్‌అండ్‌వో మార్కెట్ ఎలా పనిచేస్తుందో ముందుగా అర్థం చేసుకోవాలని సూచించారు. క్యాష్ మార్కెట్ లేదా ఎఫ్‌అండ్‌వో లేదా కమోడిటీలు ఇలా ఏ విభాగమైనప్పటికీ కాల పరీక్షలకు నిలిచిన చక్కని వ్యూహాలు అవసరమని.. అవి లేకుండా ట్రేడింగ్ చేయడం అవకాశమే కానీ, నైపుణ్యం కాబోదన్నారు. "ఎఫ్‌అండ్‌వో వారం, నెలవారీ సిరీస్‌లలో రోజులు గడుస్తూ, ఎక్స్‌పైరీ సమీపిస్తున్న క్రమంలో అనుకున్న దిశలో దాని చలనం లేకపోతే, అప్పుడు ఆప్షన్ల విలువ వేగంగా తగ్గిపోతుంటుంది. ఏదైనా ఒక వ్యూహం ఫలించి మంచి లాభం వచ్చినప్పటికీ.. అదే వ్యూహం ప్రతి రోజూ ఫలితమిస్తుందని గ్యారంటీ లేదు'' అని అగర్వాల్ వివరించారు.

ఫిన్‌ఫ్లుయెన్సర్స్ మాయలోపడితే అంతే..



బజాజ్ బ్రోకింగ్ రీసెర్చ్ ప్రకారం.. ఎఫ్‌అండ్‌వోలోకి ఎక్కువ మంది రిటైల్ ఇన్వెస్టర్లు అడుగు పెట్టడం వెనుక ఆర్థిక ప్రభావశీలురు (ఫిన్‌ఫ్లుయెన్సర్స్) పరోక్ష ప్రోద్బలం, సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా ఉంటోంది. ఎఫ్‌అండ్‌వోలో తాము పెద్ద మొత్తంలో సంపాదించామంటూ యూట్యూబ్, ఎక్స్ ప్లాట్‌ఫామ్, ఇన్‌స్టాగ్రామ్‌లపై కనిపించే ఎన్నో వీడియోలు ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టిస్తున్నాయి. పులిని చూసి నక్క వాత పెట్టుకున్న చందంగా.. అప్పటి వరకు ఎఫ్‌అండ్‌వో మొహం చూడని వారు సైతం ట్రేడింగ్‌కు ఆసక్తి చూపిస్తున్నారు. ఆర్థిక ప్రభావశీలురులో రాబడులను ఎక్కువ చేసి చూపించడంపై ఉన్న శ్రద్ధ అదే సమయంలో రిస్కులు, ట్రేడింగ్ స్ట్రాటజీలను వెల్లడించడంపై ఉండదు. దీంతో ఎఫ్‌అండ్‌వో ట్రేడింగ్ ధనవంతులు కావడానికి సులభ మార్గం అన్న తప్పుడు అభిప్రాయానికి దారితీస్తోంది. అందుకే ఫిన్‌ఫ్లుయెన్సర్స్ తీరును నియంత్రించేందుకు సెబీ ఎన్నో కఠిన నిబంధనలను తీసుకువచ్చింది.

ఇన్‌స్టిట్యూటషనల్ ఇన్వెస్టర్లదే పైచేయి

ఎఫ్‌అండ్‌వో మార్కెట్లో మెజారిటీ రిటైల్ ఇన్వెస్టర్ల పెట్టుబడి.. అతి కొద్ది మంది బడా ఇన్వెస్టర్లు, ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు సమర్పయామిగా మారుతోంది. "ఎఫ్‌అండ్‌వో విభాగంలో రిటైల్ ఇన్వెస్టర్లతో పోల్చుకుంటే ఇన్‌స్టిట్యూషనల్ ట్రేడర్లకు స్పష్టమైన అనుకూలతలు ఉన్నాయి. గొప్ప టెక్నాలజీ వసతులు, ట్రేడ్‌లపై తక్కువ చార్జీలు, క్రమశిక్షణతో కూడిన విధానాలు వారి సొంతం'' అని రెలిగేర్ బ్రోకింగ్ రిటైల్ రీసెర్చ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రవిసింగ్ వివరించారు. 2023–24లో ప్రొప్రయిటరీ ట్రేడర్లు (బ్యాంక్‌లు, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్‌లు, బ్రోకరేజీలు తదితర) రూ.33,000 కోట్లు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) రూ.28,000 కోట్ల చొప్పున ఎఫ్‌అండ్‌వో మార్కెట్లో లాభాలు పోగేసుకున్నారు. రిటైల్ ట్రేడర్లు ఉమ్మడిగా రూ.61,000 కోట్లు నష్టపోయారు. లావాదేవీల చార్జీలు దీనికి అదనం. "అతి విశ్వాసం, పాక్షిక వాదం తదితర ప్రవర్తనా లోపాలకు ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు దూరంగా ఉంటారు. రిటైల్ ఇన్వెస్టర్లను ఉచ్చులోకి లాగేవి ఇవే. అత్యాధునిక టూల్స్, వ్యయాల పరంగా సానుకూలత, సహేతుక నిర్ణయాలు ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు ఎఫ్‌అండ్‌వో మార్కెట్లో అనుకూలిస్తున్నాయి'' అని రవిసింగ్ తెలిపారు.



ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు ఆల్గోరిథమ్ ట్రేడింగ్ (ఎప్పుడు ఏ ధరలో కొనుగోలు, విక్రయాలు చేయాలన్న కోడింగ్ సాఫ్ట్‌వేర్) అత్యంత అనుకూలించే అంశం. ప్రొప్రయిటరీ ట్రేడర్లలో 96 శాతం మందికి లాభాలు ఈ మార్గంలోనే వస్తున్నట్టు రవిసింగ్ తెలిపారు. భావోద్వేగాలతో సంబంధం లేకుండా ధరల గమనం ఆధారంగా వేగంగా కొనుగోలు, అమ్మకాల లావాదేవీలను ఆల్గోరిథమ్ ట్రేడింగ్ సాఫ్ట్‌వేర్ పూర్తి చేస్తాయి. రిటైల్ ఇన్వెస్టర్లలో 13 శాతం మందే ఆల్గోరిథమ్ ట్రేడింగ్ వినియోగిస్తున్నారు. "ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు ఎప్పటికప్పుడు తాజా మార్కెట్ సమాచారాన్ని మైక్రో సెకన్లలోనే తెలుసుకోగలరు. ఆప్షన్లతో హెడ్జ్ చేసుకోగలరు. వోలటాలిటీ స్ప్రెడ్స్ (తటస్థ ఆప్షన్ విధానం), నేరుగా మార్కెట్ యాక్సెస్, తక్కువ చార్జీలు వారికి అనుకూలం. రిటైల్ ట్రేడర్లు కొంచెం ఆలస్యంగా వచ్చే డేటాపై ఆధారపడుతుంటారు. ట్రేడ్‌వారీ చార్జీలు వీరికి ఎక్కువ. అంచనాలు తప్పడం, సోషల్ మీడియా టిప్స్ వారికి ప్రతికూలం'' అని రవిసింగ్ వివరించారు.

రిటైల్ ఇన్వెస్టర్ల తప్పటడుగులు

- ఫ్యూచర్స్, ఆప్షన్లు ఎలా పనిచేస్తాయో కూడా తెలియకుండా ఎఫ్‌అండ్‌వోలోకి పెట్టుబడితో అడుగుపెట్టడం.
- మార్కెట్ సంకేతాలను, కాంట్రాక్టుల సంక్లిష్టతలను తప్పుగా అర్థం చేసుకోవడం.
- మార్జిన్ ఫండింగ్‌తో ట్రేడ్లు చేయడం.
- నష్టాన్ని పరిమితం చేసుకునేందుకు స్టాప్‌లాస్ ఆర్డర్లను వినియోగించుకోకపోవడం.
- స్పష్టమైన ప్రణాళిక లేకుండా అత్యాశ, భయాల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం.
- నష్టాన్ని భర్తీ చేసుకునేందుకు మరిన్ని ట్రేడ్లు చేయడం.
- తరచూ ట్రేడ్లు చేయడం ద్వారా చార్జీల రూపంలో అధికంగా నష్టపోవడం.
- ప్రతికూల పరిణామాల్లోనూ ట్రేడ్లు కొనసాగించడం.
- ఎలాంటి వ్యూహాలు లేకుండా మార్కెట్‌లో వచ్చే సమాచారం ఆధారంగా స్వీయ అంచనాలతో ట్రేడ్లు చేయడం.

ప్రయోజనాలు వేరు..

ఎఫ్‌అండ్‌వో అన్నది నిజమైన స్టాక్స్ కాకుండా డిజిటల్ కాంట్రాక్టులు. కనుక 10–20 శాతం మార్జిన్‌తోనే 100 శాతం విలువైన ఫ్యూచర్ కాంట్రాక్ట్‌ను సొంతం చేసుకోవచ్చు. ఆప్షన్లు అయితే ఇంకా తక్కువ పెట్టుబడికే వస్తాయి. మార్కెట్ పతనాల్లో స్టాక్స్ హోల్డింగ్స్ విలువను కాపాడుకునేందుకు ఎఫ్‌అండ్‌వోను హెడ్జింగ్ టూల్ కింద బడా ఇన్వెస్టర్లు ఉపయోగించుకుంటారు. మెజారిటీ రిటైల్ ఇన్వెస్టర్లకు ఈ హెడ్జింగ్ స్ట్రాటజీలు తెలియవు. పైగా వారి పెట్టుబడి హెడ్జ్ చేసుకునే స్థాయిలోనూ ఉండదు. మ్యూచువల్ ఫండ్స్ పథకాల తరఫున ఫండ్ మేనేజర్లు ఈ హెడ్జింగ్ టూల్స్‌ను వినియోగించుకునేందుకు అనుమతి ఉంది. సెబీ ఇటీవలే అనుమతించిన స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (సిఫ్) అనే కొత్త మ్యూచువల్ ఫండ్స్ విభాగంలో అయితే ఫండ్ మేనేజర్లు తమ నిర్వహణ ఆస్తుల్లో గరిష్టంగా 20 శాతం వరకు ఎఫ్‌అండ్‌వో ఎక్స్‌పోజర్ తీసుకునేందుకు అనుమతి ఉంది. కనుక రిస్క్ ఉన్నా అధిక రాబడి కోరుకునే వారు సిఫ్‌లను పరిశీలించొచ్చు. ఇందులో కనీసం రూ.10 లక్షలు ఇన్వెస్ట్ చేసుకోవాల్సి ఉంటుంది.



ఏమిటి మార్గం..?

"భావోద్వేగాలతో కూడిన నిర్ణయాలు, అపరిమిత ట్రేడింగ్, స్టాప్‌లాస్‌లను నిర్లక్ష్యం చేయడం, సరైన ప్రణాళిక లేకపోవడం పెట్టుబడిని వేగంగా హరించేస్తుంది. విజయవంతమైన ట్రేడింగ్ అంటే సానుకూల పరిస్థితుల్లో లాభాలు ఆర్జించడమే కాదు. క్రమశిక్షణతో ప్రతికూలతలను అధిగమించి పెట్టుబడిని కాపాడుకోవడం కూడా'' అని సహజ్ అగర్వాల్ తెలిపారు.

- డెరివేటివ్‌లకు సంబంధించి సాంకేతిక సంక్లిష్టతలను అర్థం చేసుకోవడంపై ఇన్వెస్టర్లు దృష్టి సారించాలి. మార్జిన్ అవసరాలు, అస్థిరతలు, ఆప్షన్ ధరల తీరుతెన్నులను అర్థం చేసుకోవాలి. టెక్నికల్ అంశాలు తెలియాలి.
- సంప్రదాయ స్టాక్స్‌లో పెట్టుబడులతో పోల్చినప్పుడు ఎఫ్‌అండ్‌వోలో పెట్టుబడులపై ప్రాథమిక అవగాహన ఒక్కటే సరిపోదు. తగినంత విజ్ఞానం కోసం గట్టిగా కృషి చేయాల్సిందే. వేగంగా లాభాలు సంపాదించాలన్న కాంక్షతో చాలా మంది రిటైల్ ట్రేడర్లు దీన్ని విస్మరిస్తుంటారు.
- దశాబ్దాల అనుభవం, అత్యాధునిక టెక్నాలజీ టూల్స్, పెట్టుబడి బలంతో ఉన్న ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లతో పోటీపడాలంటే రిటైల్ ఇన్వెస్టర్లు సైతం తగిన విధంగా సన్నద్ధం అవ్వాలి.
- స్పెక్యులేటివ్ ధోరణిని వీడి క్రమశిక్షణతో కూడిన వ్యూహాలు, హెడ్జింగ్ స్ట్రాటజీలపై దృష్టి పెట్టాలి.
- ఆర్థిక ప్రభావశీలురు, తప్పుదోవ పట్టించే కంటెంట్‌కు దూరంగా ఉండాలి. ట్రేడింగ్, సాంకేతిక అంశాలపై విఖ్యాత ఇన్వెస్టర్లు రాసిన పుస్తకాలను చదివి అపోహలు తొలగించుకోవాలి.

"ఇన్వెస్టింగ్, ట్రేడింగ్ రెండూ విరుద్ధమైనవి. పెట్టుబడులకు సహనం, దీర్ఘకాల దృష్టి అవసరం. ట్రేడింగ్‌లో రిస్క్‌తో కూడిన తక్షణ వ్యూహాత్మక చర్య అవసరం. అవగాహన కలిగిన రిటైల్ ఇన్వెస్టర్లు సైతం తమ స్వల్పకాల, దీర్ఘకాల లక్ష్యాల కోసం సంప్రదాయ మ్యూచువల్ ఫండ్స్, స్టాక్స్‌కు పరిమితం కావడం మంచిది. ఈ విషయంలోనూ నిపుణుల మార్గదర్శనం అవసరమే'' అని సహజ్ అగర్వాల్ సూచించారు.



స్టాక్స్ వ్యూ

ఓరియంట్ ఎలక్ట్రిక్ | బ్రోకరేజ్: బీఎన్‌పీ పారిబా | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 235 **టార్గెట్:** రూ. 275

ఎందుకంటే: క్యూ4లో ఓరియంట్ ఎలక్ట్రిక్ ఆదాయం అంచనాలను అందుకుంది. మార్జిన్లు అంచనాలనుమించి బలపడ్డాయి. గతేడాది 6.6 శాతం వృద్ధిని మించుతూ రానున్న 7–8 త్రైమాసికాలలో రెండంకెల ప్రగతిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే భారీగా విస్తరించిన మార్కెట్లో ఎలక్ట్రిక్ కన్జూమర్ డ్యురబుల్స్(ఈసీడీ) అమ్మకాలు అంతంతమాత్రంగా నమోదయ్యాయి. ఫ్యాన్ల అమ్మకాలు మాత్రం 6.6 శాతం వృద్ధిని సాధించాయి. ముందుగానే స్టాకింగ్ చేయడంతో కూలర్ల విక్రయాలు 30 శాతానికిపైగా ఎగశాయి. ప్రీమియం ప్రొడక్టులపై దృష్టి పెట్టడంతో



క్యూ4 అమ్మకాలలో 30 శాతం ఆక్రమించాయి. బీఎల్‌డీసీ ఫ్యాన్ల అమ్మకాలు వార్షికంగా 50 శాతం జంప్‌చేశాయి. పరిశ్రమ వృద్ధిని మించుతూ సీలింగ్ ఫ్యాన్ల విభాగంలో ఇవి 20 శాతానికి చేరాయి. గతేడాది(2024–25) లైటింగ్, స్విచ్‌గేర్ బిజినెస్ పరిశ్రమను మించుతూ 11 శాతానికిపైగా పురోగతిని అందుకుంది. ఇందుకు బీటూబీ ప్రాజెక్టులు, బీటూసీ విభాగంలో రెండంకెల వృద్ధి సహకరించాయి. బీటూసీలో ప్రీమియం మిక్స్ 60 శాతాన్ని తాకగా.. మార్కెట్ వాటా 2 శాతం బలపడింది. గతేడాది స్విచ్‌గేర్లు, వైర్ల బిజినెస్ 17 శాతం పుంజుకోగా..క్యూ4లో 30 శాతం జంప్‌చేసింది. ఇబిట్ మార్జిన్లు 14.3 శాతంవద్ద నిలకడను చూపాయి. వేసవి ఆలస్యంకావడంతో ముందస్తు సీజన్ చానళ్ల ఈసీడీ అమ్మకాలు నీరసించాయి. అయితే వేసవి డిమాండ్‌పై కంపెనీ విశ్వాసాన్ని వ్యక్తం చేస్తోంది. ముందస్తు పెట్టుబడుల ప్రభావం క్యూ4 ఫలితాల నుంచే ప్రతిఫలిస్తోంది. అయితే వేసవి అమ్మకాలను పర్యవేక్షించవలసి ఉంది.

టాటా టెక్నాలజీస్ | బ్రోకరేజ్: జేఎమ్ ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 765 **టార్గెట్:** రూ. 850

ఎందుకంటే: ఐటీ సేవల టాటా గ్రూప్ కంపెనీ టాటా టెక్నాలజీస్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో ఆదాయ ఆర్జన అంచనాలకంటే తక్కువగా నమోదైంది. అయితే కంపెనీ అంతర్గత నిర్మాణం పటిష్టంగా ఉంది. కీలకమైన సర్వీసుల ఆదాయం త్రైమాసికపద్ధతిలో ఫ్లాట్(అంచనాలకు అనుగుణం)గా నమోదైంది. క్యూ2 నుంచి రికవర్ కావలసిన టెక్నాలజీ సొల్యూషన్స్ బిజినెస్ మాత్రం త్రైమాసికవారీగా 14 శాతం క్షీణించింది. కాగా.. క్యూ4(జనవరి–మార్చి), పూర్తి ఏడాదికి కంపెనీ పనితీరు డైవర్సిఫికేషన్ ప్రభావాన్ని ప్రతిఫలిస్తోంది. క్యూ4లో ఆటో విభాగం త్రైమాసికవారీగా 3 శాతం నీరసించినప్పటికీ ఏరోస్పేస్ బిజినెస్ నిలకడగా 8 శాతం పుంజుకోవడం ద్వారా పనితీరుకు మద్దతిచ్చింది. నిజానికి గతేడాది ఏరోస్పేస్ విభాగం ఆదాయం దాదాపు రెట్టింపైంది. ఆటో విభాగం విషయానికివస్తే ప్రపంచవ్యాప్తంగా ప్రధాన ఆటో రంగ దిగ్గజాలు సవాళ్లు ఎదుర్కొంటున్నప్పటికీ కంపెనీ పటిష్ట సామర్థ్యం ఆదుకుంది.



విన్‌ఫాస్ట్‌ను మినహాయిస్తే గతేడాది ఆటో విభాగం వార్షికంగా 12 శాతం పురోగతి సాధించింది. తద్వారా ప్రణాళికలకు అనుగుణంగా విన్‌ఫాస్ట్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకోగలుగుతోంది. గ్లోబల్ దిగ్గజం బీఎమ్‌డబ్ల్యూతో భాగస్వామ్య కంపెనీ(జేవీ) ద్వారా మొత్తం 50 కోట్ల డాలర్ల(రూ. 4,300 కోట్లు) కాంట్రాక్ట్ విలువను పొందే వీలుంది. వెరసి ఆదాయంలో మందగమన ప్రభావాలకు చెక్ పెట్టగలుగుతుంది. తద్వారా అనిశ్చిత డిమాండ్ వాతావరణంలోనూ నెగ్గుకురాగలుగుతుంది. బీఎమ్‌డబ్ల్యూతో భాగస్వామ్యం నేపథ్యంలో ఇతర జర్మన్ దిగ్గజాల నుంచి సైతం బిజినెస్‌ను ఆకట్టుకోగలుగుతుంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

యూనియన్ ఇన్‌కమ్ ప్లస్ ఆర్బిట్రేజ్ ఫండ్ ఎన్‌ఎఫ్‌వో

స్థిరమైన ఆదాయం కోసం ఆవిష్కరణ

ముంబై: యూనియన్ మ్యూచువల్ ఫండ్ 'యూనియన్ ఇన్‌కమ్ ప్లస్ ఆర్బిట్రేజ్ యాక్టివ్ ఎఫ్‌వోఎఫ్'ను ప్రవేశపెట్టింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్‌వోఎఫ్). వడ్డీ రేట్లు తగ్గుతున్న తరుణంలో పన్ను ప్రయోజనకరమైన ఆదాయాన్నిచ్చే లక్ష్యంతో ఈ పథకాన్ని తీసుకొచ్చింది. జూన్ 5 వరకు పెట్టుబడులకు ఈ న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్‌వో) అందుబాటులో ఉంటుంది. ఆర్బిట్రేజ్, డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా మధ్యకాలం నుంచి దీర్ఘకాలంలో ఆదాయాన్నిచ్చే లక్ష్యంతో ఈ పథకం పనిచేస్తుంది. రెండేళ్లకు మించి పెట్టుబడులు కలిగి ఉన్న వారికి ఈక్విటీ ఆధారిత పన్ను ప్రయోజనాలు వర్తించేలా ఈ పథకం ఆర్బిట్రేజ్ పెట్టుబడుల విధానాన్ని అనుసరిస్తుంది. సంపద సృష్టించడమే కాకుండా దాన్ని కాపాడుకోవడం అన్నది అస్సెట్ అలోకేషన్‌కు కీలకంగా యూనియన్ మ్యూచువల్ ఫండ్ పేర్కొంది.

Union Mutual Fund

'సాక్షి ప్లస్' ఈ–పేపర్‌లో..

ఈ వారం 4 ఐపీవోలు.. 2 లిస్టింగ్‌లు	జీడీపీ గణాంకాలపై ఫోకస్

ఇంటిపై పెట్టుబడి మంచి నిర్ణయమేనా?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రిసెర్చ్

అంతర్గతంగా విలువ దాగి ఉన్న స్టాక్స్‌ను గుర్తించడం ఎలా? – కపిల్ శర్మ

వాస్తవ విలువ కంటే తక్కువలో ట్రేడ్ అవుతున్న (అండర్ వ్యాల్యూడ్) స్టాక్‌ను గుర్తించం అన్నది ఒక కళ. డిస్కౌంటింగ్ సూత్రాన్ని ఇక్కడ అమలు చేసి చూడాల్సి ఉంటుంది. అంటే వచ్చే ఐదు, పదేళ్ల కాలంలో కంపెనీ ఆదాయాలు ఏ మేరకు వృద్ధి చెందుతాయో గుర్తించి, ఆ మేరకు చెల్లించేందుకు ముందుకు రావడం. ఇక్కడ ఎన్నో అంశాలు లెక్కించే విధానాన్ని ప్రభావితం చేస్తాయి. అలాగే, యాజమాన్యం ఎంత ఉత్తమమైనది? అనే అంశాన్ని కూడా చూడాలి. కంపెనీ నుంచి నిధులను మెరుగ్గా వినియోగిస్తున్నార? ప్రమోటర్లు విశ్వసనీయత కలిగిన వారేనా? ఆయా రంగంలో కంపెనీకి వృద్ధికి అవకాశం ఉందా? అవకాశాలను అనుకూలంగా మార్చుకోగలదా? వీటిని విశ్లేషించుకోవాలి. అలాగే, ఎంపిక చేసుకున్న మెరుగైన కంపెనీల గురించి వచ్చే ప్రతికూల వ్యాఖ్యానాలను విశ్లేషించుకునే సామర్థ్యం.. తటస్థ వైఖరి కావాలి.

నేను పెట్టుబడి దృష్ట్యా ఇంటిని కొనుగోలు చేద్దామని అనుకుంటున్నాను. ఇది మెరుగైన ఎంపికేనా? – శివమ్

ఇల్లు అన్నది కేవలం నివాసం కోసమే. రాబడి దృష్ట్యా కాకుండా దీర్ఘకాలంలో భూముల ధరలు పెరుగుతాయన్న అంచనాలతో చాలా మంది కొనుగోలు చేస్తుంటారు. ఒక కుటుంబ నివాస అవసరాలకే ఇల్లు. దీన్ని పెట్టుబడిగా చూడకూడదు. ఒక్కసారి ఇల్లు కొనుగోలు చేసి, దానిలో నివసిస్తుంటే విలువ పెరుగుతుందా? లేక తగ్గుతుందా అన్నది పట్టించుకోవాల్సిన అవసరం ఉండదు. అదే పెట్టుబడి కోణం నుంచి చూస్తే రియల్ ఎస్టేట్‌కు కొన్ని ప్రతికూలతలు ఉన్నాయి. అధిక మొత్తంలో పెట్టుబడి కావాల్సి ఉంటుంది. ఇతర సాధనాలతో పోలిస్తే లిక్విడిటీ (నగదుగా మార్చే సౌలభ్యం) తక్కువగా ఉంటుంది. దీంతో కోరుకున్నప్పుడు విక్రయించుకునే వీలు ఉండకపోవచ్చు. కొన్ని సందర్భాల్లో రియల్ ఎస్టేట్ మార్కెట్లో సవాళ్లూ ఉంటాయి. ప్రాపర్టీని అద్దెకు ఇస్తే కిరాయిదారు రూపంలో ఆదాయం వస్తుంది. అలా చూస్తే చాలా మందికి ఇల్లు మంచి పెట్టుబడిగా కనిపిస్తుంది. ఎందుకంటే ద్రవ్యోల్బణంతోపాటే అద్దె కూడా పెరుగుతూ వెళుతుంది. అదే సమయంలో ప్రతికూలతలూ కనిపిస్తాయి. 20 ఏళ్లు గడిచిన తర్వాత పాతదిగా మారడంతో అద్దెకు డిమాండ్ తగ్గుతుంది. అప్పటి వరకు వసూలు చేసినంత అధిక అద్దెకు కిరాయిదారులు ముందుకు రాకపోవచ్చు. మెరుగైన అద్దెతో అధునికమైన, కొత్త ఇంటికి వారు మొగ్గు చూపించొచ్చు. ప్రాపర్టీ విలువ పెరిగినా, అద్దె రాబడి మెరుగ్గా ఉండదు. అందుకే ప్రాపర్టీని కొనుగోలు చేసే ముందు ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలి.



దేశీయ ప్రయాణికుల రవాణా వ్యవస్థలో వందే భారత్ రైలు ఒక పెద్ద ముందడుగు. సౌకర్యవంత ప్రయాణ అనుభూతికి ఈ రైలు ప్రసిద్ధి. గంటకు గరిష్ఠంగా 180 కిలోమీటర్ల వేగంతో కూడా ప్రయాణించగలదు. దీన్ని మించిన వేగంతో దూసుకుపోయే 'హై స్పీడ్ రైల్' కొద్దిరోజుల్లో పట్టాలెక్కనుంది. భారత ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ముంబై-అహ్మదాబాద్ హై స్పీడ్ రైల్ (ఎంఏహెచ్ఎస్ఆర్) ప్రాజెక్టు వేగం పుంజుకుంది. 2026 నాటికి పాక్షిక కార్యకలాపాలు ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు. అన్నీ అనుకూలిస్తే 2028 నాటికి ప్రాజెక్ట్ పూర్తై బుల్లెట్ రైల్ దూసుకెళ్లనుంది. తద్వారా ప్రపంచంలో హై స్పీడ్ రైల్ వ్యవస్థ కలిగిన అతికొద్ది దేశాల సరసన భారత్ నిలవనుంది.

- సాక్షి, స్పెషల్ డెస్క్



బుల్లెట్ రైలు వస్తోంది..

హైస్పీడ్ రైలు ప్రాజెక్టు కోసం 300 కి.మీ. వయాడక్ట్‌లు పూర్తయినట్లు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఇటీవల తెలిపారు. ముంబై–అహ్మదాబాద్ కారిడార్ పొడవు 508 కిలోమీటర్లు. బుల్లెట్ రైలు గంటకు 320 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణించనుంది. ముంబైలో మొదలై సూరత్, వడోదర, అహ్మదాబాద్ స్టాప్స్‌నకు పరిమితమైతే చివరి స్టాప్ అయిన సబర్మతికి 2 గంటల 7 నిమిషాల్లోనే ఈ రైలు చేరనుంది. అన్ని స్టాప్స్‌లోనూ ఆగితే 2 గంటల 58 నిమిషాల సమయం తీసుకుంటుంది. ఈ కారిడార్‌లో 12 స్టేషన్లు ఉన్నాయి. వీటిలో గుజరాత్‌లో ఎనిమిది, మహారాష్ట్రలో నాలుగు ఉన్నాయి. ముంబై స్టేషన్ భూగర్భంలో నిర్మిస్తుండగా మిగిలిన థానే, విరార్, బోయిసర్, వాపి, బిలిమోరా, సూరత్, భరూచ్, వడోదర, ఆనంద్, అహ్మదాబాద్, సబర్మతి వద్ద ఎలివేటెడ్ స్టేషన్స్ రానున్నాయి.

రెడీ అవుతున్న భారత హై స్పీడ్ రైల్

రూ.1,08,000 కోట్ల వ్యయం

గంటకు 320 కిలోమీటర్ల గరిష్ఠ వేగం

ముంబై టు సబర్మతి.. రెండు గంటల్లోనే

2028లో సాకారం కానున్న ప్రాజెక్టు

పనుల్లో వేగం పెంచిన రైల్వే శాఖ

సముద్రగర్భ రైల్ టన్నెల్..


బుల్లెట్ రైలు కారిడార్‌లో 21 కిలోమీటర్ల పొడవైన సముద్రగర్భ రైల్ టన్నెల్ ప్రత్యేక ఆకర్షణ. ఇది ముంబై–థానే మధ్య ఏర్పాటవుతోంది. ఇందులో భారత్‌లోనే మొట్టమొదటి 7 కి.మీ. పొడవైన సముద్రగర్భ సొరంగం కూడా ఉంది. 13.1 మీటర్ల వ్యాసం కలిగిన ఒకే ట్యూబ్ సొరంగంలో రెండు ట్రాక్‌లు ఉంటాయి. ముంబై–అహ్మదాబాద్ హై స్పీడ్ రైల్ ప్రాజెక్టులో 465 కి.మీ. మేర ఎలివేటెడ్ కారిడార్ ఉంటుంది. ప్రధానంగా ఫుల్ స్పాన్ లాంచింగ్ మెథడ్ ఉపయోగించి నిర్మిస్తున్నారు. వయాడక్ట్ నిర్మాణంలో ఉపయోగించే సంప్రదాయ సెగ్మెంటల్ నిర్మాణ సాంకేతికత కంటే ఇది 10 రెట్లు వేగంగా ఉంటుంది. ఈ ప్రత్యేకమైన నిర్మాణ పద్ధతిని దేశంలో మొదటిసారిగా ఉపయోగిస్తున్నారు. ఈ సాంకేతికతను ఉపయోగించే, నైపుణ్యం సాధించిన ప్రపంచంలోని అతి కొద్ది దేశాలలో భారత్ ఒకటి.

ట్రయల్ రన్ గుజరాత్‌లో..

ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్న నేషనల్ హై–స్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రకారం.. 383 కి.మీ. పీయర్ పనులు, 401 కి.మీ. ఫౌండేషన్, 326 కి.మీ. గర్డర్ క్యాస్టింగ్ కూడా పూర్తయ్యాయి. ఇప్పటివరకు రూ.67,486 కోట్లు ఖర్చయ్యాయి. ప్రాజెక్టు పూర్తి అయ్యేసరికి వ్యయం భారీగా పెరిగే అవకాశం ఉంది. 2026లో మొదటి ట్రయల్ రన్ గుజరాత్‌లో 50 కి.మీ.లో నిర్వహించనున్నారు. ఢిల్లీ–వారణాసి, చెన్నై–మైసూరు వంటి కారిడార్లలో హెచ్ఎస్ఆర్ ప్రాజెక్ట్ సాధ్యాసాధ్యాలపై అధ్యయనం జరుగుతోంది. ముంబై–హైదరాబాద్, ఢిల్లీ–అహ్మదాబాద్ కారిడార్లు పరిశీలనలో ఉన్నాయి.

హెచ్ఎస్ఆర్‌గా పరిగణించాలంటే..

హై–స్పీడ్‌గా పరిగణించాలంటే రైళ్లు వాటి కోసం ప్రత్యేకంగా కేటాయించిన ట్రాక్‌లపై గంటకు 250 కి.మీ. కంటే ఎక్కువ వేగంతో వెళ్లాలి. సాధారణంగా వీటికి నూతన, ప్రత్యేకంగా రూపొందించిన మార్గాలు అవసరం. కొన్ని హెచ్ఎస్ఆర్ వ్యవస్థలు ప్రస్తుత నెట్‌వర్క్‌లోని కొంత ట్రాక్‌లను ఉపయోగిస్తాయి. అధిక వేగానికి తగ్గట్టుగా ట్రాక్‌లలో మార్పు, సిగ్నలింగ్‌ను మెరుగుపరచడం వంటివి చేయాల్సి ఉంటుంది. కఠిన భద్రతా ప్రమాణాలు, తగినంత విద్యుత్ సరఫరా, శిక్షణ పొందిన ఆపరేటింగ్ సిబ్బంది, మెరుగైన నిర్వహణ తప్పనిసరి.



ఆటంకాలు దాటుకుని..

కోవిడ్–19 మహమ్మారి, మహారాష్ట్రలో భూసేకరణ, అనుమతుల జాప్యం.. వంటి కారణాలు బుల్లెట్ రైలు ప్రాజెక్టును రెండున్నరేళ్లు వెనక్కి నెట్టాయి. మౌలిక సదుపాయాలు, రోలింగ్ స్టాక్, సిగ్నలింగ్ వ్యవస్థ ఖరీదు భారం కావడం వంటి సవాళ్లను ఎదుర్కొంది. భారత రైల్వేల సొంత ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ, ప్రభుత్వ అధీనంలో ఉన్న బీఈఎంఎల్‌ను సంయుక్తంగా 280 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే రెండు ప్రోటోటైప్ రైలు సెట్లను (ఒక్కొక్కటి ఎనిమిది కార్లు) రూపొందించి తయారు చేయడానికి కేంద్రం అనుమతి ఇచ్చింది. ఆర్థిక సహాయంతోపాటు భారత్‌లో సమాచార సేకరణ, పరీక్షల కోసం రెండు షింకన్సెన్ రైళ్లను (జపాన్ బుల్లెట్ రైళ్లు) 2026 నాటికి జపాన్ ఇంటర్నేషనల్ కో–ఆపరేషన్ ఏజెన్సీ (జికా) ఉచితంగా సరఫరా చేయనుంది. సిగ్నలింగ్ వ్యవస్థకు ప్రత్యామ్నాయాలను అందించేందుకు ఆల్‌స్టమ్–ఎల్అండ్‌టీ, డీఆర్ఏ–సీమెన్స్ జాయింట్ వెంచర్లు టెండర్ల కోసం బిడ్డింగ్ చేస్తున్నాయి.

వాటి అనుభవాల నుంచి..

జపాన్, ఫ్రాన్స్, జర్మనీతో సహా అభివృద్ధి చెందిన దేశాల్లో హై స్పీడ్ రైల్ నెట్‌వర్క్ ఉంది. ప్రపంచంలో అతిపెద్ద హెచ్ఎస్ఆర్ నెట్‌వర్క్ ఉన్న దేశం చైనా. ఇండోనేషియా, ఉజ్బెకిస్తాన్ వంటి మధ్య ఆదాయ దేశాలు సైతం హెచ్ఎస్ఆర్ జాబితాలో ఉన్నాయి. ఇప్పటికే హెచ్ఎస్ఆర్ నెట్‌వర్క్‌లను కలిగి ఉన్న దేశాల్లో పరిస్థితులపై పూర్తిస్థాయిలో మనం అధ్యయనం చేయాలి. అలాగే బుకింగ్స్ సమస్యలు (ఉజ్బెకిస్తాన్), భారీ నిర్వహణ వ్యయాలు (చైనా), శబ్ద కాలుష్యం (జపాన్) వంటి విషయాల్లో ఈ నెట్‌వర్క్‌లు ఎదుర్కొన్న విమర్శలపైనా దృష్టిపెట్టాలి. అప్పుడే మన బుల్లెట్ రైలు బ్రేకులు లేకుండా యమస్పీడుగా దూసుకెళ్తుంది.



రూ.లక్ష కోట్ల ప్రాజెక్టు

ముంబై–అహ్మదాబాద్ హై స్పీడ్ రైల్ (ఎంఏహెచ్ఎస్ఆర్) ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.1,08,000 కోట్లు. ఇందులో 81 శాతం నిధులను జపాన్ ఇంటర్నేషనల్ కో–ఆపరేషన్ ఏజెన్సీ (జికా) ద్వారా జపాన్ ప్రభుత్వం సమకూరుస్తోంది. ఈ ప్రాజెక్టులో రైల్వే మంత్రిత్వ శాఖకు 50 శాతం, మహారాష్ట్ర, గుజరాత్‌కు చెరి 25 శాతం వాటా ఉంది. మొత్తం 1,389.5 హెక్టార్ల భూమిని సమీకరించారు.

బుల్లెట్ రైల్.. ఇతర హైలైట్స్

ముంబై–అహ్మదాబాద్ కారిడార్ పొడవు 508 కిలోమీటర్లు.	బుల్లెట్ రైలు గరిష్ఠ వేగం గంటకు 320 కి.మీ.	2028 నాటికి దూసుకెళ్లనున్న బుల్లెట్ రైల్	పరిమిత స్టాప్స్‌తో 2 గంటల 7 నిమిషాల్లోనే ప్రయాణం	అన్ని స్టాప్స్‌లో ఆగితే 2 గంటల 58 నిమిషాల సమయం



కుందూ నదిలో అరుదైన చేప

ఏపీలోని నంద్యాల జిల్లా దొర్నిపాడు మండలంలోని కుందూ నదిలో అరుదైన జానిటర్ ఫిష్ అనే చేప కనిపించింది. పుల్లయ్య అనే జాలరి క్రిష్టిపాడు గ్రామ సమీపంలోని కుందూ నదికి చేపల వేటకు వెళ్లగా ఆయనకు ఈ చేప చిక్కింది. ఇది దక్షిణ అమెరికా ఆర్మర్డ్ క్యాట్ ఫిష్‌ల జాతికి చెందినది అని, దీనిని సాధారణంగా సెయిల్ ఫిష్, ఆర్మర్డ్ క్యాట్ ఫిష్ అని పిలుస్తుంటారని, వీటిని అక్వేరియంలో పెంచుతారని నిపుణులు పేర్కొన్నారు.

- దొర్నిపాడు



కిందకు ఉన్నవి కొబ్బరిబొండాం కాయలు కాగా, రంగు మారి పైకి ఉన్నవి పాపారావు గోవారకం మామిడి కాయలు

ఒకే చెట్టు.. రెండు రకాల మామిడి కాయలు

ములుగు జిల్లా వాజేడులోని నానాజీ బాబురాజు ఇంట్లో ఒకే చెట్టుకు రెండు రకాల మామిడి కాయలు కాశాయి. ఇందులో ఒకటి కొబ్బరిబొండాం రకం కాయ కాగా, మరోటి పాపారావు గోవారకం మామిడి కాయ.

- వాజేడు

మానవ శరీర భాగాల అక్రమ విక్రయం

హార్వర్డ్ మాజీ ఉద్యోగి అరెస్ట్

పెన్సిల్వేనియా: మానవ శరీర భాగాలను తస్కరించి బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్న హార్వర్డ్ మెడికల్ స్కూల్ మాజీ ఉద్యోగిని పోలీసులు అరెస్ట్ చేశారు. సెడ్రిక్ లాడ్జ్(57) అనే ఇతడు మెడికల్ స్కూల్‌లో పోస్టుమార్టంకు ముందు మృతదేహాలను తాత్కాలిక నిల్వ ఉంచే విభాగం (మార్గ్)మేనేజర్‌గా ఉండేవాడు. హార్వర్డ్‌కు వైద్య పరిశోధనలు, విద్యాబోధన నిమిత్తం అందిన మృతదేహాల నుంచి కత్తిరించిన తల, మెదడు, శరీరం, చేతులు, ముఖం, ఇతర అవయవాలను తస్కరించేవాడు. పెన్సిల్వేనియా ఫెడరల్ కోర్టులో ఇతడు నేరాన్ని అంగీకరించాడు. 2018 నుంచి 2020 మార్చి వరకు ఈ దందా కొనసాగిందని అధికారులు చెప్పారు. విద్యాబోధనకు వినియోగించిన అనంతరం వీటిని ఒప్పందం ప్రకారం దాతలకు అందజేయడమో లేక అంత్యక్రియలు జరిపించడమో చేయాల్సి ఉండగా సెడ్రిక్ దొంగతనంగా పక్కదారి పట్టించాడు. వీటిని బోస్టన్‌లోని తన ఇంటికి తీసుకెళ్లి భార్య డెనిస్ సాయంతో ఇతరులకు విక్రయించే వాడని అధికారులు తెలిపారు. ఈ అక్రమ రవాణా నెట్‌వర్క్ మసాచుసెట్స్, న్యూహాంప్‌షైర్, పెన్సిల్వేనియా రాష్ట్రాల్లో విస్తరించి ఉందన్నారు. పెన్సిల్వేనియాకు చెందిన ఓ వ్యక్తి మూడేళ్ల కాలంలో సెడ్రిక్ నుంచి కొనుగోలు చేసిన అవయవాలకు గాను రూ.32 లక్షలు చెల్లించినట్లు తేలిందన్నారు. ఇతడికి పేపాల్ ద్వారా డబ్బులు అందేవని వివరించారు. ఈ నేరానికిగాను కోర్టు ఇతడికి గరిష్ఠంగా పదేళ్ల జైలు శిక్ష విధించే అవకాశాలున్నాయి. ఇతడి భార్యపై ఆరోపణలు గతేడాదే కోర్టులో రుజువయ్యాయి.

దాయాది సైబర్ వార్‌కు చెక్

- ఆపరేషన్ బనియన్ మార్సూస్ చేపట్టిన పాకిస్తాన్
- భారత వ్యవస్థలు, సంస్థలే లక్ష్యంగా ఐదు దశల్లో సైబర్ దాడులు
- మద్దతిచ్చిన చైనా, ఇరాన్, తుర్కియే, ఉత్తర కొరియా
- సమర్థంగా తిప్పికొట్టిన మన ఏజెన్సీలు, ఎథికల్ హ్యాక్టివిస్టులు



సాక్షి, హైదరాబాద్: తూటాలు, క్షిపణులు, డ్రోన్లు, ఎయిర్ డిఫెన్స్ సిస్టం... ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్‌లోని ముష్కరులపై భారత్ సాగించిన కైనెటిక్ వార్ ఫేర్ ఇది. కానీ వర్చువల్ వరల్డ్‌లో మరో పెద్ద యుద్ధమే జరిగింది. 'ఆపరేషన్ బనియన్ ఉమ్ మార్సూస్'పేరుతో పాకిస్తాన్ పన్నిన కుయుక్తుల్ని భారత ఏజెన్సీలు సమర్థంగా తిప్పికొట్టాయి. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్ర దాడి జరగ్గా మే 7న ఆపరేషన్ సిందూర్ మొదలవడం తెలిసిందే. దీనికి ప్రతిస్పందనగా మే 10 నుంచి తాము ఆపరేషన్ మార్సూస్‌ను చేపట్టినట్లు పాక్ హ్యాకర్లు వర్చువల్ వరల్డ్‌లో ప్రచారం చేసుకున్నారు. కానీ వాస్తవానికి పహల్గాం దాడి జరిగిన మర్నాడే సైబర్ ఎటాక్స్ మొదలైనట్లు మన నిఘా వర్గాలు గుర్తించాయి. ఐదు దశల్లో ఇవి జరిగాయని, భారత ఏజెన్సీలతోపాటు ఎథికల్ హ్యాక్టివిస్టులు వాటిని సమర్థంగా తిప్పికొట్టారని తాజాగా వెల్లడించాయి.

సందేశాలతో మొదలుపెట్టి దాస్, డీడాస్...

పాకిస్తాన్‌కు చెందిన హ్యాకర్లు సైబర్ దాడుల్ని వివిధ పంథాల్లో చేపట్టినట్లు మన ఏజెన్సీలు గుర్తించాయి. గత నెల 23 నుంచి 26 వరకు జరిగిన మొదటి దశలో పాక్ హ్యాకర్లు ముఠాలుగా ఏర్పడి సైబర్ దాడులు చేశారు. హ్యాక్టివిస్టులుగా పిలిచే ఈ ముష్కరులు చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, స్కూళ్లు, కళాశాలలతోపాటు వివిధ రాష్ట్రాలకు చెందిన అధికారిక వెబ్‌సైట్లను టార్గెట్ చేశారు. కేవలం తమ స్లోగన్లు, రెచ్చగొట్టే సందేశాలు ప్రదర్శించడానికే వారు ప్రాధాన్యం ఇచ్చారు. ఏప్రిల్ 27 నుంచి మే 2 వరకు జరిగిన రెండో దశ సైబర్ ఎటాక్‌తో తీవ్రత పెరిగింది. అందులో ఈ–సేవ, ఈ–గవర్నెన్స్‌తోపాటు ప్రజాసేవలకు సంబంధించిన వెబ్‌సైట్లను లక్ష్యంగా చేసుకున్నారు. ప్రత్యేక ప్రోగ్రామింగ్ కలిసిన మాల్‌వేర్‌ను పంపడం ద్వారా వెబ్‌సైట్లు కుప్పకూలేలా చేయాలని ప్రయత్నించారు. వాటినే సాంకేతికంగా దాస్ (డినైయల్ ఆఫ్ సర్వీసెస్), డీడాస్ (డిస్ట్రిబ్యూటెడ్ డినైయల్ ఆఫ్ సర్వీసెస్) ఎటాక్స్ అని వ్యవహరిస్తుంటారు.

మూడో దశలో ర్యాట్‌లను పంపిస్తూ...

పాక్ హ్యాకర్లు మే 3 నుంచి మే 6 మధ్య మూడో దశలో రిమోట్ యాక్సెస్ ట్రోజన్ (ర్యాట్) విధానంలో ఫిషింగ్, స్పియర్ ఫిషింగ్ తరహా సైబర్ ఎటాక్స్ చేశారు. ఈ–మెయిల్స్, వాట్సాప్ సందేశాల్లో మాల్‌వేర్‌ను జోడించి పంపారు. దీన్ని ఎవరైనా క్లిక్ చేస్తే వారి ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు హ్యాకర్ల అధీనంలోకి వెళ్లిపోతాయి. ఆ డేటా మొత్తాన్ని లాక్ చేసి ఎన్‌క్రిప్ట్ చేసే అవకాశం వారికి వస్తుంది. దీన్ని డీక్రిప్ట్ చేయడానికి క్రిప్టో కరెన్సీ డిమాండ్ చేస్తారు. ఆ దశలో ఆయిల్, గ్యాస్ ఇండస్ట్రీ, తయారీ రంగంలో ఉన్న సంస్థలు టార్గెట్‌గా మారాయి. మే 7 నుంచి 12 వరకు సాగిన నాలుగో దశ ఎటాక్స్‌లో నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) టార్గెట్‌గా మారింది. అడ్వాన్స్‌డ్ ప్రెసిస్టెంట్ థ్రెట్ 36 (ఏపీటీ 36) పేరుతో నిష్ణాతులైన హ్యాకర్ల సమూహం ఈ దాడుల్ని చేసింది.

పాక్‌కు మద్దతుగా ఐదు దేశాల హ్యాకర్లు...

ఈ నెల 12 నుంచి దాదాపు 10 రోజులపాటు సాగిన ఐదో దశ సైబర్ ఎటాక్స్‌లో పాక్ హ్యాక్టివిస్టులకు చైనా, తుర్కియే, ఇరాన్, ఉత్తర కొరియా హ్యాకర్లూ తోడయ్యారు. వారంతా కలిసి ఏపీటీ 36తోపాటు ఏపీటీ 10, ఏపీటీ 28, మడ్డీ వాటర్, లజారస్ పేర్లతో సమూహాలుగా ఏర్పడ్డారు. ప్రజాసేవల రంగాలను దెబ్బతీయాలని ప్రయత్నించారు. టెలికమ్యూనికేషన్స్, పవర్ గ్రిడ్, బ్యాంకింగ్ రంగాలను లక్ష్యంగా చేసుకొని సైబర్ ఎటాక్స్ చేశారు. ఇందుకోసం ఒపేక్ డ్రాకో, మాకింగ్ డ్రాకో, సైడ్ వైండర్, టీమ్ ఇన్సానే పీకే, టీమ్ అజ్రేల్–ఎంజెల్ ఆఫ్ డెత్, సైలెంట్ సైబర్ ఫోర్స్ పేర్లతో బృందాలుగా ఏర్పడ్డారు. భారత ఏజెన్సీలు, మన ఎథికల్ హ్యాక్టివిస్టులు విదేశీ సైబర్ దాడులను సమర్థంగా తిప్పికొట్టడంతో దేశీయ సంస్థలకు భారీ నష్టం ఏమీ వాటిల్లలేదు. సైబర్ దాడుల ముప్పు ఇంకా కొనసాగొచ్చని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

వచ్చే నెలలో 'పీఎం ఈ–డ్రైవ్' టెండర్లు

- హైదరాబాద్‌కు ఎలక్ట్రిక్ బస్సుల సరఫరా కసరత్తు ప్రారంభించిన కేంద్రం
- దశలవారీగా బస్సుల సరఫరా
- 10 కొత్త డిపోల కోసం స్థల సేకరణ మొదలుపెట్టిన ఆర్టీసీ



సాక్షి, హైదరాబాద్: రాజధాని నగరం నుంచి ఆర్టీసీ డీజిల్ బస్సులను పూర్తిగా తొలగించే ప్రక్రియ మొదలు కాబోతోంది. ఇందుకు అవసరమైన 2,800 బస్సులను కేంద్రప్రభుత్వం పీఎం ఈ–డ్రైవ్ పథకంలో భాగంగా అందించనుంది. తాజాగా కేంద్రప్రభుత్వం ఇందులో 2 వేల బస్సులను మంజూరు చేసినట్టు అధికారికంగా ప్రకటించింది. మిగతా వాటిని తదుపరి మంజూరు చేయనుంది. మంజూరైన బస్సులకు వచ్చే నెలలో టెండర్లు పిలవబోతోంది.

నాలుగు ప్రాంతాల్లో అనువైన స్థలాలు

ప్రస్తుతం సిటీలో దాదాపు 2,500 బస్సులు నడుస్తున్నాయి. ఎలక్ట్రిక్ బస్సులు సమకూరిన తర్వాత డీజిల్ బస్సులను రాష్ట్రంలోని ఇతర డిపోలకు బదలాయిస్తారు. ఉన్న బస్సులు నగర ప్రజల అవసరాలను తీర్చలేకపోతున్నందున, ఎలక్ట్రిక్ బస్సులను పెంచాలని, అదనంగా 300 బస్సులు కావాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. బస్సుల సంఖ్య పెరిగితే ఉన్న డిపోలు సరిపోవు. చార్జింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాల్సి ఉన్నందున సాధారణ బస్సులతో పోలిస్తే ఎలక్ట్రిక్ బస్సులకు ఎక్కువ స్థలం అవసరం. దీంతో నగరంలో అదనంగా మరో పది డిపోలు ఏర్పాటు చేయాలని ఇప్పటికే నిర్ణయించారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన మూడు నెలల్లో బస్సుల రాక మొదలవుతుంది. దీంతో కొత్త డిపోల ఏర్పాటుకు ఆర్టీసీ చర్యలు ప్రారంభించింది. శంషాబాద్, శామీర్‌పేట, తుర్కయాంజాల్, హయత్‌నగర్ ఇలా.. పలు ప్రాంతాల్లో ఆర్టీసీకి ఉన్న సొంత స్థలాలను సిద్ధం చేస్తోంది. ఇప్పటికే నాలుగు ప్రాంతాల్లో సొంత భూములను అనువుగా ఉన్నట్టు గుర్తించింది. ఒక్కో డిపోలో 60–80 వరకు బస్సులు ఉంచాలని భావిస్తోంది. ప్రస్తుతం నగరంలో 550 ఎలక్ట్రిక్ బస్సులు సరఫరా చేయాల్సి ఉండగా, విడతల వారీగా 275 బస్సులు వచ్చాయి. కానీ, ప్రస్తుతం చైనాతో మన దేశానికి సంబంధాలు సానుకూలంగా లేకపోవటం మిగతా బస్సుల సరఫరాపై ప్రభావం చూపుతోంది. డిసెంబర్ వరకు గానీ మళ్లీ సరఫరా ఉండకపోవచ్చన్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

ఆటల్లో మేటి.. కష్టాలు కోటి

- బేస్‌బాల్ ఆటలో అంతర్జాతీయ స్థాయికి..
- పట్టుదలతో సాగుతున్న పేదింటి 'సౌమ్య'ం
- చైనా వెళ్లేందుకు డబ్బుల్లేక దీనంగా దిక్కులు
- సిద్దిపేట జిల్లా క్రీడాకారిణి అవస్థలు



మెడల్స్‌తో సౌమ్యారెడ్డి

సాక్షి, సిద్దిపేట: ఆటలపై మక్కువ అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లింది. ఆర్థిక ఇబ్బందులు మాత్రం పాతాళానికి లాగుతున్నాయి. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట–భూంపల్లి మండలం జంగాపల్లికి చెందిన బేస్‌బాల్ క్రీడాకారిణి పోసానిపల్లి సౌమ్యారెడ్డి పరిస్థితి ఇది. చైనాలో నవంబర్‌లో జరిగే బేస్‌బాల్ మహిళా ఆసియా కప్‌లో పాల్గొనే భారత జట్టులో ఆమె చోటు సంపాదించింది. ఇటీవల బ్యాంకాక్‌లో జరిగిన ఆసియా కప్ క్వాలిఫైయింగ్ పోటీలలో భారత జట్టు సిల్వర్ మెడల్ సాధించడంలో సౌమ్యారెడ్డి కీలకపాత్ర పోషించింది.

చిన్నప్పటి నుంచి ఆటలే లోకం

సౌమ్యారెడ్డి తల్లిదండ్రులు ప్రతాప్‌రెడ్డి, కవిత. వీరికి ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురు సౌమ్యారెడ్డి, చిన్న కూతురు మాధురి. సౌమ్య క్రీడల్లో రాణిస్తుండటంతో మంచి శిక్షణ ఇప్పించేందుకు హైదరాబాద్‌కు మకాం మార్చారు. ప్రతాప్‌రెడ్డి ఇళ్లకు పెయింటింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సౌమ్యకు చిన్నప్పటి నుంచి ఆటలే లోకం. 8వ తరగతి చదువుతున్నప్పుడే త్రో బాల్ నేషనల్స్ ఆడింది. సాఫ్ట్‌బాల్, క్రికెట్, బేస్‌బాల్ ఆటలో సైతం రాణిస్తోంది. హైదరాబాద్ పీజీ గ్రౌండ్‌లో బేస్‌బాల్ కోచింగ్ తీసుకుంది. ఇప్పటివరకు బేస్‌బాల్‌లో 12 నేషనల్స్ ఆడింది. అండర్ –19 క్రికెట్‌తోపాటు సాఫ్ట్‌బాల్ 15 నేషనల్స్‌లలో పాల్గొంది. నవంబర్‌లో చైనాలో జరిగే ఆసియా కప్‌లో పాల్గొనే భారత జట్టుకు ఇటీవల ఎంపికైంది. అయితే, పేద కుటుంబం కావటంతో ప్రయాణ ఖర్చులు భారంగా మారాయి. పోటీలలో పాల్గొనేందుకు నెల రోజుల ముందే చైనాకు చేరుకుని ప్రాక్టీస్ చేయాలి. ప్రయాణం ఖర్చులతో పాటు అక్కడ నెలపాటు ఉండేందుకు దాదాపు రూ.5 లక్షల వరకు అవసరం. అంతమొత్తం భరించే స్తోమత ఆ కుటుంబానికి లేకపోవటంతో సౌమ్య నిరాశలో కూరుకుపోయారు.

ఇండియాకు మెడల్స్ తీసుకొస్తా

ఇండియా తరఫున ఆడి మెడల్స్ తీసుకువస్తా. చైనాలో జరిగే ఆసియా కప్‌ను గెలుపొందేందుకు కృషి చేస్తా. చైనాకు వెళ్లాలంటే ఆర్థికంగా ఇబ్బందిగా ఉంది. హైదరాబాద్‌లో బేస్‌బాల్ శిక్షణ, ప్రాక్టీస్ కోసం రోజు 14 కిలోమీటర్లు సైకిల్ మీద వెళ్తున్నాను. నన్ను ప్రోత్సహిస్తున్న బేస్‌బాల్ అసోసియేషన్‌ప్రధాన కార్యదర్శి శ్వేత, కోచ్ చిన్న, ఖాదర్, షానవాజ్‌లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు.

– సౌమ్యారెడ్డి, బేస్‌బాల్ క్రీడాకారిణి.

బ్యాంకాక్‌కు బంగారం కుదువపెట్టి పంపించాం



బ్యాంకాక్ పోటీల్లో పాల్గొనేందుకు దాదాపు రూ.3.5 లక్షలు ఖర్చు అయింది. మా బిడ్డ లక్ష్యంకు చేరుకునేందుకు మా దగ్గర ఆర్థిక స్తోమత లేనప్పటికీ బంగారం బ్యాంకులో కుదువపెట్టి ఆ డబ్బుతో పంపించాము. కొంత అప్పు కూడా చేశాం. నవంబర్‌లో చైనా వెళ్లేందుకు రూ.5 లక్షలు అవుతుందని తెలిసింది. అంత ఖర్చు భరించే స్తోమత మాకు లేదు. ఎవరైనా దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలి.

– సౌమ్య తల్లిదండ్రులు ప్రతాప్‌రెడ్డి, కవిత



సైబర్ సస్పెక్ట్.. వెంటనే రిపోర్ట్ చేయండి

సైబర్ నేరాల నిరోధంలో మరో ముందడుగు

- 'అనుమానాస్పదాల'పై ఎన్‌సీఆర్‌పీ పోర్టల్ దృష్టి
- అధికారిక వెబ్‌సైట్‌లోనూ ప్రత్యేక లింక్ ఏర్పాటు
- 8 అంశాలపై సమాచారం ఇచ్చే అవకాశం

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరాల నిరోధం దిశగా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ) మరో కీలక ముందడుగు వేసింది. అనుమానాస్పద సోషల్ మీడియా ఖాతా, ఫోన్ నంబర్.. ఇలా మొత్తం ఎనిమిది అంశాలపై ఎప్పటికప్పుడు ఫిర్యాదు చేసే అవకాశం ఇచ్చింది. దీనికోసం తన అధికారిక పోర్టల్‌లో (https:// cybercrime.gov.in) ప్రత్యేక విభాగంతో కూడిన లింక్ అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే ఈ లింక్ దుర్వినియోగానికి ఆస్కారం లేకుండా ప్రతి ఫిర్యాదుతోపాటు ఆధారాలను జత చేయడం తప్పనిసరి చేసింది.

సైబర్ నేరాలకు అవే ఆధారం

ఏ సీజన్‌లో.. ఆ ఫ్రాడ్ చేస్తూ అందినకాడికి కొల్లగొట్టే సైబర్ నేరగాళ్లకు ఫోన్ కాల్స్‌తోపాటు సోషల్‌మీడియా ఖాతాలే ఆధారం. డార్క్ వెబ్‌తో పాటు వివిధ మార్గాల్లో లక్షల్లో ఫోన్‌నంబర్లను సంప్రదిస్తున్న సైబర్ నేరగాళ్లు వీటి ఆధారంగానే ఎర వేస్తున్నారు. బల్క్ విధానంలో సందేశాలు పంపుతూ, ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం (ఐవీఆర్ఎస్) కాల్స్ చేస్తూ తమ పని ప్రారంభిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో నకిలీ వెబ్‌సైట్లు ఏర్పాటు చేసి, వర్చువల్ మొబైల్ యాప్స్‌ను లింకుల ద్వారా టార్గెట్ చేసిన వ్యక్తికి పంపి అందినకాడికి దండుకుంటున్నారు. వీరు వినియోగించే సిమ్‌కార్డులు, బ్యాంకు ఖాతాలు సహా ప్రతీదీ నకిలీ పేర్లు, చిరునామాలతోనే ఉంటున్నాయి.

ఇప్పటి వరకు నేరం జరిగాకే...

సైబర్ నేరాల బారిన పడినవారు ఫిర్యాదు చేయడానికి, సహాయసహకారాలు పొందడానికి ఎన్‌సీఆర్‌పీ పోర్టల్ పనిచేస్తోంది. ఈ వెబ్‌సైట్‌తో పాటు టోల్‌ఫ్రీ నంబరు1930 ద్వారా బాధితులు ఫిర్యాదు చేసే అవకాశముంది. ఇలా వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా నేరగాళ్లు వినియోగించిన సెల్‌నంబర్, బల్క్ పోర్టల్, వెబ్‌సైట్, బ్యాంకు ఖాతా సహా వివిధ అంశాలను పోర్టల్ నిర్వాహకులతోపాటు ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) దృష్టికి వెళుతున్నాయి. ఇలా ఆయా నేరగాళ్లు వినియోగించిన వాటిని గుర్తిస్తున్న అధికారులు వాటిని కేసుల దర్యాప్తునకు ఆధారంగా మార్చుకుంటున్నారు. ఆపై వీటికి సంబంధించిన జాబితాలను రూపొందించి సంబంధిత విభాగాలు, మంత్రిత్వ శాఖలు, బ్యాంకుల ద్వారా బ్లాక్ చేయిస్తున్నారు.



నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ విడుదల చేసిన అధికారిక పోర్టల్

ఒకేసారి ఎందరినో టార్గెట్ చేస్తూ...

ఇదంతా నేరం జరిగిన తర్వాత, ఆ నేరంలో కొందరు బాధితులుగా మారిన తర్వాత జరుగుతోంది. అలాకాకుండా సైబర్ నేరం చేయడానికి ముందే ఆ కేటుగాళ్లు ఎర వేయడం మొదలెట్టడంతోనే వీటిని బ్లాక్ చేయాలని ఎన్‌సీఆర్‌పీ నిర్ణయించుకుంది. ఓ వ్యక్తిని టార్గెట్ చేసిన తర్వాత నేరగాళ్లు కొన్నిరోజుల పాటు వారితో సంప్రదింపులు జరుపుతుంటాడు. వ్యవస్థీకృతంగా నేరం చేయడానికి కాల్ సెంటర్లు సైతం ఏర్పాటు చేసుకుంటున్న నేరగాళ్లు ఒకేసారి అనేక మందితో సంప్రదింపులు జరుపుతున్నారు. వీరిలో కొందరే వారి వల్లో పడతారు. ఆదిలోనే ప్రజల నుంచి సమాచారం సేకరించి వారి ఫోన్‌నంబర్ తదితరాలను బ్లాక్ చేస్తే బాధితుల సంఖ్య తగ్గే అవకాశముందని ఎన్‌సీఆర్‌పీ నిర్ణయించింది. దీంతో తన పోర్టల్‌లోని 'రిపోర్ట్ అండ్ చెక్ సస్పెక్ట్' (https:// cybercrime.gov.in/webform/cyber&suspect. aspx) విభాగంలో వెబ్‌సైట్, వాట్సాప్ నంబర్/టెలి గ్రాం హ్యాండ్లర్, ఫోన్ నంబర్, ఈ–మెయిల్ ఐడీ, ఎస్ఎంఎస్ నంబర్/హ్యాండ్లర్, సోషల్‌మీడియా యూఆర్ఎల్, డీప్ ఫేక్, మొబైల్ యాప్‌లపై ఫిర్యాదు చేసే అవకాశం ఇచ్చింది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

ఆ 'ఆనందం' దక్కదా!

- కిన్నెరసాని జలాశయం మధ్యలో ఆనంద ద్వీపం
- మంత్రులు, కలెక్టర్లు పరిశీలించినా అభివృద్ధికి దూరమే
- ఫలితంగా దూరం నుంచే పర్యాటకులు వీక్షించాల్సిన దుస్థితి





కిన్నెరసాని మధ్యలోని ఆనంద ద్వీపం

పాల్వంచ రూరల్: ప్రకృతి అందాలకు నెలవైన కిన్నెరసాని పర్యాటక అభివృద్ధికి నోచుకోవడం లేదు. మంత్రులు, కలెక్టర్లు ప్రత్యక్షంగా పరిశీలించినా అడుగు కూడా ముందుకు పడడం లేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని కిన్నెరసాని పర్యాటకంగా అభివృద్ధి చెందకపోవడంతో ప్రభుత్వం ఆదాయాన్ని కోల్పోతోంది. నిత్యం వందల సంఖ్యలో, సెలవు రోజుల్లో వేలాదిగా వచ్చే పర్యాటకులు రిజర్వాయర్ మధ్యలోని ఆనంద ద్వీపాన్ని సందర్శించాలని తపన పడుతుంటారు. కానీ అక్కడ చేయాల్సిన అభివృద్ధి పనుల్లో ముందడుగు పడకపోవడంతో అద్భుత అవకాశాన్ని కోల్పోతున్నారు.

ముగ్గురు మంత్రులు వీక్షించినా..

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఏడాది క్రితం కిన్నెరసానిని సందర్శించారు. రిజర్వాయర్ మధ్యలోని ఆనంద ద్వీపం అద్భుతంగా ఉందని, పర్యాటకులకు దర్శనభాగ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అద్దాల మేడ, కాటేజీ పనులు వేగవంతం చేయాలని, పర్యాటకులను ఆకర్షించేలా ఆనంద ద్వీపాన్ని తీర్చిదిద్దాలని అటవీశాఖను ఆదేశించారు. ప్రభుత్వం కూడా ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించడంతో కలెక్టర్ కిన్నెరసానిపై ప్రత్యేక దృష్టి సారించినా, పనులు మాత్రం మందకొడిగానే సాగుతున్నాయి.

పర్యాటకులకు నిరాశే..

చూడచక్కని ప్రకృతి అందాలు, అద్భుతమైన హైల్యాండ్స్, అందమైన జలాశయం, ఆహ్లాదకరమైన అడవులు ఉన్న కిన్నెరసానిలో సౌకర్యాలు లేక పర్యాటకులకు నిరాశే మిగులుతోంది. అద్దాలమేడ, కాటేజీలు, హరిత హోటల్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతారు.

పదేళ్ల క్రితమే నిధులు మంజూరు


కిన్నెరసాని పర్యాటక ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు 2015లో నీతి అయోగ్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.3.24 కోట్లు, ఎకో టూరిజం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.7.53 కోట్లు మంజూరు చేశాయి. ఆ నిధులతో కొత్తగూడెం క్రాస్ వద్ద హరిత హోటల్, కిన్నెరసానిలో పది కాటేజీలు, అద్దాలమేడ, ఫుడ్‌కోర్టు పనులు చేపట్టాలని నిర్ణయించారు. కాగా, ఇందులో కొన్ని పూర్తి కాగా, మరికొన్ని అసంపూర్తిగానే ఉన్నాయి. దీంతో సౌకర్యాల లేమితో పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు. పర్యాటకుల సంఖ్య పెరుగుతున్నా.. వసతులు ఉంటే మరింత మంది వచ్చే అవకాశం ఉంది.

సింగపూర్ నుంచి ఆర్కిటెక్ట్‌లు..

రిజర్వాయర్ మధ్యలో ఉన్న ఆనంద ద్వీపాన్ని అభివృద్ధి చేసేందుకు 2018లో అప్పటి కలెక్టర్ రజత్ కుమార్ శైనీ సింగపూర్ నుంచి ప్రత్యేకంగా ఆర్కిటెక్ట్‌లను పిలిపించారు. పర్యాటకుల సౌకర్యార్థం వెదురు బొంగులతో గుడారాలు, ఎత్తయిన ట్రాక్, తాగునీటి వసతి వంటివి కల్పించాలని నిర్ణయించారు. అయితే అవి నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఆ తర్వాత కలెక్టర్లు ఎంవీ రెడ్డి, అనుదీప్‌తోపాటు ప్రస్తుత కలెక్టర్ జితేశ్ వి పాటిల్ కూడా పనులను పరిశీలించినా ఫలితం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని లక్నవరంలో ఏర్పాటు చేసినట్టుగా ఆనంద ద్వీపం వరకు తీగలవంతెన ఏర్పాటు చేసి, హోటళ్లు, వసతి గృహాలను నిర్మిస్తే పర్యాటకుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశముంది.


ఐలాండ్ అభివృద్ధిపై చర్చిస్తున్న కలెక్టర్ పాటిల్ (ఫైల్)


ఐలాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్కిటెక్ట్‌లు (ఫైల్)


నిర్మాణ దశలోని కాటేజీలు


కిన్నెరసాని జలాశయం మధ్యలో ఐలాండ్ ఉన్న ప్రదేశం

కథలు రాయించి... బొమ్మలు గీయించి

విద్యార్థుల సృజనాత్మకతకు పదును పెడుతున్న హెచ్‌ఎం

ధర్మారం(ధర్మపురి): విద్యార్థులతో కథలు రాయిస్తున్నాడు...వారితో బొమ్మలు వేయిస్తున్నాడు. వాటిని తను నిర్వహిస్తున్న ఓ పత్రికలో ప్రచురిస్తూ విద్యార్థుల్లోని సృజనాత్మకతకు పదును పెడుతున్నారు ఆ హెచ్‌ఎం. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని రచ్చపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సముద్రాల వంశీమోహనాచార్యులు వినూత్న రీతిలో విద్యాబోధనకు శ్రీకారం చుట్టారు. మై స్కూల్ ఈ జైన్ షాన్మాశిక పత్రిక నిర్వహిస్తున్న విద్యార్థులకు సులభమైన రీతిలో వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ పత్రికలో విద్యార్థులు రాసిన చిన్న కథలు, కవితలు, గీసిన చిత్రాలు ప్రచురించారు. చిన్నారుల్లో ఉన్న సృజనాత్మక శక్తిని పెంపొందించేందుకు 'ఈ జైన బాల షాన్మాశిక పత్రిక'ను రూపొందించినట్టు ఆయన చెప్పారు. ఈ పత్రికలో ప్రచురితమయ్యాక వాటిని చూసి విద్యార్థులు రెట్టించిన ఉత్సాహంతో తమ తెలివికి పదును పెడుతున్నారని చెప్పారు. 'మై స్కూల్ ఈ జైన్ షాన్మాశిక పత్రిక' నిర్వహణ తీరును పరిశీలించిన జిల్లా విద్యాధికారి మాధవి, మండల విద్యాధికారి ప్రభాకర్, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

లెక్కల వైకుంఠపాళి

హెచ్‌ఎం ఆధ్వర్యంలో వినూత్న పద్ధతిలో లెక్కలు (గణితం) నేర్పిస్తున్నారు. మన ఊరు–మనబడి కార్యక్రమం కింద రూ.38.33 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు తరగతి గదులు గతేడాది అందుబాటులోకి వచ్చాయి. హెచ్‌ఎం సొంతంగా రూ.70 వేలు వెచ్చించి పిల్లలను ఆకట్టుకునేలా గోడలతోపాటు ఫ్లోరింగ్‌పై బొమ్మలు వేయించారు, ఆంగ్ల పదాలు, తెలుగు వ్యాకరణం, ఆటలు తదితరాలు అందులో ఉన్నాయి. పాఠశాల ఆవరణలో గీయించిన వైకుంఠపాళి ద్వారా విద్యార్థులకు లెక్కలు నేర్పుతున్నారు. గదుల్లో ముగ్గురు విద్యార్థులు నిల్చొని ఉంటే బయట ముగ్గురు ఆడుతుంటారు. ఒక్కొక్కరి వద్ద క్యూబ్ ఆకారంలో ఉండే మూడు డైస్‌లు ఉంటాయి. మూడింటినీ ఒకేసారి వేస్తారు. వచ్చిన సంఖ్య ఆధారంగా వైకుంఠపాళిలో ఉన్న విద్యార్థులు గడులు మారుతుంటారు. మరోవైపు.. పాఠశాలలోని మెట్లపై ఎక్కాలు రాయించారు. పాఠశాల ఆవరణలో మొక్కలను వృత్తం, పంచభుజి, త్రిభుజం తదితర ఆకారాల్లో తొట్టిలు నిర్మించి గణితంపై అవగాహన కల్పిస్తున్నారు.







మై స్కూల్ ఈ జైన్ షాన్మాశిక పత్రికలో విద్యార్థులు గీసిన చిత్రాలు


సీనియర్ జర్నలిస్టు ఎండీ మునీర్ మృతికి కేసీఆర్ సంతాపం

సాక్షి, హైదరాబాద్: సీనియర్ జర్నలిస్టు, టీజేఎఫ్ తెలంగాణ జర్నలిస్టుల సంఘం నేత, ఎండీ మునీర్ మృతిపట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సింగరేణి కార్మికుల నడుమ జీవిస్తూ వారి సమస్యలను వెలుగులోకి తెస్తూ నిబద్ధతగల పాత్రికేయునిగా సుదీర్ఘకాలం పనిచేసిన మునీర్ కృషి గొప్పదన్నారు. టీజేఎఫ్ నేతగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన పోరాటంలో సింగరేణి ప్రాంత ప్రజాసంఘాలను, ఉద్యమ శక్తులను సమన్వయం చేయడంలో, వారిని చైతన్యపరచడంలో జర్నలిస్టుగా ఎండీ మునీర్ సేవలను కేసీఆర్ స్మరించుకున్నారు. మునీర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం ఎండీ మునీర్ మరణంపై సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. మునీర్ మృతి బాధాకరమని మాజీ మంత్రి హరీశ్‌రావు వేరొక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. సుదీర్ఘకాలం జర్నలిస్టుగా సేవలందించిన ఆయన, సింగరేణి కార్మికుల కష్టాలను, సమస్యలను వెలుగులోకి తెచ్చారని హరీశ్‌రావు గుర్తుచేసుకున్నారు.





ఆదివారం సరస్వతీ పుష్కరాల సందర్భంగా కాళేశ్వరంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు


సిరొంచ వైపు నిలిచి ఉన్న వాహనాలు


బండెనక..బండి

మల్హర్: సరస్వతి పుష్కరాలు ముగింపు దశకు చేరుకోవడంతో పుష్కర స్నానాలకు వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో ఆర్టీసీ, ప్రైవేట్ వాహనాల రద్దీ ఎక్కువై కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి.



ఆదివారం హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో మధ్య–పశ్చిమ ఆఫ్రికా దేశాలకు చెందిన మీడియా ప్రతినిధులు. వీరు తమ పర్యటనలో హైదరాబాద్‌తోపాటు పోచంపల్లిని సందర్శిస్తారు.

కృష్ణమ్మపై కారుమబ్బులు



దిగువన క్షీర వర్ణంలో నిశ్చల గంభీర స్థితిలో కృష్ణమ్మ.. పైన గంగను పుక్కిట పట్టి ఎప్పుడు ఒలకపోద్దామా అని చూస్తున్న కరిమబ్బులు. మరోవైపు వీటితో నాకు సంబంధమే లేదన్నట్టు పడవపై బతుకువేట సాగిస్తున్న జాలరి. విజయవాడలోని ప్రకాశం బ్యారేజ్ వద్ద ఆదివారం సాయంత్రం ఈ మనోహర దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

వన్ ఎర్త్..వన్ లైఫ్



భూమిపై ప్రాణికోటి మనుగడ సాగించాలంటే ఆక్సిజనే ఆధారం. ఈ ప్రాణవాయువును అందించేది వృక్షాలే. అయితే అది మరచిన మనిషి చెట్లను నరికేస్తూ తన వినాశనాన్ని తానే కొనితెచ్చుకుంటున్నాడు. దీనిపై అవగాహన పెంపొందించేందుకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో చిన్నారులు నిర్వహించిన వన్ ఎర్త్.. వన్ లైఫ్ కార్యక్రమం ఆకట్టుకుంది - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

అలలపై సయ్యాట



విశాఖలోని రుషికొండ బీచ్ ఆదివారం సందర్శకులతో కిక్కిరిసింది. యువతీయువకుల కేరింతలతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. స్పీడ్ బోట్లు అలలను చీల్చుకుంటూ వెళ్తుంటే పర్యాటకులు కేరింతలు కొట్టారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ముగిసిన లాసెట్ దరఖాస్తుల గడువు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లాసెట్–2025 ప్రవేశ పరీక్షకు అపరాధ రుసుముతో దరఖాస్తుల గడువు ఆదివారంతో ముగిసింది. వచ్చే నెల 5వ తేదీన జరగనున్న లాసెట్ పరీక్షకు 27,217 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 30వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లను అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

కుంకీలతో భీ'కరి' కట్టడి



సూచనలిస్తున్న పీసీసీఎఫ్ అజయ్‌కుమార్‌నాయక్

తిరుపతి మంగళం : అటవీ ప్రాంతంలో నుంచి బయటకు వస్తున్న మద గజాలను కుంకీ ఏనుగులతో కట్టడి చేసేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అజయ్‌కుమార్ నాయక్ ఆదేశించారు. ఆదివారం తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర జంతుప్రదర్శనశాలలోని ఎలిఫెంట్ క్యాంపును ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పలమనేరులోని క్యాంపుతో పాటు జూ పార్కును కూడా కుంకి ఏనుగుల నిర్వహణకు వినియోగించుకోవాలని సూచించారు. శిక్షణ పొందిన ఏనుగులను జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు. గజ దాడులలో ఒక్కరు కూడా మృత్యువాత పడకుండా, పంట పొలాలు నాశనం కాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే జూ పార్క్ లోని వన్యప్రాణుల స్థావరంలో పరిశుభ్రతను మెరుగుపరచాలన్నారు. అనంతరం జంతువుల ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. జూలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో తిరుపతి సీఎఫ్ సెల్వం, అనంతపురం సీఎఫ్ యశోదాబాయి పాల్గొన్నారు.

కష్టాల కడలిలో గోదా'వర్రీ' రైతు



కాకినాడ తిమ్మాపురంలో ఆరబెట్టిన మొలకెత్తిన ధాన్యం

పంట కొనే నాథుడే లేదు

కళ్లాల్లో కలిసిపోయిన నాదెండ్ల మాటలు / అదనంగా ఒక్క గింజ కొంటే ఒట్టు / దిక్కుతోచని స్థితిలో రబీ రైతులు

ప్రకృతి కన్నెర్రకు, కూటమి ప్రభుత్వ నిర్వాకం తోడవడంతో రబీ రైతులు కుదేలయ్యారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల్లో ఈ సీజన్‌లో దిగుబడులు బాగున్నాయనుకున్న తరుణంలో ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడం రైతన్నకు పెను శాపమైంది. ఎక్కడి ధాన్యం అక్కడే రోడ్ల పైన, కళ్లాల్లో ఉండిపోవడంతో అకాల వర్షాలకు తడిసి ముద్దయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఖరీఫ్ సీజన్ ఆసన్నమై సాగుకు సమాయత్తమయ్యే తరుణంలో ఇంకా కళ్లాల్లో కనిపిస్తున్న తడిసిన ధాన్యం చూసి రైతులు గుండెలవిసేలా విలపిస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో తడిసిన ధాన్యంతో రైతులు రోడ్డెక్కి ఎక్కడికక్కడ ఆందోళనలకు దిగడంతో ప్రభుత్వం అదనంగా ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రకటించింది. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడ జిల్లా జగ్గంపేట, పెద్దాపురం మండలాలు సహా పలు ప్రాంతాల్లో కళ్లాల్లో ఉన్న తడిసిన ధాన్యం వద్ద ఫొటోలకు పోజులిచ్చారే తప్ప అదనంగా ఒక్క గింజ కొంటే ఒట్టని రైతులు మండిపడుతున్నారు. - సాక్షి ప్రతినిధి, కాకినాడ

జగన్ హయాంలో తేమ శాతంతో సంబంధం లేకుండా కొనుగోళ్లు

రబీలో వరి కోతలు ముమ్మరంగా జరిగినప్పుడు ధాన్యాన్ని అక్కడక్కడ కొద్దోగొప్పో కొనుగోలు చేసిన ప్రభుత్వం.. వర్షాలు పడి తడిసి ముద్దయ్యే సరికి చేతులెత్తేసింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాదిరిగా తేమ శాతంతో సంబంధం లేకుండా తడిసిన ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేసి ఉంటే రబీ సీజన్ ముగుస్తున్నా రోడ్లపైన, కళ్లాల్లోను ధాన్యం కనిపించేదే కాదని రైతులు అభిప్రాయపడుతున్నారు.

జిల్లాల వారీగా పరిస్థితి ఇదీ...

కాకినాడ జిల్లాలో రబీలో 1.60 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఐదున్నర లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో రబీ సీజన్ చివరి దశకు వచ్చేసరికి 3.40 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు జిల్లా యంత్రాంగం చెబుతోంది. మిగిలిన ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది.

తూర్పు గోదావరి జిల్లాలో 2.50 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలనేది లక్ష్యం కాగా 2,63,076 మెట్రిక్ టన్నులతో లక్ష్యాలను అధిగమించామని కొనుగోళ్లు ఆపేశారు.

కోనసీమ జిల్లాలో 5,86,616 మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా కాగా, రెండు లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు మాత్రమే ప్రభుత్వం అనుమతించింది.

ఆరబెట్టుకున్న ధాన్యానికి.. మొలకలు

గడచిన ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై ఆరబెట్టుకున్న ధాన్యం మొలకలెత్తడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇక కొనుగోలు చేసిన కొద్దో గొప్పో ధాన్యం విషయానికి వస్తే, 75 కేజీల బస్తా ధాన్యం రూ.1,725కు కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రచారార్భాటమే తప్ప క్షేత్ర స్థాయిలో రూ.1,250 మించి ఎక్కడా కొనుగోలు చేసిన దాఖలాలు లేవు.



పిఠాపురంలో మొలకలొచ్చిన ధాన్యం

అటుకులు ఆడించుకోవాల్సిన దుస్థితి



ఆరబెట్టుకుంటుండగా కురిసిన అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోయి మొలకలు వచ్చాయి. కొనడానికి దళారులు కూడా రావడం లేదు. దిక్కుతోచని పరిస్థితుల్లో తడిసిన ధాన్యాన్ని అటుకులు ఆడించుకోవాల్సిన దుస్థితి దాపురిస్తుందనే భయమేస్తోంది.

– టి.సత్యనారాయణ, రైతు, తిమ్మాపురం, కాకినాడ రూరల్ మండలం

తక్కువ రేటుకైనా కొనడం లేదు



వర్షం కారణంగా రాశుల్లో ఉన్న దానితో పాటు రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం కూడా తడిసిపోయింది. తడిసిన ధాన్యాన్ని కనీసం తక్కువ రేటుకైనా కొనుగోలు చేసేందుకు ఏ కమీషన్ ఏజెంటూ ముందుకు రావడం లేదు.

– కె.అప్పారావు, రైతు, అచ్చంపేట, సామర్లకోట మండలం, కాకినాడ జిల్లా

పగడపు దిబ్బలకు ముప్పు



పగడపుదిబ్బల్ని సంరక్షిస్తున్న ప్లాటిపస్ స్కూబా డైవర్లు

కూటమి విధ్వంస రచన

- సముద్ర పర్యావరణంపై పగబట్టిన ప్రభుత్వం
- సంపద సృష్టి కోసం సాగర తీరంలో పర్యాటక ప్రాజెక్టులు
- జీవ వైవిధ్యం కోసం పగడపు దీవుల్ని కాపాడుతున్న ఎన్జీవో సంస్థ ప్లాటిపస్
- పదేళ్లపాటు సంరక్షిస్తే సముద్ర తీర సంరక్షణ
- తిమ్మాపురం నుంచి మంగమారిపేట వరకు విస్తరించిన కోరల్ రీఫ్స్
- ఆ ప్రాంతంలోనే వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటుకు ప్రభుత్వ కుట్ర
- పగడపుదిబ్బల రక్షణ కోసం పోరాటం చేస్తున్న ప్లాటిపస్ ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం:

ఆంధ్రప్రదేశ్ తీరంలో ఎక్కడా లేని విభిన్న పగడపు దిబ్బలకు చిరునామాగా ఉన్న విశాఖ తీరంలో విధ్వంసకాండకు తెరతీసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రపన్నుతోంది. సంపద సృష్టి కోసం.. పర్యాటకం పేరుతో.. పర్యావరణంపై వేటు వేస్తున్నారు. జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు ప్లాటిపస్ ఎన్జీవో సంస్థ సముద్ర గర్భంలో పగడపు దీవుల్ని కాపాడుకుంటూ వస్తోంది. మరో పదేళ్లపాటు వాటిని సంరక్షిస్తే.. మరింత విస్తరించి.. సాగరతీర స్వచ్ఛతతో పాటు.. కోతకు గురయ్యే ప్రమాదం నుంచి కాపాడవచ్చు. కానీ కూటమి ప్రభుత్వం ఇవేమీ పట్టనట్లుగా మంగమారిపేట తీరంలో వాటర్‌స్పోర్ట్స్‌కు టెండర్లు ఆహ్వానించి విధ్వంస రచనకు సంతకం చేస్తుండటంతో పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పగడపు దిబ్బల రక్షణ కోసం పోరాటం కొనసాగించేందుకు ప్లాటిపస్ సంస్థ ప్రతినిధులు నడుంబిగించారు.

కోస్తా తీరంలో పగడపు దిబ్బలు అస్సలుండవని గతంలో అనేక సర్వేలు చెప్పినప్పటికీ, ఇటీవల జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పరిశోధనలు ఆ వాదనను తప్పని నిరూపించాయి. విశాఖ సాగర తీరంలో విభిన్న రకాల కోరల్స్ (పగడపు దిబ్బలు) ఉన్నట్లు గుర్తించారు. ముఖ్యంగా మంగమారిపేట ప్రాంతంలో సాగరగర్భంలో విభిన్న పగడపు దిబ్బలు ఉన్నట్లు అన్వేషణలో తేలింది. దీని వెనుక ప్లాటిపస్ ఫౌండేషన్ కృషి ఎంతో ఉంది. తిమ్మాపురం, రుషికొండ, మంగమారిపేట మొదలైన ప్రాంతాల్లో నిరంతరం సాగరగర్భ స్వచ్ఛత కోసం ఈ సంస్థ ఏళ్ల తరబడి శ్రమిస్తోంది. సముద్రపు లోతుల్లో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను



మంగమారిపేట సముద్ర గర్భంలో ప్లాస్టిక్ వ్యర్థాల్ని తొలగిస్తున్న ప్లాటిపస్ ప్రతినిధులు

ఇప్పటివరకు 2 లక్షల 60 వేల కిలోల వరకు తొలగించారు. అక్కడ ఉన్న పగడపు దిబ్బలను సంరక్షిస్తూ వాటి అభివృద్ధి కోసం స్కూబా డైవర్లతో కలిసి నిరంతరం కృషి చేయడంతో మంగమారిపేట, తిమ్మాపురం ప్రాంతాల్లో ఇవి విస్తరించాయి. స్కెలరాక్టినియా కోరల్స్, పవోనా ఎస్‌పీ, లిథోఫిలాన్ ఎస్‌పీ, మోంటీపోరా ఎస్‌పీ, పోరిటెస్ ఎస్‌పీ, హెక్సాకోరిలియా, ఆక్టోకోరలియా, డిస్కోసోమా, లోబాక్టిస్ వంటి అరుదైన పగడపు దిబ్బలు విస్తారంగా ఉన్నాయి.

తీరప్రాంత నిర్మాణాలు పెరగడం, ఉష్ణోగ్రతలు పెరగడం కారణంగా ఇప్పటికే 33 శాతం పగడాలు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయి. వాతావరణ మార్పులు, విధ్వంసకర మానవ చర్యల వల్ల వీటి మనుగడకు ముప్పు వాటిల్లుతోంది. తీరప్రాంతాన్ని రక్షించేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయనే ఉద్దేశంతో ప్లాటిపస్ సంస్థ ఈ పగడపు దిబ్బలను సంరక్షిస్తోంది. అయితే ఇలాంటి అరుదైన ప్రాంతంపై ఇప్పుడు కొందరు కూటమి నేతల కన్ను పడింది. సంపద సృష్టి పేరుతో తిమ్మాపురం నుంచి మంగమారిపేట వరకు ఆక్వా స్పోర్ట్స్‌ను అభివృద్ధి చేసేందుకు టెండర్లు ఆహ్వానించారు. వాస్తవానికి ఈ ప్రాంతం వాటర్‌స్పోర్ట్స్‌కు అనువుగా లేకపోయినా కేవలం కొన్ని సంస్థలకు భూములు కట్టబెట్టేందుకే పర్యాటక శాఖ ఇలాంటి ప్రయత్నాలు చేస్తోందని ఆరోపణలు వస్తున్నాయి. టూరిజం మంత్రి అండదండలున్న ఒక సంస్థ కోసం పగడపు దిబ్బలను నాశనం చేసేందుకు సిద్ధమవుతున్నారని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే పగడపు దిబ్బలను సంరక్షించేందుకు ప్లాటిపస్ ఫౌండేషన్ సంస్థ పోరాటానికి సిద్ధమైంది. ఈ ప్రాంతంలో వాటర్ స్పోర్ట్స్ వద్దని, వాటిని వేరే ప్రాంతానికి తరలించాలని వారు అధికారులను కోరుతున్నారు.

'కూటమి' కాసుల కక్కుర్తికి బలి.!

పదేళ్లపాటు సంరక్షించుకోవాలి



కొన్ని తీర ప్రాంతాలను ప్రభుత్వం గుర్తించి ఆక్వా స్పోర్ట్స్ అభివృద్ధి కోసం ప్రయత్నించడం మంచి పరిణామమే. కానీ అత్యంత అరుదైన, జీవవైవిధ్యానికి, పర్యావరణానికి ఎంతో మేలు చేసే పగడపు దిబ్బలు ఉన్న ప్రాంతంలో వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటు చేయడం మాత్రం తగదు. గత కొన్నేళ్లుగా మంగమారిపేట ప్రాంతంలో కోరల్ రీఫ్స్‌ను పెంచుతూ వస్తున్నాం. వీటిని మరో పదేళ్లపాటు సంరక్షించుకుంటే ఈ ప్రాంత సముద్ర తీరం మరింత ఆహ్లాదకరంగా మారుతుంది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతున్నాం.

– సుభాష్ చంద్రన్, ప్లాటిపస్ ఫౌండేషన్ ప్రతినిధి

జీవవైవిధ్యానికి ప్రతిరూపాలు



ఈ కోరల్స్ ద్వారా సముద్ర జీవజాలాన్ని సంరక్షించుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. సముద్ర గర్భంలో పర్యావరణ పరిరక్షణ వ్యవస్థలుగా పగడపు దిబ్బలను పిలుస్తారు. పగడాల ద్వారా స్రవించే కాల్షియం కార్బోనేట్ నిర్మాణాల వల్ల ఇవి ఏర్పడతాయి. ఇవి అనేక పోషకాలను కలిగి ఉంటాయి. పగడపు దిబ్బలు సముద్రగర్భంలో అత్యంత వైవిధ్యమైన పర్యావరణ వ్యవస్థలను ఏర్పరుస్తాయి. ఇవి ఉంటే సముద్ర జీవరాశులు ఎక్కువగా వృద్ధి చెందడానికి ఉపయోగపడతాయి. సముద్రంలోని చేపలతో పాటు 25 శాతం జీవులకు సముద్ర వర్షారణ్యాలు అని పిలిచే పగడపు దిబ్బలే ఆవాసాలు. రంగురంగుల చేపల నుంచి గంభీరమైన సముద్ర తాబేళ్ల వరకు లెక్కలేనన్ని జాతులకు ఇవి కీలకమైన ఆశ్రయం, సంతానోత్పత్తి ప్రదేశాలుగా మారి ఆహార వనరులను అందిస్తాయి. చేపలు, మొలస్కా, ఇతర జీవజాతులు, క్రస్టేసియన్లు, స్పాంజ్‌లు మొదలైన సముద్ర జాతుల ఉత్పత్తి పెరిగేందుకు ఇవి అనువైన వాతావరణాన్ని అందిస్తాయి.



పొలంలో వ్యర్థాలను తొలగిస్తున్న కూలీలు

వ్యవసాయ 'పరీక్ష'

ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు కర్నూలు జిల్లాలో అన్నదాత ఖరీఫ్ పరీక్షకు సంసిద్ధమయ్యాడు. కొందరు రైతులు సాగు వ్యర్థాలను తొలగించుకుంటుండగా.. మరికొందరు భూముల ను దుక్కిదున్నుతున్నారు. ఇంకొందరు రైతులు ముందస్తు విత్తనం వేసే పనిలో నిమగ్నమయ్యారు. వీళ్లందరు కూడా అధిక దిగుబడులనే ఫలితాలు రాబట్టేందుకు రెక్కల కష్టంతో పరీక్ష రాస్తున్నారు. కర్నూలు మండలంలోని ఎదురూరు, తొలిశాపురం, ఆర్.కొంతలపాడు, నిడ్జూరు, సింగవరం గ్రామాల పరిధిలోని రైతులు తమ పనుల్లో నిమగ్నమై ఉండగా 'సాక్షి' క్లిక్ మనిపించింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



పనులకు బయలుదేరుతున్న మహిళలు



పొలానికి ఎరువు తీసుకెళ్తున్న అన్నదాత



దుక్కిదున్నుతున్న రైతు



విత్తనం వేస్తున్న దృశ్యం

సాక్షి ప్లస్
సోమవారం ॥ 26-5-2025



దీక్షాభూమిలో అంబేద్కర్



దీక్షాభూమిలోని బుద్ధుడు



నాగపూర్‌లోని దీక్షాభూమి స్థూపం

ఈ టూర్ మిగతా టూర్‌లకంటే ప్రత్యేకం...
ఎందుకు ప్రత్యేకం అంటారా! వినండి!
మహాకాళేశ్వర్... ఓంకారేశ్వర్...
త్రయంబకేశ్వర్... భీమ్‌శంకర్... ఘృష్ణేశ్వర్...
మొత్తం ఐదు జ్యోతిర్లింగాలను దర్శించవచ్చు.
ఓ మహోన్నత వ్యక్తి పుట్టిన ఊరిని కూడా.
అది... డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జన్మభూమి...
బౌద్ధం తీసుకున్న దీక్షభూమిని చూడవచ్చు.
అందుకే ఈ యాత్ర పేరు 'అంబేద్కర్ యాత్ర
విత్ పాంచ్ జ్యోతిర్లింగ దర్శన్'.

అంబేద్కర్ యాత్ర... త్రినేత్రుడి దర్శనం

1వ రోజు

రైలు మధ్యాహ్నం రెండు గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరుతుంది. కామారెడ్డి, నిజామాబాద్, ధర్మాబాద్, ముద్‌ఖేడ్, నాందేడ్, పూర్ణ స్టేషన్‌లలో కూడా రైలెక్కవచ్చు.

2వ రోజు

ఉదయం ఎనిమిది గంటలకు రైలు నాగపూర్ స్టేషన్‌కు చేరుతుంది. రైలు దిగి హోటల్‌కెళ్లి రిఫ్రెష్‌మెంట్ తర్వాత చెక్ అవుట్ చేయాలి. దీక్షాభూమి స్థూప విజిట్, స్వామి నారాయణ మందిర్ దర్శనం తర్వాత తిరిగి రైల్వేస్టేషన్‌కు రావాలి. ట్రెన్ జర్నీ రాత్రి ఎనిమిది గంటలకు నాగపూర్ నుంచి ప్రయాణం ఉజ్జయినికి సాగుతుంది.

బౌద్ధదీక్ష బూనిన నేల

నాగపూర్‌లో ఉన్న దీక్షభూమికి అంబేద్కర్ జీవితంలో మాత్రమే కాదు బౌద్ధంలో కూడా ప్రత్యేక స్థానం ఉంది. ఇది హిందూ మతం నుంచి బౌద్ధమతంలోకి మారిన ప్రదేశం. అంబేద్కర్‌తోపాటు నాలుగు లక్షల మంది మతం మారి బౌద్ధ దీక్ష తీసుకున్నారు. ఈ చారిత్రక సంఘటన 1956, అక్టోబర్ 14 తేదీన విజయదశమి రోజున జరిగింది. బౌద్ధమత పునరుజ్జీవనం కోసం అంబేద్కర్ తన మార్కు మార్పులతో బౌద్ధానికి నవయాన బౌద్ధాన్ని ఆవిష్కరించారు. అందుకు ప్రతీకగా ఇక్కడ నిర్మించిన స్థూపానికి దీక్షభూమి స్థూపం అనే పేరు పెట్టారు. ఇది నిర్మాణంలో సాంచిలోని బౌద్ధ స్థూపాన్ని పోలి ఉంది. దీక్ష బూనిన సందర్భంగా చేసిన ప్రతిజ్ఞలతో ఇక్కడ ఒక ఫలకం ఉంది. అబద్ధం చెప్పను, దొంగతనం చేయను వంటి 22 ప్రతిజ్ఞలు ఈ ఫలకం మీద ఇంగ్లిష్‌లో ఉంటాయి.

నాగపూర్ నారాయణుడు

నాగపూర్‌లోని స్వామినారాయణ్ మందిర్ కొత్త నిర్మాణం. పదకొండు ఎకరాల్లో విస్తరించి ఉంది. నిర్మాణంలో లాలిత్యం చూపు తిప్పుకోనివ్వదు. ఈ ఆలయాన్ని 2010- 17 వరకు ఏడేళ్ల పాటు నిర్మించారు. గుజరాత్ నిర్మాణశైలి నిర్మాణం ఇది. 'బోచసాంవాశి శ్రీ అక్షర పురుషోత్తమ్ స్వామి నారాయణ సంస్థ' నిర్వహణలో ఉంది. ఇందులోని నారాయణుని విగ్రహం, అలంకరణ కూడా గుజరాత్ స్వామి నారాయణుని రూపాన్ని పోలి ఉంటుంది..



స్వామి నారాయణ్


3వ రోజు

ఉదయం పది గంటలకు రైలు ఉజ్జయిని స్టేషన్‌కు చేరుతుంది. రైలు దిగి హోటల్‌లో చెక్ ఇన్ కావాలి. మహాకాళేశ్వర్ జ్యోతిర్లింగ దర్శనం తర్వాత తిరిగి హోటల్‌కు చేరాలి. రాత్రి బస ఉజ్జయిని లోనే.

మహాకాలుడి ఆలయం

ఉజ్జయిని జ్యోతిర్లింగ క్షేత్రానికి, మహాకాళేశ్వర్ ఆలయానికి ప్రాచీన కాలం నుంచి ప్రాధాన్యం ఉంది. ఇప్పుడు మనకు కనిపిస్తున్న నిర్మాణం 18వ శతాబ్దం నాటిది. నిర్మాణపరంగా బాగా నిశితంగా పరిశీలించి ఆస్వాదించాల్సిన ఆలయం. ఇక్కడ శివుడు దక్షిణామూర్తి పేరుతో దక్షిణముఖంగా ఉంటాడు. ఈ ఆలయంలో భస్మ హారతి ప్రసిద్ధి. ఈ ఆలయంలో డ్రెస్‌కోడ్ ఉంది. భారతీయ సంప్రదాయ దుస్తులు మాత్రమే ధరించాలి. చీరకొంగు, దుపట్టా లేదా స్కార్ఫ్‌తో తలను కప్పుకోవాలి. ఫొటోగ్రఫీ కి అనుమతి ఉండదు. కాబట్టి ఆలయం రూపం, దేవుని విగ్రహం రూపం మదిలో ముద్రించుకునే వరకు కంటినిండుగా చూడాలి.





ఉజ్జయిని జ్యోతిర్లింగ క్షేత్రం

4వ రోజు

ఉదయం ఉజ్జయినిలో బ్రేక్‌ఫాస్ట్ తర్వాత రోడ్డు మార్గాన జన్మభూమికి వెళ్లాలి. ఇది బీఆర్ అంబేద్కర్ జన్మభూమి. మధ్యాహ్న భోజనం తర్వాత ఓంకారేశ్వర్ దర్శనం. ఆ తర్వాత ఎమ్‌హౌ (మిలటరీ హెడ్ క్వార్టర్స్ ఆఫ్ వార్‌ఫేర్, ఎమ్‌హెచ్‌ఓడబ్ల్యూ) రైల్వే స్టేషన్‌కి చేరి రైలెక్కాలి. ఈ రైల్వేస్టేషన్‌కి అంబేద్కర్ నగర్ రైల్వేస్టేషన్ అనే పేరు. రైలు నాసిక్ వైపు సాగిపోతుంది.

భీమ్ రావ్ జన్మభూమి

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పుట్టిన ప్రదేశంలో ఆయన స్మారక భవనం నిర్మించారు. దీనిని భీమ్ జన్మభూమి అంటారు. ఇది మధ్యప్రదేశ్‌లోని ఎంహౌ (మిలటరీ హెడ్ క్వార్టర్స్ ఆఫ్ వార్‌ఫేర్) ప్రదేశంలో ఉంది. ఈ స్మారకానికి అంబేద్కర్ శతజయంతి సందర్భంగా 1991, ఏప్రిల్ 14వ తేదీన సంకల్పం జరిగింది. నిర్మాణం పూర్తయిన తర్వాత 2008, ఏప్రిల్ 14వ తేదీన 117వ జయంతి నాడు ప్రారంభం అయింది. భీమ్ జన్మభూమి తర్వాత ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఓంకారేశ్వరుడి దర్శనం. ఈ జ్యోతిర్లింగం నర్మద నదిలోని మాంధాత దీవిలో ఉంది. ఓంకారేశ్వరుడి దర్శనంతోపాటు నర్మద నది దక్షిణ తీరాన ఒడ్డు మీద ఉన్న మామలేశ్వర్ ఆలయ దర్శనం కూడా చేసుకోవచ్చు.



భీమ్ జన్మభూమి

5వ రోజు

పగలంతా నాసిక్‌కు చేరడంలోనే పూర్తవుతుంది. ట్రెన్ సాయంత్రం ఆరు గంటలకు నాసిక్ రోడ్ రైల్వే స్టేషన్‌కు చేరుతుంది. హోటల్‌లో చెక్‌ఇన్ అయిన తర్వాత రాత్రి భోజనం చేసి విశ్రాంతి తీసుకోవాలి. ఈ రోజు పర్యాటక ప్రదేశాలకు వెళ్లడం కుదరదు.



6వ రోజు

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత హోటల్ గది చెక్ అవుట్, ప్రయాణం రోడ్డు మార్గాన త్రయంబకేశ్వర్ వైపు సాగుతుంది. త్రయంబకేశ్వర్ దర్శనం తర్వాత నాసిక్ రైల్వేస్టేషన్‌కు వెళ్లి రైలెక్కాలి. రాత్రి ఎనిమిది గంటలకు ప్రయాణం పూనా వైపు సాగుతుంది.




త్రయంబకేశ్వర క్షేత్రం

ముక్కంటికి గోదారమ్మ అభిషేకం

త్రయంబకేశ్వర్ క్షేత్రం ఒక జ్యోతిర్లింగం. ఇక్కడ గర్భాలయంలో పానవట్టం ఒక పళ్లెంలాగ ఉంటుంది. అందులో మూడు చిన్న చిన్న శివలింగాలుంటాయి. ఆ పానవట్టం రాయి నుంచి నీరు ఉబుకుతూ శివలింగాలను అభిషేకిస్తూ ఉంటుంది. పూజారులు ఆ నీటిని చేత్తో తీసి పక్కన పోస్తుంటారు. ఆ నీరు గోదావరి నది నుంచి జాలువారుతున్న జల. ఆలయం పక్కనే బ్రహ్మగిరి కొండల నుంచి జాలువారే నీటి పాయ త్రయంబకం దగ్గర శివలింగాలను అభిషేకిస్తూ ముందుకు సాగుతూ క్రమంగా విస్తరిస్తుంది. గోదావరి పుట్టిన ప్రదేశాన్ని చూడాలంటేయువత బ్రహ్మగిరి కొండల్లోకి ట్రెకింగ్ చేయవచ్చు. కానీ ఈ టూర్‌లో అంత సమయం ఉండదు. ఈ ప్రాచీన ఆలయం సమీపంలో అన్నపూర్ణమాత ఆలయం ఉంది. ఇది పాలరాతి ఆలయం. దశాబ్దకాలం నాడు నిర్మించినది. ఆలయ ప్రాంగణం నుంచి గ్రానైట్ స్టోన్‌తో నిర్మించిన త్రయంబకేశ్వర ఆలయం, బ్రహ్మగిరి కొండల వ్యూ అద్భుతంగా ఉంటుంది.

7వ రోజు

తెల్లవారు జామున నాలుగన్నరకు రైలు పూనాలోని ఖడ్‌కీ రైల్వే స్టేషన్‌కు చేరుతుంది. పూనాలోని హోటల్‌లో చెక్ ఇన్ అయ్యి రిఫ్రెష్‌మెంట్ తర్వాత భీమశంకర్ జ్యోతిర్లింగ ఆలయానికి వెళ్లాలి. భీమశంకర దర్శన దర్శనం తర్వాత తిరిగి ఖడ్‌కీ రైల్వేస్టేషన్‌కి చేరి రైలెక్కాలి. రైలు రాత్రి పదకొండు గంటలకు బయలుదేరుతుంది. ప్రయాణం ఔరంగాబాద్ వైపు సాగిపోతుంది.




భీమశంకరుడు

ప్రకృతి దర్శనం

భీమశంకర జ్యోతిర్లింగం దర్శనానికి పూనా నుంచి నూటపాతిక కిలోమీటర్ల దూరం ప్రయాణించాలి. మందిరం ఉన్న నివాస ప్రదేశం పేరు కూడా భీమశంకరే. ఈ గ్రామం అటవీ ప్రదేశంలో భీమ నది ఒడ్డున ఉంది. ఈ ఆలయ నిర్మాణం పూర్తిగా ఉత్తర భారత రాష్ట్రాల నిర్మాణశైలి. నగర శైలి అంటారు. దక్షిణాది ఆలయాల శిల్పచాతుర్యం కనిపించదు. దర్శనం తర్వాత ఆలయ ప్రాంగణంలో కూర్చుని ప్రకృతి ఒడిలో ప్రశాంతతను ఆస్వాదించవచ్చు.

8వ రోజు

ఉదయం ఏడు గంటలకు రైలు ఔరంగాబాద్‌కు చేరుతుంది. హోటల్‌కి వెళ్లి రిఫ్రెష్ అయిన తర్వాత ఘృష్ణేశ్వర్ దర్శనానికి వెళ్లాలి. ఈ దర్శనంతో టూర్‌లో చూడాల్సిన ప్రదేశాలన్నీ పూర్తవుతాయి. షాపింగ్ తర్వాత రైల్వే స్టేషన్ కు వెళ్లి రైలెక్కాలి. ట్రెన్ సాయంత్రం నాలుగు గంటలకు బయలుదేరుతుంది. సికింద్రాబాద్‌కి చేరేలోపు ఎవరికి అనువైన ప్రదేశాల్లో వాళ్లు డీబోర్డ్ కావచ్చు. సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరేటప్పటికి తొమ్మిదవ రోజు తెల్లవారుజామున నాలుగు గంటలవుతుంది.



ఘృష్ణేశ్వరాలయం

చారిత్రక శివుడు

ఘృష్ణేశ్వర్ మందిరాన్ని ఆర్కిటెక్చర్ స్టూడెంట్స్ చూసి తీరాలి. లేత గులాబీరంగు గ్రానైట్ స్టోన్‌తో అందంగా ఉంటుంది. కంప్యూటర్‌లో రంగుల పాళ్లను మారుస్తూ కొత్త షేడ్‌లను తెచ్చినట్లు చాలా లాలిత్యంగా ఉంటాయి. షిరిడీలో సాయి దర్శనం తర్వాత ఎల్లోరా టూర్ ప్యాకేజ్‌లో ఈ జ్యోతిర్లింగం కూడా ఉంటుంది. ఎల్లోరా నుంచి రెండు కిలోమీటర్లకు మించదు. ఈ ఆలయం ప్రస్తావన స్కందపురాణం, శివపురాణం, రామాయణం, మహాభారతాల్లో కూడా ఉండడంతో హిందువులు ఘృష్ణేశ్వర్ దర్శనాన్ని మిక్కిలిగా కోరుకుంటారు. ఈ శివుడు రాజకీయ వివాదాలకు కేంద్రబిందువయ్యి చరిత్రలో ప్రాధాన్యం సంతరించుకున్నాడు. మొఘల్-మరాఠా ఆదిపత్యపోరులో ఢిల్లీ సుల్తానుల విధ్వంసానికి గురైంది. ఇప్పుడు చూస్తున్న మందిరాన్ని 18వ శతాబ్దంలో ఇండోర్ రాణి గౌతమి బాయ్ హోల్కర్ నిర్మించారు. ఇక్కడ శివలింగానికి భక్తులు స్వయంగా పూజ చేయవచ్చు.

ప్యాకేజ్ వివరాలివి!

'అంబేద్కర్‌యాత్ర విత్ పాంచ్ జ్యోతిర్లింగ దర్శన్'... తొమ్మిది రోజుల టూర్. ఐఆర్‌సీటీసీలో జూలై ఐదవ తేదీ నుంచి మొదలవుతుంది. ఇందులో దీక్షాభూమి, మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీమ్‌శంకర్, ఘృష్ణేశ్వర్, జన్మభూమి అనే ప్రదేశాలు కవర్ అవుతాయి.

నాగ్‌పూర్‌లో దీక్షాభూమి, ఉజ్జయిన్‌లోని మహాకాళేశ్వర్ జ్యోతిర్లింగంతోపాటు ఓంకారేశ్వర్ జ్యోతిర్లింగం, ఎమ్‌హౌ (ఎమ్ హెచ్‌ఓడబ్ల్యు)లో జన్మభూమి, నాసిక్‌లో త్రయంబకేశ్వర్ జ్యోతిర్లింగం, పూనేలో భీమశంకర్ జ్యోతిర్లింగం, ఔరంగాబాద్‌లో ఘృష్ణేశ్వర్ జ్యోతిర్లింగాలను దర్శించుకోవచ్చు.

టికెట్ ధరలిలా!

ఇందులో సింగిల్ ఆక్యుపెన్సీ సదుపాయం లేదు. ఒక్కరుగా ప్రయాణిస్తున్న వారికి మరొక ఒంటరి ట్రావెలర్‌తో కలిపి రూమ్ కేటాయిస్తారు. టికెట్ ధరలు ఎకానమీ కేటగిరీలో దాదాపుగా 15 వేల రూపాయలు, స్టాండర్డ్ కేటగిరీలో 23 వేలు, కంఫర్ట్ కేటగిరీలో 30 వేల రూపాయలవుతుంది. పిల్లలకు సుమారు పదిహేను వందల వరకు తగ్గుతుంది.

భోజనం ఇలాగ!

- టూర్‌లో ఉదయం టీ, బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్ ఇస్తారు. శాకాహార భోజనం మాత్రమే.
- ట్రావెల్ ఇన్సూరెన్స్, టూర్ ఎస్కార్ట్, సెక్యూరిటీ సౌకర్యాలు కల్పిస్తారు.
- పర్యాటకుల సహాయం కోసం ఐఆర్‌సీటీసీ అధికారులు కూడా ప్రయాణంలో ఉంటారు.
- పర్యాటక ప్రదేశాల ఎంట్రీ ఫీజులు, బోటింగ్ రైడ్, అడ్వెంచర్ స్పోర్ట్స్ టికెట్‌లు ప్యాకేజ్‌లో వర్తించవు.
- ఆహారం విషయంలో నిర్దేశించిన మెనూ లో లేని పదార్థాలను తినాలంటే ఎవరికి వారు కొనుక్కోవాలి.

https://www.irctctourism.com/pacakage_description?packageCode=SCZBG43



ఉజ్జయిని మహాకాలుడు

- వాకా మంజులారెడ్డి,
సాక్షి, ఫీచర్స్ ప్రతినిధి



పెట్టుబడుల్లో ఏది చాలా సౌకర్యంగా అనిపిస్తుందో అదే చాలా అరుదుగా లాభాన్నిస్తుంది.

- రాబర్ట్ ఆర్నాట్ ,అమెరికా వ్యాపారవేత్త

బిజినెస్ రీల్

క్యూఆర్ కోడ్ చెల్లింపులకు యాక్సిస్ రూపే కార్డ్

సూపర్ మనీ భాగస్వామ్యంతో ఆవిష్కరణ



ముంబై: యాక్సిస్ బ్యాంక్ ఫ్లిప్‌కార్ట్ గ్రూప్‌నకు చెందిన క్రెడిట్ ఫస్ట్ యూపీఐ ప్లాట్‌ఫామ్ 'సూపర్.మనీ' భాగస్వామ్యంతో కో బ్రాండెడ్ క్రెడిట్ కార్డును విడుదల చేసింది. 'యాక్సిస్ బ్యాంక్ సూపర్.మనీ రూపే క్రెడిట్ కార్డ్' అన్నది రూపే నెట్‌వర్క్‌పై పనిచేస్తుంది. యూపీఐ చెల్లింపులకు, పీవోఎస్ టెర్మినళ్లు, ఆన్ లైన్ ప్లాట్‌ఫామ్‌లు, ఏటీఎంలలో దీన్ని వినియోగించుకోవచ్చని యాక్సిస్ బ్యాంక్ ప్రకటించింది. కార్డు దారులు సూపర్.మనీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని.. దీని సాయంతో స్కాన్ చేసి చెల్లింపులు చేస్తే 3 శాతం క్యాష్‌బ్యాక్ లభిస్తుంది. ఇతర విభాగాల్లో ఈ కార్డుతో చేసే వ్యయాలపై ఒక శాతం క్యాష్ బ్యాంక్ లభిస్తుంది. ఎలాంటి వార్షిక ఫీజులు లేకుండా జీవితకాలం ఉచిత సదుపాయంతో ఈ కార్డు లభిస్తుందని యాక్సిస్ బ్యాంక్ ప్రకటించింది.

నజారా చేతికి కర్వ్ గేమ్స్


- డీల్ విలువ రూ. 247 కోట్లు



న్యూఢిల్లీ: పీసీ, కన్సోల్ గేమ్స్ యూకే పబ్లిషర్ కర్వ్ డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను కొనుగోలు చేసినట్లు దేశీ గేమింగ్ కంపెనీ నజారా టెక్నాలజీస్ పేర్కొంది. ఇందుకు నగదు రూపేణా 2.17 కోట్ల బ్రిటిష్ పౌండ్లు(రూ. 247 కోట్లు) వెచ్చించినట్లు వెల్లడించింది. కర్వ్ డిజిటల్‌లో సొంత యూకే అనుబంధ సంస్థ నజారా టెక్నాలజీస్ 100 శాతం వాటాను 10 పనిదినాల్లో సొంతం చేసుకోనున్నట్లు తెలియజేసింది. దీంతో రెండు కొత్త ప్లాట్‌ఫామ్స్‌ను పోర్ట్‌ఫోలియోలో జత చేసుకోనున్నట్లు వివరించింది. అంతేకాకుండా ఉత్తర అమెరికా, ఆసియా పసిఫిక్, యూరప్ తదితర కీలక దేశాలలోనూ విస్తరించనుంది.

గ్రావిటా ఇండియాలో ప్రమోటర్ల వాటా విక్రయం

3.4 శాతం అమ్మకంతో రూ.498 కోట్లు



న్యూఢిల్లీ: గ్రావిటా ఇండియాలో కంపెనీ ప్రమోటర్లు 3.4 శాతం వాటాను విక్రయించడం ద్వారా రూ.498 కోట్ల నిధులను సమకూర్చుకున్నారు. రజత్ అగర్వాల్ 25 లక్షల షేర్లను (3.38 శాతం) ఓపెన్ మార్కెట్ లావాదేవీల రూపంలో షేర్లను విక్రయించినట్టు ఎన్‌ఎస్‌ఈ బల్క్ డీల్ డేటా ఆధారంగా తెలుస్తోంది. ఒక్కో షేరు సగటున రూ.1991.52కు విక్రయించారు. ఈ లావాదేవీ తర్వాత గ్రావిటా ఇండియాలో రజత్ అగర్వాల్ వాటా 32.39 శాతానికి దిగొచ్చింది. మోతీలాల్ ఓస్వాల్ అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ 7.33 లక్షల షేర్లను (రూ.146 కోట్లు) కొనుగోలు చేసింది. 2023 మే నెలలోనూ రజత్ అగర్వాల్ 4.6% వాటాను రూ.181 కోట్లకు విక్రయించారు. మరోవైపు ఎన్‌ఎస్‌ఈ బల్క్ డీల్ డేటా ప్రకారం రామ్కో సిమెంట్స్‌లో 0.82 శాతం వాటాను రూ.196 కోట్లతో నిప్పన్ ఇండియా మ్యూచువల్ ఫండ్ కొనుగోలు చేసింది.

జీడీపీ గణాంకాలపై ఫోకస్

- ప్రపంచ మార్కెట్లలో ట్రెండ్‌కు ప్రాధాన్యం
- విదేశీ పెట్టుబడులు, రుతుపవనాలు కీలకం
- ప్రైమరీ మార్కెట్‌వైపు ఇన్వెస్టర్ల చూపు
- దేశీ స్టాక్ మార్కెట్‌పై నిపుణుల అంచనాలు

ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లు పలు అంశాల ఆధారంగా కదలనున్నాయి. ప్రధానంగా యూఎస్, భారత్ జీడీపీ గణాంకాలు ప్రభావం చూపనున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. ఫెడరల్ రిజర్వ్ గత పాలసీ వివరాలు, రుతుపవనాల తీరు తదితర పలు అంశాలు సైతం ట్రెండ్‌ను నిర్దేశించనున్నట్లు తెలియజేశారు. వివరాలు చూద్దాం..



న్యూఢిల్లీ: ఇటు దేశీ, అటు విదేశీ అంశాలు ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లకు కీలకంగా నిలవనున్నాయి. ప్రధానంగా పలు ఆర్థిక గణాంకాలు ఈ వారం వెలువడనున్నాయి. దేశీయంగా చూస్తే ఏప్రిల్ నెలకు పారిశ్రామికోత్పత్తి(ఐఐపీ), తయారీ రంగ గణాంకాలను ప్రభుత్వం బుధవారం(28న) ప్రకటించనుంది. 2025 మార్చిలో ఐఐపీ, తయారీ రంగాలు 3% చొప్పున పుంజుకున్నాయి. ఈ బాటలో జనవరి-మార్చి2025 కాలానికి దేశ ఆర్థిక వ్యవస్థ(జీడీపీ) పురోగతి గణాంకాలు శుక్రవారం(30న) వెల్లడికానున్నాయి. 2024 అక్టోబర్-డిసెంబర్‌లో దేశ జీడీపీ 6.2 శాతం ఎగసింది. వీటిపై ఇన్వెస్టర్లు దృష్టిపెట్టనున్నట్లు మోతీలాల్ ఓస్వాల్ వెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా తెలియజేశారు.

విదేశీ అంశాలు

ఏప్రిల్ నెలకు యూఎస్ మన్నికైన వస్తు ఆర్డర్లు 27న, కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్(ఎఫ్‌వోఎంసీ) గత పాలసీ సమీక్ష వివరాలు(మినిట్స్) 28న విడుదలకానున్నాయి. 29న క్యూ1 జీడీపీ రెండో అంచనాలు వెలువడనున్నాయి. ఇదే రోజు మే నెలకు జపాన్ కన్జూమర్ కాన్ఫిడెన్స్ ఇండెక్స్ వెల్లడికానుంది. 30న యూఎస్ ఏప్రిల్ పీసీఈ ధరల ఇండెక్స్ విడుదలకానుంది. కాగా.. చైనాసహా ఇతర దేశాలతో యూఎస్ వాణిజ్య చర్చలకు ప్రాధాన్యమున్నట్లు జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయిర్ తెలియజేశారు. కొద్ది రోజులుగా మళ్లీ విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు దేశీ స్టాక్స్‌లో పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నప్పటికీ కొన్ని సెషన్లలో అమ్మకాలకూ ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో విదేశీ ఇన్వెస్టర్ల తీరు సైతం సెంటిమెంటును ప్రభావితం చేయగలదని నిపుణులు పేర్కొన్నారు.

క్యూ4 ఫలితాలు

ఇప్పటికే క్యూ4(జనవరి-మార్చి2025) ఫలితాల సీజన్ ముగింపునకురాగా.. ఈ వారం మరికొన్ని దిగ్గజాల పనితీరు వెల్లడికానుంది. జాబితాలో బజాజ్ ఆటో, ఐఆర్‌సీటీసీ, అరబిందో ఫార్మా తదితరాలున్నాయి. ఈ ఏడాది అంచనాలకంటే ముందుగానే రుతుపవనాలు కేరళను తాకడం, కేంద్ర ప్రభుత్వానికి ఆర్‌బీఐ అత్యధిక డివిడెండ్ చెల్లింపు సానుకూల అంశాలుకాగా.. యూఎస్ ట్రెజరీ బాండ్ల ఈల్డ్స్‌తోపాటు, ప్రభుత్వ రుణ భారం అధికమవుతుండటం ఇన్వెస్టర్లలో ఆందోళనలు పెంచవచ్చని రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా పేర్కొన్నారు. గత వారాంతాన ఆర్‌బీఐ ప్రభుత్వానికి రూ. 2.69 లక్షల రికార్డ్ డివిడెండ్ చెల్లించిన సంగతి తెలిసిందే.

సాంకేతికంగా

గత వారం మార్కెట్లు స్వల్పంగా డీలా పడ్డాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ నికరంగా 610 పాయింట్లు(0.75 శాతం) క్షీణించి 81,721 వద్ద నిలిచింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 167 పాయింట్లు(0.7 శాతం) నష్టంతో 24,853 వద్ద ముగిసింది. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.3 శాతం నీరసించగా.. స్మాల్‌క్యాప్ మాత్రం 0.95 శాతం ఎగసింది. సాంకేతికంగా ఈ వారం నిఫ్టీకి 24,950-25,000 పాయింట్ల వద్ద అవరోధాలు(రెసిస్టెన్స్) ఎదురుకావచ్చని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఈ బాటలో సెన్సెక్స్‌కు 82,500-83,000 పాయింట్లవద్ద రెసిస్టెన్స్ కనిపించవచ్చని అంచనా వేశారు.

మళ్లీ ఐపీవోల హవా

ఈ వారం 4 కంపెనీలు రెడీ ● బొరానా వీవ్స్, బెల్‌రైజ్ లిస్టింగ్



న్యూఢిల్లీ: కొద్ది రోజులుగా ప్రైమరీ మార్కెట్లలో సందడి నెలకొంది. ఈ బాటలో మరో నాలుగు కంపెనీలు స్టాక్ మార్కెట్ల తలుపు తట్టనున్నాయి. ఈ వారం ఇష్యూలు ప్రారంభంకానున్న కంపెనీల జాబితాలో లీలా ప్యాలసెస్ హోటల్స్ ఏజిస్ వొప్యాక్ టెర్మినల్స్ చేరాయి. ఇతర చిన్న సంస్థలలో ప్రోస్టార్ ఇన్ఫో సిస్టమ్స్, స్కోడా ట్యూబ్స్ ఐపీవోకు రానున్నాయి. మరోపక్క గత వారం ఇష్యూలను పూర్తి చేసుకున్న బొరానా వీవ్స్(28న), బెల్‌రైజ్ ఇండస్ట్రీస్(29న) లిస్టకానున్నాయి.

లీలా ప్యాలసెస్

ఆతిథ్య రంగ కంపెనీ ష్లాస్ బెంగళూరు షేరుకి రూ. 413-435 ధరల శ్రేణిలో ఈ నెల 26-28 మధ్య ఐపీవోకు వస్తోంది. తద్వారా రూ. 3,500 కోట్ల సమీకరణపై కన్నేసింది. లీలా ప్యాలసెస్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ బ్రాండుతో కంపెనీ ఆతిథ్య రంగ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఇష్యూలో భాగంగా కంపెనీ రూ. 2,500 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 1,000 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్ సంస్థ ప్రాజెక్ట్ బాలెట్ బెంగళూరు హోల్డింగ్స్ ఆఫర్ చేయనుంది. వెరసి దేశీయంగా ఆతిథ్య రంగంలో అతిపెద్ద ఐపీవోగా నిలవనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 34 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది.

ఏజిస్ వొప్యాక్

లాజిస్టిక్స్ రంగ సంస్థ ఏజిస్ వొప్యాక్ టెర్మినల్స్ రూ. 223-235 ధరల శ్రేణిలో ఈ నెల 26-28 మధ్య పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ప్రయివేట్ రంగ దిగ్గజం ఏజిస్ లాజిస్టిక్స్ అనుబంధ సంస్థ ఇది. ఇష్యూలో భాగంగా రూ. 2,800 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. రూ. 3,500 కోట్ల సమీకరణకు ప్రణాళికలు వేసినప్పటికీ రూ. 2,800 కోట్లకు కుదించింది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 63 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది.

స్కోడా ట్యూబ్స్

స్టెయిన్‌లెస్ స్టీల్ ట్యూబులు, పైపుల తయారీ కంపెనీ స్కోడా ట్యూబ్స్ రూ. 130-140 ధరల శ్రేణిలో ఈ నెల 28-30 మధ్య ఐపీవోకు వస్తోంది. తద్వారా రూ. 220 కోట్లు సమీకరించే యోచనలో ఉంది.

ప్రోస్టార్మ్ ఇన్ఫో సిస్టమ్స్

సమీకృత పవర్ సొల్యూషన్ కంపెనీ ప్రోస్టార్మ్ ఇన్ఫో సిస్టమ్స్ ఐపీవోలో భాగంగా 1.6 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. ఇందుకు షేరుకి రూ. 95-105 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 27న ప్రారంభమై 29న ముగియనుంది. తద్వారా రూ.168 కోట్లు సమకూర్చుకోనుంది.

మోసాలకు వ్యతిరేకంగా టెలికం కంపెనీల జట్టు!

జియో, వొడాఐడియాలకు ఎయిర్‌టెల్ లేఖ



న్యూఢిల్లీ: పెరిగిపోతున్న టెలికం మోసాలు, స్కామ్‌లకు వ్యతిరేకంగా కలసికట్టుగా పోరాడుదామంటూ రిలయన్స్ జియో, వొడాఫోన్ ఐడియా సంస్థలను ఎయిర్‌టెల్ కోరింది. సున్నితమైన వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని సాగుతున్న టెలికం మోసాలకు వ్యతిరేకంగా పరిశ్రమ అంతా ఒక్కటై సమష్టి కృషి చేద్దామని పిలుపునిచ్చింది. ఇదే విషయాన్ని తెలియజేస్తూ ప్రభుత్వానికి, ట్రాయ్‌కి ఎయిర్‌టెల్ లేఖ రాసింది. 2024 మొదటి తొమ్మిది నెలల్లో రూ.11,000 కోట్లకుపైగా ఆర్థిక నష్టంతో కూడిన 17 లక్షల సైబర్ నేరాలపై ఫిర్యాదులు నమోదు కావడాన్ని తోటి టెలికం కంపెనీల దృష్టికి తీసుకెళ్లింది. ఫోన్‌కాల్స్ ద్వారా ఓటీపీలు తెలుసుకోవడం, ఫిషింగ్ లింక్‌లు పంపడం ద్వారా డేటా చోరీ తదితర నేరాలు పెరిగిపోతున్న తరుణంలో ఎయిర్‌టెల్ చర్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. స్పామ్‌లు, మోసాలను గుర్తించే సొల్యూషన్లను ఎయిర్‌టెల్ కొన్ని వారాల నుంచి తన నెట్‌వర్క్ పరిధిలో అమలు చేస్తుండడం గమనార్హం. "ఫిషింగ్ దాడులు, హానికారక యూఆర్‌ఎల్ ఆధారిత స్కామ్‌లు ఇటీవలి కాలంలో ఆందోళనకర స్థాయిలో పెరిగిపోయిన నేపథ్యంలో.. పరిశ్రమ వ్యాప్తంగా మరింత సమన్వయంతో కూడిన చర్యలు అవసరం. టెలికం సేవల ప్రొవైడర్ల మధ్య సమన్వయ లోపాలను ఈ తరహా అత్యాధునిక మోసపూరిత పథకాలు ఉపయోగించుకుంటాయి'' అని ట్రాయ్ చైర్మన్ అనిల్ కుమార్ లహోటి, టెలికం శాఖ కార్యదర్శి నీరజ్ మిట్టల్‌కు రాసిన లేఖలో ఎయిర్‌టెల్ పేర్కొంది. ఉమ్మడి చర్యల దిశగా టెలికం సర్వీస్ ప్రొవైడర్లను (జియో, వొడాఐడియా) ఈ నెల 14న సంప్రదించినట్టు తెలిపింది. అన్ని కంపెనీలు రియల్ టైమ్ ఫ్రాడ్ ఇంటెలిజెన్స్ పంచుకోవడం, నెట్‌వర్క్‌ల మధ్య సమన్వయంతో మోసాలను గుర్తించి, నిరోధించేందుకు ఈ చర్య చేపట్టినట్టు వివరించింది.

రూ.16,000 కోట్ల వసూలు లక్ష్యం

- ఒక శాతం లోపే కొత్త మొండి బకాయిలు
- పీఎన్‌బీ ఎండీ అశోక్ చంద్ర



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పెద్ద ఎత్తున మొండి బకాయిల (ఎన్‌పీఏ) వసూలు లక్ష్యాన్ని పెట్టుకుంది. రూ.16,000 కోట్ల వసూళ్లతోపాటు.. కొత్త ఎన్‌పీఏలను ఒక శాతం లోపునకు పరిమితం చేయనున్నట్టు, అదే సమయంలో లాభదాయకతను కొనసాగించడానికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు బ్యాంక్ ఎండీ, సీఈవో అశోక్‌చంద్ర తెలిపారు. ఓ సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో భాగంగా ఆయన పలు వివరాలను వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరం మార్చి త్రైమాసికంలో పీఎన్‌బీ వసూళ్లు రూ.4,733 కోట్లుగా ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తం మీద వసూళ్లు రూ.14,000 కోట్లుగా ఉండడం గమనార్హం. ఇక కొత్త ఎన్‌పీలుగా 0.73 శాతంగానే ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ గరిష్ట స్థాయిలో వసూళ్లు చేసుకోవడం, తాజా ఎన్‌పీఏలను వీలైనంత కనిష్టానికి కట్టడి చేయడం తమ ప్రాధాన్యమని అశోక్ చంద్ర తెలిపారు. త్రైమాసికం వారీ తాజా ఎన్‌పీఏలు రూ.1,500-1,700 కోట్ల మధ్య ఉండొచ్చని చెప్పారు. సాంకేతిక మాఫీ రూపంలో రూ.6,000 కోట్ల వసూలును సాధించనున్నట్టు తెలిపారు. అధిక విలువ కలిగిన మొండి ఖాతాల్లేవంటూ.. చాలా వరకు ఎన్‌పీఏ ఖాతాలు ఒక్కోటీ రూ.25-50 కోట్ల మధ్యనున్నవేనని పేర్కొన్నారు.

ర్యామ్ రుణాలకు ప్రాధాన్యం..

రిటైల్, అగ్రికల్చరల్, ఎంఎస్‌ఎంఈ (ఆర్‌ఏఎం/ర్యామ్) రంగాలకు రుణాల వెయిటేజీని 58 శాతానికి పెంచుకోనున్నట్టు అశోక్ చంద్ర తెలిపారు. ఇందుకోసం ఎన్నో చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. కార్పొరేట్ రుణాలు, రెపో ఆధారిత రుణాల్లో తగ్గిన రేట్ల ప్రభావాన్ని అధిగమించడానికి ర్యామ్ పోర్ట్‌ఫోలియో కుషన్‌గా ఉంటుందన్నారు. 2025 మార్చి నాటికి ర్యామ్ పుస్తకం మొత్తం రుణాల్లో 56 శాతంగా (రూ.6,02,682 కోట్లు) ఉన్నట్టు తెలిపారు. తదుపరి రుణ రేట్ల కోత ప్రభావాన్ని సైతం ఎదుర్కొనేందుకు ర్యామ్ విభాగం మద్దతుగా నిలుస్తుందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 12 ప్రభుత్వరంగ బ్యాంకుల్లో లాభదాయకతను పెంచుకోవడంలో పీఎన్‌బీ ముందుంది. గత ఆర్థిక సంవత్సరంలో పీఎన్‌బీ లాభం అంతక్రితం ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూసుకుంటే 102 శాతం వృద్ధి చెందింది. రూ.8,245 కోట్ల నుంచి రూ.16,630 కోట్లకు లాభం పెరిగింది. మొత్తం వ్యాపారం 14 శాతం పెరిగి రూ.26.83 లక్షల కోట్లుగా ఉండడం గమనార్హం.

ఎన్‌ఎస్‌డీఎల్ లాభం ప్లస్



ముంబై: పబ్లిక్ ఇష్యూపై కన్నేసిన నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ(ఎన్‌ఎస్‌డీఎల్) గతేడాది చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 5 శాతం వృద్ధితో రూ. 83 కోట్లను అధిగమించింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 80 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 2 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం 10 శాతం బలపడి రూ. 394 కోట్లను తాకింది. అంతక్రితం క్యూ4లో రూ. 358 కోట్ల ఆదాయం నమోదైంది. పూర్తి ఏడాదికి(2024-25) నికర లాభం 25 శాతం జంప్‌చేసి రూ. 343 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం సైతం 12 శాతంపైగా ఎగసి రూ. 1,535 కోట్లయ్యింది. సంస్థ డీమ్యాట్ ఖాతాలను నిర్వహించే సంగతి తెలిసిందే. ఐపీవోలో భాగంగా తొలుత 5.72 కోట్ల షేర్లు విక్రయించాలని భావించిన ఎన్‌ఎస్‌డీఎల్ ఇటీవల దాఖలు చేసిన ప్రాస్పెక్టస్‌లో 5.01 కోట్ల షేర్లకు కుదించింది. ఇష్యూలో స్టాక్ ఎక్స్చేంజీ దిగ్గజం ఎన్‌ఎస్‌ఈ, బ్యాంకింగ్ దిగ్గజాలు ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ షేర్లను ఆఫర్ చేయనున్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

26-5-2025

విశాఖ	525-00
చిత్తూరు	603-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	495-00
విజయవాడ	510-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	505-00
వరంగల్	507-00
రిటైల్ ధర	5.65

80సి డిడక్షన్లు.. ట్యూషన్ ఫీజు..



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

80సిలో 20 అంశాలు ఉన్నాయి. కొన్ని ఇన్వెస్ట్‌మెంట్లు, కొన్ని సేవింగ్స్, కొన్ని ఖర్చులు, కొన్ని ఆస్తుల కొనుగోలుకు సంబంధించినవి వీటిలో ఉన్నాయి. వీటిలో ట్యూషన్ ఫీజు విషయానికొస్తే .. ఇది చాలా పెద్ద ఖర్చు. ప్రతి సంవత్సరం తప్పనిసరి. చాలా మంది తమ పిల్లలను చదివిస్తున్నారు. అటువంటి వారిని ప్రోత్సహించేందుకు ఈ అంశాన్ని చేర్చారు. చదువుకు ప్రాముఖ్యత ఇచ్చే తల్లిదండ్రులు, అలాగే ఈపీఎఫ్, జీపీఎఫ్ కంపల్సరీ కాని వర్గాలు (వ్యాపారస్తులు, వృత్తి నిపుణులు, ఆర్టిస్టులు, కళాకారులు.. ఇలా సొంత కాళ్ల మీద నిలబడేవారికి) పిల్లల చదువు కోసం చేసే ఖర్చుతో పన్ను భారాన్ని తగ్గించుకోవచ్చు.

ఇద్దరు పిల్లల చదువు కోసం చెల్లించే ఫీజుకు మాత్రమే మినహాయింపు లభిస్తుంది. ముగ్గురు లేదా నలుగురు పిల్లలున్న పక్షంలో ట్యాక్స్ ప్లానింగ్‌లో భాగంగా ఇద్దరి ఖర్చును తల్లిదండ్రుల్లో ఒకరు, మిగతా వారి ఖర్చును మరొకరు చూపించి, మినహాయింపును పొందవచ్చు. భార్యాభర్తలిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైనా లేక ఈపీఎఫ్ కంపల్సరీగా ఉండే ఉద్యోగం చేస్తున్నా .. ఈ అంశం వల్ల అదనంగా ప్రయోజనం ఉండకపోవచ్చు. తప్పనిసరిగా చెల్లించే ఈపీఎఫ్, జీపీఎఫ్‌ల మొత్తం ఒక్కొక్కరికి రూ. 1,50,000 దాటితే, స్కూల్ ఫీజుల మినహాయింపులపరంగా ఎటువంటి ప్రయోజనం దక్కదు. అయితే, స్థూలపరిమితి అయిన రూ. 1,50,000 నుంచి పీఎఫ్ నిమిత్తం వార్షికంగా పోతున్న మొత్తాన్ని తీసివేయగా, ఏదైనా మిగిలితే, దానికి స్కూల్ ఫీజు కింద మినహాయింపు పొందవచ్చు. ఈ కింది ఉదాహరణలు గమనించండి..

- రత్నాకర్, అతని భార్య.. ఇద్దరిదీ ప్రైవేట్ ప్రాక్టీసు. ఈపీఎఫ్, జీపీఎఫ్ చేయాల్సిన అవసరం లేదు. ఉన్న ఇద్దరు పిల్లల్ని మంచి స్కూల్లో చదివిస్తున్నారు. ఫీజులు భారీగానే కడతారు. ఇద్దరూ అస్సెస్సీలే. ఒకరి అసెస్‌మెంట్‌లో అబ్బాయి స్కూల్ ఫీజును, మరొకరి అసెస్‌మెంట్‌లో అమ్మాయి స్కూల్ ఫీజును చూపించి మినహాయింపు పొందుతారు.
- విజయకిరణ్‌కి కన్సల్టెన్సీ సంస్థ ఉంది. భార్య సింధు వ్యాపారం చేస్తుంది. ఒక్కడే కొడుకు. స్కూల్ ఫీజు భారీగానే ఉంటుంది. భార్యకి సంబంధించిన ఇన్‌కం ట్యాక్స్ అసెస్‌మెంట్‌లో కొడుకు స్కూల్ ఫీజును క్లెయిమ్ చేశారు. విజయకిరణ్ కూడా తన ఇన్‌కం ట్యాక్స్ అసెస్‌మెంట్‌లో కొడుకు స్కూల్ ఫీజును క్లెయిమ్ చేస్తాడు. చట్టంలో స్పష్టత లేనందున ఇద్దరూ ఒకే సంతానం మీద చెల్లించే స్కూల్ ఫీజుకి మినహాయింపు పొందుతున్నారు.
- కుటుంబరావుగారు, ఆయన భార్య సంతానానికి గంపెడు పిల్లలేమీ లేరు. కానీ రెండు సార్లు కవలలు కావడంతో.. మొత్తం నలుగురు పిల్లలు ఉన్నారు. తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన లంకంత ఇల్లు ఉంది. ఇద్దరూ లాయర్లుగా బాగా సంపాదిస్తున్నారు. భర్త తన అసెస్‌మెంట్‌లో ఇద్దరు పిల్లల ఫీజులను, భార్య తన అసెస్‌మెంట్‌లో మిగతా ఇద్దరి పిల్లల ఫీజులను క్లెయిమ్ చేస్తారు.
- అనంత మూర్తి, భార్య శారద.. ఇద్దరూ బ్యాంకు ఉద్యోగులే. ఒక్కర్తే ఆడపిల్ల. ఒకరి అసెస్‌మెంట్‌లో పిల్ల స్కూల్ ఫీజును క్లెయిమ్ చేస్తారు. మరొకరు కూడా క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉన్నా.. అలా చేయకుండా.. ఈపీఎఫ్, వీపీఎఫ్‌లో జమ చేస్తారు.
- గురునాథ్, సావిత్రికి ముగ్గురు పిల్లలు. గురునాథ్ ఇద్దరు పిల్లల చదువుల ఫీజులను క్లెయిమ్ చేస్తారు. సావిత్రి బొటిక్ నడిపిస్తుంది. తన అసెస్‌మెంట్‌లో మూడో సంతానం చదువులకయ్యే ఫీజులను క్లెయిమ్ చేస్తోంది.

పాత కాలంలోలాగా గంపెడు పిల్లలు ఉంటే ఏం చేయలేం కానీ.. నలుగురి వరకు స్కూల్ ఫీజులను క్లెయిమ్ చేసుకోవచ్చు. ట్యూషన్ ఫీజుల మీద మినహాయింపు వస్తుంది. డొనేషన్లు, క్యాపిటేషన్, డెవలప్‌మెంట్ నిమిత్తం ఇస్తే ఎలాంటి మినహాయింపు రాదు.

ఒక్కొక్కరి ఆలోచన ఒక్కో విధంగా ఉంటుంది. మీకు ఏది సూట్ అవుతుంది. ఏది అనుకూలంగా ఉంటుందో అది చేయండి. ఏదైనా చట్టానికి లోబడి చేయాలి సుమా!!

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

పెట్టుబడులకు పటిష్ట వృద్ధి

నిప్పన్ ఇండియా గ్రోత్ ఫండ్



ఇన్వెస్టర్ ఎవరైనా తమ పెట్టుబడి బలంగా వృద్ధి చెందాలని కోరుకోవడం సహజమే. కానీ, అధిక రాబడి కోరుకునే ముందు తమ రిస్క్‌ను ఒకసారి మదింపు వేసుకోవాలి. అధిక రాబడులు కోరుకుంటున్నట్టు అయితే పెట్టుబడి, రాబడుల పరంగా అధిక అస్థిరతలను ఆహ్వానించడమే అవుతుంది. మార్కెట్ ఆటుపోట్ల సమయంలో ఆందోళన చెందకుండా దీర్ఘకాలం పాటు సహనంతో పెట్టుబడులు పెట్టుకుంటూ, స్థిరత్వం ప్రదర్శించే వారే అధిక రాబడులను కోరుకోవడం సమంజసం అవుతుంది. ఇలా అధిక రిస్క్ తీసుకునే వారికి మిడ్‌క్యాప్ స్టాక్స్ మంచి వేదిక అవుతుంది. నిప్పన్ ఇండియా గ్రోత్ ఫండ్ మిడ్‌క్యాప్ ఆధారిత పెట్టుబడి సేవలు అందిస్తోంది. 10 ఏళ్లు అంతకుమించిన కాలానికి ఇన్వెస్టర్లు ఈ పథకాన్ని పరిశీలించొచ్చు.

రాబడులు



ఈ పథకం అన్ని కాలాల్లోనూ మెరుగైన రాబడులను అందించింది. ఏడాది కాలంలో 11.75 శాతం రాబడి తెచ్చిపెట్టింది. మూడేళ్లలో 29 శాతం, ఐదేళ్లలో 36.47 శాతం, ఏడేళ్లలో 21 శాతం, పదేళ్ల కాలంలో 18.16 శాతం చొప్పున ఏటా రాబడులు (డైరెక్ట్ ప్లాన్) అందించిన చరిత్ర ఉంది. మిడ్‌క్యాప్ ఫండ్స్ విభాగం సగటు రాబడులతో పోల్చి చూసినప్పుడు ఈ పథకంలోనే ఐదు శాతం వరకు అధిక రాబడి కనిపిస్తోంది. ఈ పథకానికి 29 ఏళ్ల చరిత్ర ఉంది. ఆరంభం నుంచి చూస్తే ఈ పథకం (రెగ్యులర్ ప్లాన్) లో రాబడి ఏటా 22.38 శాతంగా ఉండడం గమనార్హం.

పెట్టుబడుల విధానం

ఇండియా నిప్పన్ గ్రోత్ ఫండ్ మిడ్‌క్యాప్ ఆధారిత ఓపెన్ ఎండెడ్ ఫండ్. అధిక వృద్ధికి అవకాశం ఉన్న కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా దీర్ఘకాలంలో సంపదను సృష్టించడమే ఈ పథకం ఉద్దేశ్యం. రూపేష్ పటేల్ 2023 జనవరి నుంచి ఈ పథకం నిర్వహణ చూస్తున్నారు. ఫండ్స్ పరిశ్రమలో ఆయనకు సుదీర్ఘ అనుభవం ఉంది. బోటమ్‌అప్ లేదా స్టాక్ వారీగా పెట్టుబడుల వ్యూహాన్ని ఈ పథకం అనుసరిస్తుంటుంది. సహేతుక ధర ఆధారంగా స్టాక్స్‌ను ఎంచుకుంటుంది. వృద్ధికి వీలున్న కంపెనీలను, అదే సమయంలో సరసమైన ధరల వద్ద (గ్రోత్ ఎట్ రీజనబుల్ ప్రైస్/జీఏఆర్‌పీ) అందుబాటులో ఉన్న వాటిని (వ్యాల్యూ స్టాక్స్) గుర్తించేందుకు ఫండ్ పరిశోధక బృందం కృషి చేస్తుంటుంది. ప్రధానంగా ఈ పథకం మిడ్‌క్యాప్ కంపెనీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంటుంది. ఆ తర్వాత లార్జ్‌క్యాప్‌కు ఎక్కువ పెట్టుబడులు కేటాయిస్తుంటుంది. పోర్ట్‌ఫోలియోలో వైవిధ్యానికి తగినంత ప్రాధాన్యం ఇస్తుంటుంది.

పోర్ట్‌ఫోలియో

ఈ పథకం నిర్వహణలో ప్రస్తుతం రూ.34,690 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 98 శాతం మేర ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసి ఉంది. మిగిలిన మొత్తాన్ని నగదు రూపంలో కలిగి ఉంది. పెట్టుబడులను గమనిస్తే 39 శాతం మేర లార్జ్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసింది. మిడ్‌క్యాప్‌లో 59 శాతం పెట్టుబడులు కలిగి ఉంది. స్మాల్‌క్యాప్ కేటాయింపులు కేవలం 1.86 శాతంగానే ఉన్నాయి. పోర్ట్‌ఫోలియోలో 94 స్టాక్స్ ఉన్నాయి. అత్యధికంగా 24 శాతం మేర పెట్టుబడులను బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు కేటాయించింది. కన్జ్యూమర్ డిస్క్రీషినరీ కంపెనీల్లో 18.43 శాతం, ఇండస్ట్రియల్ కంపెనీల్లో 16.58 శాతం, హెల్త్‌కేర్ కంపెనీల్లో 11.30 శాతం, టెక్నాలజీ కంపెనీల్లో 8.54 శాతం చొప్పున పెట్టుబడులు ఉన్నాయి.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు శాతం
బీఎస్‌ఈ	3.47
చోళమండలం ఫైనాన్షియల్	2.87
ఫోర్టిస్ హెల్త్‌కేర్	2.62
పర్సిస్టెంట్ సిస్టమ్స్	2.52
పవర్ ఫైనాన్స్	2.35
ఫెడరల్ బ్యాంక్	2.27
ఏయూ స్మాల్‌ఫైనాన్స్	2.25
డిక్సన్ టెక్నాలజీస్	2.13
ఇండస్ టవర్స్	2.12
వోల్టాస్	2.10

ఎర్రమట్టి కోర్టులపై తన ఆధిపత్యం నిరూపించుకునే దిశగా బెలారస్ టెన్నిస్ స్టార్ సబలెంకా అడుగు వేసింది. తనకు అంతగా కలిసిరాని ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా శుభారంభం చేసింది. టాప్ సీడ్ హోదాలో బరిలోకి దిగిన ఆమె తొలి మ్యాచ్‌లో దుమ్మురేపింది. రష్యా ప్లేయర్ కమిల్లా రఖిమోవాతో జరిగిన పోరులో సబలెంకా కేవలం ఒక్క గేమ్ మాత్రమే కోల్పోయి విజయాన్ని ఖరారు చేసుకుంది. వరుసగా ఎనిమిదో ఏడాది ఫ్రెంచ్ ఓపెన్‌లో ఆడుతున్న సబలెంకా గత ఏడాది సెమీఫైనల్ చేరుకొని తన అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. మూడు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ (2 ఆస్ట్రేలియన్ ఓపెన్, 1 యూఎస్ ఓపెన్) సాధించిన సబలెంకా స్థాయికి తగ్గట్టు ఆడితే ఫ్రెంచ్ ఓపెన్‌లో అద్భుతం సృష్టించినా ఆశ్చర్యపోనక్కర్లేదు.



సబలెంకా సులువుగా...

రెండో రౌండ్‌లోకి ప్రపంచ నంబర్‌వన్ • తొలి మ్యాచ్‌లో ఒక్క గేమ్ మాత్రమే కోల్పోయిన బెలారస్ స్టార్

పారిస్: టెన్నిస్ సీజన్ రెండో గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫ్రెంచ్ ఓపెన్‌లో తొలి రోజు ఎలాంటి సంచలనాలు నమోదు కాలేదు. మహిళల సింగిల్స్‌లో ఫేవరెట్స్‌లో ఒకరైన నంబర్‌వన్ సబలెంకా గెలుపు బోణీ కొట్టింది. ఆదివారం జరిగిన తొలి రౌండ్‌లో సబలెంకా 6–1, 6–0తో ప్రపంచ 86వ ర్యాంకర్ కమిల్లా రఖిమోవా (రష్యా)పై అలవోకగా గెలిచి రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది. 60 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఐదు ఏస్‌లు సంధించిన సబలెంకా ఒక డబుల్ ఫాల్ట్ చేసింది. తన సర్వీస్‌ను ఒక్కసారి కూడా కోల్పోని ఆమె ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. 30 విన్నర్స్ కొట్టిన సబలెంకా 17 అనవసర తప్పిదాలు చేసింది. మరోవైపు ఎనిమిదో సీడ్ కిన్‌వెన్ జెంగ్ (చైనా), 13వ సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్) 11వ సీడ్ దయానా ష్నైడర్ (రష్యా) కూడా తొలి రౌండ్‌లో విజయం సాధించి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో కిన్‌వెన్ జెంగ్ 6–4, 6–3తో పావ్లీచెంకోవా (రష్యా)పై, స్వితోలినా 6–1, 6–1తో జెనిప్ సోన్‌మెజ్ (తుర్కియే)పై, దయానా 7–6 (7/3), 6–2తో క్వాలిఫయర్ సాబోలియెవా (ఉక్రెయిన్)పై గెలిచారు.

ముసెట్టి ముందంజ

పురుషుల సింగిల్స్ విభాగంలో ఎనిమిదో సీడ్ ముసెట్టి (ఇటలీ), 12వ సీడ్ టామీ పాల్ (అమెరికా), 15వ సీడ్ టియాఫో(అమెరికా) శుభారంభం చేశారు. తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ముసెట్టి 7–5, 6–2, 6–0తో హాన్ఫ్‌మన్ (జర్మనీ)పై, టామీ పాల్ 6–7 (3/7), 6–2, 6–3, 6–1తో ఎల్మెర్ మోలెర్ (డెన్మార్క్)పై, టియాఫో 6–4, 7–5, 6–4తో సఫిలిన్ (రష్యా)పై విజయం సాధించారు.

నాదల్‌కు సన్మానం

రికార్డుస్థాయిలో ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను 14 సార్లు గెలిచిన స్పెయిన్ స్టార్ రాఫెల్ నాదల్‌కు ఆదివారం నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమానికి స్విట్జర్లాండ్ దిగ్గజం రోజర్ ఫెడరర్, సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్, బ్రిటన్ స్టార్ ఆండీ ముర్రే హాజరై నాదల్‌తో ఫొటోలు దిగారు. గత ఏడాది ఆటకు గుడ్‌బై చెప్పిన నాదల్ తన కెరీర్‌లో మొత్తం 22 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ సాధించాడు.



ఫ్యాబులస్ ఫోర్: జొకోవిచ్, ఫెడరర్, రాఫెల్ నాదల్, ఆండీ ముర్రే

ప్రణవ్–ఖ్యాతి జోడీకి రజత పతకం



ప్రణవ్

బెర్లిన్: అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) జూనియర్ ప్రపంచకప్ టోర్నమెంట్‌లో భారత్ ఖాతాలో మరో రెండు పతకాలు చేరాయి. ఆదివారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో నరేన్ ప్రణవ్–ఖ్యాతి చౌధరీ జోడీకి రజత పతకం... హిమాన్షు–శాంభవి క్షీర్‌సాగర్ జంటకు కాంస్య పతకం లభించాయి. 38 జోడీలు పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లో నరేన్ ప్రణవ్–ఖ్యాతి 631 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలిచి స్వర్ణ–రజత పతక మ్యాచ్‌కు అర్హత సాధించారు. హిమాన్షు–శాంభవి ద్వయం 629.5 పాయింట్లు సాధించి నాలుగో స్థానంలో నిలిచి కాంస్య పతక మ్యాచ్‌కు అర్హత పొందింది. ఫైనల్లో ప్రణవ్–ఖ్యాతి 14–16 సిరీస్ పాయింట్ల తేడాతో హువాంగ్ యుటింగ్–హువాంగ్ లివాన్లిన్ (చైనా) జంట చేతిలో ఓడిపోయింది. కాంస్య పతక మ్యాచ్‌లో హిమాన్షు–శాంభవి జోడీ 17–9 సిరీస్ పాయింట్ల తేడాతో గ్రిఫిన్ లేక్–ఎలీజా స్పెన్సర్ (అమెరికా) జంటను ఓడించింది. ప్రస్తుతం భారత్ 2 స్వర్ణాలు, 4 రజతాలు, 4 కాంస్యాలతో కలిపి మొత్తం 10 పతకాలతో రెండో స్థానంలో ఉంది.

భారత్ బోణీ



కనిక

రొసారియా (అర్జెంటీనా): నాలుగు దేశాల జూనియర్ మహిళల హాకీ టోర్నమెంట్‌లో భారత్ గెలుపు బోణీ కొట్టింది. చిలీ జట్టుతో జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ 2–1 గోల్స్ తేడాతో విజయం సాధించింది. భారత్ తరఫున సుఖ్‌వీర్ కౌర్ (39వ నిమిషంలో), కనిక సివాచ్ (58వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. చిలీ జట్టుకు జవేరియా సేంజ్ (20వ నిమిషంలో) ఏకైక గోల్ అందించింది.

భారత జూనియర్ హాకీ జట్టు అసిస్టెంట్ కోచ్‌గా లాక్రా



న్యూఢిల్లీ: భారత హాకీ జట్టు మాజీ ఆటగాడు బీరేంద్ర లాక్రా కోచింగ్ బాట పట్టాడు. ఈ ఏడాది పురుషుల జూనియర్ ప్రపంచకప్ జరగనున్న నేపథ్యంలో లాక్రా... యువ భారత జట్టు అసిస్టెంట్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. ప్రస్తుతం భారత జూనియర్ జట్టుకు దిగ్గజ గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్ కోచ్‌గా వ్యవహరిస్తుండగా... అతడితో కలిసి సుదీర్ఘ కాలం పాటు టీమిండియాకు ప్రాతినిధ్యం వహించిన లాక్రా అసిస్టెంట్ కోచ్‌గా సేవలు అందించనున్నాడు. 'యువ భారత జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా ఎంపికవడం ఆనందంగా ఉంది. కొత్త కుర్రాళ్లకు మార్గనిర్దేశం చేసేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. శ్రీజేశ్‌తో మంచి అనుబంధం ఉంది. మా అందరికీ స్ఫూర్తి అతడు. ఇప్పుడు శ్రీజేశ్‌తో కలిసి యువ ఆటగాళ్లకు కోచింగ్ ఇవ్వనుండడం సంతోషం. జూనియర్ వరల్డ్‌కప్‌నకు ముందు ఆటగాళ్ల నైపుణ్యం పెంపొందించడంపై దృష్టి పెడతాం' అని లాక్రా అన్నాడు. ఈ ఏడాది నవంబర్ 28 నుంచి డిసెంబర్ 10 వరకు తమిళనాడు వేదికగా జూనియర్ హాకీ వరల్డ్‌కప్ జరగనుంది. 'సహాయక శిక్షణ సిబ్బందిలో లాక్రా చేరడంతో మరింత ప్రయోజనం చేకూరింది. యువ ఆటగాళ్లకు అతడి సూచనలు ఎంతో ఉపయోగపడతాయి. మేమిద్దరం కలిసి ఏన్నో మ్యాచ్‌లు ఆడాం' అని శ్రీజేశ్ అన్నాడు. 2010లో జాతీయ జట్టు తరఫున అరంగేట్రం చేసిన లాక్రా డిఫెండర్‌గా సేవలందించాడు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం నెగ్గిన భారత జట్టులో అతను సభ్యుడు. 2012 లండన్ ఒలింపిక్స్‌తో పాటు ప్రపంచకప్‌లు, ఆసియా గేమ్స్, కామన్వెల్త్ గేమ్స్‌లో అతను టీమిండియాకు ప్రాతినిధ్యం వహించాడు. 2014 ఆసియా క్రీడల్లో స్వర్ణం, 2018 ఆసియా క్రీడల్లో కాంస్యం, 2013 ఆసియా కప్‌లో రజతం, 2014 కామన్వెల్త్ గేమ్స్‌లో రజతం లాక్రా ఖాతాలో ఉన్నాయి.

స్వప్నం సాకారం

- మొనాకో గ్రాండ్‌ప్రి రేసులో టైటిల్ సాధించిన మెక్‌లారెన్ డ్రైవర్ లాండో నోరిస్
- చిన్ననాటి కల నిజమైందన్న బ్రిటన్ రేసర్ • ఆఖరి ల్యాప్‌లో దక్కిన విజయం



విన్నర్స్ ట్రోఫీతో లాండో నోరిస్

మోంటెకార్లో: టెన్నిస్‌లో 'వింబుల్డన్'... బ్యాడ్మింటన్‌లో 'ఆల్ ఇంగ్లండ్'... ఫార్ములా వన్‌లో 'మొనాకో' గ్రాండ్‌ప్రి... ఆయా క్రీడాంశాల్లోని క్రీడాకారులు పై మూడింటిలో గెలిస్తే ఎంతో గొప్పగా, ఎంతో గౌరవంగా భావిస్తారు. బ్రిటన్ రేసింగ్ డ్రైవర్ లాండో నోరిస్ ఆదివారం మొనాకో వీధుల్లో తన చిన్ననాటి కలను నిజం చేసుకున్నాడు. ఎంతో ఘన చరిత్ర కలిగిన మొనాకో గ్రాండ్‌ప్రిలో నోరిస్ విజేతగా అవతరించాడు. 'పోల్ పొజిషన్'తో రేసును ఆరంభించిన లాండో నోరిస్ నిర్ణీత 78 ల్యాప్‌లను అందరికంటే వేగంగా, అందరికంటే వేగంగా 1 గంట 40 నిమిషాల 33.843 సెకన్లలో ముగించి టైటిల్ సాధించాడు. 'ఎంతో గొప్పగా అనిపిస్తోంది. ఏనాటికైనా నా మొనాకో గ్రాండ్‌ప్రిలో విజేతగా నిలవాలని చిన్ననాటి నుంచి కలలు కన్నాను. ఇప్పుడు నా స్వప్నం సాకారమైంది' అని ఈ సీజన్‌లో రెండో విజయాన్ని అందుకున్న నోరిస్ వ్యాఖ్యానించాడు. మొనాకో గ్రాండ్‌ప్రి మొత్తం వీధుల్లోనే జరుగుతుంది కాబట్టి నిర్వాహకులు ఈ రేసులో ప్రత్యేక నిబంధనను ప్రవేశపెట్టారు. ఈసారి డ్రైవర్లందరూ కచ్చితంగా రెండుసార్లు పిట్ స్టాప్‌లోకి వెళ్లి టైర్లు మార్చుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. 'పోల్ పొజిషన్' నుంచి రేసును ఆరంభించిన నోరిస్ 20వ ల్యాప్ వరకు ఆధిక్యంలో ఉన్నాడు. ఆ తర్వాత 20వ ల్యాప్‌లో నోరిస్ పిట్ స్టాప్‌లోకి వెళ్లడంతో రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ వెర్‌స్టాపెన్ ఆధిక్యంలోకి వచ్చాడు. వెర్‌స్టాపెన్ 29వ ల్యాప్‌లో తొలిసారి పిట్ స్టాప్‌లోకి వెళ్లాడు. ఆ తర్వాత వెర్‌స్టాపెన్ 77వ ల్యాప్ వరకు ఆధిక్యంలో ఉన్నా రెండోసారి పిట్ స్టాప్‌లోకి వెళ్లలేదు. 77వ ల్యాప్‌లో వెర్‌స్టాపెన్ పిట్ స్టాప్‌లోకి ప్రవేశించగా... ఇదే అదనుగా నోరిస్ దూసుకుపోయి మళ్లీ ఆధిక్యంలోకి వచ్చి చివరి ల్యాప్‌ను పూర్తి చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఫెరారీ డ్రైవర్ లెక్‌లెర్క్ రెండో స్థానంలో, ఆస్కార్ పియాస్ట్రి (మెక్‌లారెన్) మూడో స్థానంలో నిలిచారు. ప్రస్తుత ప్రపంచ చాంపియన్ వెర్‌స్టాపెన్ నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు. మాజీ చాంపియన్ లూయిస్ హామిల్టన్‌కు ఐదో స్థానం దక్కింది. ఇద్దరు డ్రైవర్లు ఫెర్నాండో అలోన్సో (ఆస్టన్ మార్టిన్), పియరీ గ్యాస్లీ (అల్పైన్) రేసును పూర్తి చేయలేకపోయారు.

ప్రస్తుత సీజన్‌లో ఎనిమిది రేసులు ముగిశాయి. ఆరింటిలో మెక్‌లారెన్ డ్రైవర్లు, రెండింటిలో రెడ్‌బుల్ డ్రైవర్లు విజేతలుగా నిలిచారు. డ్రైవర్స్ చాంపియన్‌షిప్‌లో 161 పాయింట్లతో ఆస్కార్ పియాస్ట్రి తొలి స్థానంలో, 158 పాయింట్లతో లాండో నోరిస్ రెండో స్థానంలో, 136 పాయింట్లతో వెర్‌స్టాపెన్ మూడో స్థానంలో ఉన్నారు. సీజన్‌లోని తదుపరి రేసు స్పానిష్ గ్రాండ్‌ప్రి జూన్ 1న జరుగుతుంది.

మొనాకో గ్రాండ్‌ప్రి రేసు ఫలితాలు (టాప్–10)

స్థానం	డ్రైవర్	జట్టు	టైమింగ్	వ్యత్యాసం	పాయింట్లు
1	లాండో నోరిస్	మెక్‌లారెన్	1:40:33.843 సెకన్లు	–	25
2	చార్లెస్ లెక్‌లెర్క్	ఫెరారీ	1:40:36.974 సెకన్లు	3.131 సెకన్లు	18
3	ఆస్కార్ పియాస్ట్రి	మెక్‌లారెన్	1:40:37.501 సెకన్లు	3.658 సెకన్లు	15
4	వెర్‌స్టాపెన్	రెడ్‌బుల్	1:40:54.415 సెకన్లు	20.572 సెకన్లు	12
5	హామిల్టన్	ఫెరారీ	1:41:25.230 సెకన్లు	51.387 సెకన్లు	10
6	ఐసాక్ హద్జర్	రేసింగ్ బుల్స్	1:41:38.925 సెకన్లు	1 ల్యాప్	8
7	ఎస్టెబన్ ఒకాన్	హాస్ టీమ్	1:41:39.872 సెకన్లు	1 ల్యాప్	6
8	లియామ్ లాసన్	రేసింగ్ బుల్స్	1:41:40.589 సెకన్లు	1 ల్యాప్	4
9	అలెగ్జాండర్ అల్బోన్	విలియమ్స్	1:40:45.712 సెకన్లు	2 ల్యాప్‌లు	2
10	కార్లోస్ సెయింజ్	విలియమ్స్	1:40:49.075 సెకన్లు	2 ల్యాప్‌లు	1

'గొప్ప గౌరవం... పెద్ద బాధ్యత'

- భారత టెస్టు కెప్టెన్సీపై గిల్ స్పందన
- విదేశాల్లో ఎలా గెలవాలో తెలుసు
- సీనియర్ల నుంచి నేర్చుకున్నానన్న కొత్త సారథి



ముంబై: భారత టెస్టు క్రికెట్ చరిత్రలో విదేశీ గడ్డపై అప్పుడప్పుడు కొన్ని మెరుపులు మినహా మన జట్టు రికార్డు పేలవంగానే ఉంది. సహజంగానే సిరీస్‌లో ఆటగాళ్ల వ్యక్తిగత ప్రదర్శనలతో పాటు కెప్టెన్సీపై కూడా అందరి దృష్టి ఉంటుంది. ఇప్పుడు టీమిండియా టెస్టు కెప్టెన్ హోదాలో శుబ్‌మన్ గిల్ ఇంగ్లండ్‌తో సిరీస్‌లో తొలిసారి బరిలోకి దిగబోతున్నాడు. ఈ నేపథ్యంలో సారథిగా తనపై అనవసరపు ఒత్తిడిని పెంచుకోనని గిల్ స్పష్టం చేశాడు. కెప్టెన్‌గా ఎంపికైన తర్వాత అతను బీసీసీఐ మీడియాతో తన స్పందనను పంచుకున్నాడు. బ్యాటర్‌గా కూడా తన బాధ్యత నెరవేర్చడం ముఖ్యమని అతను అన్నాడు. 'ఒక విషయంలో నేను చాలా స్పష్టంగా ఉండదల్చుకున్నాను. బ్యాటింగ్ చేస్తున్నప్పుడు నేను బ్యాటర్‌గానే ఆలోచిస్తాను. అదే కోణంలో నిర్ణయాలు తీసుకుంటాను తప్ప కెప్టెన్ హోదా గురించి పట్టించుకోను. బ్యాటింగ్ చేస్తూ కూడా ఇతర అంశాలపై దృష్టి పెడితే సహజంగానే ఒత్తిడి పెరుగుతుంది. అది అవసరం లేదు. నేను కెప్టెన్‌ను అనే భావనే రాకుండా నా బ్యాటింగ్‌తో ఏం చేయగలననేది ముఖ్యం' అని గిల్ వ్యాఖ్యానించాడు. భారత కెప్టెన్‌గా ఎంపిక కావడం పట్ల చాలా సంతోషంగా ఉందన్న గిల్... అదో పెద్ద బాధ్యత అని అభిప్రాయపడ్డాడు. 'చిన్నప్పుడు క్రికెట్ ఆడటం మొదలు పెట్టినప్పుడు భారత్‌కు ఆడితే చాలనుకుంటాం. ఆ తర్వాత ఎక్కువ కాలం టెస్టులు ఆడితే బాగుంటుందని భావిస్తాం. అలాంటిది ఇప్పుడు కెప్టెన్ కావడం గొప్ప గౌరవం. ఇంత పెద్ద బాధ్యత నాకు దక్కిన గొప్ప అవకాశం. ఇంగ్లండ్‌తో సిరీస్ కోసం ఎంతో ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా' అని గిల్ భావోద్వేగం ప్రదర్శించాడు. ఆటగాళ్లకు పూర్తి స్వేచ్ఛనిచ్చి వారి నుంచి అత్యుత్తమ ప్రదర్శన రాబట్టడంతో పాటు ఏ సమయంలో కెప్టెన్ అవసరం జట్టుకు ఉంటుందని గుర్తించడం కూడా కీలకమని అభిప్రాయం వ్యక్తం చేశాడు. ఇటీవలే టెస్టుల నుంచి రిటైర్ అయిన కోహ్లి, రోహిత్, అశ్విన్‌ల నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని... విదేశాల్లో ఎలా గెలవాలో వారు చూపించారని కొత్త కెప్టెన్ అన్నాడు. 'రోహిత్, విరాట్, అశ్విన్ విదేశాల్లో టెస్టులు, సిరీస్‌లు ఎలా గెలవాలనే విషయంలో ఒక 'బ్లూప్రింట్'ను అందించారు. దీనిని అమలు చేయగలగాలి. విరాట్, రోహిత్‌ల నాయకత్వంలో ఆడటం నా అదృష్టం. బయటకు కనిపించడంలో ఇద్దరి శైలి భిన్నమే అయినా...మైదానంలో అటాకింగ్ చేసే విషయంలో ఇద్దరూ దూకుడుగానే ఉంటారు. ఎప్పటికప్పుడు మాట్లాడుతూ ఆటగాళ్లనుంచి తనకు ఏం కావాలో స్పష్టంగా చెప్పే రోహిత్ కెప్టెన్సీ పద్ధతిని నేను నేర్చుకున్నాను' అని గిల్ వివరించాడు.

ముంబై X పంజాబ్

- టాప్–2 లో నిలవడమే లక్ష్యంగా కీలక పోరు
- రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం





పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్

జైపూర్: పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలవడమే లక్ష్యంగా... సోమవారం పంజాబ్ కింగ్స్‌తో ముంబై ఇండియన్స్ పోరుకు సిద్ధమైంది. లీగ్ దశలో 13 మ్యాచ్‌లు ఆడిన ముంబై 8 విజయాలు, 5 పరాజయాలతో 16 పాయింట్లు ఖాతాలో వేసుకొని నాలుగో స్థానంలో ఉండగా... పంజాబ్ 13 మ్యాచ్‌ల్లో 17 పాయింట్లతో రెండో 'ప్లేస్'లో కొనసాగుతోంది. టాప్–2లో నిలిచిన జట్లకు ఫైనల్‌కు చేరేందుకు మరో అదనపు అవకాశం ఉండటంతో... ఇరు జట్లు దానిపైనే దృష్టి సారించాయి. సీజన్ ఆరంభంలో పెద్దగా ఆకట్టుకోలేకపోయిన ముంబై జట్టు... ఆ తర్వాత వరుస విజయాలతో విజృంభిస్తుంటే... పంజాబ్ కింగ్స్ 11 ఏళ్ల తర్వాత 'ప్లే ఆఫ్స్'కు అర్హత సాధించింది. హార్దిక్ పాండ్యా సారథ్యంలోని ముంబై జట్టు స్టార్ ఆటగాళ్లతో నిండి ఉంటే... శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలోని పంజాబ్ కింగ్స్ బ్యాటింగ్‌పై ఎక్కువ ఆధారపడుతోంది. చిన్న బౌండరీల మైదానంలో భారీ స్కోర్లు నమోదవడం ఖాయం కాగా... ఇరు జట్లు సమ ఉజ్జీలుగా కనిపిస్తున్న బుమ్రా ఫామ్‌లో ఉండటంతో ముంబైకి కాస్త మొగ్గు ఉంది. సూర్యకుమార్ యాదవ్ 583 పరుగులతో ఫుల్ ఫామ్‌లో ఉండగా... రోహిత్ శర్మ, రికెల్టన్, విల్ జాక్స్ మంచి టచ్‌లో ఉన్నారు. హైదరాబాద్ ఆటగాడు తిలక్ వర్మ... ధాటిగా ఆడలేక ఇబ్బంది పడుతుండగా... హార్దిక్ పాండ్యా, నమన్ ధీర్ భారీ షాట్లతో జట్టుకు ఉపయుక్తకరమైన పరుగులు అందిస్తున్నారు. బౌలింగ్‌లో బుమ్రా, బౌల్ట్, దీపక్ చాహర్, సాంట్నర్ కీలకం కానున్నారు. మరోవైపు పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఈ సీజన్‌లో 488 పరుగులు చేయగా... ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్ సింగ్ (486), ప్రియాన్ష్ ఆర్య (362) దూకుడు మీదున్నారు. ఈ జంట మెరుగైన ఆరంభాలు అందిస్తుండటంతోనే ఆ జట్టు నిలకడ కొనసాగించగలుగుతోంది. జోష్ ఇన్‌గ్లిస్, నేహల్ వధేరా, శశాంక్ సింగ్, స్టొయినిస్‌తో పంజాబ్ బ్యాటింగ్ పటిష్టంగా ఉంది. గత మ్యాచ్‌లో టాపార్డర్ పెద్దగా ఆకట్టుకోలేకపోయినా... చివర్లో స్టొయినిస్ మెరుపులు మెరిపించడంతో పంజాబ్ భారీ స్కోరు చేయగలిగింది. ఇలాగే ప్రతి మ్యాచ్‌లో ఒకరు విఫలమైనా మరొకరు బాధ్యత తీసుకుంటుండటం పంజాబ్ కింగ్స్‌కు కలిసి వస్తోంది. బ్యాటింగ్‌లో ముంబైకి దీటుగా ఉన్న పంజాబ్... బౌలింగ్‌లో మాత్రం కాస్త వెనుకబడ్డట్లు కనిపిస్తోంది. అర్‌ష్‌దీప్ సింగ్, మార్కో యాన్సెన్‌పై అధిక భారం పడుతోంది. మరి కీలక పోరులో ముంబై విజయం సాధించి ముందంజ వేస్తుందా... లేక పంజాబ్ ప్రతాపం కనబరుస్తుందా చూడాలి!

ఎడారి నేల జలకళ

పల్లె దృశ్యాన్ని మార్చిన మహిళలు • దుఃఖనది జీవనది అయ్యింది

బందిపోట్లు రైతులయ్యారు • కరౌలీ పచ్చదనానికి మారుపేరైంది



కరౌలీలో పచ్చదనం సంతరించుకుంటున్న ఎడారి నేల

రాజస్థాన్ అనగానే గుర్తొచ్చేది ఎడారి. అందులోనూ కరౌలీ జిల్లా అంటేనే నీటికోసం తండ్లాట. వరుస కరువులు. పచ్చదనం అంటే తెలియని పల్లెలు. ఈ దృశ్యాన్ని మార్చేశారు మహిళలు. చుక్క చుక్కను ఒడిసిపట్టి పొఖార్(నీటికుంట)లను సృష్టించారు. ఉపాధి లేక బందిపోట్లుగా మారిన పురుషులను వ్యవసాయం వైపు మళ్లించి.. మళ్లీ రైతులను చేశారు. బంజరు నేలల్లో ఇప్పుడు బంగారం పడిస్తున్నారు. దుఃఖనదిలా మారిన షేర్నిని మళ్లీ జీవనదిగా మార్చారు. మే నెల మండుటెండల్లోనూ కరౌలీ చెరువులు, పొఖార్లు నీటితో కళకళలాడుతున్నాయి. నెమ్మదిగా ప్రవహిస్తున్న సేర్ని నది ఒడ్డున పిల్లలు ఆడుకుంటున్నారు. ఆ పక్కనే పశువులు మేస్తూ ఉన్నాయి. ఒక దశాబ్దం క్రితం, ఎవరూ ఊహించని దీనిని మహిళలు సాధ్యం చేసి చూపించారు. అదెలా సాధ్యమైందంటే...



బోరుబావిలో పుష్కలంగా నీరు

సంపత్తి దేవి

రాజస్థాన్‌లోని కరౌలీ జిల్లా.. కరువుకు మారుపేరు. వాతావరణ మార్పులతో వర్షపాతం తగ్గింది. భూములు బంజరుగా మారాయి. నీటి వనరులు లేవు. 50 ఏళ్ల కిందట జీవనాధారంగా ఉన్న వ్యవసాయం, పశుపోషణ లేకుండా పోయింది. వేరే మార్గం లేక చాలా మంది వలస పోయారు. ఉపాధి లేక కొందరు నగరాలకు వలస వెళ్లగా, మరికొందరు మైనింగ్‌వైపు మొగ్గుచూపారు. ఇంకొందరు బందిపోట్లుగా మారారు. ఒక్కసారి ఇంటినుంచి వెళ్లిన వారు తిరిగి ఇంటికొస్తారో లేదో తెలియదని భయం. మైనింగ్ నుంచి వచ్చే సిలికా ధూళితో సిలికోసిస్ అనే ఊపిరితిత్తుల వ్యాధికి కారణమయ్యింది. ఈ పనిలోకి వెళ్లినవారిలో 74శాతం మంది వ్యాధి బారిన పడ్డారు. చాలామంది 40 ఏళ్లు దాటి జీవించలేదు. నీటికరువు ఆ ప్రాంత సామాజిక పరిస్థితిని కూడా మార్చేసింది. నీళ్లు లేని కారణంగా ఆ జిల్లాలోని గ్రామాలకు పిల్లనివ్వాలంటే భయపడేవారు. మరోవైపు వరుస కరువులు, పేదరికంతో తమ ఆడపిల్లలకు తొందరగా పెళ్లిళ్లు చేసి పంపేవారు కరౌలీ జిల్లాలోని గ్రామస్తులు. అందరి జీవితాల్లో ఒకరకమైన నిరాశ.

కరువు నుంచి లక్షాధికారుల వరకు..

2010లో మార్పునకు బీజం పడింది. నీటి సంరక్షణ స్వచ్ఛంద సంస్థ తరుణ్ భారత్ సంఘ్‌వారి జీవితాల్లోకి వచ్చింది. ఒకప్పటి చెరువులన్నీ ఎండిపోయాయి. మట్టి, ఇసుకతో నిండిపోయాయి. వాటిని పునరుద్ధరణకు నడుం కట్టారు మహిళలు. ఆలంపూర్ గ్రామ సంపత్తి దేవి అనే మహిళ అప్పటిదాకా తాను కూడబెట్టిన మొత్తాన్ని ఖర్చు చేసి 2015-16లో కొండ కింద పొఖార్‌ను నిర్మించింది. వర్షాలు పడినప్పుడు కొండపైనుంచి వచ్చిన నీటితో పొఖార్ నిండిపోయింది. ఏడాదికి సరిపడా నీరు. బందిపోటు అయిన భర్తను వ్యవసాయానికి ఒప్పించింది. 58 ఏళ్ల జగదీష్, ఆయన భార్య కలిసి ఇప్పుడు ఆవాలు, గోధుమలు, చిరుధాన్యాలు, కూరగాయలు పండిస్తున్నారు. ప్రతి సీజన్‌లో లక్షరూపాయలు సంపాదిస్తున్నారు. అదే జిల్లాలోని భూర్ఖేడ గ్రామానికి చెందిన ప్రేమ్.. బిడ్డలకు చిన్నవయసులోనే పెళ్లి చేసింది. ఆర్థిక ఇబ్బందులతో భర్త బందిపోటుగా మారాడు. ఈ పరిస్థితి మార్చాలనుకుంది. గ్రామ శివార్లలో పొఖార్ నిర్మించేందుకు నాలుగు బిగాల సొంత భూమిని ఇచ్చింది. చెరువు నీటితో గోధుమలు, చిరుధాన్యాలను పండిస్తూ గర్వంగా కుటుంబాన్ని పోషించుకుంటోంది. బందిపోటు నుంచి రైతుగా మారిన మరో వ్యక్తి భూర్ఖేడకు చెందిన 60 ఏళ్ల లజ్జా రామ్. 'నా తండ్రి రైతు. ఆ కాలంలో తగినంత నీరు ఉండేది. నేను పెరిగేకొద్దీ వర్షపాతం తగ్గింది, బావులు ఎండిపోయాయి. వ్యవసాయం కష్టమైంది. పశువులు చనిపోయాయి, తరువాత మా ప్రాణాలు పోతాయేమో అనిపించింది. అలా దొంగగా మారిపోయాను. నేను లొంగిపోయేందుకు నా సోదరి ఒప్పించింది. ఇప్పుడు మా 10 బిగాల భూమిలో గోధుమలు, ఆవాలు, శనగలు, ముత్యాల మిల్లెట్లను పండిస్తున్నారు. ఎనిమిది గేదెలు, మేకలతో ఆనందంగా ఉన్నాం'అని చెబుతున్నాడు.

జీవనదిగా మారిన సేర్ని...

ఈ పదిహేనేళ్ల కాలంలో.. జిల్లాలోని చుట్టుపక్కల అడవిలో ఇటువంటి 16 పొఖార్లను నిర్మించారు. ఇవన్నీ వర్షపు నీటిని ఒడిసిపట్టేవే. వీటినుంచి డీజిల్ పంపుల ద్వారా సాగుకు వాడుకుంటారు. పొఖార్లతో భూగర్భజలం మట్టం పెరిగింది. నేలను తవ్వితే ఐదు నుంచి పది అడుగుల లోపే నీరు అందుతుంది. జిల్లాలోని సేర్ని నది.. 40 ఏళ్లకిందట ఏడాది పొడవునా ప్రవహించేది. వాతావరణ మార్పులు.. అది ఎండిపోయేలా చేశాయి. దీపావళి పండుగ అయిపోయిందంటే నదిలో చుక్క నీరు కనిపించకపోయేది. కానీ.. ఇప్పుడది జీవనదిగా మారింది. వేసవిలోనూ నీరు ప్రవహిస్తోంది. నీరు జీవం.. నీటితో స్థిరత్వం వస్తుంది. నీటి గతిని అనుసరించే నాగరికతలు ఏర్పడ్డాయి. ఇప్పుడా నీరే రాజస్థాన్ ఎడారి జీవితాలను మార్చేసింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

బిహార్‌లో పెళ్లి కొడుకును అపహరించారు

పట్నా: పెళ్లి మండపం నుంచి పెళ్లి కుమారుడు కిడ్నాప్ కావడం ఎక్కడైనా విన్నామా? బిహార్ రాష్ట్రం గోపాల్‌గంజ్ జిల్లాలోని దిఘ్వా దబౌలీ గ్రామంలో శుక్రవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. పెళ్లి వేడుక కాస్తా రణరంగంగా మారిపోయింది. పెళ్లిలో అతిథులను అలరించడానికి వచ్చిన డ్యాన్సర్ల బృందం పెళ్లి కొడుకు సోనూకుమార్ శర్మను అపహరించింది. తొమ్మిది గంటల తర్వాత అతడి ఆచూకీ దొరకడంతో అంతా హాయిగా ఊపిరి పీల్చుకున్నారు. అసలేం జరిగిందంటే... పెళ్లి సమయంలో డ్యాన్సర్ల బృందం పలు రకాల నృత్యాలతో అలరించింది. అప్పటికే సమయం మించిపోవడంతో తాము కార్యక్రమం ఆపేస్తామని డ్యాన్సర్లు చెప్పడంతో అతిథులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్యాన్సులు కొనసాగించాలని, లేకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. దానికి డ్యాన్సర్లు ఒప్పుకోలేదు. దాంతో ఇరువర్గాల మధ్య భీకర ఘర్షణ జరిగింది. ముస్కాన్ కిన్నార్ అనే కళాకారుడు గాయపడ్డాడు. ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకొని మళ్లీ వివాహ మండపానికి చేరుకున్నాడు. ఆ సమయంలో పెళ్లికొడుకు సోనూకుమార్ శర్మ మండపంలోనే ఉన్నాడు. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత 2 గంటల సమయంలో డ్యాన్సర్ల బృందం పెళ్లి కుమారుడిని అపహరించింది. అందరూ చూస్తుండగానే వాహనంలో ఎక్కించి, అక్కడి నుంచి వేగంగా వెళ్లిపోయింది. వరుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. వరుడి కోసం అన్వేషణ ప్రారంభించారు. తొమ్మిది గంటల తర్వాత సివాన్ జిల్లాలో అతడి అచూకీ కనిపెట్టారు. కిడ్నాప్ చేసిన డ్యాన్సర్ల కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. ఇదిలా ఉండగా, డ్యాన్సర్లకు చెల్లించాల్సిన డబ్బుల విషయంలో ఘర్షణ జరిగిందని గోపాల్‌గంజ్ ఎస్పీ అవదేశ్ దీక్షిత్ చెప్పారు.

పేకాట సిగ్గుమాలిన పని కాదు

జూదంలో భాగంగా ఆడితేనే తప్పు

- గ్యాంబ్లింగ్, బెట్టింగ్‌లా ఆడితే నేరమే
- స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: పేకాట ఆడటం సిగ్గుమాలిన పని కాదని సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. జూదం, గ్యాంబ్లింగ్‌లో భాగంగా పేకాట ఆడితే మాత్రం నేరమని స్పష్టంచేసింది. ఎలాంటి గ్యాంబ్లింగ్, బెట్టింగ్‌తో సంబంధం లేకుండా, ఎలాంటి మోసంతో ప్రమేయం లేకుండా కేవలం వ్యక్తిగతంగా, సొంత వాళ్లతో సరదాగా ఆడితే తప్పుగా పరిగణించకూడదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. రోడ్డు పక్కన ఆటవిడుపుగా పేకాట ఆడాడన్న కారణంతో కర్ణాటకలో ఎంప్లాయీస్ హౌసింగ్ సొసైటీ బోర్డులో డైరెక్టర్ సభ్యత్వానికి దూరం చేయడం సబబుకాదని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టంచేసింది. కర్ణాటకలో గవర్నమెంట్ పోర్సలిన్ ఫ్యాక్టరీ ఎంప్లాయీస్ హౌసింగ్ కో-ఆపరేటివ్ సొసైటీలో వైసీ హనుమంతరాయప్ప ఎన్నికల్లో అత్యధిక ఓట్లు గెలిచి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లో సభ్యత్వం సాధించారు. అయితే రోడ్డుపక్కన పేకాట ఆడారన్న కారణంగా అయనపై రూ.200 జరిమానా వేసి, సభ్యత్వాన్ని రద్దుచేస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది. దీనిపై ఆయన కర్ణాటక హైకోర్టును ఆశ్రయించగా బోర్డు నిర్ణయాన్ని సమర్థిస్తూ తీర్పు వచ్చింది. దీంతో ఆయన సుప్రీంకోర్టు తలుపు తట్టగా మే 14వ తేదీన ఆయనకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. హౌసింగ్ సొసైటీలో ఆయన సభ్యత్వాన్ని పునరుద్ధరించాలంటూ తీర్పు వెలువర్చింది. ఈ సందర్భంగా పలు వ్యాఖ్యలు చేసింది. ''పేకాట అనేది నైతికంగా తప్పు కాదు. బెట్టింగ్, జూదం, గ్యాంబ్లింగ్‌లో భాగంగా ఆడితేనే నేరం. సరదాకి సొంత వాళ్లతో ఆడితే దానిని నేరంగా భావించొద్దు. ఈ కేసులో నిందితుడు హనుమంతరాయప్ప పేకాటకు బానిస కాదు. గ్యాంబ్లింగ్ చేయలేదు. కేవలం విరామం, విశ్రాంతి వేళ మానసిక ప్రశాంతత కోసం పేకాట ఆడారు. 2020 ఫిబ్రవరి 12న జరిగిన ఎన్నికల్లో అత్యధిక ఓట్లు సాధించి డైరెక్టర్ల మండలిలో స్థానం సంపాదించిన ఈయనను పేకాట ఆడాడన్న ఒకే ఒక్క కారణం చూపి శిక్షించడం సహేతుకం అనిపించుకోదు'' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

ట్రంప్ పేరుతో నకిలీ యాప్

150 మంది నుంచి రూ.కోటి వసూలు

బెంగళూరు: సైబర్ నేరగాళ్లు చివరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కూడా వదల్లేదు. ఆయన పేరుతో యాప్‌ను రూపొందించి.. 150 మందిని మోసం రూ.కోటి వసూలు చేశారు. 'ట్రంప్ హోటల్ రెంటల్'పేరుతో యాప్ క్రియేట్ చేసిన స్కామర్లు.. ఇందులో పెట్టుబడులు పెడితే డబ్బు రెట్టింపవుతుందని నమ్మబలికారు. యాప్ చట్టబద్ధమైనదిగా చూపించడానికి ఏఐ జనరేటెడ్ ట్రంప్ వీడియోను ప్రసారం చేశారు. పెట్టుబడి పెట్టిన వారికి బహుమతులు కూడా ఆశ చూపారు. అంతేకాదు.. ఇంటి నుంచి పనిచేసే అవకాశం కల్పిస్తామని చెప్పారు. దీంతో నమ్మిన బెంగళూరు, తమకూరు, మంగళూరు, హావేరి వరకు ప్రజలు యాప్‌లో ఉన్న నంబర్‌కు కాల్ చేసి డబ్బు ఇచ్చారు. 150 మంది కోటికి పైగా పెట్టుబడి పెట్టారు. వీరికి నమ్మకం కలిగించేందుకు స్కామర్లు ధ్రువీకరణ పత్రాలు కూడా అందజేశారు. కొన్ని రోజులపాటు చిన్నచిన్న బహుమతులు కూడా అందజేశారు. ఆ తరువాత షేర్లు రోజురోజుకూ పెరుగుతున్నట్టుగా డిజిట్స్ మారుస్తూ వారిని మాయ చేశారు. ఆ తరువాత కొంతకాలానికి యాప్‌లో ఉన్న నంబర్‌కు కాల్ చేస్తే స్పందన లేదు. మోసపోయామని తెలుసుకున్న బాధితులు పోలీస్ స్టేషన్లను ఆశ్రయించారు. ఒక్క హావేరీలోనే 15 మందికి పైగా మోసపోయారని పోలీసు అధికారులు వెల్లడించారు.

నేటి నుంచి గుజరాత్‌లో మోదీ పర్యటన

రూ.77,400 కోట్ల ప్రాజెక్టులు ప్రారంభించనున్న ప్రధాని

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం నుంచి రెండు రోజులపాటు తన సొంత రాష్ట్రం గుజరాత్‌లో పర్యటించబోతున్నారు. ఈ సందర్భంగా రూ.77,400 కోట్ల విలువైన ప్రాజెక్టులను ఆయన ప్రారంభిస్తారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేస్తారు. దాహోద్‌లో లోకోమోటివ్ తయారీ ప్లాంట్‌ను ప్రారంభించనున్నారు. అలాగే ఎలక్ట్రిక్ లోకోమోటివ్ రైలుకు పచ్చజెండా ఊపుతారు. భుజ్‌లో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. రెండు బహిరంగ సభల్లో ప్రసంగిస్తారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుతోపాటు మరో రైలును ప్రారంభిస్తారు. నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అర్బన్ డెవలప్‌మెంట్ ఇయర్-2005కి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం కింద పట్టణాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేశారు. ఇప్పుడు ప్రధానమంత్రి హోదాలో అర్బన్ డెవలప్‌మెంట్ ఇయర్-2025ను ప్రారంభించబోతున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పట్టణాభివృద్ధితోపాటు వాయు నాణ్యతను మెరుగుపర్చనున్నారు.

'బిస్కెట్ డబ్బా' నుంచే బిగ్ డిబేట్

లక్కీ డిప్‌గా అందులో వచ్చిన బిల్లుపైనా చర్చ

న్యూజిలాండ్‌లో కొనసాగుతున్న వింత సంప్రదాయం



బిస్కెట్ డబ్బా ఇదే

వెల్లింగ్టన్: అత్యవసర సమయాల్లో అక్కర కొస్తాయని డబ్బును ఇంట్లో అమ్మవాళ్లు పోపుల డబ్బాల్లో దాస్తారు. అదే తరహాలో దేశ భవిష్యత్‌ను నిర్దేశించే ప్రతిపాదిత బిల్లులను న్యూజిలాండ్ పార్లమెంటేరియన్లు బిస్కెట్ డబ్బాలో పెడతారు. అందులోంచి ఎంపిక చేసిన బిల్లుపైనే చర్చ జరుపుతారు. ఈ వింత సంప్రదాయ న్యూజిలాండ్‌లో 20వ శతాబ్దం నుంచే ఉంది. గురువారం పార్లమెంట్‌లో బిల్లులపై చర్చ సందర్భంగా మళ్లీ ఆ బిస్కెట్ డబ్బాను తీసుకురావడంతో ఇప్పుడిది చర్చనీయాంశమైంది. సాధారణంగా పార్లమెంట్ కీలక అజెండాలో ఉన్న బిల్లులను ఈ కుకీ టిన్‌లో వేయరు. గతంలో కొత్త చట్టాలకు సంబంధించి మంత్రులుకాని సభ్యుల నుంచి ఏవైనా ప్రతిపాదనలు వస్తే వాటిల్లో దేనిని చర్చించాలనే మీమాంస మొదలైంది. ఎవరికి వారు తమ ప్రతిపాదనపైనే చర్చ జరపాలని పట్టుబట్టారు. వీటికి ప్రజాస్వామ్యయుతంగా చెక్ పెట్టేందుకే ఈ బిస్కెట్ డబ్బాను తెచ్చారు. 1990 దశకంలో వెల్లింగ్టన్ సిటీలోని 'డేకా'సంస్థ సరకుల దుకాణం నుంచి పార్లమెంట్ ఉద్యోగి ఒకరు ఈ బిస్కెట్ డబ్బాను తీసుకొచ్చారు. సభ్యుల బిల్లుల సంబంధించిన టోకెన్లను ఈ డబ్బాలో వేస్తారు. వైజ్ఞానిక సందర్శనలో భాగంగా పార్లమెంట్‌కు వచ్చిన విద్యార్థులు లేదా రాజకీయాలకు సంబంధం లేని వ్యక్తులతో ఈ డబ్బాలోని టోకెన్‌ను లక్కీడిప్ తరహాలో తీయిస్తారు. అలా తీసిన బిల్లుపై మాత్రమే చర్చ జరుపుతారు. న్యూజిలాండ్‌లో కొన్ని కీలక చట్టాలుగా రూపుదాల్చిన కొన్ని ప్రతిపాదిత బిల్లులు సైతం ఇలా బిస్కెట్ డబ్బా నుంచే లక్కీ డిప్‌లో ఎంపికచేసినవే కావడం విశేషం. వివాహంలో సమానత్వ చట్టం, కారుణ్య మరణాలకు బాటలు వేసిన చట్టాలు ఇలా వచ్చినవే. ''కొత్త డబ్బాను తెచ్చి అందులోని బిస్కెట్లన్నీ తినేస్తాం. తర్వాత ఒకటి, రెండు అంటూ 90 దాకా టోకెన్లు వేస్తాం. అందులో వచ్చిన టోకెన్ నంబర్ ఉన్న ప్రతిపాదిత బిల్లుపైనే చర్చ జరుపుతారు''అని న్యూజిలాండ్ దిగువసభలో క్లర్క్ అయిన డేవిడ్ విల్సన్ చెప్పారు.

దుండగుల కాల్పుల్లో అకాలీదళ్ కౌన్సిలర్ మృతి

చండీగఢ్: అమృత్‌సర్‌లో ఆదివారం శిరోమణి అకాలీదళ్‌కు చెందిన కౌన్సిలర్‌ను దుండగులు కాల్చి చంపారు. జందియాలా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో రెండో వార్డు కౌన్సిలర్‌గా ఉన్న హర్జీందర్ సింగ్ వెళ్తుండగా చెహెర్తా ప్రాంతంలో బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు అడ్డుకున్నారు. అనంతరం నాలుగు రౌండ్ల వరకు ఆయనపై తుపాకీతో కాల్పులు జరిపి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన హర్జీందర్‌ను వెంటనే ఆస్పత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. దుండగులు ముగ్గురూ కృష్ణా గ్యాంగ్‌కు చెందిన వారిగా గుర్తించారు. వారిని త్వరలోనే పట్టుకుంటామని ఏడీసీపీ హర్పాల్ సింగ్ రణ్‌ధవా తెలిపారు. వారు వాడిన బైక్‌ను గుర్తించామన్నారు. ఇటీవల హర్జీందర్ సింగ్ ఇంటిపై గుర్తు తెలియని దుండుగులు కాల్పులు జరిపారని, బెదిరింపు వస్తున్నట్లు ఆయన ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని శిరోమణి అకాలీదళ్ చీఫ్ సుఖ్‌బీర్ సింగ్ బాదల్ ఆరోపించారు.

సరిహద్దు ఉగ్రవాదాన్ని భారత్ ఉపేక్షించబోదు

ఎంపీ శశిథరూర్

న్యూయార్క్/మనామా/సియోల్: సరిహద్దు ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి భారత్ సంసిద్ధంగా ఉందని, నేరానికి పాల్పడిన ఎవ్వరినీ ఉపేక్షించబోదని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అన్నారు. ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రవాద దాడిలో 26 మంది మరణించిన నేపథ్యంలో భారత్ అనుసరిస్తున్న జీరో టాలరెన్స్ విధానం, ఆపరేషన్ సిందూర్ గురించి వివరించేందుకు భారత దౌత్య బృందాలు వివిధ దేశాల్లో పర్యటిస్తున్నాయి. అమెరికా పర్యటనలో ఉన్న ఎంపీ శశిథరూర్ నేతృత్వంలోని బృందం న్యూయార్క్‌లోని 9/11 స్మారక చిహ్నం వద్ద నివాళులర్పించింది. అనంతరం శశిథరూర్ మీడియాతో మాట్లాడుతూ.. ఉగ్రవాదం ప్రపంచం ముందున్న అతి పెద్ద సమస్యని, దీనిని ఎదుర్కోవడానికి అందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ తీసుకుంటున్న చర్యలను అంతకుముందు భారత కాన్సులేట్‌లో ఆయన వివరించారు. ఆపరేషన్ సిందూర్ వారు చేసిన దాడికి ప్రతిఘటనే తప్ప.. పాకిస్తాన్‌తో యుద్ధం చేయాలనేది తమ ఉద్దేశం కాదన్నారు. ఇక బహ్రెయిన్ పర్యటనలో ఉన్న పార్లమెంటరీ ప్రతినిధి బృందం ఆదివారం ఆ దేశ ఉప ప్రధాని షేక్ ఖలీద్ బిన్ అబ్దుల్లా అల్ ఖలీఫాతో భేటీ అయ్యింది. భారత్ ఎదుర్కొంటున్న సీమాంతర ఉగ్రవాదం, దానిని ఎదుర్కోవడానికి ఉన్న దృఢ సంకల్పం గురించి వివరించింది. ఉగ్రవాదంపై పోరాడటానికి, బహ్రెయిన్‌తో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడానికి భారత్ సిద్ధంగా ఉందని బీజేపీ ఎంపీ బైజయంత్ పాండా అన్నారు.

తాజ్‌మహల్ రక్షణకు యాంటీడ్రోన్ వ్యవస్థ

- బెదిరింపుల నేపథ్యంలో అదనపు హైటెక్ భద్రత
- సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

ఆగ్రా (యూపీ): తాజ్‌మహల్‌ను పేల్చేస్తామని వరుస బెదిరింపుల నేపథ్యంలో.. ఈ అద్భుత నిర్మాణం భద్రతపై కేంద్రం దృష్టి సారించింది. తాజ్ మహల్ కాంప్లెక్స్‌లో యాంటీ డ్రోన్ వ్యవస్థను ఏర్పాటు చేయనుంది. దీంతో తాజ్ మహల్ భద్రత మరింత హైటెక్‌గా మారనుంది. ఈ స్మారక చిహ్నం ప్రస్తుతం కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్), ఉత్తరప్రదేశ్ పోలీసుల రక్షణలో ఉంది. ఇక్కడ త్వరలో అధునాతన డ్రోన్ తటస్థీకరణ సాంకేతికత రూపంలో అదనపు భద్రతను ఏర్పాటు చేయనున్నామని తాజ్ సెక్యూరిటీ ఏసీపీ సయ్యద్ అరిబ్ అహ్మద్ తెలిపారు. ఈ యాంటీ డ్రోన్ వ్యవస్థ 7 నుంచి 8 కిలోమీటర్ల పరిధి వరకు పనిచేయగలుగుతుంది. ప్రధాన గోపురంపైన 200 మీటర్ల వ్యాసార్థంలో ప్రభావవంతంగా పనిచేయనుంది. ఆ ప్రాంతంలోకి ఏదైనా డ్రోన్ ప్రవేశిస్తే వెంటనే గుర్తించి దాని సిగ్నల్‌ను జామ్ చేస్తుంది. దీంతో డ్రోన్ పనిచేయదు. దీనిని 'సాఫ్ట్ కిల్' అని పిలుస్తారు. ఈ వ్యవస్థను నిర్వహించడానికి పోలీసు సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామని, అంకితమైన ప్రతిస్పందన బృందాన్ని ఏర్పాటు చేస్తున్నామని అరిబ్ అహ్మద్ తెలిపారు. కొద్ది రోజుల్లో వ్యవస్థ ఏర్పాటు పూర్తవుతుందని చెప్పారు. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడికి ప్రతిస్పందనగా మే 7న భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టడం, పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద కేంద్రాలపై భారత సైన్యం ఖచ్చితమైన దాడులు చేయడం తెలిసిందే. అయితే.. ఆ తరువాత పాక్ వరుసగా ఫిరంగి, క్షిపణి, డ్రోన్ దాడులకు పాల్పడింది. అమృతసర్‌లోని స్వర్ణ దేవాలయంపైనా దాడికి యత్నించింది. వీటన్నింటి భారత సాయుధ దళాలు తిప్పికొట్టాయి. ఈ నేపథ్యంలో సున్నితమైన ప్రదేశాలలో డ్రోన్ నిరోధక చర్యల అవసరాన్ని గుర్తించిన కేంద్రం.. తాజ్‌మహల్ భద్రతపై దృష్టి సారించింది.

మరోసారి బాంబు బెదిరింపులు..

ఇదిలా ఉండగా.. తాజ్‌మహల్‌కు ఆదివారం మరోసారి బాంబు బెదిరింపులు వచ్చాయి. ఆర్‌డీఎక్స్‌తో తాజ్ మహల్‌ను పేల్చేస్తామని కేరళ నుంచి అధికారులకు బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన అధికారులు, తాజ్‌మహల్ వద్ద హై అలర్ట్ ప్రకటించారు. పోలీసులు, బాంబు నిర్వీర్యం దళం, డాగ్ స్క్వాడ్, భారత పురావస్తు సర్వే (ఏఎస్ఐ) అధికారులు, సీఐఎస్ఎఫ్ భద్రతా దళం మూడు గంటల పాటు తాజ్‌మహల్ ప్రాంగణంలో తనిఖీలు చేశారు. అనుమానాస్పద వస్తువులేవీ దొరకలేదు. దీంతో పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టిదిట్టం చేశారు. మెయిల్‌పై రంగంలోకి దిగిన పోలీసులు దీనిపై విచారణ ప్రారంభించారు. ఫేక్ ఈమెయిల్ అని తేలడంతో దీనిపై కేసు నమోదైంది. ప్రస్తుతం పోలీసులు నిందితులను పట్టుకునేందుకు దర్యాప్తు చేస్తున్నారు.

యూనస్ బంగ్లాదేశ్‌ను అమ్మేస్తున్నారు

షేక్ హసీనా ఆరోపణ

ఢాకా: బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ అధిపతి ముహమ్మద్ యూనస్ దేశాన్ని అమెరికాకు అమ్మేస్తున్నారని మాజీ ప్రధాన మంత్రి షేక్ హసీనా ఆరోపించారు. సెయింట్ మార్టిన్స్ ద్వీపాన్ని అమెరికాకు అప్పగించడానికి నిరాకరించినందుకు తన తండ్రి షేక్ ముజీబుర్ రెహమాన్‌ను హత్య చేశారని గుర్తు చేశారు. ''అమెరికా సెయింట్ మార్టిన్స్ ద్వీపం కావాలని అడిగినప్పుడు నా తండ్రి అంగీకరించలేదు. అందుకు ఆయన తన ప్రాణాలను అర్పించాల్సి వచ్చింది. నేనూ దాన్ని కొనసాగిస్తున్నా. అధికారం కోసం దేశాన్ని అమ్మేయాలనే ఆలోచన నాకూ ఎప్పుడూ రాలేదు''అని హసీనా పేర్కొన్నారు. డిసెంబర్‌లో సాధారణ ఎన్నికలు నిర్వహించాలని సైన్యం పిలుపునివ్వడంతో.. యూనస్ రాజీనామా చేస్తారనే వార్తలొచ్చిన విషయం తెలిసిందే. అయితే.. అందుకు వ్యతిరేకంగా, యూనస్‌కు మద్దతుగా దేశవ్యాప్తంగా నిరసనలు చెలరేగిన నేపథ్యంలో... హసీనా ఫేస్‌బుక్ వేదికగా తీవ్రంగా స్పందించారు. యూనస్ ఉగ్రవాద గ్రూపుల మద్దతుతో పాలన సాగిస్తున్నారని ఆమె ఆరోపించారు. 'ఒకే ఒక ఉగ్రవాద దాడి తర్వాత మేం కఠినమైన చర్యలు తీసుకున్నాం. చాలా మందిని అరెస్టు చేశాం. కానీ ఇప్పుడు జైళ్లు ఖాళీగా ఉన్నాయి. ఉగ్రవాదులందరినీ విడుదల చేశారు. అంతర్జాతీయంగా నిషేధించిన ఉగ్రవాదుల సాయంతో యూనస్ అధికారాన్ని చేజిక్కించుకున్నారు. ఇప్పుడు బంగ్లాదేశ్‌లో ఉన్నది ఉగ్రవాదుల పాలన'అని ఆమె అన్నారు. అవామీ లీగ్ నిషేధాన్ని కూడా ఆమె తీవ్రంగా విమర్శించారు. అది రాజ్యాంగ విరుద్ధమన్నారు.

ఢిల్లీలో కుండపోత వాన

లోతట్టు ప్రాంతాలు జలమయం • స్తంభించిన జనజీవనం

న్యూఢిల్లీ: భారీ వర్షాలతో దేశ రాజధాని ఢిల్లీ అతలాకుతలమైంది. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకూ ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాహనాలు నీట మునిగాయి. రాకపోకలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. జనజీవనం స్తంభించింది. భారీ ఈదురుగాలుల ధాటికి చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయి. నగరవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వాన కారణంగా పలు విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నగరంలో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గిపోయాయి. 19.8 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఇది సాధారణం కంటే 6.9 డిగ్రీలు తక్కువ. సఫ్దర్‌జంగ్ వాతావరణ కేంద్రంలో 81.2 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డు అయినట్లు భారత వాతావరణ విభాగం ప్రకటించింది. ఇక్కడ గంటకు 82 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. పాలమ్, మయూర్ విహార్, ఢిల్లీ యూనివర్సిటీ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ప్రతికూల వాతావరణం కారణంగా 17 అంతర్జాతీయ విమానాలు సహా మొత్తం 49 విమానాలను దారిమళ్లించారు. ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులోని టెర్మినల్-3 నీట మునిగింది. టెర్మినల్-1 వద్ద ఒక టెంట్ పాక్షికంగా కూలిపోయింది. 180 విమానాలు ఆలస్యంగా నడిచాయి. కొన్ని విమానాలను రద్దు చేశారు. వాతావరణ విభాగం శనివారం రాత్రి ఢిల్లీలో రెడ్ అలర్ట్ ప్రకటించింది.

గాజాలో మరో 38 మంది మృతి

దెయిర్ అల్-బలాహ్: ఇజ్రాయెల్ బలగాలు కొనసాగిస్తున్న వైమానిక దాడుల్లో గడిచిన 24 గంటల వ్యవధిలో కనీసం 38 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో దెయిర్ అల్-బలాహ్‌లోని ఒక టెంటులో నిద్రిస్తున్న తల్లి, ఆమె ఇద్దరు చిన్నారులు ఉన్నట్లు స్థానిక ఆరోగ్య సిబ్బంది తెలిపారు. జబాలియా జరిగిన మరో దాడిలో ఇద్దరు మహిళలు, చిన్నారి మృతి చెందారు. మార్చిలో కాల్పుల విరమణ ముగిసిన నాటి నుంచి ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన వారి సంఖ్య 3,785కు చేరుకుందని అన్నారు.

హైకోర్టు బెంచ్ ఉన్న ఏకైక కేంద్రపాలిత ప్రాంతం?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

రాష్ట్ర న్యాయవ్యవస్థ

భారతదేశంలో స్వయం ప్రతిపత్తి గల ఏకీకృత న్యాయవ్యవస్థను ఏర్పాటు చేశారు. స్వయం ప్రతిపత్తి న్యాయవ్యవస్థ అంటే శాసన నిర్మాణ శాఖకు, కార్యనిర్వాహక శాఖకు బాధ్యత వహించకుండా స్వతంత్రంగా పనిచేసే న్యాయశాఖ. ఏకీకృత న్యాయవ్యవస్థ అంటే అన్ని న్యాయస్థానాలు ఉన్నత న్యాయస్థానం నియంత్రణలో పనిచేసే విధానం. మనదేశంలో శాసన, పరిపాలన సంబంధమైన అధికార పంపిణీ జరిగింది. కానీ న్యాయపరమైన అధికార పంపిణీ జరగలేదు.

రాష్ట్ర న్యాయవ్యవస్థ గురించి ప్రకరణ 214 నుంచి 237 వరకు తెలియచేస్తాయి. వాటిని రాజ్యాంగంలో VI భాగంలో చేర్చారు. ప్రకరణ- 214 ప్రకారం ప్రతి రాష్ట్రానికి ఒక హైకోర్టు ఉండాలి. రాష్ట్రంలో అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు. ప్రకరణ- 231 ప్రకారం ఒకటి కంటే ఎక్కువ రాష్ట్రాలకు పార్లమెంట్ చట్టం ద్వారా ఉమ్మడి హైకోర్టును ఏర్పాటు చేయొచ్చు. ప్రస్తుతం కింది రాష్ట్రాలకు ఉమ్మడి హైకోర్టులు ఉన్నాయి.

1. హరియాణా, పంజాబ్ - ఛండీగఢ్
2. మహారాష్ట్ర, గోవా - ముంబై
3. అసోం, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్ మిజోరాం- గౌహతి.

ప్రకరణ-241 ప్రకారం కేంద్రపాలిత ప్రాంతాలకు ప్రత్యేక హైకోర్టు ఉండొచ్చు, లేదా దగ్గరి హైకోర్టుకు కలపొచ్చు. ప్రత్యేక హైకోర్టు ఉన్న ఏకైక కేంద్రపాలిత ప్రాంతం ఢిల్లీ. దీన్ని 1966లో ఏర్పాటు చేశారు. అండమాన్ నికోబార్ దీవులను కలకత్తా హైకోర్టు, పాండిచ్చేరిని మద్రాస్ హైకోర్టు, లక్షద్వీప్‌ను కేరళ హైకోర్టు, దాద్రానగర్ హవేలి, డయ్యూ డామన్‌లను ముంబై హైకోర్టు పరిధిలో చేర్చారు.

దేశంలో మొత్తం హైకోర్టుల సంఖ్య 25. మొదట హైకోర్టును 1862లో కలకత్తాలో ఏర్పాటు చేశారు. అదే ఏడాది బాంబే, మద్రాసు హైకోర్టులను ప్రారంభించారు. 2013లో మణిపూర్, మేఘాలయ, త్రిపురల్లో మూడు హైకోర్టులను ఏర్పాటు చేశారు. 2019లో ఏపీ హైకోర్టు అమరావతిలో ఏర్పాటు చేశారు.

హైకోర్టు నిర్మాణం

ప్రకరణ-216 ప్రకారం ప్రతి హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులు ఉంటారు. వీరి సంఖ్యను రాష్ట్రపతి నిర్ణయిస్తారు. గరిష్ఠ, కనిష్ఠ న్యాయమూర్తుల సంఖ్యను నిర్ణయించలేదు. ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ హైకోర్టులో అత్యధికంగా ప్రధాన న్యాయమూర్తి, 56 మంది న్యాయమూర్తులు ఉన్నారు. సిక్కింలో అతి తక్కువగా ప్రధాన న్యాయమూర్తి, ముగ్గురు న్యాయమూర్తులు ఉన్నారు.

హైకోర్టు న్యాయమూర్తుల నియామకం

అధికరణ- 217 ప్రకారం హైకోర్టు న్యాయమూర్తులను రాష్ట్రపతి నియమిస్తారు. ఈ క్రమంలో కిందివారిని సంప్రదిస్తారు.

1. సంబంధిత రాష్ట్ర గవర్నర్
2. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
3. సంబంధిత రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి
4. సంబంధిత రాష్ట్ర హైకోర్టు వ్యవహారాలు తెలిసిన ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు

అర్హతలు

అధికరణం- 217 (2) హైకోర్టు న్యాయమూర్తుల అర్హతల గురించి తెలియజేస్తుంది. దీని ప్రకారం..

1. భారతీయ పౌరుడై ఉండాలి.
2. ఏదైనా హైకోర్టులో న్యాయవాదిగా 10 ఏళ్ల అనుభవం ఉండాలి.
3. ఏదైనా జిల్లా కోర్టు న్యాయమూర్తిగా 10 ఏళ్ల అనుభవం ఉండాలి.

పదవీ ప్రమాణం

ప్రకరణ- 219 ప్రకారం హైకోర్టు న్యాయమూర్తులతో గవర్నర్ పదవీ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. దీని గురించి రాజ్యాంగంలో షెడ్యూల్-3లో పేర్కొన్నారు.

పదవీ కాలం

హైకోర్టు న్యాయమూర్తుల పదవీ కాలాన్ని నిర్ణయించలేదు. పదవీ విరమణ వయస్సు ప్రారంభంలో 60 ఏళ్లు ఉండేది. 1963లో 15వ రాజ్యాంగ సవరణ ద్వారా 62 ఏళ్లకు పెంచారు. 2011లో 114వ రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా 65 ఏళ్లకు పెంచేందుకు ప్రతిపాదించారు.

జీతభత్యాలు

ప్రకరణ- 221 ప్రకారం హైకోర్టు న్యాయమూర్తుల జీతభత్యాలను పార్లమెంటు నిర్ణయిస్తుంది. వీటిని రాష్ట్ర సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు. పదవీ విరమణ తర్వాత కేంద్ర సంఘటిత నిధి నుంచి పెన్షన్ చెల్లిస్తారు. వీరి జీతభత్యాలకు ఆదాయ పన్ను నుంచి మినహాయింపు ఉంటుంది. జీతభత్యాలను ఆర్థిక అత్యవసర సమయంలో మాత్రమే తగ్గించొచ్చు.

రాజీనామా

ప్రకరణ-217(1) ప్రకారం ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులు తమ రాజీనామా లేఖలను రాష్ట్రపతికి సమర్పిస్తారు. పదవీ విరమణ తర్వాత సుప్రీంకోర్టులో మాత్రమే న్యాయవాద వృత్తి చేపట్టవచ్చు.



తొలగింపు

ప్రకరణ-218 హైకోర్టు న్యాయమూర్తుల తొలగింపు గురించి తెలియజేస్తుంది. దీని ప్రకారం పార్లమెంటు అభిశంసన తీర్మానం మేరకు రాష్ట్రపతి వీరిని తొలగిస్తారు. ఇంతవరకు ఏ హైకోర్టు న్యాయమూర్తిని తొలగించలేదు. గతంలో అభిశంసన తీర్మానాన్ని కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి సౌమిత్రి సేన్‌పై ప్రవేశపెట్టారు. తీర్మానం రాజ్యసభలో నెగ్గిన తర్వాత లోక్‌సభకు రాక ముందే రాజీనామా చేసి సేన్ తప్పుకున్నారు. కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దినకరణ్‌కు నోటీస్ జారీ చేశారు.

న్యాయమూర్తుల బదిలీ

ప్రకరణ- 222 ప్రకారం రాష్ట్రపతి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని, ఇతర న్యాయమూర్తులను ఏ హైకోర్టుకైనా బదిలీ చేయొచ్చు.

హైకోర్టు- విధులు, అధికారాలు

1. **ప్రారంభ అధికారం- అధికరణ- 225**
ప్రాథమిక హక్కుల పరిరక్షణ, ఎంఎల్ఏ, ఎంఎల్సీ, ఎంపీల ఎన్నిక వివాదాల పరిష్కారం, ఆస్తి, ఆర్థిక వ్యవహారాల్లో వివాదాల పరిష్కారం, దిగువ న్యాయస్థానాల నుంచి వచ్చే అన్ని అప్పీళ్ల విచారణ, వివాహం, విడాకులు, వారసత్వం మొదలైన వివాదాలు ప్రారంభ అధికారాల్లోకి వస్తాయి.
2. **కోర్ట్ ఆఫ్ రికార్డ్:** అధికరణ- 215 ప్రకారం హైకోర్ట్ 'కోర్ట్ ఆఫ్ రికార్డు'గా వ్యవహరిస్తుంది. హైకోర్టు తీర్పులను ప్రతి దిగువ న్యాయస్థానం, ప్రతి సంస్థ గౌరవించాలి. హైకోర్టు తీర్పులను కింది న్యాయస్థానాలు ఆధారాలుగా, సాక్ష్యాలుగా తీసుకొని తమ తీర్పులను వెలువరించాలి. హైకోర్టు తీర్పులను ధిక్కరిస్తే కోర్టు ధిక్కారం కింద శిక్షిస్తుంది.
3. **రిట్‌ల అధికార పరిధి:** అధికరణ-226 ప్రకారం ప్రాథమిక హక్కుల సంరక్షణ కోసం రిట్లను జారీ చేస్తుంది. రిట్ల జారీ విషయంలో సుప్రీంకోర్టు కంటే ఎక్కువ అధికార పరిధి హైకోర్టుకు ఉంటుంది. హైకోర్టు ప్రాథమిక హక్కుల రక్షణతోపాటు మిగతా హక్కుల రక్షణకు కూడా రిట్లను జారీ చేస్తుంది.
4. **న్యాయ సమీక్ష అధికారం:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చట్టాల రాజ్యాంగ బద్ధతను పరిశీలించి, అవి రాజ్యాంగ నిబంధనలకు వ్యతిరేకమైతే ఆ చట్టాలను హైకోర్టు న్యాయసమీక్ష అధికారం ద్వారా కొట్టేస్తుంది.
5. **దిగువ న్యాయస్థానాలపై నియంత్రణ:**
అధికరణ - 227 ప్రకారం తన పరిధిలో ఉన్న కింది న్యాయస్థానాలు, ట్రిబ్యునళ్లపై పర్యవేక్షణ అధికారం ఉంటుంది. దిగువ న్యాయస్థానాల నుంచి కావాల్సిన సమాచారాన్ని తెప్పించుకోవచ్చు. దిగువ న్యాయస్థానాలకు విధివిధానాలను సూచిస్తుంది. న్యాయాధికారుల నియామకం, పదోన్నతి, క్రమశిక్షణ మొదలైన సర్వీసు విషయాల్లో రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును సంప్రదించాలి.

దిగువ కోర్టులు

రాజ్యాంగంలోని 6వ భాగంలో ప్రకరణలు 233 నుంచి 237 వరకు ఆధీన న్యాయస్థానాల గురించి తెలియజేస్తాయి. హైకోర్టు తర్వాత వచ్చే దిగువ న్యాయస్థానాలను సబార్డినేట్ కోర్టులంటారు. వీటిలో జిల్లా కోర్టులు, సిటీ సివిల్ కోర్టులు, మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్‌లు ఉంటాయి. ప్రకరణ - 233 ప్రకారం జిల్లా కోర్టు న్యాయమూర్తులను నియమించి, తొలగించే అధికారం గవర్నర్‌కు ఉంటుంది. ఈ విషయంలో గవర్నర్ హైకోర్టును సంప్రదిస్తారు. కింది కోర్టుల న్యాయమూర్తుల నియామకం, తొలగింపు విషయంలో రాష్ట్ర సర్వీసు కమిషన్ హైకోర్టును సంప్రదిస్తుంది.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ప్రత్యేక హైకోర్టు ఉన్న ఏకైక కేంద్రపాలిత ప్రాంతం ఏది?
ఎ) ఛండీగఢ్ బి) ఢిల్లీ
సి) అండమాన్ నికోబార్ దీవులు
డి) పైవేవీ కావు
2. హైకోర్టు న్యాయమూర్తుల పదవీ కాలం?
ఎ) 4 ఏళ్లు బి) 5 ఏళ్లు
సి) 6 ఏళ్లు డి) పైవేవీకావు

సమాధానాలు: 1) బి; 2) డి.

మాదిరి ప్రశ్నలు

1. 2013లో ఏర్పాటు చేసిన హైకోర్టులు ఏవి?
ఎ) జార్ఖండ్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్
బి) మిజోరాం, మేఘాలయ, నాగాలాండ్
సి) మణిపూర్, మేఘాలయ, త్రిపుర
డి) మిజోరాం, నాగాలాండ్, సిక్కిం
2. హైదరాబాద్ హైకోర్టును ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
ఎ) 1948 బి) 1952 సి) 1954 డి) 1956
3. హైకోర్టు బెంచ్ ఉన్న ఏకైక కేంద్రపాలిత ప్రాంతం?
ఎ) లక్షద్వీప్
బి) అండమాన్ నికోబార్ దీవులు
సి) దాద్రానగర్ హవేలి డి) పైవేవీ కావు
4. కిందివాటిలో సరైనవి?
ఎ) అన్నా ఛాంది - మొదటి హైకోర్టు మహిళా న్యాయమూర్తి
బి) అమరేశ్వరి దేవి - ఆంధ్రప్రదేశ్ హైకో ర్టు మొదటి మహిళా న్యాయమూర్తి
సి) లీలాసేథ్- హైకోర్టు మొదటి మహిళ ప్రధాన న్యాయమూర్తి
డి) పైవన్నీ సరైనవే
5. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా పనిచేసి, తర్వాత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసినవారు?
ఎ) కొండా మాధవరెడ్డి బి)కోకా సుబ్బారావు
సి) యోగేశ్వర్ దయాళ్ డి) జీవన్ రెడ్డి
6. ప్రాథమిక హక్కుల రక్షణ కోసం ఏ అధికరణ ప్రకారం హైకోర్టు రిట్లను జారీ చేస్తుంది?
ఎ) 32 బి) 215 సి) 226 డి) 219
7. దేశంలో మహిళ న్యాయమూర్తులతో ధర్మాసనాన్ని ఏర్పాటు చేసిన మొదటి హైకోర్టు?
ఎ) లక్నో బి) కలకత్తా
సి) హైదరాబాద్ డి) మద్రాస్
8. జాతీయ న్యాయ వ్యవస్థకు సంబంధించి ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం ప్రవేశపెట్టినప్పుడు ఉన్న భారత ప్రధాన న్యాయ మూర్తి ఎవరు?
ఎ) ఎ.ఎం. అహ్మదీ బి) ఎం.హిదయతుల్లా
సి) ఎస్.ఆనంద్ డి) పి.ఎన్.భగవతి
9. హైకోర్టు న్యాయమూర్తుల పదవీ విరమణ వయసు 62 నుంచి 65 ఏళ్లకు పెంచేందుకు ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ ఏది?
ఎ) 104 బి) 110 సి) 112 డి) 114
10. భారత రాజ్యాంగంపై అంతిమ వ్యాఖ్య చేసే అధికారం ఎవరికి ఉంటుంది?
ఎ) సుప్రీంకోర్టు బి) రాష్ట్రపతి
సి) పార్లమెంటు డి) అటార్నీ జనరల్
11. హైకోర్టు న్యాయమూర్తులను ఎవరు నియమిస్తారు?
ఎ) భారత ప్రధాన న్యాయమూర్తి
బి) న్యాయశాఖామంత్రి
సి) రాష్ట్రపతి
డి) గవర్నర్

సమాధానాలు

1) సి; 2) సి; 3) బి; 4) డి; 5) బి; 6) సి; 7) సి; 8) డి; 9) డి; 10) ఎ; 11) సి.

శిశువుల సమగ్రాభివృద్ధిని అంచనా వేసే సాధనం

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు (ఎస్‌జీటీ, ఎస్ఏ) - మెథడ్స్

మూల్యాంకనం - పరీక్షలు

మాదిరి ప్రశ్నలు

1. బోధనాభ్యసన కార్యక్రమాలను సమీక్షించి భవిష్యత్ కార్యక్రమాలను, ప్రణాళికలను రూపొందించుకోవడానికి తోడ్పడేది?
1) బోధనాలక్ష్యం 2) మూల్యాంకనం
3) విద్యా ప్రణాళిక
4) వార్షిక ప్రణాళిక
2. ప్రస్తుతం మనం వేటి ద్వారా విద్యార్థుల ప్రగతిని తెలుసుకుంటున్నాం?
1) నికషలు 2) పరిగణనం
3) రాతపరీక్షలు 4) మూల్యాంకనం
3. రాతపరీక్షల్లోని పలు లోపాలను సవరించి, విద్యార్థి మూర్తిమత్వాన్ని సరిగ్గా అంచనా వేయడానికి, శాస్త్రీయంగా ఫలితాలు విశ్లేషించడానికి తోడ్పడేది?
1) నికష 2) విద్యాప్రణాళిక
3) పరిగణనం 4) మూల్యాంకనం
4. ప్రస్తుతం మన పాఠశాలల్లో అమలులో ఉన్న బోధన?
1) కృత్యాధార బోధన
2) లక్ష్యాధార బోధన
3) సామర్థ్యాధారిత బోధన
4) లోపనివారణ బోధన
5. బోధన, అభ్యసన ప్రక్రియల ద్వారా లభించే ఫలితాలను అంచనా వేయడాన్ని ఏమంటారు?
1) నికష 2) పరీక్ష
3) పరిగణనం 4) మూల్యాంకనం
6. శిశువుల సమగ్రాభివృద్ధిని అంచనా వేసే సాధనం?
1) పరిగణనం 2) మూల్యాంకనం
3) నికష 4) పరీక్ష
7. శాస్త్రీయ పద్ధతుల ద్వారా, పలు సాధనాల ద్వారా విద్యార్థుల విద్యార్జన స్థాయిని తెలియజేసేది?
1) మూల్యాంకనం 2) పరిగణనం
3) పరీక్ష 4) నికష
8. భాషా నైపుణ్యాలను, సామర్థ్యాలను, బోధనా లక్ష్యాలను ఎంతవరకు సాధించామో తెలియజేసేది?
1) సామర్థ్యాధార మూల్యాంకనం
2) సమగ్ర మూల్యాంకనం
3) భాషా మూల్యాంకనం
4) లక్ష్యాధార మూల్యాంకనం
9. విద్యార్థి ప్రవర్తనలో వచ్చిన పరివర్తనను తెలియజేసేది?
1) పరీక్ష 2) నికష
3) పరిగణనం 4) మూల్యాంకనం
10. 5వ తరగతి విద్యార్థులకు రాత పరీక్షల భారత్వాన్ని విద్యావేత్తలు ఎంత శాతంగా నిర్ధారించారు?
1) 60% 2) 70%
3) 80% 4) 50%



11. మూల్యాంకనానికి ప్రాతిపదికలు అయిన బోధన అభ్యసన సామర్థ్యాలాధారంగా జరిగే మూల్యాంకనాన్ని ఏమంటారు?
1) నిరంతర సమగ్ర మూల్యాంకనం
2) నిర్మాణాత్మక మూల్యాంకనం
3) సామర్థ్య ఆధారిత మూల్యాంకనం
4) సమగ్ర అవలోకనం
12. ఒక యూనిట్ లేదా పాఠం బోధించిన తర్వాత, బోధనలో భాగంగా కూడా తప్పని సరి నిర్వహించాల్సిన మూల్యాంకనం?
1) లక్ష్యాధారిత మూల్యాంకనం
2) నిరంతర సమగ్ర మూల్యాంకనం
3) నిర్మాణాత్మక మూల్యాంకనం
4) సామర్థ్యాధారిత మూల్యాంకనం
13. మూల్యాంకనంలో ఉపాధ్యాయులు ఎక్కువగా వినియోగించే సాధనం?
1) ప్రశ్నపత్రం 2) కృత్యనిర్వహణ
3) క్షేత్ర పర్యటన
4) మౌఖిక పరీక్ష
14. ప్రశ్నపత్రం జవాబులకు ఎన్ని పర్యాయాలు విలువలు కట్టినా మార్కుల్లో మార్పు రాకపోతే దాన్ని ఏ లక్షణం అంటారు?
1) ప్రామాణికత 2) విశ్వసనీయత
3) ఔపయోగికత 4) వస్తు నిష్ఠత
15. కాలం మారినా, వ్యక్తులు మారినా విలు వలు లేదా ఫలితాలు మారకపోతే అది ఏ లక్షణం?
1) ఔపయోగికత 2) వస్తు నిష్ఠత
3) ప్రామాణికత 4) విశ్వసనీయత
16. పక్షపాత ధోరణికి తావులేక, వ్యక్తుల వస్తువుల ప్రభావం ఉండక సార్వజనీనమైన ప్రశ్నపత్రాలకు ఏ లక్షణం ఉంటుంది?
1) విశ్వసనీయత 2) వస్తురిష్ఠత
3) ప్రామాణికత 4) ఔపయోగికత
17. ఏ ఉపాధ్యాయుడైనా పరీక్షలు సులభంగా నిర్వహించగలిగితే అది ఏ లక్షణం గల ప్రశ్నపత్రం?
1) ఔపయోగికత 2) ప్రామాణికత
3) విశ్వసనీయత 4) వస్తు నిష్ఠత
18. ఉపాధ్యాయులు తయారుచేసే పరీక్షా పత్రాల్లో దేనికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలి?
1) జ్ఞానం 2) అవగాహన
3) మానసిక చలనాత్మక రంగం
4) పైవన్నీ
19. విద్యార్జన నికషకు గల నామాంతరం?
1) విద్యాసాధక నికష
2) విద్యాప్రయోజన నికష
3) విద్యా ఉపలబ్ధి నికష
4) 1, 3
20. తెలుగు వాచకంలో ఒక పాఠం లేదా ఒక యూనిట్ బోధన చివర విద్యార్థుల ప్రవర్తన ల్లో వచ్చిన మార్పులను తెలుసుకోవడానికి పనికి వచ్చేది?
1) నికష 2) పరీక్ష
3) పరిగణనం 4) మూల్యాంకనం
21. నికషల వల్ల లభించిన సాముహిక ప్రమాణాల ఆధారంగా ఇతర విద్యార్థుల ప్రగతితో పోల్చి చూడడాన్ని ఏమంటారు?
1) విద్యాసాధక నికష
2) సూత్రాధారిత నికష
3) ప్రమాణాధారిత నికష
4) విద్యా ఉపలబ్ధి నికష
22. విద్యార్థి తానుగా సాధించిన ప్రమాణాల ఆధారంగా అతని ఫలితాలను పోల్చి చూడటాన్ని ఏమంటారు?
1) సంకలన నికష
2) సూత్రాధారిక నికష
3) రూపణ నికష
4) ప్రామాణాధారిత నికష
23. విద్యార్థులకు అభిప్రాయ వ్యక్తీకరణలో స్వేచ్ఛ ఉండే ప్రశ్నరూపాలు?
1) లక్ష్యాత్మక ప్రశ్నలు
2) లఘు సమాధాన ప్రశ్నలు
3) వ్యాసరూప ప్రశ్నలు
4) పైవన్నీ
24. విద్యార్థుల సృజనాత్మక రచనా శక్తులను, వివేచన, విచక్షణా శక్తులను అంచనా వేసే ప్రశ్నరూపాలు?
1) వ్యాసరూప ప్రశ్నలు
2) లఘు సమాధాన ప్రశ్నలు
3) లక్ష్యాత్మక ప్రశ్నలు
4) బహుళైచ్ఛిక ప్రశ్నలు
25. లక్ష్యాత్మక ప్రశ్నలను ఇలా కూడా పిలుస్తారు?
1) లఘు సమాధాన ప్రశ్నలు
2) వస్తునిష్ఠ ప్రశ్నలు
3) బహుళైచ్ఛిక ప్రశ్నలు
4) సహసంబంధ ప్రశ్నలు
26. ప్రస్తుతం పలు పోటీ పరీక్షల్లో ఉద్యోగా ర్థులను ఎంపిక చేయడానికి ఎక్కువగా వాడుతున్న ప్రశ్నారూపాలు?
1) లక్ష్యాత్మక ప్రశ్నలు
2) లఘు సమాధాన ప్రశ్నలు
3) వ్యాసరూప ప్రశ్నలు
4) పైవన్నీ
27. రిక్త పూరణ ప్రశ్నలు అంటే?
1) బహుళైచ్ఛిక ప్రశ్నలు
2) ఖాళీలు పూరించే ప్రశ్నలు
3) జతపరిచే ప్రశ్నలు
4) వర్గీకరణ ప్రశ్నలు
28. విద్యార్థుల్లో అవగాహనను పరీక్షించడానికి, సంబంధం లేని అంశాన్ని వేరు చేయడానికి తగిన లక్ష్యాత్మక ప్రశ్నలు ఏవి?
1) బహుళైచ్ఛిక ప్రశ్నలు
2) ఖాళీలు పూరించే ప్రశ్నలు
3) జతపరిచే ప్రశ్నలు
4) వర్గీకరణ ప్రశ్నలు
29. ప్రశ్నపత్రం తయారీలో జ్ఞాన లక్ష్యానికి ఎంత శాతం మార్కుల భారత్వాన్ని పాటించాలి?
1) 25% 2) 32%
3) 40% 4) 28%
30. ప్రశ్నపత్రం తయారీలో అవగాహన లక్ష్యానికి ఎంత శాతం మార్కుల భార త్వాన్ని పాటించాలి?
1) 40% 2) 32%
3) 28% 4) 25%
31. బ్లూ ప్రింట్‌ను తెలుగులో ఏమంటారు?
1) ప్రశ్నల భారత్వం
2) లక్ష్య భారత్వం
3) ప్రారూపిక
4) భారత్వ నమోదు
32. ఉపాధ్యాయులు రూపొందించే ప్రశ్నపత్రా న్ని, ప్రశ్నల భారత్వాన్ని ప్రతిబింబించేది?
1) భారత్వ నమోదు
2) ప్రారూపిక
3) గణన సూచీ పత్రం
4) పైవన్నీ
33. ప్రారూపిక అంటే?
1) గణన సూచీ పత్రం
2) భారత్వ నమోదు పత్రం
3) బోధనాంశాల భారత్వం
4) నిర్దిష్ట ప్రశ్నపత్ర ప్రణాళిక
34. విద్యారంగంలో గ్రేడింగ్ విధానాన్ని ప్రతిపాదించిన కమిటీ?
1) జాతీయ విద్యావిధానం (1986)
2) కొఠారి కమిషన్ (1964-66)
3) మాధ్యమిక విద్యా కమిషన్ (1951-52)
4) ఈశ్వరీబాయి కమిటీ (1973)
35. CBSE వారి గ్రేడింగ్ విధానం ప్రకారం విద్యార్థి ఉపలబ్ధిలో A2 గ్రేడ్ శాతం మార్కుల రేంజ్ ఎంత?
1) 50-59 2) 60-69
3) 70-79 4) 80-89
36. CBSE వారి గ్రేడింగ్ విధానం ప్రకారం విద్యార్థి ఉపలబ్ధిలో C1 గ్రేడ్ మార్కుల రేంజ్?
1) 40-49 2) 50-59
3) 60-69 4) 70-79
37. నియోజనాలను ఇలా కూడా అంటారు?
1) లక్ష్యాలు 2) ఉద్దేశాలు
3) నిర్దేశాలు 4) కృత్యాలు
38. బోధనాభ్యసన సోపానాల్లో భాగమై విద్యార్థుల చురుకైన అభ్యసనానికి దోహదపడే ప్రశ్నలు లేదా వ్యాసక్తుల రూపంలో ఉండే వాటిని ఏమంటారు?
1) నియోజనాలు 2) నికషలు
3) పరీక్షలు 4) ప్రశ్నానిధులు
39. స్వల్పకాల వ్యవధిలో నిర్వహించడానికి అనుకూలమైన, ఒక అంశాన్ని బోధించిన వెంటనే పరీక్షించడానికి అనువైంది?
1) శ్రవణం 2) భాషణం
3) పఠనం 4) లేఖనం

సమాధానాలు

1) 2; 2) 3; 3) 4; 4) 3; 5) 4; 6) 2; 7) 1; 8) 3; 9) 4; 10) 2; 11) 3; 12) 2; 13) 1; 14) 2; 15) 4; 16) 2; 17) 1; 18) 4; 19) 4; 20) 1; 21) 2; 22) 4; 23) 3; 24) 1; 25) 2; 26) 1; 27) 2; 28) 4; 29) 2; 30) 1; 31) 3; 32) 2; 33) 4; 34) 1; 35) 4; 36) 2; 37) 3; 38) 1; 39) 3.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎస్ఆర్‌టీఆర్ఐలో గ్రామీణ నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ(ఎస్ఆర్‌టీఆర్).. దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన(డీడీయూజీకేవై) పథకం ద్వారా అందిస్తున్న ఉద్యోగ ఆధారిత సాంకేతిక శిక్షణా కోర్సులలో ప్రవేశాలకు గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ, యువకుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సులు:** అకౌంట్స్ అసిస్టెంట్(ట్యాలీ), కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్, ఆటోమొబైల్ 2 వీలర్ సర్వీసింగ్, డీటీపీ.
» **కోర్సు వ్యవధి:** మూడున్నర నెలలు.
» **అర్హత:** కోర్సును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(బీకాం), ఇంటర్మీడియట్, పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. గ్రామీణ ప్రాంత అభ్యర్థులై ఉండాలి. చదువు మధ్యలో ఉన్నవారు అర్హులు కారు.
» **వయసు:** 18 నుంచి 30 ఏళ్లు ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ, జలాల్‌పూర్, పోచంపల్లి, యాదాద్రి భువనగిరి జిల్లా, తెలంగాణ-508284 చిరునామకు పంపించాలి.
» **అడ్మిషన్ల తేది:** 29.05.2025.
» **వెబ్‌సైట్:** https://www.srtri.com

ఎన్ఐడీ, ఏపీలో 21 ఫ్యాకల్టీ, నాన్ ఫ్యాకల్టీ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడీ) డిప్యుటేషన్, షార్ట్‌టర్మ్, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన ఫ్యాకల్టీ, నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 21.
» **పోస్టుల వివరాలు:** రిజిస్ట్రార్-01, కంట్రోలర్ ఆఫ్ ఫైనాన్స్ అండ్ అకౌంట్స్-01, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్-01, సీనియర్ అసిస్టెంట్ లైబ్రేరియన్-01, సీనియర్ డిజైనర్-06, అసోసియేట్ సీనియర్ డిజైనర్-03, ప్రిన్సిపల్ టెక్నికల్ ఇన్‌స్ట్రక్టర్-02, సీనియర్ టెక్నికల్ ఇన్‌స్ట్రక్టర్-01, ఫ్యాకల్టీ-05.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** నోటిఫికేషన్ వెలువడిన 30 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
» **నోటిఫికేషన్ వెలువడిన తేది:** 05.05.2025.
» **వెబ్‌సైట్:** https://www.nid.edu

జాతీయ సైన్స్ విధానాన్ని మొదటిసారి ఎప్పుడు ప్రకటించారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సైన్స్ అండ్ టెక్నాలజీ

- శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పురోగతి ద్వారానే ఒక దేశ సామాజిక, ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుంది. సైన్స్ అండ్ టెక్నాలజీ రెండూ భావి భారత్‌కు మూలస్తంభాల వంటివని భారత మొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేర్కొన్నారు. స్వాతంత్ర్యం తర్వాత ఆలస్యం చేయకుండా ఈ రంగంలో అనేక కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు.
- హోమి జహంగీర్ బాబా, విక్రం సారాబాయ్, ఎం.ఎస్.స్వామినాథన్ వంటి వారిని నెహ్రూ ప్రోత్సహించారు. వీరిలో ఒక్కొక్కరు ఒక్కో రంగంలో దిక్సూచిగా వ్యవహరిస్తూ భారత శాస్త్ర, సాంకేతిక రంగాన్ని అభివృద్ధి చేశారు. అణుశక్తి రంగానికి హోమి బాబా పునాది వేయగా, అంతరిక్ష రంగానికి విక్రం సారాబాయ్, వ్యవసాయ రంగానికి ఎం.ఎస్. స్వామినాథన్ మూలస్తంభాలుగా నిలిచారు. వీరికి అదనంగా భారత శాస్త్ర, సాంకేతిక రంగ ప్రాధాన్యతను ప్రపంచవ్యాప్తంగా చాటిన వారిలో శ్రీనివాస రామానుజన్, జగదీశ్ చంద్ర బోస్, సత్యేంద్రనాథ్ బోస్, పి.సి.రే, మేఘనంద్ సాహా, సర్ సి.వి. రామన్, బీర్బల్ సహనీ, హర్ గోబింద్ ఖురానా, మోక్షగుండం విశ్వేశ్వరయ్య, రాజా రామన్న, ఏపీజే అబ్దుల్‌కలాం, పి.ఎం.భార్గవ, పి.మహేశ్వరి, వెంకట రామకృష్ణన్ ప్రముఖులు. అయితే ప్రాచీన కాలంలోనే భారతదేశ శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. అంతరిక్షం, గణితం, వైద్య, లోహ సంగ్రహణ శాస్త్రంలో భారతీయులు అద్భుతవిజయాలను సాధించారు. ఆర్యభట్ట, భాస్కర, బ్రహ్మగుప్త, ధన్వంతరి, ఆచార్య నాగార్జునుడు వంటి వారి కృషి అద్వితీయం. భారత్ ప్రస్తుతం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో చెప్పుకోదగ్గ విజయాలు నమోదు చేస్తోంది. గతంలో శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధిపై భారత్ పెట్టుబడులు చాలా తక్కువ. 2010 నాటికి భారత్ శాస్త్ర, సాంకేతిక రంగంలో 13 బిలియన్ డాలర్లు ఖర్చు చేయగా, చైనా 135 బిలియన్ డాలర్లకుపైగా ఖర్చు చేసింది. టెక్నాలజీలో అభివృద్ధి ద్వారా మాత్రమే దేశం వివిధ రంగాల్లో ముఖ్యంగా శక్తి, ఆహార పోషణ, పర్యావరణ, తాగునీరు, ఆరోగ్య రంగాల్లో భద్రత సాధించడం సాధ్యమవుతుంది. అంతేకాకుండా దేశంలో జీవ వైవిధ్యాన్ని మానవాళి శ్రేయస్సుకు ఉపయోగించవచ్చు.



- శాస్త్ర, సాంకేతిక రంగాల్లో త్వరితగతిన అభివృద్ధి సాధించేందుకు అన్ని సంబంధిత అంశాలను ప్రతిబింబించే ఒక జాతీయ విధానం అవసరం. దీన్ని గుర్తించి 1958లో మొదటిసారిగా జాతీయ సైన్స్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తీర్మానించింది. ఆ తర్వాత అవసరాలు, సవాళ్లను దృష్టిలో పెట్టుకొని ఈ విధానంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఫలితంగా 1983లో ఒకసారి, 2003లో మరోసారి కొత్త టెక్నాలజీ పాలసీని ప్రభుత్వం విడుదల చేసింది. దేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాన్ని మరింత ప్రోత్సహించడానికి 2013లో సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ (ఎస్‌టీఐ) అనే సరికొత్త విధానాన్ని ప్రభుత్వం 100వ జాతీయ సైన్స్ సదస్సు (కోల్‌కతా) సందర్భంగా ప్రవేశపెట్టింది.
- భారతదేశ శాస్త్ర, సాంకేతిక రంగ వ్యవస్థలో ప్రధానమైనవి కేంద్ర ప్రభుత్వ ఎస్ అండ్ టీ విభాగాలు. ఈ రంగంలో ప్రధానంగా కృషి చేసే విభాగాలివి. వీటికి తోడుగా ఈ రంగం అభివృద్ధికి కృషి చేస్తున్నవి – రాష్ట్ర ఎస్ అండ్ టీ విభాగాలు, ప్రైవేటు పరిశ్రమలు, ఎన్‌జీవోలు, కొన్ని ప్రత్యేక కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు (వ్యవసాయ, ఆరోగ్య కుటుంబ సంక్షేమం, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలు)
- దేశంలో శాస్త్ర, సాంకేతిక రంగ పురోగతికి కృషి చేస్తున్నవి.. సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం (డీఎస్‌టీ), అంతరిక్ష విభాగం (డీఎస్), డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (డీఎస్‌ఐఆర్), అణుశక్తి విభాగం (డీఏఈ), బయోటెక్నాలజీ విభాగం (డీబీటీ), డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఓషన్ డెవలప్‌మెంట్ (డీవోడీ).

శాస్త్ర, సాంకేతిక విభాగం (డీఎస్‌టీ)

ఇది 1971 మేలో ఏర్పాటైంది. జాతీయ సైన్స్ విధానాన్ని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ) రూపొందిస్తుంది. ఈ రంగంలోని నూతన పరిశోధనలను ప్రోత్సహిస్తూ, దేశవ్యాప్తంగా కార్యక్రమాల నిర్వహణకు ఇది కృషి చేస్తుంది. జాతీయ సమాచార వ్యవస్థను నిర్వహిస్తుంది. ఈ రంగం అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తుంది. రాష్ట్ర ఎస్ అండ్ టీ మండళ్ల ద్వారా రాష్ట్ర, జిల్లా, గ్రామ స్థాయిలో ఎస్ అండ్ టీ వినియోగాన్ని ప్రోత్సహిస్తుంది. స్వయం ప్రతిపత్తి సంస్థలకు కావాల్సిన నిధులను కూడా ఇది సమకూరుస్తుంది. అంతర్జాతీయ స్థాయిలో శాస్త్ర, సాంకేతిక రంగంలో సహకారం, అభివృద్ధికి కూడా డీఎస్‌టీ కృషి చేస్తుంది. ఆధునికీకరణను ప్రోత్సహిస్తూ జాతీయ అవసరాలకు తగ్గట్టుగా ఈ రంగాన్ని అభివృద్ధి చేయాలనేది డీఎస్‌టీ మరో లక్ష్యం. దీని ఆధ్వర్యంలో ఎస్ అండ్ టీ అభివృద్ధికి కృషి చేసే కొన్ని ముఖ్యమైన సంస్థలు..

- టెక్నాలజీ ఇన్ఫర్మేషన్ ఫోర్‌కాస్టింగ్ అండ్ అసెస్‌మెంట్ కౌన్సిల్ (టీఐఎఫ్ఏసీ)
- ఇండియన్ మెట్రోలాజికల్ డిపార్ట్‌మెంట్ (భారత వాతావరణ విభాగం)
- సర్వే ఆఫ్ ఇండియా
- సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ కౌన్సిల్
- నేషనల్ అట్లాస్ అండ్ థీమాటిక్ మ్యాపింగ్ ఆర్గనైజేషన్
- నేషనల్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌క్యాస్టింగ్

అంతరిక్ష విభాగం

- అంతరిక్ష సంఘం, అంతరిక్ష విభాగాలను మన దేశంలో 1972లో ఏర్పాటు చేశారు. అంతరిక్ష సంఘం రూపొందించే అంతరిక్ష విధానాన్ని అంతరిక్ష విభాగం ఆధ్వర్యంలోని ఇస్రో నిర్వహిస్తుంది. దేశ సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ఉద్దేశించిన ఇన్శాట్, ఐఆర్ఎస్, నావిగేషనల్ ఉపగ్రహ వ్యవస్థలను అభివృద్ధి చేసి ప్రయోగించడం ఈ విభాగం ప్రధాన లక్ష్యం. వీటిని ప్రయోగించే లక్ష్యంతో పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ రాకెట్ వ్యవస్థలను ఇస్రో అభివృద్ధి చేసింది.

ప్రపంచంలో అత్యంత విజయవంతమైన రాకెట్లలో పీఎస్ఎల్వీ ఒకటి. ఇప్పటివరకు నిర్వహించిన 63 పీఎస్ఎల్వీ ప్రయోగాల్లో 3 మాత్రమే విఫలం అయ్యాయి. దేశీయ క్రయోజెనిక్ ఇంజన్, జీఎస్ఎల్వీ–మార్క్–3 అభివృద్ధి, పరీక్ష ప్రయోగం, మంగళయాన్ వంటివి ఇటీవల అంతరిక్ష విభాగం సాధించిన విజయాలు.

డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (డీఎస్ఐఆర్)

- డీఎస్ఐఆర్ ఆధ్వర్యంలో పని చేస్తున్న ప్రధాన విభాగం కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్). దీని ఆధ్వర్యంలో దేశంలో అనేక సంస్థలు వివిధ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి. పరిశ్రమల్లో పరిశోధన – అభివృద్ధిని ప్రోత్సహించడం, టెక్నాలజీ రంగంలో స్వయం సమృద్ధిని సాధించడం, టెక్నాలజీ బదిలీ, నేషనల్ ఇన్ఫర్మేషన్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎన్ఐఎస్ఏటీ)ని అభివృద్ధి చేయడం డీఎస్ఐఆర్ ప్రధాన లక్ష్యాలు.

అణుశక్తి విభాగం

- శాంతియుత ప్రయోజనాలకు అణుశక్తిని అభివృద్ధి చేయడం, భద్రతతో కూడిన లాభదాయకమైన అణుశక్తిని ఉత్పత్తి చేయడం అణుశక్తి విభాగం ముఖ్య లక్ష్యాలు. అణుశక్తి విధానాన్ని రూపొందించే అణుశక్తి సంఘం 1948లో, దాన్ని అమలు చేసే అణుశక్తి విభాగం 1954లో ఏర్పాటైంది. మూడు దశల అణుశక్తి కార్యక్రమాన్ని వేగంగా అభివృద్ధి చేసి స్థాపిత శక్తి సామర్థ్యంలో అణుశక్తి వాటాను పెంచడం, వైద్య, పారిశ్రామిక, వ్యవసాయ, సామాజిక రంగాల్లో ఉపయోగపడే రేడియో ఐసోటోపులను, రేడియో ధార్మిక టెక్నాలజీలను అభివృద్ధి చేయడం ఈ విభాగం లక్ష్యాలు.

బయోటెక్నాలజీ విభాగం (డీబీటీ)

- విశ్వవిద్యాలయాలు, పరిశోధన కేంద్రాల్లో బయోటెక్నాలజీని ప్రోత్సహించే విభాగం డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ.

కణజాల వర్ధనం, సూక్ష్మవ్యాప్తి టీకాల అభివృద్ధి, క్యాన్సర్ మందుల ఉత్పాదన, డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్, ఎయిడ్స్ మందుల ఉత్పాదన, నిర్ధారణ పద్ధతుల అభివృద్ధిలో ఇప్పటికే బయోటెక్నాలజీ రంగం ఎన్నో విజయాలను సాధించింది. అమెరికా, ఫ్రాన్స్, బెల్జియం తర్వాత హెపటైటిస్–బీ టీకాను ఉత్పత్తి చేసిన నాలుగో దేశం భారత్. మూలకణాల రంగంలో ఇప్పటికే ముఖ్యంగా ప్రౌఢ మూలకణాల ద్వారా సరికొత్త చికిత్స పద్ధతులు భారత్‌లో అందుబాటులోకి వచ్చాయి.

డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఓషన్ డెవలప్‌మెంట్

- సముద్ర రంగ వనరుల సర్వే, అభివృద్ధి వాటి వెలికితీత కోసం కృషి చేస్తుంది డీవోడీ. జీవ, నిర్జీవ వనరుల గుర్తింపు, సముద్ర లోతులో డీప్ సీ బెడ్ మైనింగ్, సముద్ర తరంగ శక్తి ఉత్పాదన, అంటార్కిటికాపై పరిశోధన ఈ విభాగం ముఖ్య లక్ష్యాలు.
- వివిధ మంత్రిత్వ శాఖల్లోని విభాగాలు కూడా దేశ ఎస్ అండ్ టీ అభివృద్ధికి కృషి చేస్తున్నాయి. **ఉదా:** వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్), ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్), రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) పనిచేస్తున్నాయి.

మాదిరి ప్రశ్నలు

1. భారత అంతరిక్ష విభాగం (డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్) ఏ సంవత్సరంలో ఏర్పాటైంది?
   1) 1969 2) 1972 3) 1975 4) 1979
2. ఎవరి ఆధ్వర్యంలో అణుశక్తి విభాగం పనిచేస్తుంది?
   1) సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ
   2) రక్షణ మంత్రిత్వ శాఖ
   3) మానవ వనరుల అభివృద్ధి శాఖ
   4) ప్రధానమంత్రి
3. నీటి నుంచి ఫ్లోరిన్‌ను తొలగించే నల్లగొండ టెక్నిక్‌ను అభివృద్ధి చేసిన సంస్థ?
   1) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ)
   2) నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ)
   3) నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్
   4) నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
4. 'గరిమ' అనే గేదె పిల్ల (దూడ)ను క్లోనింగ్ ద్వారా సృష్టించిన కేంద్రం?
   1) నేషనల్ బ్యూరో ఆఫ్ యానిమల్ జెనిటిక్ రిసోర్సెస్
   2) నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
   3) సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ
   4) నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్
5. సెంట్రల్ ప్లాంటేషన్ క్రాప్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఎక్కడ ఉంది?
   1) కాసరగోడ్ 2) తిరువనంతపురం
   3) కోచి 4) హైదరాబాద్
6. కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎర్త్ సైన్సెస్ శాఖా మంత్రి?
   1) పీయూష్ చావ్లా 2) హర్షవర్ధన్
   3) స్మృతి ఇరానీ 4) అనంతకుమార్
7. బోల్ క్యూర్ పేరుతో సరికొత్త జీవ క్రిమి సంహారకాన్ని అభివృద్ధి చేసిన సంస్థ?
   1) ది ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్
   2) ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
   3) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పైసెస్ రీసెర్చ్
   4) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వెజిటబుల్ రీసెర్చ్
8. పూర్తి దేశీయ పరిజ్ఞానంతో సిన్‌రియం అనే మలేరియా నివారణ మందును అభివృద్ధి చేసిన సంస్థ?
   1) భారత్ బయోటెక్ 2) రాన్‌బ్యాక్సీ
   3) బయోకాన్ 4) డా.రెడ్డీస్ లేబొరేటరీ
9. అణు వ్యర్థాన్ని గాజు మాత్రికలో భద్రపర్చే విధానాన్ని అణుశక్తి విభాగం అభివృద్ధి చేసింది. ఈ విధానాన్ని ఏమంటారు?
   1) విట్రిఫికేషన్ 2) ట్రాన్స్‌మ్యుటేషన్
   3) అన్నీలింగ్ 4) ఎన్‌రిచ్‌మెంట్
10. మొదటి జాతీయ సైన్స్ విధానాన్ని ఎప్పుడు ప్రకటించారు?
    1) 1952 2) 1958 3) 1962 4) 1965
11. అణుశక్తి సంఘం ప్రస్తుత చైర్మన్?
    1) శ్రీకుమార్ బెనర్జీ 2) అనిల్ కకోద్కర్
    3) అజిత్‌కుమార్ మహంతి
    4) యు.ఆర్.రావు
12. ప్రతి ఏటా దేశంలో శాస్త్రవేత్తలకు శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డులను ప్రదానం చేసేది?
    1) కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్)
    2) డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ)
    3) అంతరిక్ష విభాగం (డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్)
    4) అణుశక్తి విభాగం (డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ)
13. కలరా వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కలరా అండ్ ఎంట్రిక్ డిసీజెస్ సంస్థ ఎక్కడ ఉంది?
    1) న్యూఢిల్లీ 2) బెంగళూరు
    3) ముంబై 4) కోల్‌కతా

సమాధానాలు

1) 2; 2) 4; 3) 4; 4) 2; 5) 1; 6) 2; 7) 1; 8) 2; 9) 1; 10) 2; 11) 3; 12) 1; 13) 4.

Rising rental rates force the middle class..

Model Questions

Directions (Q. No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence, the mark the number of that part with error as your answer. Mark (5) as your answer, if there is 'No error'.

1. As more and much people invest their money in savings certificates or money-market funds (1)/ in order to earn higher interest, (2)/ they are abandoning traditional low-interest investment havens (3)/ such as passbook accounts and life insurance policies. (4)/ No error. (5)
2. Rising rental rates force the middle class to use (1)/ far more than the standard 25 percent of their incomes (2)/ for housing, leaving them with know equity (3)/ or tax write-offs to offset the expenditures. (4)/ No error. (5)
3. Astronomers studying(1)/ the newly discovered star (2)/ said that it provides clues about (3)/ our galaxy's origin. (4)/ No error. (5)
4. According to some economists, (1)/ the June decrease in unemployment suggest (2)/ that the gradual improvement (3)/ in the job market is continuing. (4)/ No error (5)
5. The qualities of a great leader are (1)/ coolness in the face of danger, (2)/ an excellent sense of strategy, (3)/ and a ability to plan in minute detail. (4)/ No error. (5)

Directions: (Q. No. 6-10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase given **bold** in the sentence to make it grammatically correct? Mark (5) "No correction required" as your answer, If there is no error.

6. Aging **is a property** of all animals that reach a fixed size at maturity.
   1) was a property
   2) had been a property
   3) was being a property
   4) is being a property
   5) No correction required
7. All-terrain vehicles have allowed vacationers to reach many previously inaccessible areas, but they **have been blamed** for causing hundreds of deaths.
   1) have also been blamed
   2) have been also blamed
   3) have been blamed also
   4) have been blaming
   5) No correction required
8. Although fruit can no longer grow once it is picked, it continues for some time to respire, **taking in oxygen and giving often** carbon dioxide.
   1) taking in oxygen and giving of
   2) taking in oxygen and giving always
   3) taking in oxygen and giving off
   4) taking out oxygen and giving off
   5) No correction required
9. Amateur astronomers with good telescopes **should been able to** see the comet within the next few weeks.
   1) should be able
   2) would be abled
   3) should being able
   4) should belonging
   5) No correction required
10. As the price of oil rises, the prices of bread and livestock feed **sure to increases**.
    1) are sure to increased
    2) are sure to increasing
    3) are sure to be increase
    4) are sure to increase
    5) No correction required

Directions (Q. No. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. The coordination of monetary policy can help ____ the orderly financing of _____imbalances.
    1) facilitate; existing
    2) felicitate; exciting
    3) fend; many
    4) fetch; permanent
    5) promote; promotional
12. __ the objects found in the excavated temple ___ small terra-cotta effigies left by supplicants.
    1) Below; wear
    2) Amongst; where
    3) Between; below
    4) Among; were
    5) Above; was
13. An array of tax incentives ___ to a boom in the construction of new buildings.
    1) have lead 2) has led
    3) have been lead
    4) has been leading 5) had leads
14. The yellow jacket can sting ____ without dying and ___ potent venom that can cause intense pain.
    1) repeatedly; carries
    2) repetition; carried
    3) repeat; carry
    4) repeats; carrier
    5) repeating; career
15. As envisioned by researchers, commercial farming ____ lobsters will enable fisheries to sell the shellfish year ____.
    1) from; threw 2) of; round
    3) off; through 4) with; around
    5) among; always

Directions (Q. No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A. The purpose was twofold: political control and religious communication. Experts believe that there were three types of human sacrifice practiced by the Shang.
B. Finally, in internment sacrifices, young girls were sacrificed. Unlike the first two, they were buried in the standard burial position and their bodies were kept intact.
C. In pit sacrifices, young men were sacrificed. Their bodies were dismembered and they were buried without their personal possessions. In foundation sacrifices, children and babies were used.
D. The practice of human sacrifice was very common in ancient China, particularly during the Shang Dynasty-the first Chinese dynasty with written records.
E. Archaeological evidences show that these human sacrifices experienced violent deaths, and they too were buried without possessions.
F. In fact, archaeological evidence suggests that human sacrifice was practiced on a grand scale during the Shang dynasty.

16. What is the FIRST sentence after rearrangement?
    1) C 2) B 3) D 4) E 5) F
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) C
18. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) C 3) D 4) E 5) F
19. What is the FIFTH sentence after rearrangement?
    1) B 2) C 3) D 4) E 5) F
20. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q. No. 21-30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Dwarf planet Ceres continues to ___ (21) scientists as NASA's Dawn spacecraft gets closer to being captured into orbit around the object. The ___ (22) images from Dawn, taken nearly 29,000 miles (46,000 kilometers) from Ceres, reveal that a bright spot that stands out in previous images ____ (23) close to yet another bright area. As scientists receive better and _____ (24) views of the dwarf planet over the next 16 months, they hope to gain a deeper understanding of its origin and evolution _____ (25) studying its surface. The intriguing bright spots and other _____ (26) features of this captivating world will come into ____ (27) focus. Dawn visited the giant asteroid Vesta _____ (28) 2011 to 2012, delivering more than 30,000 images of the body along with many other measurements, and providing insights about its composition and geological history. Vesta has an average diameter of 326 miles (525 kilometers), while Ceres has an average diameter of 590 miles (950 kilometers). Vesta and Ceres are the ___ (29) most massive bodies in the asteroid belt, located _____ (30) Mars and Jupiter.

21. 1) puzzle 2) question 3) answer 4) doubt 5) propose
22. 1) later 2) latest 3) recently 4) frequently 5) presently
23. 1) lay 2) lain 3) lies 4) lays 5) laid
24. 1) batter 2) good 3) best 4) better 5) bought
25. 1) for 2) from 3) with 4) among 5) by
26. 1) interesting 2) annoying 3) disturbing 4) distributing 5) presently
27. 1) sharer 2) sharper 3) shaver 4) sharp 5) severe
28. 1) with 2) by 3) from 4) for 5) above
29. 1) to 2) too 3) toe 4) two 5) type
30. 1) beyond 2) besides 3) in front of 4) in addition to 5) between

Directions (Q. No. 31-35): Choose the word which is wrongly spelt from the five options given.

31. 1) misanthrope 2) misogynism 3) misappropriation 4) mismatch 5) mistake
32. 1) commission 2) apportion 3) succession 4) concession 5) profession
33. 1) adjudicte 2) judicious 3) combat 4) demur 5) elope
34. 1) flamboyant 2) genuine 3) hinderance 4) innocuous 5) germane
35. 1) kiosk 2) lacerate 3) mirege 4) nocturnal 5) opulent



Answers

1) 1; 2) 3; 3) 3; 4) 2; 5) 4; 6) 5; 7) 1; 8) 3; 9) 1; 10) 4; 11) 1; 12) 4; 13) 2; 14) 1; 15) 2; 16) 3; 17) 1; 18) 2; 19) 4; 20) 5; 21) 1; 22) 2; 23) 3; 24) 4; 25) 5; 26) 1; 27) 2; 28) 3; 29) 4; 30) 5; 31) 2; 32) 3; 33) 1; 34) 3; 35) 3;